ఈనాడు

కరీంనగర్ 21-1-2019 సోమవారం సిటీ సంపుటి 45 సంచిక 161

THE LARGEST CIRCULATED TELUGU DAILY

రూ. 6-50. పేజీలు 18+16 www.eenadu.net

Karimnagar, Visakhapatnam, Hyderabad, Vijayawada, Tirupati, Ananthapuramu, Rajamahendravaram, Suryapet, Guntur, Nellore, Srikakulam, Kurnool, Tadepalligudem, Warangal, Kadapa, Nizamabad, Khammam, Ongole, Mahaboobnagar, Chennai, Bengaluru, Mumbai, Delhi

TG

ఈనాడు

కరీంనగర్ 21-1-2019 సోమవారం సిటీ సంపుటి 45 సంచిక 161

THE LARGEST CIRCULATED TELUGU DAILY

రూ. 6-50. పేజీలు 18+16 www.eenadu.net

Karimnagar, Visakhapatnam, Hyderabad, Vijayawada, Tirupati, Ananthapuramu, Rajamahendravaram, Suryapet, Guntur, Nellore, Srikakulam, Kurnool, Tadepalligudem, Warangal, Kadapa, Nizamabad, Khammam, Ongole, Mahaboobnagar, Chennai, Bengaluru, Mumbai, Delhi



TG

పెరగనున్న పీజీ వైద్య సీట్లు

- డిప్లొమా సీట్లను పీజీ డిగ్రీకి మార్చేందుకు కేంద్రం అనుమతి
- తెలంగాణలో మార్పునకు అనాసక్తి
- కొత్తగా 250 పీజీ సీట్ల పెంపుపై దృష్టి

ఈనాడు, హైదరాబాద్: తెలంగాణలో పీజీ వైద్యవిద్య సీట్లు పెరగనున్నాయి. ప్రభుత్వ, ప్రైవేటు వైద్యకళాశాలల్లో పీజీ డిప్లొమా, పీజీ డిగ్రీ సీట్లు మొత్తం సుమారు 1,500 ఉండగా.. వీటిలో పీజీ డిప్లొమా సీట్లు సుమారు 250 వరకూ ఉన్నాయి. పీజీ డిప్లొమా సీట్లను పీజీ డిగ్రీ సీట్లుగా మార్చుకోవడానికి తాజాగా కేంద్ర ప్రభుత్వం అవకాశమిచ్చింది. ఈ నెల 25 వరకూ ఈ మేరకు దరఖాస్తు చేసుకున్న ప్రభుత్వ, ప్రైవేటు వైద్య కళాశాలల వినతులను పరిశీలించి, ఇందులో అర్హమైన డిప్లొమా సీట్లను అదే కోర్సులో డిగ్రీ సీట్లుగా మార్చుతామనీ, ఫిబ్రవరి 28 నుంచి ఈ ప్రక్రియ చేపడతామని కేంద్ర ప్రభుత్వం ఇటీవల అన్ని రాష్ట్రాలకూ లేఖలను పంపించింది.

ఎందుకీ మార్పు?

సూపర్‌స్పెషాలిటీ కోర్సుల్లో చేరాలంటే పీజీ డిగ్రీ పూర్తి చేయాలి. వీరికి యూజీసీ వేతనాలు అందుతాయి. దీంతో పీజీ డిగ్రీ కోర్సు వైపు ఎక్కువమంది మొగ్గుచూపుతుంటారు. పీజీ డిప్లొమా కోర్సు పూర్తిచేసిన వైద్యులు బోధనా సుపత్రుల్లో అధ్యాపకులుగా అర్హులే కానీ, పదోన్నతులకు అనర్హులు. డిసెంబరు 24న చెన్నైలో అన్ని ఆరోగ్య విశ్వవిద్యాలయాల ఉపకులపతుల భేటీలో నీతిఆయోగ్, ఎంసీఐ అధికారులు ఈ విషయంపై చర్చించారు. ప్రభుత్వ, ప్రైవేటు వైద్యకళాశాలలన్నింటిలోనూ ప్రస్తుతమున్న పీజీ డిప్లొమా వైద్యవిద్య కోర్సుల సీట్ల స్థానంలో పీజీ డిగ్రీ సీట్లను భర్తీ చేయాలని నిర్ణయించారు. ఈ నేపథ్యంలో కేంద్ర ప్రభుత్వం తాజాగా ప్రకటన విడుదల చేసింది.

ఇన్‌సర్వీస్ కోటా మెలిక

ప్రభుత్వ వైద్యకళాశాలల్లో 139 పీజీ డిప్లొమా సీట్లున్నాయి. వీటిని పీజీ డిగ్రీ సీట్ల కింద మార్చితే.. ఇన్‌సర్వీస్ కోటాలో పీజీ చేసే అవకాశాన్ని ప్రభుత్వ వైద్యంలో పనిచేస్తున్న ఎంబీబీఎస్ వైద్యులు కోల్పోతారు. దీంతో ఈ అంశాన్ని వాళ్లు వ్యతిరేకిస్తున్నారు. డిప్లొమా సీట్లను పీజీ డిగ్రీకి మార్చుకోవడంపై రాష్ట్ర ప్రభుత్వం కూడా అనాసక్తిగా ఉన్నట్లు తెలుస్తోంది. డిప్లొమా సీట్లను డిగ్రీకి మార్చుకోవడంపై దృష్టిపెట్టడం లేదని వైద్యవర్గాలు ధ్రువీకరించాయి. రాష్ట్రానికి 2019-20 వైద్యవిద్య సంవత్సరానికి కొత్తగా 250 పీజీ సీట్లను మంజూరు చేయాల్సిందిగా కేంద్రానికి ప్రతిపాదనలు రూపొందిస్తున్నట్లు పేర్కొన్నాయి. కొత్తగా వచ్చే పీజీ సీట్లన్నీ కూడా డిగ్రీవేననీ, డిప్లొమా సీట్లు కావని వైద్యవర్గాలు స్పష్టంచేశాయి. ప్రైవేటు కళాశాలలు మాత్రం తమ వద్దనున్న సుమారు 110 పీజీ డిప్లొమా సీట్లను డిగ్రీ సీట్లుగా మార్చుకునేందుకు దరఖాస్తు చేయనున్నట్లు తెలిసింది.

జైలు నుంచి త్వరగా విడుదల చేయాలి

వేలూరు కారాగారంలో దీక్ష చేపట్టిన రాజీవ్ హత్యకేసు నిందితుడు మురుగన్

వేలూరు, న్యూస్‌టుడే: వేలూరు కేంద్ర కారాగారం నుంచి విడుదల చేయాలని కోరుతూ మాజీ ప్రధాని రాజీవ్ గాంధీ హత్య కేసులో శిక్ష అనుభవిస్తున్న మురుగన్ శనివారం రాత్రి జైలులో నిరాహార దీక్ష చేపట్టాడని స్థానిక అధికారులు తెలిపారు. ఆదివారం నాటికి ఈ దీక్ష రెండో రోజుకు చేరిందన్నారు. గత 27 ఏళ్లుగా వేలూరు జైలులో ఆయన శిక్ష అనుభవిస్తున్నాడు. రాజీవ్‌గాంధీ హత్య కేసులో నిందితులైన మురుగన్, ఆయన భార్య నళిని, పేరరివాళన్ సహా ఏడుగురిని విడుదల చేయడానికి రాష్ట్ర ప్రభుత్వం ప్రస్తుతం ప్రయత్నాలు చేపట్టింది. శనివారం మధ్యాహ్నం మురుగన్.. మహిళా జైలులో శిక్ష అనుభవిస్తున్న భార్య నళినిని కలిసి మాట్లాడాడు. అదేరాత్రి నిరాహార దీక్ష ప్రారంభించాడని జైలు అధికారులు తెలిపారు. రెండోరోజైన ఆదివారం ఒక వినతిపత్రాన్ని జైలు ఉన్నతాధికారికి అందజేసి గవర్నర్‌కు పంపాలని కోరాడు. దాన్ని గవర్నర్ పరిశీలించి తన సత్వర విడుదలకు సంబంధించి చర్యలు తీసుకొనేవరకు దీక్ష కొనసాగుతుందని మురుగన్ ప్రకటించాడు.


● జీవన పోరాటం.. చదువే ఆయుధం



విక్రయిస్తోంది వ్యవసాయ పనిముట్లను, నమ్ముకొంది చదువనే ఏకైక ఆయుధాన్ని.. మొదటిది వర్తమానం గడవటానికి.. రెండోది భవిష్యత్తును తీర్చి దిద్దుకోవడానికి. నల్గొండ జిల్లా నకిరేకల్‌లోని ప్రధాన కూడలిలో రహదారిపై ఆదివారం వ్యవసాయ పనిముట్లు విక్రయిస్తూ.. శ్రద్ధగా నోట్సు రాసుకుంటున్న ఈ బాలిక అటుగా వెళుతున్న పలువురి దృష్టిని ఆకర్షించింది. ఈ చిన్నారి పేరు భారతి. స్థానిక జడ్పీ ఉన్నత పాఠశాలలో ఏడో తరగతి చదువుతోంది. ఆదివారం కావడంతో తల్లిదండ్రులకు పనిలో సాయపడేందుకు పనిముట్లు విక్రయించేందుకు రహదారిపై కూర్చుంది. గిరాకీ రాకపోవడంతో రాతపనిని పూర్తి చేసుకుంది.

– న్యూస్‌టుడే, నకిరేకల్

ఊపిరి ఆడనివ్వని కాలుష్యం



- దీర్ఘకాలంగా శ్వాసకు అడ్డుపడే వ్యాధి విజృంభణ
- తెలంగాణలో ప్రతి లక్ష జనాభాలో 4250-4749 మంది సీఓపీడీ వ్యాధిగ్రస్తులే
- గాలి కాలుష్యమే ప్రధాన కారణం
- 'ప్రపంచ వ్యాప్తంగా వ్యాధుల భారం (జీబీడీ)'పై అధ్యయనం వెల్లడి
- చలిలో తీవ్రత పెరుగుతుందంటున్న నిపుణులు

దీర్ఘకాలిక శ్వాసకోశ వ్యాధులు విజృంభిస్తున్నాయి. అందుకు ప్రధానంగా గాలి కాలుష్యం కారణమవుతోంది. ఇంట్లో ఉంటే వంట పొగ, బయటికెళ్తే పరిసరాల కాలుష్యం, ధూమపానం వల్ల ఈ వ్యాధులు పెరుగుతున్నాయి. ప్రపంచమంతా ఈ సమస్య ఉన్నప్పటికీ మన దేశంలో పరిస్థితి ఆందోళనకరంగా ఉంది. మనదేశంలోనే 18 శాతం మంది వ్యాధి పీడితులు ఉన్నారు. మొత్తం వేర్వేరు రకాల దీర్ఘకాలిక శ్వాసకోశ వ్యాధులతో మంచాన పడుతున్నవారి సంఖ్య 1990లో 4-5శాతం ఉండగా.. 2016కొచ్చేసరికి 6.4 శాతానికి పెరిగింది.


2016 గణాంకాల ప్రకారం దీర్ఘకాలిక శ్వాస కోశ వ్యాధులతో మృతిచెందినవారు 10.9శాతం. దీనివల్ల మంచానపడినవారు 6.4శాతం. ఈ వ్యాధుల్లోనూ ముఖ్యంగా దీర్ఘకాలంగా శ్వాసకు అడ్డుపడే వ్యాధి (క్రానిక్ అబ్‌స్ట్రక్టివ్ పల్మనరీ డిసీజ్ -సీఓపీడీ), ఆస్థమా బాధితుల సంఖ్య అధికంగా ఉంది. 2016 గణాంకాల ప్రకారం తెలంగాణలో ప్రతి లక్ష జనాభాలో 4250-4749 మంది సీఓపీడీ వ్యాధిగ్రస్తులే కాగా, రాష్ట్రంలో ఆస్థమా బాధితులు 2750-3249గా నమోదయ్యారు. పరిసరాల గాలి కాలుష్యం కారణంగా మహిళలు, పురుషుల్లోనూ దాదాపు 33.5శాతం మంది సీఓపీడీ బారిన పడుతున్నారు. ఇళ్లలో గాలి కాలుష్యం మహిళల్ని పట్టి పీడిస్తోంది. దీనివల్ల దాదాపు 30.1 శాతం మంది మహిళలు సీఓపీడీ బారినపడి అవస్థలు పడుతున్నారు. తాగి వదిలేసిన పొగను పీల్చడం వల్ల అత్యధికంగా మహిళలు బాధితులుగా మారుతున్నారు. 1990-2016 మధ్యన 'ది గ్లోబల్ బర్డెన్ ఆఫ్ డిసీజ్' అధ్యయనం ఈ గణాంకాలను వెల్లడించింది. 2016లో 9వ స్థానంలో ఉన్న దీర్ఘకాలంగా శ్వాసకు అడ్డుపడే వ్యాధి.. 2040 నాటికి 4వ స్థానానికి ఎగబాకనుందని అధ్యయనం వెల్లడించడం ఆందోళన కలిగించే అంశమే.



అధ్యయనంలోని ప్రధానాంశాలు


- మొత్తం దీర్ఘకాలిక శ్వాసకోశ వ్యాధుల్లో అత్యధికంగా సీఓపీడీ కారణంగా 75.6 శాతం మంది దీర్ఘకాలంగా మంచానికే పరిమితమవుతుండగా.. ఆస్థమాతో 20 శాతం మంది మంచాన పడుతున్నారు.
- సీఓపీడీ మరణాలు 1990లో మన దేశంలో 6.24 లక్షలు కాగా, 2016లో 8.48 లక్షలుగా నమోదైంది.
- సీఓపీడీ కేసుల సంఖ్య గత 25 ఏళ్లలో గణనీయంగా పెరిగింది. 1990లో 28.1 మిలియన్ల మంది ఈ వ్యాధికి గురవగా.. 2016కు వచ్చేసరికి ఈ వ్యాధిగ్రస్తుల సంఖ్య 55.3 మిలియన్లకు పెరగడం పరిస్థితి తీవ్రతను తెలియజేస్తోంది.

దీనివల్ల దీర్ఘకాలంగా మంచానపడినవారు 4.8శాతం. ఇలా మంచానపడడానికి ధూమపానం నాలుగోవంతు కారణమవుతోంది.





- 1990లో ఆస్థమాతో మరణాలు అంత గుర్తింపులేని సంఖ్యలో ఉండగా.. 2016లో మాత్రం 1.83 లక్షలుగా గుర్తించారు. దీనివల్ల మంచానపడే వారు 1.3శాతం.

ఆస్థమా



- తెలంగాణలో సీఓపీడీ 1990లో ప్రతి లక్ష జనాభాకు 2750-3249 మంది ఉండగా.. 2016లో ఈ సంఖ్య 4250-4749కి పెరిగింది.
- రాష్ట్రంలో ఆస్థమా 1990లో ప్రతి లక్ష జనాభాకు 2250-2749 మందిలో ఉండగా.. 2016లో 2750-3249కి పెరిగింది.





- ఆస్థమా కేసులు సిక్కిం, త్రిపుర, నాగాలాండ్, కేరళల్లో ఎక్కువగా గుర్తించారు.




- దేశం మొత్తమ్మీద సీఓపీడీ కేసులు అత్యధికంగా జమ్ము కశ్మీర్, హరియాణా, హిమాచల్ ప్రదేశ్, ఉత్తరాఖండ్, దిల్లీ రాష్ట్రాల్లో నమోదు కాగా.. రెండో అత్యధిక కేసులు నమోదైన జాబితాలో తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ సహా కర్ణాటక, కేరళ, గోవా, మహారాష్ట్ర, రాజస్థాన్, ఉత్తర ప్రదేశ్, పంజాబ్, మిజోరాం రాష్ట్రాలున్నాయి.

చలికాలంలో అప్రమత్తత అవసరం

– డాక్టర్ శుభాకర్, ప్రముఖ శ్వాసకోశ వ్యాధుల నిపుణులు



సీఓపీడీ వచ్చినవారిలో శ్వాసనాళాలు కుంచించుకుపోతాయి. ఊపిరి తీసుకోవడం కష్టమవుతుంది. ఇటీవల కాలంలో మగాళ్లతో పోల్చితే ఆడవారిలో ఎక్కువగా కనిపిస్తోంది. ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాల్లో కట్టెల పొయ్యిపై వంట చేసేవారు ఆ పొగ కారణంగా సీఓపీడీ బారినపడుతున్నారు. సీఓపీడీ అనేది ఒక జబ్బు కాదు. ఇది మొత్తం శరీరంలోని అవయవాలపైనా దుష్ప్రభావం చూపుతుంది. చలికాలంలో బ్యాక్టీరియా, వైరస్‌లు తొలుత దాడిచేసేది సీఓపీడీ బాధితులనే. వీరు చల్లగాలుల్లో తిరగడం మానేయాలి. వ్యాధుల బారినపడకుండా ఇన్‌ఫ్లూయెంజా, నిమోకొకల్ టీకాలను చలికాలం రాకముందే వేయించుకోవాలి.



– ఈనాడు, హైదరాబాద్

వంటగ్యాసుకూ బీమా

- ప్రమాదం జరిగితే పరిహారం
- అవగాహనలేక సద్వినియోగం చేసుకోని వినియోగదారులు

ఈనాడు డిజిటల్, హైదరాబాద్: రాష్ట్రంలో తరచూ గ్యాసు ప్రమాదాలు జరుగుతున్నా బాధితులు ప్రభుత్వం నుంచి నష్టపరిహారం అర్థిస్తున్నారే తప్ప హక్కుల గురించి తెలుసుకోవడం లేదు. వంట చేసుకోవడానికి ఉపయోగించే ఎల్పీజీ సిలిండర్‌కూ బీమా ఉంటుంది. సిలిండర్‌లో ఏదైనా లోపం వల్ల ప్రమాదం జరిగితే వినియోగదారులు నష్ట పరిహారం పొందవచ్చు. ఈ విషయం తెలియక చాలామంది ప్రమాదాలు జరిగినప్పుడు సద్వినియోగం చేసుకోవడం లేదు.

ఎలాంటి ప్రీమియమూ ఉండదు

చమురు పరిశ్రమలు, గ్యాస్ సిలిండర్ల వల్ల అగ్ని ప్రమాదాలకు ఎక్కువ ఆస్కారముంటుంది. అందుకే ముందస్తుగా ప్రభుత్వరంగ ఆయిల్ మార్కెటింగ్ కంపెనీలైన ఇండియన్ ఆయిల్ (ఐఓసీఎల్), హిందూస్థాన్ పెట్రోలియం (హెచ్‌పీసీఎల్), భారత్ పెట్రోలియం (బీపీసీఎల్), చమురు పరిశ్రమలకు 'పబ్లిక్ లయబిలిటీ పాలసీ ఫర్ ఆయిల్ ఇండస్ట్రీస్' కింద వినియోగదారులు, వారి ఆస్తులకు 'థర్డ్ పార్టీ ఇన్సూరెన్స్' చేయిస్తాయి. ఇందుకోసం వినియోగదారుల వద్ద ఎలాంటి ప్రీమియమూ వసూలు చేయరు.

ప్రమాదం జరిగినప్పుడు...

గ్యాసు ప్రమాదం జరిగినప్పుడు వినియోగదారులు నేరుగా బీమా కంపెనీకి తెలపాల్సిన అవసరం లేదు. సంబంధిత పంపిణీదారుకు సమాచారమందిస్తే సరిపోతుంది. వారు ప్రమాదానికి గల కారణాలను ఆరాతీసి బీమా తీసుకున్న సదరు కంపెనీ ప్రతినిధులకు తెలియజేస్తారు. ప్రమాదంలో ఎవరైనా చనిపోతే మరణ ధ్రువీకరణ పత్రం, శవపరీక్ష నివేదిక, ప్రాథమిక విచారణ నివేదిక, గాయపడితే వైద్యచికిత్స వివరాలు, వైద్యులిచ్చిన ప్రిస్కిప్షన్, మందులు, ఆసుపత్రి ఖర్చులకు సంబంధించిన బిల్లులను ఆయిల్ కంపెనీకి సమర్పించాలి. బీమా కంపెనీ పూర్తిస్థాయిలో విచారణ జరిపి పరిహారాన్ని సంబంధిత ఆయిల్ కంపెనీకి చెల్లిస్తుంది. ఆ కంపెనీ ప్రతినిధులు నష్టపోయిన వినియోగదారులకు ఆ మొత్తాన్ని అందజేస్తారు.

మృతులకు రూ.5లక్షలు

ఎల్పీజీ సిలిండర్ ప్రమాదంలో ఎవరైనా చనిపోతే రూ.5లక్షలు పరిహారంగా చెల్లిస్తారు. గాయపడితే వైద్యచికిత్స కోసం గరిష్ఠంగా రూ.లక్ష అందిస్తారు. ఇందులో తక్షణసాయం కింద ఒక్కో క్షతగాత్రునికి రూ.25వేలు ఇస్తారు. ఆస్తులకు నష్టం వాటిల్లితే గరిష్ఠంగా రూ.లక్ష వరకు పరిహారం పొందవచ్చు. చమురు పరిశ్రమల్లో ఒక్కో ప్రమాదానికి గరిష్ఠంగా రూ.50లక్షలు, ప్రాణనష్టం జరిగితే రూ.10లక్షల చొప్పున పరిహారాన్ని బీమా కంపెనీ చెల్లిస్తుంది.

కంపెనీల వారీగా చూస్తే...

ఆయిల్ కంపెనీ	వినియోగదారులు	పంపిణీదారులు
ఐఓసీఎల్	37,80,018	323
హెచ్‌పీసీఎల్	33,89,706	205
బీపీసీఎల్	22,66,542	187
మొత్తం	94,36,266	715

నిబంధనలు బోలెడు...

ప్రమాదం జరగ్గానే బీమా కంపెనీలు అంత తేలిగ్గా నష్టపరిహారం చెల్లించవు. దీనికి బోలెడు నిబంధనలుంటాయి. బీమా ఒప్పందంలో పొందుపర్చిన నియమాల మేరకే పరిహారం చెల్లిస్తాయి. గ్యాసు కనెక్షన్ తీసుకున్నప్పుడు ఇచ్చిన చిరునామాలో ఉన్న ఆస్తులకు మాత్రమే పరిహారం వర్తిస్తుంది. ఒకవేళ వేరే ఇంటికి మారినప్పుడు తప్పనిసరిగా కొత్త చిరునామాను నమోదు చేయించుకోవాలి. సిలిండర్‌లో లోపం వల్ల ప్రమాదం వాటిల్లితేనే పరిహారం ఇస్తారు. ఆత్మహత్యాయత్నం, బలవన్మరణం, మద్యం, డ్రగ్స్ ప్రభావం వల్ల సంభవించిన ప్రమాదాలకు బీమా కంపెనీ బాధ్యత వహించదు. భూకంపాలు, వరదలు, తుపానులు, ఇతర ప్రకృతి విపత్తుల వల్ల గ్యాసు ప్రమాదం జరిగినా నష్టపరిహారం ఇవ్వరు.



94,36,266 మంది వినియోగదారులు...

ఇండియన్ పెట్రోలియం అండ్ న్యాచురల్ గ్యాస్ స్టాటిస్టిక్స్ 2017-18 ప్రకారం తెలంగాణలో 94,36,266 మంది వినియోగదారులు, 715 మంది పంపిణీదారులు ఉన్నారు.

మహారాష్ట్రలోని పాల్ఘర్‌లో కంపనాలు

ముంబయి: మహారాష్ట్రలోని పాల్ఘర్ జిల్లాలోని కొన్ని ప్రాంతాల్లో ఆదివారం భూమి కంపించింది. కంపన తీవ్రత రిక్టర్ స్కేల్‌పై 3.6గా నమోదైనట్లు అధికారులు తెలిపారు. తీర పట్టణం డహాణూలోని ధుందల్‌వాడీలో సాయంత్రం 6.40కు ప్రకంపన వచ్చినట్లు గుర్తించామని పేర్కొన్నారు. మరోవైపు చైనాలోని టిబెట్ ప్రాంతంలో ఉన్న షిగాజే పట్టణంలోనూ ఆదివారం రాత్రి భూకంపం వచ్చింది. తీవ్రత రిక్టర్ స్కేల్‌పై 5గా నమోదైనట్లు ఆ దేశ భూకంప అధ్యయన కేంద్రం తెలిపింది.



జాతీయ సదస్సు ముగింపు సమావేశంలో మాట్లాడుతున్న బిపిన్ రావత్

చైనా దూసుకెళ్తోంది.. అప్రమత్తం కావాలి

- ఆర్మీ చీఫ్ బిపిన్ రావత్

ఈనాడు, హైదరాబాద్: భారత్‌కు ఉత్తరం వైపు ఉన్న విరోధి.. కృత్రిమ మేధ, బిగ్ డేటా అనలిటిక్స్, సైబర్ యుద్ధ సాంకేతికతలపై భారీగా ధనాన్ని ఖర్చు చేస్తూ దూసుకెళ్తోందని.. మనం వెనకబడకూడదంటే రక్షణ రంగంలో వీటిపై దృష్టి పెట్టాల్సిన అవసరముందని ఆర్మీచీఫ్ బిపిన్ రావత్ అన్నారు. చైనాను ఉద్దేశించి ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. రక్షణ రంగంలో స్వావలంబన అనే అంశంపై హైదరాబాద్‌లో జరిగిన రెండ్రోజుల జాతీయ సదస్సు ముగింపు సమావేశంలో ఆదివారం ఆయన పాల్గొన్నారు. సైబర్ యుద్ధాలను ఎదుర్కొనేందుకు కృత్రిమ మేధ, బిగ్ డేటా సాంకేతికత అవసరాన్ని గుర్తించామని, దీన్ని సాయుధ వ్యవస్థల్లో ప్రవేశపెట్టడంపై దృష్టి సారించామన్నారు. సరిహద్దు అవతల ఉండే శత్రువుల కదలికలను ఎప్పటికప్పుడు గుర్తించేందుకు శాటిలైట్ నిఘావ్యవస్థ ఒక్కటే సరిపోదని డ్రోన్లు, మానవరహిత వాహనాలు, రిమోట్ వాహనాల అవసరం ఉందన్నారు. సమావేశంలో మేజర్ జనరల్ ఏబీ గోర్తి, లెఫ్టినెంట్ జనరల్ డీబీ షేకత్కర్, సెక్రటరీజనరల్ బాల్ దేసాయ్, కెప్టెన్ సంజయ్, వి.ఎస్. హెగ్డే తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ ఎమ్మెల్యేపై సహచర సభ్యుడి దాడి

- 'ఆపరేషన్ కమల'కు దూరంగా కాంగ్రెస్ విడిదిలో అనూహ్య ఘటన
- చికిత్స పొందుతున్న విజయనగర ఎమ్మెల్యే ఆనంద్ సింగ్
- కర్ణాటకలో కలకలం



కంప్లి ఎమ్మెల్యే గణేశ్



బాధిత ఎమ్మెల్యే ఆనంద్‌సింగ్

బెంగళూరు (మల్లేశ్వరం), న్యూస్‌టుడే: బెంగళూరు శివార్లలోని ఈగల్టన్ రిసార్టులో బసచేసిన బళ్లారి జిల్లా విజయనగర(హొసపేటె) శాసనసభ్యుడు ఆనంద్‌సింగ్‌పై ఇదే జిల్లా కంప్లి నియోజకవర్గ ఎమ్మెల్యే జె.ఎన్.గణేశ్ మద్యం సీసాతో దాడి చేశారు. ఈ ఘటనలో ఆనంద్ సింగ్ తలకు గాయాలయ్యాయి. శరీరానికి గాజు ముక్కలు గుచ్చుకున్నాయి. ఈ ఎమ్మెల్యేలిద్దరూ కాంగ్రెస్ పార్టీవారే కావటం గమనార్హం. తమ ఎమ్మెల్యేపై దాడి జరగలేదని, కాలుజారి పడడంతో గాజుముక్కలు గుచ్చుకున్నాయని మాజీ ముఖ్యమంత్రి సిద్ధరామయ్య, మంత్రి డి.కె.శివకుమార్, కేపీసీసీ అధ్యక్షుడు ఈశ్వర ఖండ్రేలు సమర్థించుకునే ప్రయత్నాలు చేశారు. దాడిలో గాయపడిన ఆనంద్‌సింగ్‌ను శనివారం అర్ధరాత్రే శేషాద్రిపురంలోని అపోలో వైద్యశాలలో చేర్చారు. ఆదివారం మధ్యాహ్నం ఆయన తలకు, శరీరానికి స్కానింగ్ చేశాక ఎలాంటి ప్రాణాపాయం లేదని వైద్యులు నిర్ధరించారు. ఘటనపై రిసార్టు యాజమాన్యం చేసిన ఫిర్యాదును బిడది పోలీసులు ఆదివారం రాత్రి స్వీకరించారు. ఆనంద్‌సింగ్ వాంగ్మూలం తీసుకున్నాక కేసు నమోదు చేస్తామన్నారు.

■ 'ఆపరేషన్ కమల'కు తమ ఎమ్మెల్యేలు ఆకర్షితులవుతారన్న అనుమానంతో కాంగ్రెస్ పార్టీ నగర శివార్లలోని రిసార్టులో వారికి బస ఏర్పాటుచేసింది. శనివారం రాత్రి అందులో నాయకులు విందు చేసుకున్నారు. అర్ధరాత్రి దాటాక ఎమ్మెల్యేలు ఆనంద్ సింగ్, జె.ఎన్.గణేశ్‌ల మధ్య మాటామాటా పెరిగింది. మద్యం సీసాతో గణేశ్ దాడిచేయడంతో ఆనంద్‌సింగ్ కన్ను పక్కన దెబ్బ తగిలింది. గణేశ్ పక్కకు తోసేయడంతో ఆయన కింద పడ్డారు. గాజుపెంకులు గుచ్చుకుని గాయపడ్డారు.

■ విషయాన్ని తెలుసుకున్న కర్ణాటక కాంగ్రెస్ వ్యవహారాల బాధ్యుడు కె.సి.వేణుగోపాల్ రిసార్టుకు తరలివచ్చారు. మాజీ ముఖ్యమంత్రి, సంకీర్ణ ప్రభుత్వ సమన్వయ సమితి అధ్యక్షుడు సిద్ధరామయ్య కూడా ఆదివారం రాత్రికి రిసార్టుకు చేరుకున్నారు. గణేశ్‌ను మందలించి, క్రమశిక్షణ చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. చికిత్స పొందుతున్న ఆనంద్‌సింగ్‌ను ఆయన తండ్రి పృథ్వీరాజ్ సింగ్, తల్లి సుమితా బాయి పరామర్శించారు. గణేశ్‌ను తమ కుమారుడే రాజకీయాల్లోకి తీసుకువచ్చారని పృథ్వీరాజ్ గుర్తుచేశారు. బాధితుడు ఆనంద్‌సింగ్‌కు మద్దతుగా కాంగ్రెస్ కార్యకర్తలు బళ్లారి, విజయనగర ప్రాంతాల్లో ధర్నాలు, ఆందోళనలు నిర్వహించారు.



ఈనాడు



కరీంనగర్ 21-1-2019 సోమవారం సిటీ సంపుటి 45 సంచిక 161

THE LARGEST CIRCULATED TELUGU DAILY

రూ. 6-50. పేజీలు 18+16 www.eenadu.net

Karimnagar, Visakhapatnam, Hyderabad, Vijayawada, Tirupati, Ananthapuramu, Rajamahendravaram, Suryapet, Guntur, Nellore, Srikakulam, Kurnool, Tadepalligudem, Warangal, Kadapa, Nizamabad, Khammam, Ongole, Mahaboobnagar, Chennai, Bengaluru, Mumbai, Delhi

చెప్పినవన్నీ చేస్తాం

అవసరమైతే కొత్త నిర్ణయాలూ తీసుకుంటాం • ఏప్రిల్ నుంచి ఆసరా, రైతుబంధు సాయం పెంపు

- నిరుద్యోగ భృతికి మరో అయిదారు నెలల సమయం
- కౌలురైతులకు భూ యజమానులే సాయమందించాలి
- ఇప్పటి నుంచే విపక్షాల రాద్ధాంతం వద్దు
- సాగునీటికి మొదటి ప్రాధాన్యం
- ఈ సారి రూ.24 వేల కోట్ల రుణమాఫీ
- మార్చి నాటికి ఇంటింటికీ 'మిషన్ భగీరథ'
- గవర్నర్ ప్రసంగానికి ధన్యవాద తీర్మానంపై చర్చలో ముఖ్యమంత్రి కేసీఆర్



ఈనాడు – హైదరాబాద్

ఎన్నికల సందర్భంగా ప్రజలకిచ్చిన వాగ్దానాలను నూటికి నూరు శాతం నెరవేరుస్తామని ముఖ్యమంత్రి కేసీఆర్ స్పష్టంచేశారు. రైతు బంధు సాయం, ఆసరా పింఛన్ల పెంపు వచ్చే ఏప్రిల్ నుంచి అమలు చేస్తామని.. నిరుద్యోగ భృతి అమలుకు మరో అయిదారు నెలల సమయం పడుతుందని తెలిపారు. గత ప్రభుత్వ కాలంలో ఎన్నికల ప్రణాళికలోలేని 76 పథకాలనూ అమలు చేశామన్నారు. ఈ సారి కూడా హామీలేగాక ప్రజావసరాలకు అనుగుణంగా నిర్ణయాలు తీసుకుంటామని చెప్పారు. ఐదేళ్లలో పూర్తి చేయాల్సిన హామీలపై ఇప్పటి నుంచే ప్రతిపక్షాలు రాద్ధాంతం చేయొద్దని సూచించారు. ఆదివారం శాసనసభలో గవర్నర్ ప్రసంగానికి ధన్యవాదాలు తెలిపే తీర్మానంపై చర్చలో సీఎం కేసీఆర్ మాట్లాడారు. సాగునీటి రంగానికి ప్రభుత్వం అగ్రతాంబూలం ఇస్తోందని చెప్పారు. వచ్చే (మిగతా 2లో)

> రైతులకు రూ.లక్ష లోపు రుణమాఫీని అమలు చేస్తాం. గత ప్రభుత్వ కాలంలో రూ.17 వేల కోట్ల రైతు రుణాలను మాఫీ చేశాం. ఈసారి రూ.24 వేల కోట్ల రుణాలను మాఫీ చేస్తాం. దీనిపై విధివిధానాలరూపకల్పన జరుగుతోంది.

> మంచి పథకాలు ఎవరు తెచ్చినా మెచ్చుకోవాల్సిందే. వైఎస్ రాజశేఖర్‌రెడ్డి తెచ్చిన ఆరోగ్యశ్రీ చాలా మంచి పథకం. మా ప్రభుత్వం దాన్ని యథాతథంగా అమలు చేసింది. కేంద్రం అమలు చేస్తున్న ఆయుష్మాన్ భారత్ కంటే ఆరోగ్యశ్రీనే బాగుంది. అందుకే ఆయుష్మాన్ భారత్‌లో చేరబోమని ప్రధానికి చెప్పాం.

> కారం, పసుపు, నూనె ఆఖరికి పిల్లలు తాగే పాలను కూడా కల్తీ చేస్తున్నారు. ఈ బెడద పోవాలంటే మంచి బ్రాండ్ తీసుకొచ్చేలా పాటుపడతాం. విజయ డెయిరీ, లిజ్జత్ పాపడ్ కంపెనీల మాదిరి చేస్తాం. పంట కాలనీలు, ఆహార శుద్ధి పరిశ్రమలపై అధ్యయనం జరుగుతోంది.



పద్దు పెద్దదే

రూ.2 లక్షల కోట్లు దాటనున్న రాష్ట్ర బడ్జెట్

- సాగునీటికే సింహభాగం
- రైతుబంధు, రుణమాఫీ, ఆసరాకు భారీగా నిధులు
- వ్యవసాయం, సంక్షేమానికి ప్రాధాన్యం
- ఆర్థికశాఖకు చేరిన ప్రతిపాదనలు

ఈనాడు – హైదరాబాద్

తెలంగాణ రాష్ట్ర బడ్జెట్ ఈసారి రెండు లక్షల కోట్ల రూపాయల మార్కు దాటనుంది. 2018-19 ఆర్థిక సంవత్సరంలో 1.74 లక్షల కోట్ల రూపాయల బడ్జెట్‌ను ప్రవేశపెట్టిన రాష్ట్ర ప్రభుత్వం 2019-20కి ప్రవేశపెట్టే ఓట్ ఆన్ అకౌంట్ బడ్జెట్ రూ.2 లక్షల కోట్లు దాటుతుందని ఆర్థిక శాఖ వర్గాలు విశ్లేషించాయి. సొంత పన్నుల రాబడిలో నవంబరుకే 29% వృద్ధిరేటు నమోదు చేసినట్లు రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికే ప్రకటించింది. ఈ నేపథ్యంలో సొంతరాబడులు, కేంద్ర పన్నుల వాటా, గ్రాంట్లు, కేంద్ర ప్రభుత్వ (మిగతా 2లో)

సాగునీటికి రూ.25 వేలకోట్లు

రాష్ట్ర బడ్జెట్‌లో సాగునీరు, రైతు సంక్షేమం, బడుగు బలహీనవర్గాల సంక్షేమం.. నిధుల కేటాయింపులో అగ్ర స్థానాల్లో ఉంటాయని అధికారులు చెబుతున్నారు. ప్రస్తుత పథకాలతో పాటు ఎన్నికల హామీల అమలును పరిగణనలోకి తీసుకుని ఓట్ ఆన్ అకౌంట్ బడ్జెట్‌ను రూపొందించనున్నారు. ఈ సారి రూ.25 వేల కోట్ల నిధులను నీటిపారుదల శాఖ ప్రతిపాదించింది. బడ్జెట్ కేటాయింపులతో పాటు బ్యాంకుల రుణాలు రూ.10,400 కోట్లు కలిపి నీటిపారుదలశాఖకు రూ.25 వేలకోట్లను కేటాయించనున్నారు.



చండీయాగం నిర్వహణకు సిద్ధమైన మంటపాలు

మహాయాగానికి సర్వం సిద్ధం

- నేటి నుంచే ఎర్రవల్లిలో మహారుద్ర సహిత సహస్ర చండీ యాగం 2లో
- యాగకర్తలుగా సీఎం కేసీఆర్ దంపతులు
- 5 రోజులపాటు నిర్వహణ



కొండల్లో పుట్టి పెరిగి... కోనల్లో ఆడిపాడిన కోలాం గిరిజన తెగకు చెందిన ఇద్దరు అమ్మాయిలు కొండల్ని అధిరోహిస్తున్నారు. కోనల్ని అధిగమిస్తున్నారు. పర్వతారోహణ, ప్రపంచ వాటర్ రాపెల్లింగ్ పోటీల్లో బహుమతులూ గెలుస్తున్నారు. ఇంతకీ వాళ్లెవరు? ఎక్కడుంటారో.. తెలుసుకోవాలని ఉందా?

చక్కగా వండుకొని, తినేసే బొకేలు ఎక్కడ దొరుకుతాయో.. కొనుక్కోవాలనుందా? చదువుకోలేని ఓ వ్యక్తి పుస్తకాలయ్య ఎందుకయ్యాడో.. చదవాలనుందా?

అయితే... నేటి వారెవ్వా!లో చూడండి.



న్యాయ వ్యవస్థ సమూలంగా మారాలి

హత్యా నేరం నిరూపణకు 30 ఏళ్లు పడితే ప్రయోజనమేమిటి?

- బ్రిటిష్ కాలం నాటి విధానాల వల్లే తీర్పుల్లో జాప్యం 3లో
- అఖిల భారత న్యాయమూర్తుల సంఘం వ్యాఖ్యలు

పల్లెపోరు నేడే

- ఉదయం ఏడు నుంచి తొలి విడత పంచాయతీ ఎన్నికలు
- ఒంటిగంట వరకు పోలింగ్
- ఆ వెంటనే ఓట్ల లెక్కింపు



ఈనాడు, హైదరాబాద్: తెలంగాణలో సోమవారం మొదటి విడత పంచాయతీ ఎన్నికలు జరుగనున్నాయి. ఉదయం ఏడు నుంచి ఒంటిగంట వరకు బ్యాలెట్ విధానంలో ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకోనున్నారు. మధ్యాహ్నం రెండు గంటల నుంచి ఓట్ల లెక్కింపు జరుగుతుంది. ఓట్ల లెక్కింపు పూర్తయ్యాక ఉపసర్పంచి ఎన్నికనూ రిటర్నింగ్ అధికారి చేపడతారు. రాష్ట్రంలోని 12,732 పంచాయతీల పాలకవర్గాలకు ఎన్నికలు నిర్వహించేందుకు ఈ నెల ఒకటో తేదీన రాష్ట్ర (మిగతా 2లో)



తెలంగాణ జాగృతి ఆధ్వర్యంలో హైదరాబాద్‌లో నిర్వహించిన అంతర్జాతీయ యువ నాయకత్వ సదస్సు ముగింపు సమావేశంలో డాక్టర్ రాజేంద్రసింగ్‌కు జీవిత సాఫల్య పురస్కారాన్ని అందజేస్తున్న గవర్నర్ నరసింహన్. పక్కన రెజ్లర్ బబితా కుమారి ఫొగాట్, ఎంపీ కవిత, మలావత్ పూర్ణ

సుస్థిరాభివృద్ధి యువతతో సాధ్యం

- పేదరిక నిర్మూలన, పర్యావరణ పరిరక్షణకు పోరాడాలి
- గవర్నర్ నరసింహన్
- యువతతో గ్లోబల్ నెట్‌వర్క్ ఏర్పాటు: ఎంపీ కవిత 6లో

పీజీ కోర్సులకు ఉమ్మడి ప్రవేశ పరీక్ష



- ఓయూ, కేయూలకు ఇక విడివిడిగా ఉండవు 6లో
- జేఎన్‌టీయూహెచ్‌కు వర్తింపు
- తెలంగాణ రాష్ట్ర ఉన్నత విద్యామండలి ప్రాథమిక నిర్ణయం



ఉల్లంఘనులకు ఇక వణుకే

ఎన్నికల కేసులు చకచకా • 22 కేసుల్లో శిక్షలు



ఈనాడు, హైదరాబాద్: ఎన్నికల నిబంధనల ఉల్లంఘన కేసులంటే అందరికీ అలుసే. ఎన్నికలప్పుడు కేసులు పెడతారు.. ఆ తర్వాత అంతా మర్చిపోతారని ఎక్కువమంది భావిస్తుంటారు. అందుకే ఎన్ని నిబంధనలు ఉన్నా యథేచ్ఛగా ఉల్లంఘనలకు పాల్పడుతూనే ఉంటారు. కానీ ఈసారి పరిస్థితి మారిపోయింది. కేసుల దర్యాప్తు శరవేగంగా పూర్తి చేస్తున్న పోలీసులు వాటిలో శిక్షలు కూడా పడేటట్లు చూస్తున్నారు. తద్వారా ఎన్నికల నిబంధనలు ఉల్లంఘించడానికి నాయకులు భయపడే పరిస్థితి తెస్తున్నారు. ఇటీవల శాసనసభ ఎన్నికల సందర్భంగా నమోదు చేసిన వాటిలో ఇప్పటికే 200 కేసుల్లో అభియోగపత్రాలు దాఖలు చేయడం (మిగతా 2లో)

విషాద సంద్రం

- మధ్యధరా సముద్రంలో మరో విషాదం!
- 170 మంది శరణార్థుల గల్లంతు 7లో

భద్రతకు తొలి ప్రాధాన్యం

- గనుల నిర్వహణపై జాతీయ సదస్సులో వక్తలు
- అక్రమ తవ్వకాలతో ప్రమాదాలు, పర్యావరణంపై ప్రభావం

ఈనాడు, హైదరాబాద్: దేశ ఆర్థిక వ్యవస్థకు వెన్నెముకలాంటి మైనింగ్ రంగంలో వృద్ధి రేటు పెరగాలని, అదే సమయంలో పర్యావరణానికి నష్టం జరగకుండా చూడాలని.. గనుల తవ్వకాల్లో ఆధునిక పరిజ్ఞానం వినియోగాన్ని పెంచాలని వక్తలు అభిప్రాయపడ్డారు. 'గనుల భద్రత నిర్వహణ, ఖనిజాభివృద్ధి'పై మైనింగ్ ఇంజినీర్స్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా, డైరెక్టరేట్ మైన్స్ సేఫ్టీ ఆధ్వర్యంలో జాతీయ సదస్సు హైదరాబాద్‌లోని మర్రి చెన్నారెడ్డి మానవ వనరుల అభివృద్ధి కేంద్రంలో ఆదివారం జరిగింది. మైనింగ్ కారణంగా పర్యావరణానికి నష్టం..పనిచేసే వారి ఆరోగ్యంపై దుష్ప్రభావం చూపుతోందన్న విమర్శల నేపథ్యంలో.. గనుల తవ్వకాల్లో మరిన్ని జాగ్రత్తలు తీసుకోవాలని సమావేశం అభిప్రాయపడింది.

కేంద్ర గనులశాఖ డైరెక్టర్ ప్రితుల్‌కుమార్ మాట్లాడుతూ.. శాస్త్రీయ విధానంలో గనుల తవ్వకాలు జరిపి ప్రమాదాలను నియంత్రించాలని సూచించారు. గనులశాఖ రాష్ట్ర డైరెక్టర్ సుశీల్‌కుమార్ మాట్లాడుతూ ప్రమాదాలు జరిగితే యజమానిదే బాధ్యత అన్నారు. ఒడిశా, మేఘాలయలలో జరిగిన పెద్ద ప్రమాదాల నుంచి పాఠాలు నేర్చుకోవాలని సూచించారు. సున్నా ప్రమాదాల దీర్ఘకాలిక లక్ష్యంతో గనుల తవ్వకాలు ఉండాలన్నారు.

తెలంగాణ ఖనిజాభివృద్ధి సంస్థ డైరెక్టర్ మల్సూర్ ప్రసంగిస్తూ అధిక లాభాల కోసమో, తెలిసో తెలియకో కొన్ని మైనింగ్ సంస్థలు అడ్డగోలుగా తవ్వుతూ పర్యావరణానికి, ప్రజలకు నష్టం కలిగిస్తున్నాయని అలాంటి వారికి శిక్షలు తప్పవని హెచ్చరించారు. భద్రతకు తొలి ప్రాధాన్యమిస్తూ గనుల్లో తవ్వకాలు జరపాలని పలువురు నిపుణులు సూచించారు. గనుల తవ్వకాలు, ఖనిజాల అన్వేషణలో సేఫ్టీ మేనేజ్‌మెంట్, తవ్వకాల్లో వివిధ దేశాల్లో అవలంబిస్తున్న ఆధునిక పద్ధతుల గురించి చర్చించారు.



ఆదివారం రాత్రి విద్యుత్తు కాంతుల మధ్య చండీయాగ ప్రాంగణం

మహాయాగానికి సర్వం సిద్ధం

- ఆహ్వానితులకు మాత్రమే వ్యవసాయ క్షేత్రంలోకి అనుమతి

ఈనాడు - హైదరాబాద్, సిద్దిపేట: ముఖ్యమంత్రి కేసీఆర్ సిద్దిపేట జిల్లా ఎర్రవల్లిలోని తన వ్యవసాయ క్షేత్రంలో తలపెట్టిన మహారుద్ర సహిత సహస్ర చండీ యాగానికి సర్వం సిద్ధమైంది. సోమవారం ఉదయం 11 గంటలకు సీఎం కేసీఆర్ దంపతులు యాగకర్తలుగా ఈ మహాక్రతువు ప్రారంభం కానుంది. విశాఖ శారదా పీఠం అధిపతి స్వరూపానందేంద్ర స్వామి, వేదపండితులు మాడుగుల మాణిక్య సోమయాజులు, నరేంద్ర కాప్రే, ఫణిశశాంకశర్మ తదితరుల ఆధ్వర్యంలో శృంగేరీ పీఠ సంప్రదాయంలో ఐదురోజులపాటు యాగం జరగనుంది. 300 మంది రుత్వికులు యాగ నిర్వహణలో పాల్గొంటున్నారు. ఆదివారం శాసనసభ సమావేశాలు ముగిసిన వెంటనే ముఖ్యమంత్రి కేసీఆర్ ఎర్రవల్లి చేరుకొని యాగశాల నిర్మాణం, ఇతర ఏర్పాట్లను పరిశీలించారు. తెలంగాణలో సకాలంలో వర్షాలు పడి రైతులు సుభిక్షంగా ఉండేలా, అభివృద్ధి, సంక్షేమ పథకాలు నిరంతరాయంగా కొనసాగేలా, బంగారు తెలంగాణ కల సాకారమయ్యేలా దైవానుగ్రహం కోసం కేసీఆర్ ఈ యాగం చేస్తున్నట్లు పండితులు చెబుతున్నారు. ప్రజలకు మరింత బాగా పనిచేసే శక్తిని ఇవ్వడంతోపాటు సమాజ హితాన్ని కాంక్షిస్తూ సీఎం కేసీఆర్ ఈ యాగాన్ని నిర్వహిస్తున్నారని మాణిక్య సోమయాజి తెలిపారు.



సిద్దిపేట జిల్లా మర్కూక్ మండలం ఎర్రవల్లిలోని వ్యవసాయ క్షేత్రంలో జరగనున్న మహారుద్ర సహిత సహస్ర చండీయాగం ఏర్పాట్లను పరిశీలిస్తున్న ముఖ్యమంత్రి కేసీఆర్, ఎంపీ సంతోష్ కుమార్, ఖనిజాభివృద్ధి సంస్థ ఛైర్మన్ సుభాష్‌రెడ్డి తదితరులు

పలువురికి ఆహ్వానాలు

యాగంలో పాల్గొనాలని గవర్నర్ నరసింహన్ దంపతులను సీఎం కేసీఆర్ ఆహ్వానించారు. ఈ నెల 23, 24, 25 తేదీల్లో ఒకరోజు వారు హాజరవుతారని తెలిసింది. తెరాస ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, జెడ్పీ ఛైర్మన్‌లు, పార్టీ రాష్ట్ర కమిటీ నేతలను కూడా యాగానికి ఆహ్వానించారు. తెలంగాణ, ఏపీలతోపాటు కర్ణాటక, మహారాష్ట్రల నుంచి వేద పండితులు, రుత్వికులు ఇప్పటికే ఎర్రవల్లికి చేరుకున్నారు.

2015 డిసెంబరులో సీఎం కేసీఆర్ అయుత చండీ మహాయాగాన్ని చేశారు. అప్పట్లో ఈ యాగాన్ని చూసేందుకు రాష్ట్రం నలుమూలల నుంచి పెద్ద సంఖ్యలో ప్రజలు విచ్చేశారు. ప్రముఖులూ విచ్చేసి పూజా కార్యక్రమాల్లో పాల్గొన్నారు. వ్యవసాయ క్షేత్రం ప్రహరీ వెలుపల ఉన్న స్థలంలో అప్పట్లో యాగశాలలు ఏర్పాటు చేశారు. అయితే, సహస్ర చండీ యాగాన్ని మాత్రం క్షేత్రం లోపలే నిర్వహిస్తున్నారు. ఈ యాగంలో సీఎం కేసీఆర్ కుటుంబ సభ్యులు, సన్నిహితులు పాలు పంచుకోనున్నారు. కేవలం కొద్ది మంది ఆహ్వానితులను మాత్రమే వ్యవసాయ క్షేత్రంలోకి అనుమతించనున్నారు. అయుత చండీ యాగం తరహాలో సహస్ర చండీ యాగాన్ని ఏకోత్తర వృద్ధి సంప్రదాయంలో నిర్వహిస్తున్నారు. అయిదో రోజు (ఈనెల 25న) పూర్ణాహుతితో ఈ మహాక్రతువు పూర్తవుతుంది. వ్యవసాయ క్షేత్రం దక్షిణ ద్వారాన్ని ఆనుకుని యాగశాలను నిర్మించారు. 27 హోమ గుండాలను సిద్ధం చేశారు. ఏర్పాట్లను అష్టకాల రామ్మోహన్‌శర్మ పర్యవేక్షిస్తున్నారు.

రేపు దిల్లీకి వెళ్లిరానున్న సీఎం

మంగళవారం రెండో రోజు యాగం కార్యక్రమాలు ముగిసిన అనంతరం సాయంత్రం నాలుగు గంటలకు సీఎం కేసీఆర్ ప్రత్యేక విమానంలో దిల్లీకి వెళ్లి కేంద్ర అటవీ శాఖ మంత్రి హర్షవర్ధన్ కుమారుడి వివాహ వేడుకల్లో పాల్గొంటారు. అదే రోజు రాత్రి మళ్లీ ఆయన దిల్లీనుంచి బయల్దేరి ఎర్రవల్లికి వస్తారు. మరుసటి రోజు యాగంలో పాల్గొంటారు.

చిన్నదే కావొచ్చు..

చెయ్యాల్సిన పని ఎంత చిన్నదైనా సరే... మీరెంత బాగా చెయ్యగలరో అంత శ్రద్ధగా, ఒక ముఖ్యమైన పనికి ఎంత ప్రాధాన్యం ఇస్తారో దాన్నీ అంతే ధ్యాసతో చెయ్యండి. ఎందుకంటే చివరికి మనమేంటన్నది నిర్ణయించేది ఈ చిన్నచిన్న పనులే!

– మహాత్మా గాంధీ

బెయిలు దక్కకున్నా బయటికెళ్లిన నిందితులు

దిల్లీ కోర్టులో అనూహ్య పరిణామం

దిల్లీ: ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్(ఈడీ) వాదనల్లో గందరగోళం కారణంగా స్థానిక న్యాయస్థానంలో అనూహ్య పరిణామం చోటుచేసుకుంది. బెయిలు దక్కకున్నా ముగ్గురు నిందితులు కోర్టు నుంచి ఎంచక్కా బయటకు వెళ్లారు. దిల్లీకి చెందిన ఉపేందర్‌రాయ్ అనే విలేకరి రూ.వేల కోట్ల అక్రమ వసూళ్లకు పాల్పడిన ఆరోపణలపై ఈడీ నగదు అక్రమ చలామణి కేసు నమోదు చేసింది. ఈడీ అభియోగపత్రం ఆధారంగా నరేంద్రకుమార్ రాయ్, రాజేశ్ మాథుర్, యోగేందర్ పాల్ గుప్తాలకు కోర్టు సమన్లు జారీ చేసింది. వారు ముగ్గురు అదనపు సెషన్స్ జడ్జి ఎదుట శనివారం హాజరయ్యారు. బెయిలు కోరుతూ పిటిషన్లు వేశారు. దర్యాప్తు ప్రక్రియలో అరెస్టుకాని నిందితులు సమన్లపై తొలిసారి కోర్టుకు హాజరైతే.. బెయిలు పొందిన తర్వాతే బయటకు వెళ్లాలన్నది నిబంధన. బెయిలు మంజూరుకు కోర్టు నిరాకరిస్తే వారు జ్యుడీషియల్ కస్టడీకి వెళ్లాలి. ప్రస్తుత కేసులో ఈడీ ప్రత్యేక పబ్లిక్ ప్రాసిక్యూటర్(ఎస్‌పీపీ) రాజీవ్ అవస్థి వాదనలు వినిపిస్తూ.. దర్యాప్తు ప్రక్రియలో అరెస్టు కాలేదు కాబట్టి నిందితులు బెయిలు తీసుకోవాల్సిన అవసరం లేదన్నారు. ఈడీ తరఫునే కోర్టుకు హాజరైన మరో ఎస్‌పీపీ నితేశ్ రాణా ఆయన వాదనతో విభేదించారు. మధ్యంతర బెయిలు తీసుకున్నాకే నిందితులు కోర్టును వీడాల్సి ఉంటుందని సూచించారు. లేదంటే వారిని జ్యుడీషియల్ కస్టడీకి పంపించాల్సి ఉంటుందనడంతో గందరగోళం నెలకొంది. నిందితుల తరఫు న్యాయవాదుల వాదనలు కూడా ఆలకించిన కోర్టు.. బెయిలు మంజూరు చేయకపోయినప్పటికీ వారిని బయటకు పంపించింది.

చలి పెరిగింది

ఆదిలాబాద్‌లో 9 డిగ్రీలు

ఈనాడు, హైదరాబాద్: రాష్ట్రంలో చలి తీవ్రత మళ్లీ పెరిగింది. ఆదివారం ఆదిలాబాద్‌లో 9, మెదక్, రామగుండంలో 12, హైదరాబాద్, హన్మకొండల్లో 13 డిగ్రీలుంది. రాత్రిపూట సాధారణంకన్నా 4 డిగ్రీలు తక్కువగా ఉంటే పగటిపూట 3 డిగ్రీలు అదనంగా ఉష్ణోగ్రతలు పెరుగుతున్నాయి. మహబూబ్‌నగర్‌లో పగలు అత్యధికంగా 34 డిగ్రీలు నమోదైంది. గాలిలో తేమ బాగా పెరిగింది.

పద్దు పెద్దదే

(మొదటి పేజీ తరువాయి)

పథకాల నిధులు సహా మొత్తం రాబడి గణనీయంగా ఉంటుందని పేర్కొంటోంది. కేంద్ర ప్రభుత్వం మాదిరే రాష్ట్ర ప్రభుత్వం కూడా ఓట్ ఆన్‌అకౌంట్ బడ్జెట్‌నే ప్రవేశపెట్టనుంది. అయితే, పూర్తి స్థాయి బడ్జెట్ ప్రతిపాదనలతోనే దీన్ని రూపొందించనున్నట్లు సమాచారం. 2019-20 బడ్జెట్ ప్రతిపాదనలను పంపినట్లు సమాచారం. కేంద్ర ప్రభుత్వం పూర్తి స్థాయి బడ్జెట్ ప్రవేశపెట్టిన అనంతరం, రాష్ట్ర ప్రభుత్వం కూడా పూర్తి స్థాయి బడ్జెట్‌ను ప్రవేశపెట్టనుంది.

ఆసరాకు రెట్టింపు.. రైతుబంధుకు పెంపు

ఆసరా పింఛన్ల పెంపు మొత్తం, ఖరీఫ్ పెట్టుబడి రాయితీ సహా కీలక అంశాలు రాబోయే బడ్జెట్లో ఉంటాయి. పెట్టుబడి రాయితీని ఎకరాకు రూ.4,000 నుంచి రూ.5,000కు పెంచనున్నట్లు ప్రభుత్వం ప్రకటించింది. ఈ నేపథ్యంలో ఈ రంగానికి రూ.12 వేల కోట్లు కేటాయించారు. పెట్టుబడి రాయితీ పెంపుతో బడ్జెట్ కేటాయింపులు 20% పెరగనున్నాయి. ఓట్ ఆన్ అకౌంట్ బడ్జెట్‌లోనే ఖరీఫ్ సీజన్ పెట్టుబడి రాయితీకి నిధులు విడుదల చేయాల్సి ఉంది. దీంతో ఈ బడ్జెట్‌లోనే ఈ నిధులను ప్రతిపాదించనున్నారు. లక్ష రూపాయల వరకూ వ్యవసాయ రుణాల మాఫీకి సంబంధించి ప్రభుత్వ ఉత్తర్వుల మేరకు బడ్జెట్ ప్రతిపాదనల్లో చేర్చనున్నట్లు అధికారులు పేర్కొన్నారు. ఆసరా పింఛన్ల మొత్తం రెట్టింపు కానుండటం, పింఛను పొందే వయో పరిమితిని 57 సంవత్సరాలకు తగ్గించనుండటం తెలిసిందే. ఆసరా పింఛన్ల నిధుల కేటాయింపు రూ.12 వేల కోట్లకు చేరే అవకాశం ఉందని గ్రామీణాభివృద్ధి శాఖ అధికారులు పేర్కొన్నారు. గృహనిర్మాణానికి కూడా పెద్ద ఎత్తున నిధులను కేటాయించేందుకు ప్రభుత్వం కసరత్తు చేస్తోంది. రెండు పడక గదుల ఇళ్ల నిర్మాణం విధానాన్ని సరళతరం చేయడంతోపాటు అర్హత కలిగిన వారికి, స్థలం ఉన్నవారికి రూ.5 నుంచి రూ.6 లక్షలు ఇవ్వాలని ప్రభుత్వం నిర్ణయించిన నేపథ్యంలో కేటాయింపులపై దృష్టిసారించనున్నారు. ప్రభుత్వ పాలనాపరమైన నిర్ణయాల మేరకు బడ్జెట్ కేటాయింపులపై కసరత్తు జరుగుతోందని అధికారులు పేర్కొంటున్నారు.

గత ఐదేళ్లలో బడ్జెట్ ప్రతిపాదనలు ఇలా

సంవత్సరం	బడ్జెట్ (రూ.కోట్లలో)
2014-15	1,00,637 (పది నెలలకు)
2015-16	1,15,689
2016-17	1,30,415
2017-18	1,49,646
2018-19	1,74,454

పల్లెపోరు నేడే

(మొదటి పేజీ తరువాయి)

ఎన్నికల సంఘం ప్రకటన విడుదల చేసింది. దీనిలో భాగంగా 21, 25, 30 తేదీల్లో పోలింగ్ నిర్వహించనుంది. మొదటి విడత ఎన్నికలు జరిగే 4479 పంచాయతీల్లో 769 పంచాయతీలు ఏకగ్రీవమయ్యాయి. 39,822 వార్డుల్లో 10,654 వార్డులు ఏకగ్రీవమయ్యాయి. దీంతోపాటు 9 పంచాయతీలు, 192 వార్డులకు దాఖలైన నామినేషన్లు పూర్తిగా చెల్లకుండా పోయాయి.

పల్లెల్లో కాసులు, గ్లాసుల గలగలలు!

పల్లె పోరును నాయకులు ప్రతిష్ఠాత్మకంగా తీసుకుంటున్నారు. పార్టీలతో నిమిత్తం లేకుండా గెలుపే లక్ష్యంగా పావులు కదుపుతున్నారు. కొన్ని చోట్ల స్వయంగా ఎమ్మెల్యేలు సైతం రంగంలోకి దిగి మంతనాలు నిర్వహించిన దృష్టాంతాలు ఉన్నాయి. మొదటి విడత ఎన్నికలు జరుగుతున్న పలు పంచాయతీల్లో శనివారం, ఆదివారం రాత్రి సమయాల్లో ఓటుకు రూ.వెయ్యి నుంచి రూ.రెండు వేల వరకు పంపిణీ చేసినట్లు సమాచారం. ఉమ్మడి మెదక్, కరీంనగర్, నిజామాబాద్, ఖమ్మం జిల్లాల్లో ధన ప్రవాహం అధికంగా ఉన్నట్లు తెలిసింది. మద్యం సీసాలు కూడా పెద్ద ఎత్తున పంపిణీ చేశారు. కొన్ని పంచాయతీల్లో గరిష్ఠంగా రూ.పాతిక లక్షల వరకు కూడా అభ్యర్థులు వ్యయం చేసినట్లు తెలుస్తోంది. ద్విచక్రవాహనాలు, సైకిళ్లను సైతం పంపిణీ చేశారు. రంగారెడ్డి, సంగారెడ్డి, యాదాద్రి భువనగిరి జిల్లాల్లో కొన్ని పంచాయతీల అభ్యర్థులు ఇంటికి కిలో చొప్పున కోడి మాంసం పంపిణీ చేశారు. పది ఓట్లు ఉన్న కుటుంబాలకు వాషింగ్ మిషన్లు, కూలర్లు ఇచ్చారు. స్థిరాస్తి వ్యాపారం జోరుగా ఉన్న పంచాయతీల్లో ప్రలోభాల పరంపరకు అంతులేకుండా ఉందని స్థానికులు చెబుతున్నారు. ఎన్నికల కోడ్ అమల్లోకి వచ్చినప్పటి నుంచి ఆదివారం వరకు రాష్ట్రంలో రూ.1.23 కోట్ల నగదును స్వాధీనం చేసుకున్నారు. రూ.22.78 లక్షల విలువైన మద్యం నిల్వలను పట్టుకున్నారు. 71 కేసులు కూడా నమోదయ్యాయి.

చెప్పినవన్నీ చేస్తాం

(మొదటి పేజీ తరువాయి)

మూడేళ్లలో 1.25 కోట్ల ఎకరాలకు సాగునీరందిస్తామని.. తొలుత ప్రతి కొత్త పంచాయతీకీ తారు రోడ్లు వేస్తామన్నారు. పోడు, అటవీ భూముల సమస్యలు పరిష్కరిస్తామని స్పష్టంచేశారు. భవిష్యత్‌లో అటవీ ఆక్రమణలు లేకుండా చర్యలు తీసుకుంటామన్నారు. లోక్‌సభ ఎన్నికలు పూర్తికాగానే పనులు, సంస్కరణల్లో వేగం పెరుగుతుందని తెలిపారు.

సాగునీటికి పెద్దపీట

"తెరాస ప్రభుత్వ పాలన చూసి ప్రజలు తిరిగి అఖండ మెజారిటీ ఇచ్చి మమ్మల్ని గెలిపించారు. వారికి కృతజ్ఞతలు. గవర్నర్ ప్రసంగం బహిరంగ సభలో కేసీఆర్ ప్రసంగంలా ఉందని కొంతమంది అన్నారు. వారి రాజకీయ పరిజ్ఞానానికి జాలిపడటం తప్ప చేయగలిగింది ఏమీ లేదు. కేసీఆర్ ప్రసంగాన్ని ఆమోదించి.. ఏ పార్టీ ప్రభుత్వాన్నైతే ప్రజలు గెలిపించారో, ఆ పార్టీ ఎన్నికల ప్రణాళిక, అదే విధానం గవర్నర్ ప్రసంగంలో ఉంటుంది. రాష్ట్ర ప్రభుత్వం మొదటి ప్రాధాన్యం నీటిపారుదలే. రానున్న మూడేళ్లలో కోటి 25 లక్షల ఎకరాలకు నీరందించబోతున్నాం. సాగునీటి ప్రాజెక్టులపై ఇప్పటి వరకు రూ.99 వేల కోట్లు ఖర్చు పెట్టాం. నిర్మాణంలో ఉన్న ప్రాజెక్టులు పూర్తి చేయడానికి రూ.లక్షా 17 వేల కోట్లు ఖర్చు చేయబోతున్నాం. మనకు కేటాయించిన నీటి వాటాను సంపూర్ణంగా వినియోగించుకునేలా ప్రణాళికలు అమలు చేస్తున్నాం. మార్చినాటికి మిషన్ భగీరథ నీళ్లు ప్రతి ఇంటికీ చేరుతాయి.

రుణమాఫీ

రాష్ట్రంలో చిన్నా, పెద్దా తారతమ్యం లేకుండా రూ. లక్ష వరకు వ్యవసాయ రుణమాఫీ కచ్చితంగా అమలు చేస్తాం. రూ.లక్ష వరకు మాఫీ చేస్తామని మేం చెప్పాం. కాంగ్రెస్ ఏకమొత్తంలో రూ.2 లక్షల వరకు మాఫీ చేస్తామని చెప్పింది. అయినా ప్రజలు మాపైనే విశ్వాసం ఉంచారు. ఏకమొత్తంలో మాఫీ చేస్తామని కాంగ్రెస్ పంజాబ్‌లోనూ చెప్పింది. ఈ రోజుకు కూడా అక్కడ అమలు కాలేదు. మధ్యప్రదేశ్, రాజస్థాన్ ప్రభుత్వాలు ఉత్త సంతకాలు మాత్రమే చేశాయి తప్ప ఇంతవరకు ఒక్క రూపాయి కూడా విడుదల చేయలేదు. గతంలో కొన్నిచోట్ల బ్యాంకుల నుంచి వచ్చిన ఇబ్బందులు ఈ సారి రాకుండా జాగ్రత్తలు తీసుకుంటాం. రైతు ఎలా మరణించినా 10 రోజుల్లో పరిహారం చెల్లిస్తున్నాం. ఇప్పటికే 6,062 మంది కుటుంబాలకు రైతు బీమా అందింది. ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు ఐకేపీ ఉద్యోగులను క్రమబద్ధీకరించి 45 వేలకు పైగా ఉన్న మహిళా సంఘాలను పాత్రధారులుగా చేస్తాం. ఆహార శుద్ధి యూనిట్లను ప్రతి నియోజకవర్గంలో నెలకొల్పి నిర్వహణ బాధ్యతను మహిళా సంఘాలకే అప్పగిస్తాం.

భూరికార్డుల ప్రక్షాళన

భూరికార్డుల ప్రక్షాళనను వందశాతం పూర్తి చేసి తీరుతాం. త్వరలో ధరణి వెబ్‌సైట్ ప్రారంభమవుతుంది. రాష్ట్రంలో ప్రతి అంగుళం భూమికి సంబంధించిన వివరాలు అందులో ఉంటాయి. తహసీల్దార్ ఆఫీసులోనే భూముల రిజిస్ట్రేషన్లు జరుగుతాయి. బ్యాంకులు వెబ్‌సైట్ చూసి రుణాలు ఇచ్చే రోజులు వస్తాయి. కౌలు రైతులకు రైతుబంధు సాయం గురించి అడుగుతున్నారు. కానీ, సాయం చేయడం సాధ్యం కాదు. రైతులకు మేం సాయం చేస్తున్నందున కౌలుదార్ల సంక్షేమాన్ని వారు చూడాలని విజ్ఞప్తి చేస్తున్నా. రాష్ట్రంలో 12481 గ్రామాలున్నాయి. కొత్తగా గ్రామ పంచాయతీలు వచ్చాయి. తండాలు, గూడేలు కూడా పంచాయతీలయ్యాయి. వీటన్నింటికీ తారు (బీటీ) రోడ్లు వేస్తాం. పాత రోడ్లు అద్దాల్లా తీర్చిదిద్దేందుకు ప్రాధాన్యం ఇస్తాం. పంచాయతీ ఎన్నికలు ముగిసిన వెంటనే వాటి అవసరాలపై సర్పంచులు, కార్యదర్శులతో అధ్యయనం చేయిస్తాం.

కేంద్రం పైసా ఇవ్వలేదు

మిషన్ కాకతీయ, భగీరథలకు రూ.24 వేల కోట్ల నిధులు ఇవ్వాలని నీతి ఆయోగ్ సిఫార్సు చేసింది. కానీ, కేంద్రం మనకు రూ.24 కూడా ఇవ్వలేదు. కేసీఆర్ కిట్ పథకంలో కేంద్రం వాటా పైసా కూడా లేదు. వచ్చే ఐదేళ్లలో తెలంగాణ సమకూర్చుకునే ఆదాయం, పెట్టే ఖర్చు రూ.10 లక్షల కోట్లపైనే ఉంటుంది. ఈ ఐదేళ్లలో 2 లక్షల 40 వేల కోట్లు అప్పు చెల్లించాలి. నాలుగు నుంచి ఐదు లక్షల కోట్లకుపైగా నిధులు అభివృద్ధి పనులకు ఉంటాయి.

దేశంలోనే అగ్రస్థానం

ఆర్థిక ప్రగతిలో తెలంగాణ రాష్ట్రం దేశంలోనే అగ్రస్థానంలో ఉంది. వరుసగా నాలుగేళ్లు 17.17 వృద్ధి రేటు సాధించాం. ఈ ఆర్థిక సంవత్సరంలో 29.93 వృద్ధి రేటు ఉంది. జీఎస్టీ వసూళ్లలో దేశంలోనే మొదటి స్థానంలో ఉన్నాం. చాలా మంచి ఉద్దేశంతో ఎవరూ అడగకుండానే కంటివెలుగు కార్యక్రమం చేపట్టాం. ఇప్పటి వరకు 1.32 కోట్ల మందికి కంటి పరీక్షలు జరిగాయి. కంటివెలుగును సునేత్ర పేరుతో అమలు చేసేందుకు ఇతర రాష్ట్రాలు ప్రయత్నాలు చేస్తున్నాయి. ఈ పథకంలో కొందరికి కళ్లు పోయాయని దుష్ప్రచారం చేశారు. అసలు కంటి వెలుగులో ఇంతవరకు శస్త్రచికిత్సలే ప్రారంభించలేదు. త్వరలో చెవి, ముక్కు, గొంతు, దంత పరీక్షల శిబిరాలు కూడా నిర్వహిస్తాం. రక్త పరీక్షలు చేసి ప్రతి ఒక్కరి ఆరోగ్య వివరాలను తయారు చేస్తాం.

పోడుకు ముగింపు పలకాలి

ఇప్పటికే పోడు చేస్తున్న వారినే పరిగణనలోకి తీసుకుంటాం. కొత్తగా పోడు ఉండదు. అడవులను పరిరక్షించే బాధ్యత మనపై ఉంది. దిల్లీ లాంటి చోట్ల డబ్బులు పెట్టి ఆక్సిజన్ కొనుక్కునే దుస్థితి నెలకొంది. అలాంటి పరిస్థితి భావితరాలకు రాకుండా చూడాల్సిన బాధ్యత మనదే. అందుకే అడవుల పరిరక్షణ కోసం కఠిన చర్యలు అమలు చేస్తున్నాం. అటవీ చట్టాలు కేంద్ర పరిధిలో ఉంటాయి. అటవీ భూములపై ఆధారపడి బతుకుతున్న గిరిజనులను ఆదుకునేందుకు ప్రత్యామ్నాయ చర్యలు తీసుకుంటున్నాం.

హామీల అమలు

కేంద్ర బడ్జెట్ తర్వాతే రాష్ట్ర బడ్జెట్ ఉంటుంది. పింఛన్ల పెంపు వచ్చే ఆర్థిక సంవత్సరం నుంచి అమలు చేస్తాం. నిరుద్యోగ భృతిపై క్షుణ్ణంగా అధ్యయనం చేసి.. ఎలాంటి లోటుపాట్లు లేకుండా అమలు జరుపుతాం. నిరుద్యోగుల లెక్క తేల్చాలి. దీనిపై శాసనసభ్యులతో సమావేశం ఏర్పాటు చేస్తాం. శాంతిభద్రతలు అద్భుతంగా అమలు కావడం మాకు గర్వకారణం. అతి త్వరలోనే పోలీస్ కమాండ్ కంట్రోల్ వ్యవస్థ అన్ని విభాగాలను సమన్వయం చేసుకునేలా ఏర్పాట్లు చేస్తున్నాం. శాంతి భద్రతల విషయంలో ఎలాంటి రాజీ ఉండబోదు. పేకాట, గుడుంబా స్థావరాలు ఇప్పుడు లేవు. బెట్టింగ్‌లకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవు. త్వరలోనే ధూల్‌పేటలో పర్యటించి.. స్థానిక సమస్యలు పరిష్కరిస్తా. లోక్‌సభ ఎన్నికలు పూర్తవగానే పంచాయతీరాజ్ చట్టాన్ని వంద శాతం అమల్లోకి తెస్తాం" అని సీఎం కేసీఆర్ చెప్పారు.

లాటరీ పద్ధతిలో ఇళ్లు

గత ప్రభుత్వాల పాలనలో గృహనిర్మాణాలు ఎలా జరిగాయో అందరికీ తెలుసు. కాంగ్రెస్ హయాంలో ఇళ్ల పేరుతో కుంభకోణం జరిగింది. ఒక్క మంథనిలోనే 144 శాతం ఇళ్లను నిర్మించినట్లు లెక్కలు చూపారు. మేం పారదర్శకంగా, పేదలకు మేలు చేసేలా రెండు పడక గదుల ఇళ్ల నిర్మించి ఉచితంగా ఇస్తున్నాం. కొంచెం ఆలస్యమైనా ఇళ్లు నాణ్యంగా నిర్మిస్తాం. రాష్ట్రంలో చేపట్టిన 2.60 లక్షల ఇళ్లకుగాకు హైదరాబాద్‌లో లక్ష ఇళ్ల నిర్మాణాలు జరుగుతున్నాయి. లబ్ధిదారులను లాటరీ ద్వారా ఎంపిక చేస్తున్నాం. సొంత స్థలం ఉన్నవారికి ఇంటి నిర్మాణానికి రూ.6 లక్షలు ఇస్తాం.

గ్రహం అనుగ్రహం

21-1-2019 సోమవారం

శ్రీ విళంబి నామ సం॥రం॥ ఉత్తరాయణం
హేమంత రుతువు; పుష్య మాసం; శుక్ల పక్షం
పూర్ణిమ: ఉ. 11.46 తదుపరి బహుళ పాడ్యమి
పుష్యమి నక్షత్రం: తె. 4.42 తదుపరి ఆశ్లేష
అమృత ఘడియలు: రా.10.42 నుంచి 12.12 వరకు
వర్జ్యం: మ. 1.44 నుంచి 3.13 వరకు
దుర్ముహూర్తం: మ. 12.34 నుంచి 1.19 వరకు
తిరిగి మ. 2.47 నుంచి 3.32 వరకు
రాహుకాలం: ఉ. 7.30 నుంచి 9.00 వరకు
సూర్యోదయం: ఉ.6-39; **సూర్యాస్తమయం:** సా.5-45

చలి - పులి

ప్రాంతం	కనిష్ఠ	గరిష్ఠ
ఆదిలాబాద్	9.0	29.8
రామగుండం	12.0	30.2
నిజామాబాద్	14.4	20.1
నల్గొండ	17.0	31.0
కరీంనగర్	17.0	31.0
మహబూబ్‌నగర్	17.0	33.6
సూర్యాపేట	20.0	23.0
విజయవాడ	20.1	29.4
ఖమ్మం	22.0	29.0

ఇదీ సంగతి!



చండీగఢ్‌లోని ఛత్‌బిర్ జంతుప్రదర్శనశాలలో ఆదివారం ఓ వ్యక్తిని రెండు సింహాలు చంపేశాయి. 30 ఏళ్ల వయసున్న ఓ వ్యక్తి ఆదివారం ప్రహరీ గోడను ఎక్కి సింహాలున్న ఎన్‌క్లోజర్‌లోకి పడిపోయాడు. సింహాలు అతడిపై దాడి చేశాయి.

ఉల్లంఘనులకు ఇక వణుకే

(మొదటి పేజీ తరువాయి)

పోలీసుల వేగానికి నిదర్శనం. వీటిలో 22 కేసుల్లో శిక్షలు కూడా పడటం గమనార్హం.

విమర్శలకు చెక్ పెట్టాలనే..

ఎన్నికల నిబంధనలు ఎంత కఠినంగా ఉన్నా ఉల్లంఘించేందుకు ఎవరూ జంకడం లేదు. ఇటీవల ముగిసిన శాసనసభ ఎన్నికల్లో రాష్ట్రవ్యాప్తంగా 1,900 కేసులు నమోదయ్యాయి. 2014 ఎన్నికల్లో నమోదయిన 1,650 కేసుల కంటే ఈసారి 250 కేసులు ఎక్కువ నమోదవడం గమనార్హం. ఎన్నికలు పూర్తవగానే పోలీసులు కూడా కేసులు గురించి పెద్దగా పట్టించుకోకపోవడమే ఉల్లంఘనలకు ప్రధాన కారణమని విమర్శలు వస్తున్నాయి. దీంతో పోలీసులు ఈసారి వీటిని తీవ్రంగా పరిగణిస్తున్నారు. ఎన్నికలు పూర్తయిన నెల రోజుల్లోనే దర్యాప్తు పూర్తి చేసి అభియోగపత్రాలు దాఖలు చేయడం మొదలుపెట్టారు. గత నెల 7న తెలంగాణలో పోలింగ్ జరిగింది. ఈ నెల 10 వరకూ 200 కేసుల్లో అభియోగపత్రాలు దాఖలు చేశారు. తూతూమంత్రంగా దర్యాప్తు జరిగినట్లు కాకుండా పకడ్బందీగా ఆధారాలు సేకరిస్తున్నారు. దాంతో ఇప్పటికే 22 కేసుల్లో న్యాయస్థానం శిక్షలు కూడా విధించింది. మిగతా కేసుల్లో న్యాయవిచారణ కొనసాగుతోంది. మిగతా 1,700 కేసుల్లోనూ మరో నెల రోజుల్లోనే దర్యాప్తు పూర్తి చేసి అభియోగపత్రాలు దాఖలు చేయాలని అధికారులు భావిస్తున్నారు.

సార్వత్రికంపై దృష్టి

పార్లమెంటు ఎన్నికల ప్రక్రియ మొదలయ్యేలోపు ఈ కేసులను కొలిక్కి తేవాలని అధికారులు భావిస్తున్నారు. ఎక్కువ కేసుల్లో శిక్షపడితే రాజకీయ నాయకుల్లోనూ భయం కలుగుతుందని అభిప్రాయపడుతున్నారు. దీని ప్రభావం పార్లమెంటు ఎన్నికపై ఉంటుందని, నిబంధనలు ఉల్లంఘించేందుకు నాయకులు వెనుకాడతారని, తద్వారా తమకు పనిభారం కూడా తగ్గుతుందని వారు విశ్లేషిస్తున్నారు.

ఆదాయపు పన్ను శాఖకు లేఖ

ఎన్నికల సమయంలో రాష్ట్రంలో రూ.98 కోట్ల నగదు స్వాధీనం చేసుకున్నారు. ఓటర్లకు పంచేందుకే వీటిని సిద్ధం చేశారన్నది పోలీసుల అభియోగం. అయితే ఈ డబ్బు ఎక్కడి నుంచి వచ్చిందనేది తేల్చే బాధ్యత ఆదాయపు పన్ను శాఖకు అప్పగించారు. స్వాధీనం చేసుకున్న డబ్బు చట్టబద్ధమైనదేనని నిందితులు నిరూపించుకోగలితే సొమ్ము తిరిగి ఇచ్చేస్తారు. దీనికి సంబంధించి ఆదాయ పన్ను శాఖ దర్యాప్తులో వెల్లడయిన అంశాలు తమకు తెలపాలని కోరుతూ డీజీపీ కార్యాలయం ఇదివరకే ఆదాయపు పన్ను శాఖకు లేఖ రాసింది.

స్వాధీనం చేసుకున్న డబ్బుకు ఆధారాలు లేని పక్షంలో దాన్ని ఓటర్లకు పంచేందుకే తెచ్చినట్లు భావించాల్సి ఉంటుంది. ఇది నేరం కాబట్టి ఆ డబ్బుకు బాధ్యులైన వారందరిపైనా పోలీసులు కేసులు నమోదు చేస్తారు. ఆదాయపు పన్ను శాఖ నుంచి సమాధానం వచ్చిన తర్వాత దీనిపై నిర్ణయం తీసుకోనున్నారు.

గర్భగుడి పక్కన శయన మండపం

- యాదాద్రి ఆలయంలో ఆధ్యాత్మికతతో కూడిన హంగులు

యాదగిరిగుట్ట, న్యూస్‌టుడే: యాదాద్రి ఆలయ పునర్నిర్మాణం, విస్తరణలో భాగంగా గర్భగుడి పక్కన శ్రీ స్వామి అమ్మవార్ల పవళింపు సేవోత్సవం కోసం కొత్తగా శయన మండప నిర్మాణం చేపట్టనున్నారు. ఇందుకోసం యాదాద్రి ఆలయ అభివృద్ధి ప్రాధికార సంస్థ(యాడా) అధికారులు ప్రణాళికలు రూపొందించారు. ప్రధానాలయ ముఖమండపంలో ఆధ్యాత్మికతతో కూడిన హంగుల ఏర్పాట్లపై తాజాగా దృష్టి పెట్టింది. ఈ క్రమంలో స్తంభోద్భవుడి సన్నిధిలో ఆళ్వారుల మండపం, కాకతీయ స్తూపాల ప్రాకారాలను తీర్చిదిద్దేందుకు నిర్ణయించారు. గర్భాలయానికి టేకు ద్వారాలను, వాటిపై అమర్చే విగ్రహాలను సిద్ధం చేస్తున్నారు. అష్టభుజ మండప ప్రాకారంలో అద్దాల మండప నిర్మాణాన్ని చేపట్టారు. పడమర వాయు మూలలో 15 అడుగుల పొడవు, 15 అడుగుల వెడల్పుతో ఈ నిర్మాణం జరుగుతోందని స్థపతులు తెలిపారు. ధ్వజ స్తంభ స్థాపనకు నారవే పకడ్రతో సిద్ధం చేస్తున్నారు. ప్రత్యేక నిపుణులతో స్తంభ తయారీకి పనులు చేపట్టారు. ఆలయ ముఖ మండపంలోని కప్పునకు ప్రత్యేక ఆకృతుల ఏర్పాటుకు యాడా నిర్ణయించింది. ఆలయ శిల్పి ఆనంద సాయి పర్యవేక్షణలో ప్రత్యేక కళాకారులతో వాటిని సిద్ధం చేస్తున్నారు.


ఆలయ ముఖమండపంలో పనులు


అష్టభుజ మండప ప్రాకారంలో చేపట్టిన అద్దాల మండప నిర్మాణం

నేడు పుష్యపౌర్ణమి పుణ్యస్నానాలు

- కుంభమేళాలో కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు
- భక్తులతో పోటెత్తిన సంగమ ప్రాంతం

ప్రయాగ్‌రాజ్: పవిత్రకుంభమేళాలో అత్యంత ప్రధానమైన పుష్యపౌర్ణమికి ముందురోజైన ఆదివారం ఇక్కడి త్రివేణి సంగమానికి వచ్చే దారులన్నీ భక్తులతో కిక్కిరిసిపోయాయి. కుంభమేళాలో పవిత్రస్నానానికి పుష్యపౌర్ణమిని అత్యంత విశేషమైన రోజుగా భావిస్తారు. కాగా, పౌర్ణమి రోజైన సోమవారం కనీసం ఇరవైలక్షల మందికి పైగా భక్తులు సంగంలో పవిత్రస్నానాలు ఆచరించవచ్చని పోలీసు అధికారులు అంచనావేస్తున్నారు. కుంభమేళాకు వచ్చిన ప్రతి ఒక్కరికీ కచ్చితమైన భద్రత కల్పించడమే లక్ష్యంగా పనిచేస్తున్నట్లు యూపీ అదనపు డీజీపీ (శాంతిభద్రతలు) తెలిపారు. కుంభమేళాలో స్నానానికి అత్యంత పవిత్రమైన దినాలుగా పరిగణించే రోజుల్లో మకరసంక్రాంతి, పుష్యపౌర్ణమి, మౌని అమావాస్య(ఫిబ్రవరి 4), వసంత పంచమి(ఫిబ్రవరి10), మాఘ పౌర్ణిమ(ఫిబ్రవరి 19), మహాశివరాత్రి (మార్చి 4) ప్రధానమైనవి.

రూ.1.2 లక్షల కోట్ల ఆదాయం!

ఈనెల 15వ తేదీ నుంచీ మొదలై మార్చి నాలుగోతేదీన పరిసమాప్తమయ్యే ఈ మహాకుంభమేళా ఉత్తర్‌ప్రదేశ్‌కు రూ.1.2లక్షల కోట్ల ఆదాయాన్ని సముపార్జించి పెడుతుందని 'కాన్ఫెడరేషన్ ఆఫ్ ఇండియన్ ఇండస్ట్రీ' (సీఐఐ) అంచనా వేసింది. మౌలికంగా కుంభమేళా ఆధ్యాత్మిక, మతపరమైన కార్యక్రమం అయినప్పటికీ...దాని ద్వారా వివిధ రంగాల్లో ఆరులక్షల మందికి పైగా వ్యక్తులకు ఉపాధిని కలుగుతుందని సీఐఐ తాజా నివేదిక పేర్కొంది. ఈ దఫా కుంభమేళా నిర్వహణ నిమిత్తం ఉత్తర్‌ప్రదేశ్ ప్రభుత్వం రూ.4,200 కోట్లను కేటాయించింది. ప్రపంచంలోనే అనేకానేక దేశాల నుంచి విదేశీ పర్యాటకులు పెద్దసంఖ్యలో కుంభమేళాకు తరలివస్తారు.

లక్ష్మీనారాయణ్ త్రిపాఠీ సారథ్యంలో అఖాడా

ట్రాన్స్‌జెండర్ల హక్కుల కోసం ఉద్యమించిన వ్యక్తిగా...సామాజిక కార్యకర్తగా పేరుగాంచి, 2011లో టీవీ రియాల్టీ షో 'బిగ్‌బాస్'లో పాల్గొని ప్రాచుర్యాన్ని పొందిన లక్ష్మీనారాయణ్ త్రిపాఠీ ఇప్పుడు ఏకంగా ఓ అఖాడానే నెలకొల్పారు. 'కిన్నర్ అఖాడా' పేరుతో తనలాంటి ట్రాన్స్‌జెండర్లతో అఖాడాను ఏర్పాటు చేశారు. కుంభమేళాలో ఇప్పుడు ఆమె పూజలందుకుంటున్నారు. ఆమె ఉంటున్న గుడారం చుట్టూ సాయుధ పోలీసు బలగాలు మోహరించి ఉన్నాయి. ఇక, బౌన్సర్ల రక్షణకూ కొదవలేదు. తన గుడారంలో పెద్దవేదికపై ఆసీనురాలైన ఆమెకు యాత్రికులంతా వచ్చి పూలహారాలు వేసి పాదాభివందనం చేసి వెళుతున్నారు. చిరునవ్వుతూ ఆసీనురాలై ఉన్న లక్ష్మీ త్రిపాఠి వారిని ఆశీర్వదిస్తున్నారు. కుంభమేళాలో తరతరాలుగా 13 రకాల అఖాడాలున్నాయి. మతపరమైన ఈ అఖాడాలు మొదట లక్ష్మీ త్రిపాఠి సారథ్యంలోని 'కిన్నర్ అఖాడా'ను స్వాగతించలేకపోయాయి. అయితే, అందులో కీలకమైన జునాఅఖాడా అంగీకారంతో 'కిన్నర్ అఖాడా' ఇప్పుడు కుంభమేళాలో ప్రముఖంగా నిలిచింది.

చిలీలో భూకంపం

శాంటియాగో: చిలీ దేశంలోని ఉత్తర మధ్య ప్రాంతంలో శనివారం శక్తిమంతమైన భూకంపం సంభవించింది. ఈ విపత్తు సమయంలో ఆందోళనకు గురై ఇక్కడి కొకింబో పట్టణంలో ఇద్దరు వృద్ధులు గుండెపోటుతో మరణించారు. ఈ పట్టణానికి నైరుతి దిశగా 15 కి.మీ.ల దూరంలో 53 కి.మీ.ల లోతులో భూకంప కేంద్రం ఉన్నట్లు అమెరికా భూగర్భ పరిశోధన సంస్థ వెల్లడించింది. భూకంపం తీవ్రత రిక్టర్ స్కేల్‌పై 6.7గా నమోదైనట్లు వివరించింది. తీర ప్రాంతమైన కొకింబోలో కొన్ని చోట్ల కొండ చరియలు విరిగిపడ్డాయి. వేల సంఖ్యలో ఇళ్లకు విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. సునామీ ముప్పు లేదని ప్రభుత్వ వర్గాలు ప్రకటించినప్పటికీ చాలా మంది ప్రజలు ఎత్తైన ప్రాంతాలకు తరలివెళ్లారు.

రక్తనాళాల్లో ఈదే బుల్లి రోబోలు

జెనీవా: రక్తనాళాల్లో ఈత కొట్టుకుంటూ వెళ్లగలిగే బుల్లి, స్మార్ట్ రోబోలను శాస్త్రవేత్తలు తయారుచేశారు. అనారోగ్యకర కణజాలానికి నేరుగా ఔషధాలను చేరవేయడంలో ఇవి ఎంతగానో తోడ్పడే వీలుంది. కావాల్సినప్పుడు ఆకారాన్ని మార్చుకోవడం వీటి ప్రత్యేకత. బ్యాక్టీరియా నిర్మాణం ఆధారంగా స్విట్జర్లాండ్‌లోని స్విస్ ఫెడరల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ లోసాన్ (ఈపీఎఫ్ఎల్), ఈటీహెచ్ జ్యూరిక్ విద్యా సంస్థల నిపుణులు వీటిని అభివృద్ధి చేశారు. సూక్ష్మ అయస్కాంత అణువులతో కూడిన హైడ్రోజెల్‌ను దీనిలో ఉపయోగించారు. దీంతో విద్యుదయస్కాంత క్షేత్రం సాయంతో ఈ స్మార్ట్ రోబోలను నియంత్రించేందుకు వీలు పడుతోంది. 'ఎక్కువ జిగటగా ఉండే ద్రవాలు ఎదురైనప్పుడు ఇవి ఆకారాన్ని మార్చుకుంటాయి. దీంతో వీటి వేగంలో ఎలాంటి మార్పు ఉండదు"అని పరిశోధనలో పాలుపంచుకున్న సల్మాన్ సకార్ తెలిపారు.

న్యాయ వ్యవస్థలో సమూల మార్పులు రావాలి

- నేర నిరూపణకు 30 ఏళ్లు పడితే ప్రయోజనమేమిటి?
- కాలం చెల్లిన బ్రిటిష్ విధానాలే ఇప్పటికీ అమల్లో ఉన్నాయి
- కొన్ని కేసుల్లో కింది కోర్టు తీర్పే అంతిమం కావాలి
- అఖిల భారత న్యాయమూర్తుల సంఘం వెల్లడి

ఈనాడు, హైదరాబాద్: న్యాయ వ్యవస్థలో సమూల మార్పులు అవసరమని, అప్పుడే సామాన్యులకు సత్వర న్యాయం దక్కుతుందని అఖిల భారత న్యాయమూర్తుల సంఘం అధ్యక్షుడు జస్టిస్ రాజేంద్ర ప్రసాద్ పేర్కొన్నారు. హత్య, అత్యాచారం వంటి తీవ్రమైన నేరాల్లో ఒకటి రెండు నెలల్లోనే నిందితులకు శిక్ష పడాల్సిన అవసరం ఉందని అభిప్రాయపడ్డారు. 40 ఏళ్ల వ్యక్తిపై నమోదైన హత్యా నేరం రుజువు కావడానికి 30 ఏళ్లు పడుతోందని, దీనివల్ల సాధించే ప్రయోజనం ఏమీ ఉండదని ఉదహరించారు. రెండో జ్యుడిషియల్ పే కమిషన్ అమలుపై అఖిల భారత న్యాయమూర్తుల సంఘం అధ్యక్షుడు జస్టిస్ రాజేంద్రప్రసాద్, కార్య నిర్వాహక అధ్యక్షుడు వసంత్‌కుమార్ షా తదితరులు ఆదివారం హైదరాబాద్‌లోని స్థానిక న్యాయాధికారులతో చర్చలు జరిపారు. అనంతరం విలేకరుల సమావేశంలో జస్టిస్ రాజేంద్రప్రసాద్ మాట్లాడారు. రెండో జ్యుడిషియల్ పే కమిషన్ అమలు జరగాల్సిన అవసరం ఉందని తెలిపారు. సత్వర న్యాయం అందించే దిశగా న్యాయ వ్యవస్థలో పలు సంస్కరణలు తీసుకొస్తున్న విషయాన్ని గుర్తుచేస్తూనే, ఆ ప్రక్రియ నిరంతరం కొనసాగాల్సి ఉందన్నారు.

చాలా మంది కింది కోర్టు ఇచ్చిన తీర్పులను సవాల్ చేస్తూ సుప్రీం కోర్టు వరకు వెళ్తున్న నేపథ్యంలో కేసుల విచారణలో జాప్యం జరగడంతోపాటు సామాన్యులకు న్యాయం దక్కడం లేదని పేర్కొన్నారు. జిల్లా స్థాయిలోనే తుది తీర్పు ఇచ్చే వ్యవస్థ అవసరమని అభిప్రాయపడ్డారు. కాలం చెల్లిన బ్రిటిష్ కాలం నాటి విధానాలను అనుసరిస్తున్నందునే, కేసుల విచారణలో జాప్యం జరుగుతోందన్నారు. పోలీసులు సమర్పించే ఆధారాలనుబట్టే శిక్షలు పడటం ఆధారపడి ఉంటుందన్న ఆయన పలుకుబడి, అధికారంలో ఉన్నవారు అధికార దుర్వినియోగానికి పాల్పడుతూ శిక్షల నుంచి తప్పించుకుంటున్నారని తెలిపారు.


విలేకరులతో మాట్లాడుతున్న అఖిల భారత న్యాయమూర్తుల సంఘం అధ్యక్షుడు జస్టిస్ రాజేంద్ర ప్రసాద్. పక్కన వసంత్ కుమార్ షా, ఏకే సింగ్

అనిశా దాడుల అంశాన్ని హైకోర్టుకు విన్నవిస్తాం

న్యాయాధికారుల సమస్యలతోపాటు, ఇటీవల చోటుచేసుకున్న ఏసీబీ దాడుల వ్యవహారాన్ని హైకోర్టు, ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తామని సంఘ సభ్యులు తెలిపారు. న్యాయమూర్తులపై ఆరోపణలు వచ్చినపుడు రిజిస్ట్రార్ విజిలెన్స్‌తో విచారణ జరిపించి చర్య తీసుకోవాలని సూచించారు. ఇటీవల అరెస్టయిన రంగారెడ్డి జిల్లా అదనపు జిల్లా జడ్జి వరప్రసాద్‌పై ఏసీబీ మోపిన అభియోగాలను పరిశీలించామని, సదరు ఆరోపణల్లో వాస్తవాలు లేవన్నారు. ఆయనకు తమ సంఘం మద్దతు ఉంటుందని తెలిపారు. ఈ వ్యవహారంపై హైకోర్టుకు, ప్రభుత్వానికి వినతి పత్రం సమర్పిస్తామని వెల్లడించారు. విలేకర్ల సమావేశంలో బిహార్ న్యాయాధికారుల సంఘం ప్రధాన కార్యదర్శి ఎ.కె.సింగ్ తదితరులు పాల్గొన్నారు.

జైల్లో శశికళకు ప్రత్యేక సౌకర్యాలు

సహ కార్యకర్త నరసింహమూర్తి ఆరోపణ

బెంగళూరు (శివాజీనగర), న్యూస్‌టుడే: బెంగళూరు పరప్పన అగ్రహార కారాగారంలో శిక్ష అనుభవిస్తున్న తమిళనాడు దివంగత ముఖ్యమంత్రి జయలలిత నెచ్చెలి శశికళ ఇప్పటికీ విలాసవంతమైన సౌకర్యాలు పొందుతున్నారని సహ కార్యకర్త నరసింహమూర్తి ఆరోపించారు. సహచట్టం కింద తాను దాఖలు చేసిన అర్జీకి అధికారులు వివరాలు ఇచ్చారని చెప్పారు. శశికళకు కారాగారంలో 5 గదులు కేటాయించారని, వంట చేసేందుకు తమిళం తెలిసిన ఓ మహిళా ఖైదీని నియమించారని ఆదివారం ఇక్కడ విలేకరుల సమావేశంలో తెలిపారు. ఆమెను కలుసుకునేందుకు నిత్యం తమిళనాడు నుంచి వస్తున్న రాజకీయ నాయకులతో ములాఖాత్ కోసం 4 గంటల పాటు అనుమతిస్తున్నారని చెప్పారు. దీనిపై కారాగారం అధికారులు స్పందిస్తూ భద్రతను దృష్టిలో ఉంచుకుని శశికళకు కేటాయించిన బ్యారక్‌లో ఆమెతో పాటు ఇళవరసిని ఉంచామని, కారాగారంలో చేరినప్పటి నుంచి వారికి 5 గదులను కొనసాగిస్తున్నామని తెలిపారు. శశికళకు కారాగారంలో విలాసవంతమైన సదుపాయాలు కల్పించేందుకు అప్పటి కారాగార అధికారి సత్యనారాయణరావు రూ.2 కోట్లు ముడుపులు తీసుకున్నారని మరో అధికారిణి రూపామౌద్గిల్ 2017లో ఆరోపించారు.

వైకాపాకు వంగవీటి రాధా రాజీనామా

ఈనాడు, విజయవాడ: వంగవీటి రంగా తనయుడు, మాజీ ఎమ్మెల్యే రాధాకృష్ణ వైకాపాకు రాజీనామా చేశారు. ఈ మేరకు ఆదివారం సాయంత్రం ఆయన వైకాపా అధ్యక్షుడు జగన్‌కు లేఖ పంపారు. అంతకుముందు రాధాతో వైకాపా సీనియర్ నేత బొత్స సత్యనారాయణ సమావేశమయ్యారు. పార్టీ వీడవద్దంటూ బుజ్జగించే ప్రయత్నం చేశారు. అయితే రాధా డిమాండ్‌పై అధిష్ఠానం నుంచి సానుకూల స్పందన రాకపోవడంతో బొత్స బుజ్జగింపులు ఫలించలేదు. అనంతరం రాధా విలేకరులతో మాట్లాడుతూ.. ఏ పార్టీలో చేరాలనే విషయమై తన అభిమానులతో మాట్లాడి రెండు రోజుల్లో నిర్ణయం ప్రకటిస్తానని చెప్పారు. తన రాజీనామాకు గల కారణాలను, భవిష్యత్తు కార్యాచరణను అప్పుడే చెబుతానని పేర్కొన్నారు.

మొక్కకు జెండా అండ


నిజామాబాద్ జిల్లా అంకాపూర్ గ్రామానికి చెందిన భోజన్న అనే రైతు తన పొలంలో పండ్ల మొక్కలు పెంచుతున్నారు. 800 జామ, 500 నిమ్మ మొక్కలను నాటగా తోటలోకి అడవిపందులు గుంపులుగా చేరి పాడు చేస్తున్నాయి. వాటి నుంచి మొక్కలను రక్షించుకోవడానికి ఎన్ని ప్రయత్నాలు చేసినా ఫలితం లేకుండాపోయింది. చివరకు ప్రతి మొక్క వద్ద రక్షణగా జెండాను నాటారు. అప్పటి నుంచి తోటవైపు అడవిపందులు రావడమే లేదని, తన ఆలోచన ఫలించిందని భోజన్న ఆనందంగా చెబుతున్నారు. – ఈనాడు, నిజామాబాద్

ప్రతిఫలాపేక్ష లేని సేవే శ్రేష్ఠమైంది

గచ్చిబౌలి, న్యూస్‌టుడే: ప్రతిఫలం ఆశించకుండా చేసేదే శ్రేష్ఠమైన సేవ అవుతుందని, సేవ చేసే వ్యక్తి మనసులో ప్రసన్నత ఉంటే చేసే పనుల్లో కూడా అది కనిపిస్తుందని ఆర్ట్ ఆఫ్ లివింగ్ ఫౌండేషన్ వ్యవస్థాపకులు శ్రీశ్రీ రవిశంకర్ పేర్కొన్నారు. స్వచ్ఛందసంస్థ 'అభయ ఫౌండేషన్' 12 వసంతాలు పూర్తిచేసుకున్న సందర్భంగా 'అభయ పుష్కర' పేరిట ఆదివారం హైదరాబాద్‌లో వేడుకలు నిర్వహించింది. ముఖ్యఅతిథిగా హాజరైన శ్రీశ్రీ రవిశంకర్ మాట్లాడుతూ.. ప్రజలను ఐక్యంగా ఉంచుతూ సమాజ సేవను సాగించేలా చేయడంలో స్వచ్ఛంద సంస్థల పాత్ర కీలకమన్నారు. ఆధ్యాత్మిక జ్ఞానం ఉన్నవారు రెట్టింపు ఉత్సాహంతో సేవ చేయగలరన్నారు. సైయంట్ కంపెనీ ఛైర్మన్ బీవీఆర్ మోహన్‌రెడ్డి మాట్లాడుతూ ప్రతిఒక్కరూ సమాజం కోసం తమ వంతు సేవ చేయాలన్నారు. తమ కంపెనీ 11 ఏళ్లుగా కార్పొరేట్ సామాజిక బాధ్యతగా కార్యక్రమాలను నిర్వహిస్తోందని, 26 పాఠశాలలను దత్తత తీసుకొని మౌలిక వసతుల కల్పన చేపట్టిందని అన్నారు. విశ్రాంత ఐపీఎస్ అధికారి వీవీ లక్ష్మినారాయణ మాట్లాడుతూ.. వృత్తిలో నిజాయితీగా పనిచేయడం సమాజ సేవలో భాగమేనన్నారు. కేరళలోని అలెప్పీ సబ్ కలెక్టర్ ఎం.వి.ఆర్.కృష్ణతేజ మాట్లాడుతూ కేరళలో వరద బాధితులకు అభయఫౌండేషన్ అందించిన చేయూత మరువలేనిదన్నారు. డాక్టర్ అనిల్‌కుమార్, ఐఆర్‌ఎస్ అధికారి ప్రదీప్‌కుమార్, అభయ ఫౌండేషన్ నిర్వాహకులు బాలచంద్ర, తదితరులు పాల్గొన్నారు.


జ్యోతి వెలిగించి కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న 'ఆర్ట్ ఆఫ్ లివింగ్' వ్యవస్థాపకులు శ్రీశ్రీ రవిశంకర్

మాలిలో ఐరాస దళాల స్థావరంపై దాడి

8 మంది సైనికుల మృతి

బమాకో: మాలి దేశంలో ఐక్యరాజ్యసమితి (ఐరాస) శాంతి స్థాపన దళాలకు చెందిన ఓ స్థావరంపై కొంత మంది సాయుధులు దాడికి పాల్పడ్డారు. ఆదివారం ఉదయం ఉత్తర మాలిలోని అగ్వెలాక్‌లో ఈ ఘటన చోటుచేసుకుంది. శాంతిస్థాపన దళంలో సేవలందిస్తున్న చాడ్ దేశానికి చెందిన ఎనిమిది మంది సైనికులు ఈ దాడిలో ప్రాణాలు కోల్పోయినట్లు ఐరాస వర్గాలు తెలిపాయి. మరో 19 మంది గాయపడ్డట్లు చెప్పాయి. మృతుల సంఖ్య మరింత పెరిగే అవకాశం ఉంది. దాడికి పాల్పడ్డవారిలోనూ కొంతమంది మరణించినట్లు సమాచారం. 2012లో ఉత్తర మాలి ప్రాంతాన్ని ఇస్లామిస్ట్ తిరుగుబాటుదారులు నియంత్రణలోకి తీసుకున్నారు. ఫ్రెంచ్ సేనల సాయంతో ఏడాది అనంతరం ఆ ప్రాంతంపై మాలి ప్రభుత్వం తిరిగి పట్టు సాధించింది. అప్పటి నుంచి అక్కడ హింసాత్మక ఘటనలు జరుగుతూనే ఉన్నాయి. మాలిలో స్థిరత్వం తెచ్చేందుకు ఐరాస 13వేల మంది సైనికులను అక్కడ మోహరించింది.

వారధికి అనుమతుల కొర్రీ

- ప్రారంభానికి నోచని మట్టపల్లి- తంగెడ వంతెన

ఈనాడు, నల్గొండ: తెలంగాణ- ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల మధ్య 80 కిలోమీటర్ల దూరాన్ని కేవలం మూడు కిలోమీటర్లకు తగ్గించే అంతర్రాష్ట్ర వంతెన నిర్మాణానికి అలసత్వం అడ్డుగా నిలుస్తోంది. సూర్యాపేట జిల్లా మట్టపల్లి నుంచి గుంటూరు జిల్లా తంగెడ మధ్య కృష్ణా నదిపై వారధికి 2014 ఫిబ్రవరిలో శంకుస్థాపన చేశారు. వంతెన నిర్మాణం పూర్తయినా అనుసంధాన రహదారికి అటవీ శాఖ అనుమతులు ఇవ్వలేదు. దీంతో వారధి ప్రారంభోత్సవం నిలిచిపోయింది. ఆంధ్రవైపు పనులన్నీ పూర్తికాగా.. తెలంగాణ వైపు 850 మీటర్ల రహదారిలో బీటీ పనులు చేయాల్సి ఉంది. ఇందులో 250 మీటర్లు ప్రభుత్వ భూమి కాగా 600 మీటర్లు అటవీ భూమి. ఈ 600 మీటర్ల రహదారి దాదాపు అయిదెకరాల అటవీభూమిలో నుంచి వెళుతుంది. దీనికి రాష్ట్ర స్థాయి అటవీ అధికారుల అనుమతులు తీసుకోవడంలో జాప్యంతో.. వారధి పూర్తయినా వినియోగించుకోలేని పరిస్థితి.

హుజూర్‌నగర్ నియోజకవర్గం మఠంపల్లి మండలం మట్టపల్లి నుంచి గుంటూరు జిల్లా దాచేపల్లికి వెళ్లాలంటే ప్రస్తుతం మఠంపల్లి, హుజూర్‌నగర్, నేరేడుచర్ల, దామరచర్ల, వాడపల్లి మీదుగా వెళ్లాలి. ఇది 75- 80 కి.మీ. దూరం ఉంటుంది. వంతెన పూర్తయితే కేవలం మూడు కిలోమీటర్లలోనే దాచేపల్లి చేరుకోవచ్చు. ఈ రెండు ప్రాంతాల ప్రజలకు సంబంధ బాంధవ్యాలు ఉన్నందున ఈ వంతెన నిర్మిస్తే వారికి ప్రయాణంలో వ్యయప్రయాసలు తగ్గుతాయి. దీనిపై జిల్లా అటవీశాఖాధికారి ముకుందరెడ్డి మాట్లాడుతూ 'వంతెన అనుసంధాన రహదారి 600 మీటర్లు అటవీ భూముల్లో ఉందని మా దృష్టికి వచ్చింది. అన్ని వివరాలు పరిశీలించాక ప్రభుత్వానికి నివేదిక పంపిస్తాం. దాన్ని బట్టి ఉన్నతాధికారులు నిర్ణయం తీసుకుంటారు' అన్నారు.


సూర్యాపేట జిల్లా మట్టపల్లి, గుంటూరు జిల్లా తంగెడ మధ్య నిర్మించిన వంతెన

ఈనాడు

ప్రాణాంతక ఖనిజ దోపిడీ

మాఫియా శక్తుల పడగనీడన అవినీతి గనులు, అక్రమ తవ్వకాలకు వత్తాసుగా ఆ వైపు ఏమాత్రం చూపు సారించని సర్కారీ ఘనులు- ఉమ్మడిగా రచించిన విషాదాధ్యాయం ఇది. దాదాపు ఆరువారాల నాడు మేఘాలయ బొగ్గు గనిలో చిక్కుకొన్న 15మంది శ్రామికులను రక్షించే యత్నాలు ఒకవంక సాగుతున్నా అదంతా దింపుడు కళ్ళెం ఆశనే తలపిస్తోంది. ఏదైనా అద్భుతం జరగకపోతుందా అంటూ సుప్రీంకోర్టులో కేంద్ర ప్రభుత్వం ఆశాభావం వ్యక్తీకరించినా- లైటిన్ నదీ ప్రవాహం ముంచెత్తిన ఆ గనిలో 160-210 అడుగుల లోతున ఓ మృత దేహాన్ని కనుగొన్నట్లు నౌకాదళం ప్రకటించింది. కనీసం కర్మకాండలైనా జరిపేందుకు మృతదేహాల్ని వెలికితీయాలన్న బాధిత కుటుంబాల వేడికోళ్లు ఒకవైపు, అది అసాధ్యమంటున్న నిపుణుల సూచనలు మరోవైపు- ఎలుక బొరియల్లాంటి అక్రమ బొగ్గు గనులు శ్రామికుల సజీవ సమాధి వేదికలవుతున్న ఘోర విషాదాన్ని కళ్లకు కడుతున్నాయి. 15మంది అభాగ్యులు 320 అడుగుల లోతున ప్రాణాపాయ స్థితిలో ఉన్న వాస్తవం వెలికి వచ్చిన 13 రోజుల తరవాత, వాళ్లను రక్షించేందుకు తగిన సాధన సంపత్తి కావాలంటూ మేఘాలయ ప్రభుత్వం 'కోల్ ఇండియా' సంస్థకు విజ్ఞప్తి చేసింది. నీటిని తోడే భారీ పంపులు ప్రమాద స్థలికి చేరేసరికి మరో పదిరోజులు పట్టింది! బహిరంగ రహస్యంగా సాగుతున్న అక్రమ బొగ్గు గనుల తవ్వకాల్లో 2011 లగాయతు ఇప్పటికి 70కిపైగా ప్రమాదాలు 90మంది దాకా అభాగ్యుల్ని కబళించాయని తెలిసినా, ప్రభుత్వ యంత్రాంగంలో అంతెత్తున మేటవేసిన ఉదాసీనత- మరణ మృదంగ ధ్వనుల ఉద్ధృతికే ఊతమిస్తోంది. అక్రమ బొగ్గు తవ్వకాల్ని 2014లోనే నిషేధించినా, తన ఆదేశాల్ని అమలు చెయ్యడంలో మేఘాలయ ప్రభుత్వం విఫలమైందంటూ జాతీయ హరిత ట్రైబ్యునల్ వందకోట్ల రూపాయల జరిమానా వడ్డించిన నేపథ్యంలోనే- మరో రెండు విషాదాలు చోటుచేసుకొన్నాయి. ఒక గని ప్రమాదంలో ఇద్దరు శ్రామికులు మృతి చెందగా, మరో గనిలో ముగ్గురు చిక్కుబడిన దుర్ఘటన- అవినీతి గనులు మృత్యు కుహరాలవుతున్నాయని ఎలుగెత్తుతున్నాయి!

'ఎక్కడెక్కడ అక్రమంగా గనుల తవ్వకం జరుగుతున్నదో పరిశీలించి కఠిన చర్యలు చేపట్టారా?'- మేఘాలయ ప్రభుత్వానికి సుప్రీంకోర్టు సంధించిన సూటి ప్రశ్న అది. ఫిబ్రవరి ఒకటినుంచి బొగ్గు రవాణాను రాష్ట్రంలో నిషేధించిన సుప్రీంకోర్టు, సక్రమంగా వ్యవహరించలేదంటూ కన్రాడ్ సంగ్మా ప్రభుత్వంపై కన్నెర్ర చేసినా- రాష్ట్రంలో బొగ్గు తవ్వకాలపై ఎన్‌జీటీ విధించిన నిషేధాన్ని పూర్తిగా ఎత్తేయాలని అది గట్టిగా కోరుతోంది. రాష్ట్రంలో 57 కోట్ల 60 లక్షల టన్నుల బొగ్గు నిల్వలున్నాయని, దాదాపు పదిశాతం కుటుంబాలు బొగ్గు వెలికితీత, రవాణానే నమ్ముకొని బతుకుతున్నాయని, బొగ్గు తవ్వకాల నిషేధంతో రాష్ట్రం రూ.600 కోట్ల రాబడి నష్టపోయిందని ప్రభుత్వం చెబుతోంది. అక్రమ బొగ్గు తవ్వకాల కేంద్ర స్థలిగా ఉన్న జయంతియా హిల్స్ పరగణాలోనే ఎలుక బొరియల్ని పోలిన బొగ్గు క్షేత్రాల్లో 70వేలమంది దాకా బాల శ్రామికులు పని చేస్తున్నారని అధ్యయనాలు చాటుతున్నాయి. అంతకుమించి అక్రమ గనుల తవ్వకాల్లో రాటుతేలినవారు రాజకీయంగానూ బలపడటంతో హరిత ట్రైబ్యునల్ ఆదేశాలు పసలేనివైపోయాయి. బొగ్గు తవ్వకాల్ని పునః ప్రారంభిస్తామన్న వాగ్దానంతో నిరుడు అధికార పగ్గాలు చేపట్టిన భాజపా- నేషనల్ పీపుల్స్ పార్టీ కూటమి ప్రభుత్వం, ఆ మేరకు కేంద్రంపై గట్టిగానే ఒత్తిడి తెస్తోంది. అక్రమ మైనింగ్ కారణంగా తలెత్తే భయానక ఉత్పాతాలు బహుముఖంగా ఎంతటి చెరుపు చేస్తాయో ఇప్పటికే తెలుగు రాష్ట్రాలు సహా పలు చోట్ల ఎన్నెన్నో రుజువులు పోగుపడ్డ దేశం మనది. అక్రమ తవ్వకాలపై ఏర్పాటైన పార్లమెంటరీ కమిటీ- 14,500 చోట్ల ఖనిజ దోపిడీ జరుగుతోందని, దానివల్ల సామాజికంగా, ఆర్థికంగా, పర్యావరణపరంగా తీవ్ర నష్టం సంభవిస్తోందని నిష్ఠురసత్యం పలికి పుష్కరకాలం దాటింది. ఇప్పటికీ ఆగక సాగుతున్న ఖనిజ దోపిడీని అరికట్టే చొరవ ఏదీ?

'అత్యంత విలువైన ఖనిజ సంపదను తక్కువ ఖర్చుతో గరిష్ఠ ప్రయోజనదాయకంగా మలచుకోవడం జాతీయ ప్రాధాన్యంగల అంశం' అన్న జాతీయ ఖనిజ విధాన లక్ష్యాన్ని కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు చిత్తశుద్ధితో మన్నిస్తే- ఎక్కడికక్కడ మాఫియా శక్తులు కుబుసం విడిచే ఆస్కారం ఎక్కడిది? అత్యధిక బొగ్గు నిల్వలున్న దేశాల జాబితాలో ఇండియా అయిదో స్థానంలో ఉన్నా, నల్లబంగారం దిగుమతిలో రెండో స్థానంలో నిలవడం- గిరాకీ సరఫరాల మధ్య అగాధాన్నే కాదు, అమూల్య వనరులను జాగ్రత్తగా వినియోగించుకోలేని వ్యూహ వైఫల్యాల్నీ కళ్లకుకడుతోంది. లోగడ లక్షా 86 వేల కోట్ల రూపాయల బొగ్గు కుంభకోణం దేశాన్ని దిగ్భ్రాంతపరిస్తే, ఖనిజ సంపదపై పరచుకొంటున్న మాఫియా పడగనీడ మరింత ఆందోళన కలిగిస్తోంది. బొగ్గు గనుల తవ్వకాలే తమకు మనుగడ అంటున్న మేఘాలయ లాంటి రాష్ట్రాల సామాజిక, ఆర్థిక అవసరాల్ని దృష్టిలో ఉంచుకొని, మాఫియా మూలాల్ని ఛేదించేలా, శాస్త్రీయ పంథాలో సకల భద్రతా ప్రమాణాలతో పర్యావరణ హితకరంగా మైనింగ్ కార్యకలాపాలు సాగేందుకు తగు ప్రాతిపదికలు సిద్ధం కావాల్సిన తరుణమిది. దేశ విదేశీ ప్రైవేటు సంస్థలు వాణిజ్య ప్రాతిపదికన బొగ్గు క్షేత్రాల్ని వేలంలో పాడుకొని, అవసరం ఉన్నవారికి స్వేచ్ఛగా విక్రయించుకొనే విధానానికి కేంద్ర ప్రభుత్వం నిరుడు ఫిబ్రవరిలో ఆమోదం తెలిపింది. భారీ కర్మాగారాలకు ఇంధన భద్రత, ప్రత్యక్ష పరోక్ష ఉపాధి సృష్టితో యువతకు జీవన భద్రత కల్పించే ఈ చొరవ- మేఘాలయలాంటి రాష్ట్రాలకు ఈసరికే వెలుగు దివ్వె కావాల్సింది. పారదర్శకత జవాబుదారీతనాలతో పట్టాలకెక్కే- ఖనిజ విధానం- మాఫియా మూకల కోరలు పెరికే కఠిన నిబంధనలతో అమలైనప్పుడే, శ్రామికుల భద్రతకూ భరోసా దక్కేది!

ముందుకు సాగని 'మౌలికం'

ప్రగతి మందగమనం



దేశ ఆర్థిక, సామాజిక అభివృద్ధికి జీవనాడి వంటి మౌలిక సదుపాయాల ప్రాజెక్టుల నిర్మాణాల్లో అపరిమిత ఆలస్యం రాజ్యమేలుతోంది. నిర్మాణ పనుల్లో తీవ్ర జాప్యం ఫలితంగా లక్షల కోట్ల రూపాయల ప్రజాధనం హరించుకుపోతోంది. ప్రాజెక్టుల ప్రారంభ సమయంలో ఇవి పూర్తయితే- దేశ ఆర్థిక ప్రగతికి రథ చక్రాల్లా మారుతాయని వాటి ప్రణాళికా పత్రాల్లో ఘనంగా చెప్పడం ఆనవాయితీగా మారింది. కానీ ఆయా నిర్మాణాలు జరుగుతున్న తీరు, అంతులేని కాలహరణంతో అవి మింగేస్తున్న ప్రజాధనాన్ని చూస్తుంటే ఆవేదన కలుగుతోంది. మోదీ ప్రధానమంత్రిగా బాధ్యతలు చేపట్టిన తరవాత మౌలిక సదుపాయాల ప్రాజెక్టులు వేగవంతం చేస్తానని ప్రకటించారు. వీటి నిర్మాణాల పురోగతిని ఎప్పటికప్పుడు నేరుగా ప్రధానమంత్రి కార్యాలయమే పర్యవేక్షిస్తుంది. తాజా అంచనా ప్రకారం ఇప్పటికే నిర్మాణంలో జాప్యం వల్ల అదనంగా మోయాల్సిన భారం రూ.3.37 లక్షల కోట్ల వరకూ ఉంటుందని గుర్తించారు. కనీసం అరడజను రాష్ట్రాల వార్షిక బడ్జెట్లకు సమానమైన ఇంతటి భారీ మొత్తాన్ని కేవలం పనుల్లో జాప్యం కారణంగా ప్రజలు జేబుల నుంచి చెల్లించాల్సిన పరిస్థితి ఏర్పడుతుంది.

ఆలస్యానికి కారణాలు అనేకం

ప్రపంచంలో వేగంగా అభివృద్ధి చెందుతున్న దేశాల్లో మనదేశం ముందుందని నేతలు చెబుతుంటారు. కానీ క్షేత్రస్థాయి పరిస్థితి మాత్రం ఇందుకు భిన్నంగా ఉంది. మొత్తం 1,417 మౌలిక సదుపాయాల ప్రాజెక్టుల నిర్మాణాలు ప్రారంభించినప్పుడు తొలి అంచనా వ్యయాలు రూ.17.38 లక్షల కోట్లు. ఇప్పుడు ఏకంగా మరో రూ.3.39 లక్షల కోట్లు పెరిగి రూ.20.77 లక్షల కోట్లకు చేరినట్లు 'కేంద్ర గణాంకాలు, కార్యక్రమాల అమలు మంత్రిత్వశాఖ' తాజా నివేదిక వెల్లడించింది. అంచనా వ్యయం ఏకంగా 19.55 శాతం అధికమైంది. కేంద్ర ప్రభుత్వ నిధులతో చేపట్టే వాటిలో రూ.150 కోట్లకు మించి వ్యయమయ్యే వాటిని ఈ శాఖ పర్యవేక్షిస్తుంది. రహదారులు, రైల్వే, టెలికం, స్టీల్, విద్యుత్, బొగ్గు, విమాన, నౌకాశ్రయాలు తదితర రంగాల్లో చేపట్టే పనులను మౌలిక సదుపాయాల రంగం కింద ప్రకటిస్తారు. ఇప్పటికిప్పుడు ఇవి పూర్తయ్యే సూచనలు లేవు. ఇవన్నీ పూర్తయి ప్రజలకు అందుబాటులోకి వచ్చేనాటికి నిర్మాణ వ్యయం మరెంతగా పెరుగుతుందో చెప్పలేని పరిస్థితి.

పెరుగుతున్న వ్యయం

వీటిలో 57శాతం ప్రాజెక్టులు నిర్ణీత గడువు కన్నా రెండేళ్ల నుంచి అయిదేళ్లకు పైగా సాగుతున్నాయి. ఇందులో 296 ప్రాజెక్టుల సగటు ఆలస్యం 48 నెలలుగా తేలింది. అంటే ఒక ప్రాజెక్టు ప్రారంభించినప్పుడు పేర్కొన్న గడువుకన్నా మరో నాలుగేళ్లు దాటినా పూర్తి కావడం లేదు. భూసేకరణ, అటవీ, పర్యావరణ అనుమతిలో జాప్యం, నిర్మాణ సామగ్రి పంపిణీలో నిర్లక్ష్యం, కూలీలు, నిధుల కొరత తదితర కారణాల వల్ల పనులు ఆలస్యంగా జరుగుతున్నాయి.

దేశంలో 2020 చివరికల్లా 100 కోట్ల టన్నుల బొగ్గు ఉత్పత్తి లక్ష్యంగా పెట్టుకున్నట్లు 2014-15లో మంత్రి పీయూష్ గోయల్ పార్లమెంటులో చెప్పారు. ఈ గడువు పూర్తికావడానికి మరో 24 నెలలే గడువుంది. కానీ గతేడాది వరకు 56 కోట్ల టన్నుల బొగ్గు మాత్రమే తవ్వారు. భూసేకరణలో ఇబ్బందులు, కొత్త గనుల ప్రారంభంలో జాప్యం, పర్యావరణ సమస్యల కారణాల వల్ల వంద కోట్ల టన్నుల బొగ్గు లక్ష్య సాధన కష్టమే. బొగ్గు తవ్వకాలు పెరగకపోతే విద్యుత్కేంద్రాల్లో విద్యుత్ ఉత్పత్తి కష్టమవుతుంది. తవ్వకాలు పెరిగితే థర్మల్ విద్యుదుత్పత్తి అధికమవుతుంది. కేంద్ర ప్రాయోజిత ప్రాజెక్టులే కాకుండా రాష్ట్రాలు సొంతంగా నిర్మిస్తున్నవీ ఏళ్ల తరబడి ఆలస్యమవుతున్నాయి. ఆదాయానికి మించి కొత్త ప్రాజెక్టులను మొదలు పెట్టడం వల్ల అవి ఎప్పటికి పూర్తవుతాయో చెప్పలేని పరిస్థితులు ఏర్పడుతున్నాయి.

రూ.150 కోట్లకు మించి వ్యయమయ్యే ప్రాజెక్టుల ఆలస్యం తీరు (రూ.కోట్లలో)

రంగం	ఎన్ని ప్రాజెక్టులు	తొలి అంచనా వ్యయం	తాజా అంచనా
రైల్వేలు	36	44,219	1,13,147
జాతీయ రహదారులు	74	64,849	68.524
పట్టణాభివృద్ధి	20	60,054	65,110
పెట్రోలియం	35	59,790	63,010
అణు ఇంధనం	3	27,271	29,779
టెలికం	3	15,863	27,093
నౌకాశ్రయాలు	8	4,117	5,085

ఆధారం: కేంద్ర గణాంకాలు, మౌలిక సదుపాయాల మంత్రిత్వ శాఖ నివేదిక

విదేశాల్లో వేగంగా...

మౌలిక సదుపాయాలు వృద్ధి చెందకపోతే ఏ దేశమూ ప్రగతి పథంలో పయనించలేదని ప్రపంచ అనుభవాలు, వివిధ అధ్యయనాలు చాటుతున్నాయి. ప్రపంచంలోనే అత్యధిక జనాభా ఉన్నా, శరవేగంగా చైనా అభివృద్ధి చెందడానికి అక్కడి ప్రభుత్వం చేపట్టిన మౌలిక సదుపాయాల ప్రాజెక్టులే ప్రధాన కారణం. ప్రపంచంలోనే అతి పెద్దదైన త్రీగోర్జెస్ ప్రాజెక్టు నిర్మాణంతో పాటు సముద్రాలు, మంచు పర్వతాల్లో అతి పెద్ద వంతెలు, జాతీయ రహదారుల నిర్మాణంలో పోటీపడుతూ అమెరికా వంటి దేశాలకు చైనా సవాల్ విసురుతోంది. ఆ స్థాయి మౌలిక సదుపాయాలు వృద్ధి చెందితేనే భారత్ ప్రపంచంలో పోటీపడగలదు. భారత్‌లో ఒక ప్రాజెక్టు రూపకల్పన జరిగితే అది పూర్తయ్యేనాటికి ఎన్ని ప్రభుత్వాలు మారుతాయో ఎవరూ చెప్పలేని పరిస్థితి. ప్రధానమంత్రి కార్యాలయం నెలవారీగా 'ప్రగతి' పేరుతో ఈ ప్రాజెక్టుల పనులను సమీక్షిస్తుంది. ఆలస్యమవుతున్న వాటిని గుర్తించి సంబంధిత మంత్రిత్వశాఖలకు తదనుగుణ మార్గదర్శకాలనూ ఇస్తుంది. ఆయా శాఖలు సైతం అంతర్గతంగా సమీక్షలు జరుపుతున్నాయి. అయినా వేగిరంగా ప్రాజెక్టులు పూర్తికావడం లేదు. రాష్ట్రాలు సంక్షేమ పథకాలతో పాటు మౌలిక సదుపాయాల ప్రాజెక్టులపై శ్రద్ధ చూపితేనే ఆదాయ వనరులు పెరుగుతాయి. ఒక ఆనకట్ట లేదా జాతీయ రహదారి నిర్మించడానికి వేల కోట్ల రూపాయలు ఖర్చయినా అది పూర్తయిన తరవాత ఆయా ప్రాంతాల ప్రగతికి, సామాజికాభివృద్ధికి అది జీవనాడిలా మారుతుంది. మరో పాతికేళ్ల తరవాత పెరిగే జనాభా అవసరాలను దృష్టిలో పెట్టుకుని మౌలిక సదుపాయాలను అభివృద్ధి చేయాలి. ప్రధాన పట్టణాలు, నగరాలతో గ్రామీణ ప్రాంతాలకు నేరుగా అనుసంధానం ఏర్పడేలా రవాణా వ్యవస్థలు పెరగాలి. ప్రతి జిల్లా కేంద్రం నుంచి రాష్ట్ర రాజధానికి నాలుగు వరసలు, రాష్ట్ర రాజధాని నుంచి దేశ రాజధానికి ఎనిమిది వరసల రహదారుల నిర్మాణం అవసరం. వెనకబడిన ప్రాంతాలకు రైలు మార్గాలు వేయాలంటే వేల కోట్ల రూపాయలు గుమ్మరించడం సాధ్యం కాదని రైల్వే శాఖ వెనకడుగు వేస్తోంది. అభివృద్ధి అంటే ప్రజల చేతికి ఐశ్వర్యం అందడం. వెనుకబడిన ప్రాంతంలో మేలైన మౌలిక సదుపాయాలు పెరగాలి. అప్పుడే ఆ ప్రాంతాలతో పాటు, అక్కడి పరిశ్రమలు దేశానికి, రాష్ట్రానికి ఆదాయ వనరుల్లా మారతాయి. పోలవరం, కాళేశ్వరంలాంటి ప్రాజెక్టులు శరవేగంగా పూర్తయితేనే తెలుగు రాష్ట్రాలు అభివృద్ధి పథంలో దూసుకెళతాయి. దశాబ్దాల క్రితమే జపాన్, చైనా వంటి దేశాల్లో బుల్లెట్‌రైళ్లు నడిచాయి. భారత్‌లో ఇప్పటికీ అది అందని కలగానే ప్రజలను ఊరిస్తోంది. మౌలిక ప్రాజెక్టులకు ప్రభుత్వాలు మొదటి ప్రాధాన్యం ఇచ్చినప్పుడే ప్రగతి సాధ్యమవుతుంది. నిర్మాణ పనుల్లో జాప్యం వల్ల ప్రజాధనం వృథాతో పాటు ప్రగతి కుంటుపడుతుంది!

- మంగమూరి శ్రీనివాస్

పనుల్లో జాప్యం ప్రజలపై భారం



విద్యుత్ ప్రాజెక్టుల్లో అపరిమిత జాప్యం జరుగుతోంది. ఫలితంగా ఇవి ఆర్థికంగా గుదిబండల్లా మారుతున్నాయి. దేశవ్యాప్తంగా 124 విద్యుత్కేంద్రాల నిర్మాణ పనుల్లో 61 కేంద్రాల పనులు ఆలస్యంగా సాగుతున్నాయి. దీని తరవాత జాబితాలో రైల్వే, పట్టణాభివృద్ధి, రహదారి ప్రాజెక్టులు ఉన్నాయి. 44 విద్యుత్కేంద్రాల నిర్మాణం తొలి అంచనా రూ.1.05 వేల కోట్ల నుంచి రూ.1.63 వేల కోట్లకు పెరిగింది. వీటి సగటు ఆలస్యం 54 నెలల దాకా ఉంది. కేంద్రీయ విద్యుత్ మండలి (సీఈఏ) మార్గదర్శకాల ప్రకారం సాధారణంగా ఒక విద్యుత్కేంద్రం నిర్మాణం ప్రారంభించినప్పటి నుంచి 48 నెలల్లోనే పూర్తిచేయాలి. ఈ గడువు ముగిశాక మరో 54 నెలల దాకా పనులు పూర్తికాలేదంటే ప్రజాధనం వృథా అవుతుందని అర్థం. నిర్మాణం ఆలస్యమైతే అక్కడ ఉత్పత్తయ్యే విద్యుత్ ధర బాగా పెరుగుతుంది. చివరికి ప్రజలు చెల్లించే విద్యుత్ ఛార్జీల నుంచే ఈ సొమ్మునంతా వసూలు చేస్తారు. కానీ విద్యుత్కేంద్రం నిర్మాణంలో జాప్యం వల్లనే విద్యుత్ ధర పెంచినట్లు ఎక్కడా చెప్పరు. ఇలా మౌలిక సదుపాయాల ప్రాజెక్టుల నిర్మాణాల్లో జరిగిన జాప్యాలే అనేక రకాల ఛార్జీలు, రుసుముల రూపంలో ప్రజల జేబులకు చిల్లుకొడుతున్నాయి. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో ప్రారంభించిన కృష్ణపట్నం విద్యుత్కేంద్రం నిర్మాణ వ్యయం తడిసిమోపెడవడంతో అక్కడ ఉత్పత్తయ్యే విద్యుత్ ధర ఖరీదైంది. ఛత్తీస్‌గఢ్ రాష్ట్రంలోని మార్వా విద్యుత్కేంద్రంలో ఒక మెగావాట్ ఉత్పత్తి వ్యయం సగటున రూ.9 కోట్లకు చేరింది. వాస్తవానికి ప్రస్తుత ధరల్లో ఈ వ్యయం రూ.7 కోట్లే ఉంది. ఏళ్ల తరబడి నిర్మాణంలో జాప్యం వల్ల మార్వా నుంచి విద్యుత్ కొనుగోలు ఖరీదైన వ్యవహారంగా మారింది. ఈ విద్యుత్‌ను తెలంగాణ విద్యుత్ పంపిణీ సంస్థ(డిస్కం)లు కొంటున్నాయి. వివిధ కారణాలతో జాప్యం జరగడం వల్ల నిర్మాణ వ్యయం రూ.9 కోట్లకు చేరిందని, అంతా చెల్లించాలని ఆ రాష్ట్ర జెన్‌కో వాదిస్తోంది. ఇందుకు తెలంగాణ డిస్కమ్‌లు అంగీకరించడం లేదు.

'బ్రెగ్జిట్'పై ప్రతిష్టంభన

రెండో ప్రపంచ యుద్ధం ఐరోపాకు చాలా పాఠాలు నేర్పింది. ఆ యుద్ధంలో భారీయెత్తున ధన ప్రాణ నష్టాలు సంభవించడంతో ఐరోపా దేశాలు తప్పు తెలుసుకున్నాయి. కలహించుకోవడం మాని వేసి పరస్పరం సహకరించుకొంటూ శాంతి సామరస్యాలను, ఆర్థికాభివృద్ధిని సాధ్యం చేసుకొన్నాయి. మొదట 1952లో ఐరోపా బొగ్గు ఇనుము సమాఖ్య (యూరోపియన్ స్టీల్ అండ్ కోల్ కమ్యూనిటీ) ఏర్పడింది. అందులో జర్మనీ, ఫ్రాన్స్, ఇటలీ మొదలైన దేశాలు పారిశ్రామికంగా సహకరించుకున్నాయి. ట్రీటీ ఆఫ్ రోమ్ తరవాత 1957లో ఐరోపా ఆర్థిక సమాఖ్య(ఈఈసీ) ఏర్పడింది. నెదర్లాండ్స్, బెల్జియం, లక్సెంబర్గ్‌లు 'బెనెలక్స్' పేరిట సమాఖ్యగా ఆవిర్భవించాయి. నెదర్లాండ్స్ వీసాతో బెల్జియంలోనూ ప్రవేశించవచ్చు. ఇలా మూడు దేశాలు కలిసిపోవడం రాజకీయంగా చెప్పుకోదగిన ముందడుగు. 1973లో ఐరోపా ఆర్థిక సమాఖ్యలో బ్రిటన్ చేరింది. బెల్జియం రాజధాని బ్రసెల్స్‌ను కేంద్ర కార్యాలయంగా చేసుకొని 1993లో ఈఈసీ ఐరోపా సమాఖ్య(ఈయూ)గా రూపాంతరం చెందింది.

క్రమంగా ఈయూలో చేరే దేశాల సంఖ్య పెరుగుతూనే ఉంది. మొదట్లో జర్మనీ, ఫ్రాన్సులు ఐరోపా సమాఖ్యలో బ్రిటన్ చేరికను వ్యతిరేకించాయి. బ్రిటన్ సారథ్యంలోని కామన్వెల్త్ ఈయూ తరహాలో పురోగతి సాధించలేదు. గడచిన మూడు దశాబ్దాల్లో ఈయూలో 28 దేశాలు చేరడమే సమాఖ్య పురోగమన వేగానికి నిదర్శనం. వీటి మధ్య సరిహద్దులు నామమాత్రం. ఈయూ సూత్రావళి మేరకు ప్రజలు, వస్తువులు అన్ని దేశాల మధ్య ఎలాంటి ఆటంకం లేకుండా ప్రయాణించవచ్చు. ఆయా దేశాలన్నీ కలిసికట్టుగా 'షెంజెన్ వీసా' పద్ధతిని పాటిస్తున్నాయి. దీనివల్ల పర్యాటకులకు ఎంతో సౌకర్యం. యూరోజోన్ పేరిట ఐరోపాలోని 19దేశాలు తమ కరెన్సీలను సైతం రద్దుచేసుకొని యూరో కరెన్సీని చలామణీలోకి తీసుకువచ్చాయి. వివిధ దేశాలు కలిసి నిచేస్తే ఎన్ని లాభాలుంటాయో ఐరోపా ఉదాహరణ.

బ్రిటన్‌ది స్వీయ అస్తిత్వ పంథా. యూకేలోని వేల్స్, స్కాట్‌లాండ్, ఉత్తర ఐర్లాండ్ రాజకీయ, భాషా వైవిధ్యం కలిగి ఉన్నాయి. ఇంగ్లండు బ్రిటన్‌లో ఒక భాగం మాత్రమే. స్కాట్‌లాండ్ ప్రత్యేక రాజకీయ అస్తిత్వాన్ని కలిగిఉంది. ఐరోపానుంచి బ్రిటన్‌ను సముద్రం వేరుచేస్తోంది. ఆంగ్లేయుల్లో చాలామందికి అస్తిత్వ స్పృహ ఎక్కువ. అయితే ఏనాడూ బ్రిటన్ ఐరోపా ఐక్యతకు అడ్డం రాలేదు.

చాలాకాలంగా బ్రిటిష్ పౌరులలో ఐరోపా సమాఖ్య నిబంధనలపట్ల కొంత అసహనం ఉంది. ఏటా ఇతర దేశాలకు చెందిన వేలమంది శరణార్థులకు, అక్రమ వలసదారులకు బ్రిటన్ ఆశ్రయం, పౌరసత్వం ఇవ్వాల్సి వస్తోంది. ఇదే పరిస్థితి కొనసాగితే స్వీయ అస్తిత్వాన్ని కోల్పోవలసి వస్తుందన్న భయం బ్రిటన్ వాసుల్లో ఉంది. ఏటా లక్షలమంది నిర్వాసితులు ఐరోపాలో ప్రవేశిస్తున్నారు. ఆఫ్రికానుంచి ప్రమాదకరంగా రక్షణలేని పడవలలో ఇటలీకి అటునుంచి ఇతర ఐరోపా దేశాలకు చేరుతున్నారు. మరోవంక టర్కీద్వారా సిరియన్లు, ఇతరులు


బ్రిటన్ ప్రధాని థెరెసా మే

బ్రిటన్ దారెటు?

లక్షల సంఖ్యలో ఐరోపాకు చేరుతున్నారు. బ్రిటన్ దీవి కాబట్టి తనను తాను సులభంగానే ఈ అక్రమ వలసల బారినుంచి కాపాడుకోగలదు. కానీ, ఈయూలో కొనసాగితే తూర్పు ఐరోపా దేశాలనుంచి పెద్దయెత్తున వచ్చే వలసలను భరించాల్సి ఉంటుంది. ఈయూ పౌరులు వీసా, వర్క్ పర్మిట్‌లు లేకుండా ఐరోపాలోని ఏ దేశంలో అయినా పనిచేయవచ్చు. వీరి సంఖ్య అంతకంతకూ పెరిగి భవిష్యత్తులో బ్రిటన్ రాజకీయాలను శాసించే పరిస్థితీ తలెత్తవచ్చునన్న భయంతోపాటు ఈయూకు ఏటా చెల్లించాల్సిన డబ్బు అంతకంతకూ పెరిగిపోతుండటం కూడా 'బ్రెగ్జిట్' దిశగా బ్రిటన్ అడుగులు కదపడానికి కారణమయ్యాయి. బ్రిటన్ చట్టాలనూ ఐరోపా న్యాయస్థానం ప్రభావితం చేయవచ్చు. ఐరోపా చట్టాలకు, బ్రిటన్ సాధారణ న్యాయ సూత్రావళికీ మధ్య ఎన్నో తేడాలున్నాయి.

బ్రిటిష్ పార్లమెంటు నిర్ణయాలనే ఐరోపా కోర్టు కొట్టివేయగలిగితే ఇక స్వతంత్ర అస్తిత్వానికి అర్థమే లేదన్నది 'బ్రెగ్జిట్' సమర్థకుల వాదన. 2016లో ప్రజాభిప్రాయ సేకరణ నిర్వహించినప్పుడు 28శాతం మంది ఓటు వేయలేదు. కాగా- ఈయూలో కొనసాగాలని 35 శాతం, విడిపోవాలని 37శాతం ఓటు వేశారు. ఇదంతా ఇపుడు చరిత్ర. విడిపోవాలన్న ఆకాంక్ష వెనక బ్రిటన్‌లోని అత్యంత ధనవంతుల హస్తం ఉందని పలువురు భావిస్తున్నారు. ఈయూ 2019 ఏప్రిల్‌నుంచి కొత్త పన్నుల విధానం ప్రవేశపెడుతోంది. పన్ను ఎగవేతలకు వ్యతిరేకంగా ఈయూ అమలు చేయ తలపెట్టిన చట్టం అక్రమాలకు చరమగీతం పాడుతుంది. దేశాలమధ్య చట్టాల్లో తేడాలను కార్పొరేట్ సంస్థలు ఇప్పటివరకూ తమకు సానుకూలంగా మార్చుకున్నాయి. ఇకమీదట అందుకు వీలు కాదు. అందుకే బ్రిటన్‌లోని అత్యంత సంపన్నులు ప్రజాభిప్రాయాన్ని వివిధ మార్గాల ద్వారా 'బ్రెగ్జిట్'కు అనుకూలంగా ప్రభావితం చేశారన్న వాదన వినిపిస్తోంది. ఈయూలో కొనసాగితే బ్రిటన్ మూలాలు దెబ్బతినే ప్రమాదం ఉందని అధికశాతం ప్రజలు విశ్వసిస్తున్నారు.

బ్రిటన్ పౌండు విలువ తగ్గితే భారత్‌కు కొంత ప్రయోజనమే. ఆ దేశంలో వ్యాపారం నిర్వహించే భారతీయ వ్యాపారులకు ఐరోపా మార్కెట్లతో అనుసంధానం తగ్గుతుంది. అయితే బ్రిటన్ భారత్‌కు అతిపెద్ద వ్యాపార భాగస్వామిగా అవతరించే అవకాశాలున్నాయి. అక్కడ విద్యా సంస్థలు వసూలు చేసే సుంకాలు తగ్గిపోతాయి. దానివల్ల అక్కడికి వెళ్ళి చదువుకునే భారతీయ విద్యార్థులకు మేలు కలుగుతుంది. ఉత్తర ఐర్లాండ్ బ్రిటన్‌లో అంతర్భాగం. దీని సరిహద్దుల్లో ఎటువంటి నియంత్రణలు ఉండాలన్నది ఇపుడు చర్చనీయాంశంగా మారింది. ప్రస్తుత పరిస్థితుల్లో బ్రిటన్ పార్లమెంటు బ్రెగ్జిట్‌ను విస్మరించి ఈయూలో కొనసాగవచ్చు. అందుకు ఈయూ దేశాల అనుమతి అవసరంలేదని ఐరోపా న్యాయస్థానం ఇప్పటికే ప్రకటించింది. మరో రెండునెలల్లో బ్రిటన్ ఈయూనుంచి విడిపోనూవచ్చు. ఎన్నికలు జరిగి ప్రధాని థెరాసా మే ఆధ్వర్యంలోని కన్సర్వేటివ్ పార్టీ ఓడిపోయి లేబర్ పార్టీ అధికారంలోకొస్తే బ్రెగ్జిట్ రూపం మారవచ్చు. ఏదిఏమైనా 'బ్రెగ్జిట్'పై స్పష్టత వస్తే ఐరోపాలో రాజకీయ, సామాజిక వైవిధ్యం వెల్లివిరియడం ఖాయం.

- డాక్టర్ పి.వి.రంగనాయకులు

(రచయిత- తిరుమల ఎస్వీ మ్యూజియం పూర్వ సంచాలకులు)

ఈనాడు లేఖలు

పొంతన లేని ప్రభుత్వ వాదన

ఫ్రాన్స్ నుంచి రఫేల్ యుద్ధ విమానాల కొనుగోలుకు సంబంధించి కేంద్ర ప్రభుత్వం వ్యవహరిస్తున్న తీరు అభ్యంతరకరంగా ఉంది. ప్రభుత్వం వినిపిస్తున్న వాదనకు, వాస్తవానికి పొంతన ఉండటం లేదు. ప్రధాని, రక్షణమంత్రి, సంబంధిత ఉన్నతాధికారుల వివరణల్లో స్పష్టత కొరవడింది. అందరూ నిబంధనలకు వక్రభాష్యం చెబుతూ అసలు విషయాన్ని దాటవేస్తున్నారు. తమ అనుయాయులకు లబ్ధి చేకూర్చేందుకు పాలకులు ప్రయత్నించారన్న వాదనను తోసిపుచ్చలేం. ఎనిమిదో దశకంలో బోఫోర్స్ కుంభకోణం వెలుగు చూసినప్పుడు సైతం అధికార పార్టీ ఇలానే బుకాయించింది. వేలకోట్ల రూపాయల ప్రజాధనం విషయంలో ప్రభుత్వం పారదర్శకంగా, జవాబుదారీతనంతో వ్యవహరించాలి.

ఎం. కె. మూర్తి, సూర్యాపేట

ఎంఈవోలు లేక ఇబ్బందులు

పలు మండలాల్లో మండల విద్యా అధికారి (ఎంఈవో) పోస్టులు ఖాళీగా ఉండటంతో ఇబ్బందులు ఎదురవుతున్నాయి. పాఠశాలల పర్యవేక్షణ సమస్యగా మారింది. ఎంఈవోలు లేక చాలాచోట్ల సీనియర్ గజిటెడ్ ప్రధానోపాధ్యాయులకు అదనంగా ఈ బాధ్యతలు అప్పగించారు. ఏకకాలంలో పాఠశాలలు, మండల విద్యాశాఖ బాధ్యతల నిర్వహణ వీరికి కత్తిమీద సాములా మారింది. దేనిమీదా పూర్తిస్థాయిలో దృష్టిలో పెట్టలేకపోతున్నారు. పరీక్షలు దగ్గర పడుతున్న సమయంలో ప్రధానోపాధ్యాయులు పాఠశాలల పనులకే ప్రాధాన్యం ఇవ్వాల్సి ఉంటుంది. ఈ సమస్యపై ఉన్నతాధికారులు దృష్టి సారించడం అవసరం.

- షేక్ అస్లాం షరీఫ్, శాంతినగర్, జోగులాంబ గద్వాల జిల్లా

సుస్వర భావుకుడు త్యాగయ్య

భారతీయ సమాజంలో ధర్మం, కళ, విజ్ఞానం అన్యోన్యంగా వర్ధిల్లుతూ వచ్చాయి. అందుకే ఈ నేల ఏకస్వనమై అలరారుతూ వస్తోంది. శ్యామశాస్త్రి, ముత్తుస్వామి దీక్షితార్, త్యాగయ్య వంటి నాదోపాసకులు, బౌద్ధాయనుడు, ఆర్యభట్టు, బ్రహ్మగుప్తుడు లాంటి శాస్త్రవేత్తలు ఈ భువిపైనే పుట్టి నడయాడారు.

సంగీతాన్ని త్యాగయ్య ఈశ్వరతుల్యమైన కళగా భావించేవారు. నిష్కామ కర్మ సాధనతో, సంగీత యుక్తమైన దైవ నామ సంకీర్తనతో సర్వేశ్వరుణ్ని సాధించవచ్చని సామవేదం చెబుతోంది. ధ్వని విజ్ఞానం, మనఃప్రవృత్తి, గణితశాస్త్రం (లయ, తాళం)తో సంగీత కళ ఒకదానితో ఒకటి అల్లుకొన్న శాస్త్రం అని ఆ వేదంలోని రుక్కులు, యజుస్సులు, సామాలు చెబుతున్నాయి. ఇవన్నీ బీజాంకురాలై త్యాగరాజస్వామి వారిలో మూర్తీభవించాయి.

త్యాగయ్య నాదోపాసన ద్వారా భగవంతుని తెలుసుకోవచ్చని నిరూపించిన గొప్ప వాగ్గేయకారుడు. ఆయన రాసి గానం చేసిన కీర్తనలు వేదాలు, ఉపనిషత్తులపై వారికున్న పట్టును తెలియజెబుతాయి. వీరిది ములకనాడు తెలుగు బ్రాహ్మణ వంశం. వీరు త్రిలింగ వైదీకులు. తిరువయ్యూర్‌కు చెందిన శొంఠి వేంకటరమణయ్య వద్ద త్యాగయ్య సంగీతాభ్యాసం చేశారు. త్యాగయ్య తొంభైఆరు కోట్ల శ్రీరామ నామాలు జపించి శ్రీవారి ఆశీర్వాదం పొందారు. త్యాగరాజు మంచి వైణికులు. తన స్వరరాగ లయ విన్యాసాలను సంప్రదాయ ఒరవడిలోనే విలక్షణ రీతిలో గానం చేసి శ్రోతల చిత్తాలను రస రంజితం చేసేవారు. నీ దయ రాదా... కాదనే వారెవరు కల్యాణ రామా (వసంత భైరవి) కీర్తనలో దైవాన్ని జాలిగా ప్రార్థించాలనే భావం వ్యక్తం అవుతుంది. సహజమైన ఆర్తి త్యాగయ్య కీర్తనల్లో వ్యక్తం కావడం నవవిధ భక్తిలోని దాస్యం, ఆత్మ నివేదనకు తార్కాణం.

భక్తి ప్రపత్తులతో పాటు త్యాగరాజుకు సామాజిక స్పృహ అధికమే. భగవంతుడిపై అనన్య భావం కలిగిన పెద్దలు, బాహ్యంగా పేదవారైనా దైవంపై అమృత మొలికే మాటలతో విధేయత చూపాలని ఆయన భావించేవారు. డాంబిక భక్తి కూడనిదని ఆయన తరచూ చెప్పేవారు. త్యాగయ్యకు అణిమాది సిద్ధులు కలిగించే శక్తి ఉండేదని కొందరి అభిప్రాయం. అల్పమైన ప్రక్రియలతో లోకాన్ని వంచించకూడదని హితవు పలికేవారు. ప్రజలను పాలించే ఏలికలకు సైతం హితవు పలికిన త్యాగయ్య- ఇల్లును చక్కదిద్దుకొన్న రీతిలోనే రాజ్యాన్నీ చక్కదిద్దుకోవాలని చెప్పడం ఆయన నీతిజ్ఞతకు నిదర్శనం.



అంతర్యామి

త్యాగరాజు జీవితంలో జరిగినట్లుగా కొన్ని కథనాలు ప్రాచుర్యంలో ఉన్నాయి. నారదుడే స్వయంగా ఆయనకు సంగీతంలోని రహస్యాలను చెప్పి, 'స్వరార్ణవం' ఇచ్చాడని, ఆ సందర్భంలోనే త్యాగరాజు పంచరత్న కృతుల్లో మూడోదైన 'సాధించెనే ఓ మనసా (అరభి) అంటూ తన్మయంతో గానం చేశాడని చెబుతారు. త్యాగయ్య దివ్యనామ సంకీర్తనలు, ఉత్సవ సంప్రదాయ కీర్తనలు అనే బృంద కీర్తనలు సైతం రచించారు.

ఆయన రాసిన పంచరత్న కృతులు పరమ పావనమైనవని సంగీతజ్ఞులు నమ్ముతారు. తనలో అహం అంటూ ఏదైనా ఉంటే రాముడు తనను కాపాడతాడా అనే అర్థంలో రాసి గానం చేసిన 'దుడుకుగల నన్నే దొరకొడుకు బ్రోచురా' (గౌళ రాగం) కీర్తన ఎంతో ప్రాచుర్యం పొందింది. షడ్జమం, పంచమాలతో పాటు శుద్ధ రిషభం, అంతర గాంధారం, శుద్ధ మధ్యమం, శుద్ధ దైవతం, కాకలి నిషాదం గల గౌళరాగం పాడేటప్పుడు గొప్ప విద్వాంసులు సైతం ప్రత్యేకంగా గమకాలు పలికి శ్రోతలను రంజింపజేసేందుకు ప్రయత్నిస్తారు.

త్యాగరాజస్వామి రామభక్తామృతాన్ని సేవించి, కర్ణాటక సంగీత సంప్రదాయంలో అనేక కృతులను మధుర కీర్తనలుగా మలచి సంగీత, సాహిత్య రసజ్ఞుల హృదయాల్లో చిరంజీవిగా నిలిచారు!

- అప్పరుసు రమాకాంతరావు

ముక్క.. చుక్క..



పంచాయతీ ఎన్నికల సందర్భంగా గ్రామాల్లో మద్యం, డబ్బు, మాంసం పంపకాలు యథేచ్ఛగా జరుగుతున్నాయి. మొదటి దశ పోలింగ్ జరగనున్న పంచాయతీల్లో ఈ అక్రమాలు జోరుగా సాగుతున్నాయి. సూర్యాపేట జిల్లా మేళ్లచెర్వు మండల పరిధిలోని ఓ గ్రామంలో ఆదివారం పొటేళ్లను కోసి ఇంటింటికీ కిలో చొప్పున మాంసాన్ని ప్యాకింగ్ చేసి పంపిణీ చేశారు. ఇలాంటి దృశ్యాలు అనేక గ్రామాల్లో కనిపిస్తున్నాయి. ఒకరి తర్వాత మరొకరు మాంసం పంపిణీ చేసుకునేలా అభ్యర్థుల మధ్య అవగాహన జరగటం కొసమెరుపు.

–హుజూర్‌నగర్, న్యూస్‌టుడే

బ్యాలెట్ పెట్టెలో పత్రాలతోనే అంతిమ నిర్ణయం

ప్రత్యేక ఎగ్జిక్యూటివ్ మెజిస్ట్రేట్‌లుగా పలువురి నియామకం

ఈనాడు, హైదరాబాద్: పంచాయతీ ఎన్నికల ఓట్ల లెక్కింపు సమయంలో.. రికార్డుల్లోని లెక్కలో ఏమైనా తేడా వచ్చినప్పటికీ.. అంతిమంగా బ్యాలెట్ పెట్టెలో గల పత్రాల సంఖ్యనే అధికారులు పరిగణనలోకి తీసుకుంటారు. ఓట్ల లెక్కింపుపై రాష్ట్ర ఎన్నికల సంఘం ఆదివారం రాత్రి ఒక ఉత్తర్వును వెలువరించింది. బ్యాలెట్ పత్రాలను మడిచి, వాటిని డ్రమ్ములో వేసి కలపడానికి ముందుగా ప్రాథమికంగా ఒకసారి వాటిని అధికారులు లెక్కపెడతారు. బ్యాలెట్ పెట్టెలోని పత్రాల సంఖ్యను, వాటి అకౌంట్‌ను, పేపర్ సీలు అకౌంట్‌ను అధికారులు సరిపోలుస్తారు. సాధారణంగా బ్యాలెట్ పెట్టెలోని పత్రాల సంఖ్య, ప్రిసైడింగ్ అధికారి రాసిపెట్టిన బ్యాలెట్ పత్రాల అకౌంట్‌లోని సంఖ్య సరిపోయి ఉంటాయి. వీటి మధ్య తేడా వస్తే అప్పుడు బ్యాలెట్ పత్రాల అకౌంట్‌ను అధికారులు తనిఖీ చేయాలి. ఇది కేవలం పరిశీలనకే తప్ప ప్రిసైడింగ్ అధికారి రాసిన లెక్కలో సవరణలు చేయకూడదు. ఫలితాల షీటు తయారీకి బ్యాలెట్ పెట్టెలో పత్రాలనే పరిగణనలోకి తీసుకోవాలని ఎన్నికల సంఘం పేర్కొంది.

ప్రత్యేక అధికారాలు: శాంతి భద్రతలకు సంబంధించి అప్పటికప్పుడు నిర్ణయాలను తీసుకొనేందుకు వీలుగా పలువురు అధికారులకు ప్రత్యేక ఎగ్జిక్యూటివ్ మెజిస్ట్రేట్‌లుగా అధికారాలను ఇస్తూ ప్రభుత్వం ఆదివారం ఉత్తర్వులిచ్చింది. ఇలాంటి అధికారాలు అందుకున్న వారిలో ప్రధానోపాధ్యాయులు, లెక్చరర్లు, ఏఈలు తదితరులు ఉన్నారు. ఏజిల్లాలో ఎవరెవరికి అధికారాలను ఇస్తున్నదీ పేర్లతో సహా న్యాయశాఖ తన ఉత్తర్వుల్లో పేర్కొంది.

బరిలో తొంభయ్యేళ్ల బామ్మ



సర్పంచి అభ్యర్థి ఈడా రత్తమ్మ

భర్త స్వాతంత్ర సమరయోధుడు.. గ్రామ రాజకీయాల్లో కీలక పాత్ర పోషించారు. ఆయన్నుంచి రాజకీయ వారసత్వాన్ని అందిపుచ్చుకున్న ఈ 90 ఏళ్ల బామ్మ.. మరోసారి పంచాయతీ ఎన్నికల్లో తన అదృష్టాన్ని పరీక్షించుకుంటున్నారు. సర్పంచిగా పోటీ చేసి, యువకులతో సమానంగా చురుగ్గా ప్రచారం చేస్తూ 'ఔరా' అనిపించుకుంటున్నారు. ఖమ్మం జిల్లా పెనుబల్లి మండలం తుమ్మలపల్లి గ్రామ సర్పంచిగా పోటీ చేస్తున్న ఈడా రత్తమ్మ.. 1995లో జడ్పీటీసీ సభ్యురాలిగా గెలుపొందారు. అనంతరం 2001 నుంచి 2013 వరకు వరుసగా 12 ఏళ్లు సర్పంచిగా గ్రామానికి సేవ చేశారు. 2013లో జరిగిన పంచాయతీ ఎన్నికల్లో ఓడిపోయారు. తాజాగా మరోసారి సర్పంచి అభ్యర్థిగా బరిలో నిలిచారు. ఆమె భర్త ఈడా చెన్నయ్య గతంలో రెండుసార్లు సర్పంచిగా గెలిచారు. నిజాం నవాబులకు ఎదురు నిలిచి పోరాడిన వ్యక్తిగా గుర్తింపు పొందారు. ఆయన స్ఫూర్తితో.. గ్రామ సమస్యల పరిష్కారానికి తాను పోటీ చేస్తున్నట్లు రత్తమ్మ 'న్యూస్‌టుడే'కి తెలిపారు.

– న్యూస్‌టుడే, తుమ్మలపల్లి(పెనుబల్లి)

అందరి ఆనందమే.. అసలైన అభివృద్ధి

- బంగారు తెలంగాణ అసలు అర్థం అదే
- గవర్నర్ ప్రసంగానికి ధన్యవాద తీర్మానంలో కొప్పుల ఈశ్వర్
- కేసీఆర్ ప్రధాని కావాల్సిన అవసరం ఉంది: ప్రశాంత్‌రెడ్డి

ఈనాడు, హైదరాబాద్: తెలంగాణ ఏర్పడిన నాలుగేళ్లలోనే కేసీఆర్ ప్రభుత్వం చేపట్టిన పథకాలు దేశానికి మార్గదర్శకమయ్యాయని తెరాస ఎమ్మెల్యే కొప్పుల ఈశ్వర్ అన్నారు. దేశంలో ఎవరూ ఆలోచించని రీతిలో కేసీఆర్ ఆలోచిస్తూ అభివృద్ధి కార్యక్రమాలను అమలు చేస్తున్నారని పేర్కొన్నారు. చిన్న రాష్ట్రమే అయినా తెలంగాణ ఇతర రాష్ట్రాలకు పాఠాలు నేర్పిందన్నారు. ఆ



ఫలాలను ప్రజలు అందుకున్నారు కాబట్టే ఎన్నికల్లో కేసీఆర్ వెంట నిలిచారన్నారు. గవర్నర్ ప్రసంగానికి ధన్యవాదాలు తెలిపే తీర్మానం సందర్భంగా ఆయన మాట్లాడారు. ఉమ్మడి రాష్ట్రంలో వృద్ధిరేటు 4.7 శాతంగా ఉండేదని, గత నవంబర్ నాటికి తెలంగాణ 29.93 శాతం వృద్ధి సాధించి దేశంలోనే ప్రథమ స్థానంలో నిలిచిందన్నారు. కేసీఆర్ ప్రభుత్వ పాలనా దక్షతకు ఇదే నిదర్శనమని తెలిపారు.

ఒక్కో సమస్యనూ పరిష్కరిస్తూ వస్తున్నాం

తెలంగాణ ఏర్పడితే చీకటే మిగులుతుందని ఉమ్మడి రాష్ట్ర చివరి ముఖ్యమంత్రి కిరణ్‌కుమార్ రెడ్డి అన్నారని, అందుకు భిన్నంగా రాష్ట్రం ఏర్పడిన రెండేళ్లలోనే నిరంతర విద్యుత్తును అందించామన్నారు. రైతుబంధు పథకం ప్రపంచ ప్రశంసలు పొందిందన్నారు. వ్యక్తిగత రాజకీయాల కోసమే ప్రతిపక్ష నేతలు సాగునీటి ప్రాజెక్టులకు వ్యతిరేకంగా కోర్టుల్లో కేసులు వేశారని ఆరోపించారు. ప్రస్తుత ప్రజాతీర్పు తర్వాతైనా నాయకులు ఇలాంటి చర్యలకు పాల్పడకుండా ఉండాలని హితవు పలికారు. కేటీఆర్ కృషిలో ఐటీ రంగం గణనీయ ప్రగతి సాధించిందని, టీఎస్ ఐపాస్ ఏర్పాటుతో 5,570 పరిశ్రమలు ఉత్పత్తిని ప్రారంభించగా, 8.37 లక్షల కొలువులు లభించాయని, రూ.1.32 వేల కోట్ల పెట్టుబడులు రాష్ట్రానికి వచ్చాయన్నారు. బంగారు తెలంగాణ అంటే బంగారు పూత పూయడం కాదని, అన్ని రంగాల్లో రాష్ట్రం అభివృద్ధి చెంది, ప్రతి ఒక్కరు సుఖసంతోషాలతో ఉండటమేనని వెల్లడించారు.

మనిషి కేంద్రంగా అభివృద్ధి: వేముల

సీఎం కేసీఆర్ కన్నా ముందు పాలించిన వారు చిత్తశుద్ధితో వ్యవహరించి ఉంటే రాష్ట్రానికి



ఇంతటి దీనస్థితి వచ్చి ఉండేది కాదని తెరాస ఎమ్మెల్యే వేముల ప్రశాంత్‌రెడ్డి అన్నారు. కొప్పుల ఈశ్వర్ తీర్మానాన్ని బలపరిచే సందర్భంగా ఆయన మాట్లాడారు. వ్యక్తి అభివృద్ధే లక్ష్యంగా సీఎం కేసీఆర్ ఆలోచనలు ఉన్నాయని, అందుకే తెలంగాణలో అన్ని పథకాలు విజయవంతమవుతున్నాయని తెలిపారు. అభివృద్ధి కార్యక్రమాలకు కావాల్సిన డబ్బు హైదరాబాద్‌లో వ్యాపారాభివృద్ధి ద్వారా వచ్చే పన్నులతో సమకూరుతోందన్నారు. ఆ సంపదను పేదలకు పంచేందుకు కేసీఆర్ పథకాలు అమలు చేస్తున్నారన్నారు. దేశంలో భాజపా, కాంగ్రెసేతర పరిపాలన రావాలన్నదే సీఎం కేసీఆర్ ఆలోచన అన్నారు. కేసీఆర్ ప్రధాని కావాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు.

ముస్లిం మైనారిటీలకే 12 శాతం రిజర్వేషన్లు



- మండలిలో హోంమంత్రి మహమూద్ అలీ

ఈనాడు, హైదరాబాద్: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిపాదించిన 12 శాతం రిజర్వేషన్లు ముస్లిం మైనార్టీలకు మాత్రమే వర్తిస్తాయని హోంమంత్రి మహమూద్ అలీ స్పష్టం చేశారు. పెంచిన పింఛన్లు, నిరుద్యోగులకు రూ.3016 భృతిని వచ్చే ఏప్రిల్ నుంచే అందజేస్తామని తెలిపారు. శాసనమండలిలో గవర్నర్ ప్రసంగానికి ధన్యవాదాలు తెలిపే తీర్మానంపై మండలిలో ఆదివారం చర్చ జరిగింది. ఈ సందర్భంగా సభ్యులు లేవనెత్తిన ప్రశ్నలకు హోంమంత్రి సమాధానం ఇచ్చారు. తెలంగాణలో రెండోసారి తెరాసకు విజయం అందించి, సేవ చేసే అవకాశం ఇచ్చిన ప్రజలకు ధన్యవాదాలు తెలిపారు. ప్రత్యేక రాష్ట్రంలో 24 గంటల ఉచిత విద్యుత్‌ను అందించిన ఘనత ముఖ్యమంత్రి కేసీఆర్‌కు దక్కుతుందన్నారు. రాష్ట్రంలో శాంతిభద్రతలు మెరుగుపడ్డాయన్నారు. రైతులకు రూ.17 వేల కోట్ల రుణ మాఫీ, భూరికార్డుల డిజిటలీకరణ, జిల్లాల ఏర్పాటు, ధరణి ప్రాజెక్టు, రైతుబంధు, రైతు బీమా పథకాలు అమలు చేశామన్నారు. షాదీ ముబారక్ ద్వారా ఇప్పటివరకు రూ.634 కోట్లు ఖర్చు చేశామన్నారు. రాష్ట్రంలో 1,10,112 ఖాళీలుంటే 34 వేల పోస్టులు భర్తీ చేశామని చెప్పారు.

అంతకు ముందు శాసనమండలిలో కాంగ్రెస్ పక్ష నేత షబ్బీర్ అలీ మాట్లాడుతూ మైనార్టీలంటే ఎవరో చెప్పాలని డిమాండ్ చేశారు. ఎస్టీలకు 12 శాతం, మైనార్టీలకు 12 శాతం రిజర్వేషన్లు అమలు చేస్తామని ప్రభుత్వం చెప్పిందన్నారు. రాష్ట్రంలో సిక్కు, జైనులూ మైనార్టీలేనన్నారు. మైనార్టీల సంక్షేమానికి రూ.509 కోట్లు ఖర్చు చేశారన్నారు. మరో కాంగ్రెస్ సభ్యుడు పొంగులేటి సుధాకర్‌రెడ్డి మాట్లాడుతూ గవర్నర్ ప్రసంగంలో అర్ధసత్యాలు ఉన్నాయన్నారు. రైతు రుణమాఫీ, రైతు బంధు పథకాలను ఒకేసారి అమలు చేయాలన్నారు. భాజపా సభ్యుడు రామచందర్‌రావు కేంద్ర ప్రభుత్వం చేపట్టిన వివిధ పథకాల గురించి వివరించబోగా తెరాస సభ్యుడు సుధాకర్‌రెడ్డి అభ్యంతరం తెలిపారు. మండలి ఛైర్మన్ స్వామిగౌడ్ కల్పించుకుని ఏదైనా మాట్లాడాలంటే అది సభాపతి ద్వారానే జరగాలన్నారు. తెరాస సభ్యులు పల్లా రాజేశ్వర్‌రెడ్డి ధన్యవాద తీర్మానం ప్రవేశపెట్టారు. దీనిపై తెరాస సభ్యులు బోడకుంటి వెంకటేశ్వర్లు, నారదాసు లక్ష్మణరావు, ఎంఐఎం సభ్యులు జాఫ్రీ మాట్లాడారు. రాజేశ్వర్‌రెడ్డి ఫిర్యాదు మేరకు పార్టీ ఫిరాయించిన ఎమ్మెల్సీలు యాదవరెడ్డి, రాములునాయక్, భూపతిరెడ్డిల సభ్యత్వాన్ని రద్దు చేశామని స్వామిగౌడ్ చెప్పారు.





రెవెన్యూ దస్త్రాల ప్రక్షాళన ఘనత మాదే.. కాదు మాదే

సీఎం, సీఎల్పీ నేత భట్టిల మధ్య వాదోపవాదాలు

ఈనాడు, హైదరాబాద్: రెవెన్యూ దస్త్రాల ప్రక్షాళనను తెరాస ప్రభుత్వమే ప్రారంభించిందన్న వాదన సరికాదని, కాంగ్రెస్ హయాంలోనే ఆ ప్రక్రియ ప్రారంభమైందని కాంగ్రెస్ శాసన సభాపక్ష నేత భట్టి విక్రమార్క అన్నారు. గవర్నర్ ప్రసంగానికి ధన్యవాద తీర్మానంపై ఆదివారం జరిగిన చర్చలో ముఖ్యమంత్రి కేసీఆర్ మాట్లాడారు. రెవెన్యూ దస్త్రాల ప్రక్షాళనపై గత ప్రభుత్వాలు నిర్లక్ష్యంగా వ్యవహరించాయని ఆరోపించారు. కాంగ్రెస్ సభ్యుడు గండ్ర వెంకటరమణారెడ్డి రెవెన్యూ దస్త్రాల ప్రక్షాళన ప్రక్రియ సరిగా జరగడం లేదంటూ చేసిన వ్యాఖ్యలు సరికాదన్నారు. వరంగల్‌లో కంటి శస్త్ర చికిత్సల అంశంపై గండ్ర చేసిన వ్యాఖ్యలనూ సీఎం తప్పుబట్టగా.. భట్టి అభ్యంతరం తెలిపారు. రెవెన్యూ దస్త్రాల ప్రక్షాళన కొత్తదేమీ కాదని, కాంగ్రెస్ ప్రభుత్వ హయాం నుంచే కొనసాగుతోందన్నారు. కాంగ్రెస్ హయాంలో ప్రతి గ్రామంలో రెవెన్యూ సదస్సులు నిర్వహించిన విషయాన్ని గుర్తు చేశారు. కంటి శస్త్ర చికిత్సలపై పత్రికల్లో వచ్చిన అంశాన్నే తమ సభ్యుడు ప్రస్తావించారని, ఆయన్ని సీఎం విమర్శించడం మంచి సంప్రదాయం కాదన్నారు. దీనిపై సీఎం సమాధానమిస్తూ 'కాంగ్రెస్ హయాంలో ఆర్వోఆర్‌ల పేరిట జేసీల ఆధ్వర్యంలో మొక్కుబడిగా సదస్సులు జరిగేవి. రెవెన్యూ దస్త్రాలను సరిచేసే ప్రక్రియ జరగలేదు' అని తెలిపారు.

హామీల అమలెప్పుడో చెప్పండి

- దానికి విధివిధానాలు ప్రకటించండి
- పంట రుణాల రద్దుపైనా స్పష్టత ఇవ్వాలి
- ధన్యవాద తీర్మాన చర్చలో గండ్ర నిలదీత
- పారదర్శకమైన ఎన్నికలు ఇవి: అబ్దుల్లా బలాల్
- పోలీసుల ముందే నరుక్కుంటున్నారు: రాజాసింగ్

ఈనాడు, హైదరాబాద్: అనేక హామీలు ఇచ్చి రెండోసారి అధికారంలోకి వచ్చిన తెరాస ప్రభుత్వం, వాటి అమలుకు విధి విధానాలు ప్రకటించాలని కాంగ్రెస్ ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి డిమాండ్ చేశారు. గవర్నర్ ప్రసంగానికి ధన్యవాదాలు తెలిపే చర్చ సందర్భంగా ఆదివారం ఆయన మాట్లాడారు. ప్రభుత్వాన్ని ముందుగానే ఎందుకు రద్దు చేశారో వివరించాల్సిన అవసరం సీఎంపై ఉందన్నారు. ప్రభుత్వ రద్దుతో మూడు నెలల పాటు రాష్ట్రంలో పాలన స్తంభించిందని, కొత్త ప్రభుత్వం ఏర్పడి నలభై రోజులు గడుస్తున్నా పూర్తిస్థాయి మంత్రివర్గాన్ని ఏర్పాటు చేయలేదని ఆక్షేపించారు. 'ప్రస్తుతం పంచాయతీ ఎన్నికలు జరుగుతున్నాయి. ఆ తర్వాత ఎంపీ, జిల్లా పరిషత్, మున్సిపాలిటీలకు ఎన్నికలు జరుగుతాయి. ఎన్నికల నియమావళి కొనసాగే అవకాశం ఉన్నందున ఏ పనీ చేసే పరిస్థితి ఉండదు. అంతకుమునుపే అభివృద్ధి పనులను చక్కబెట్టే ప్రయత్నం చేయాలి' అని ప్రభుత్వానికి సూచించారు. 'రూ.లక్ష వరకు పంట రుణాల రద్దు హామీని ఎప్పుడు అమలు చేస్తారు? ఏక కాలంలో రద్దు చేస్తారా? విడతలుగానా? అనేదీ చెప్పండి. ఆసరా పింఛనుదారులకు ఆర్థిక సాయం పెంపు, నిరుద్యోగ భృతి, ఉద్యోగుల పదవీ విరమణ వయసు పెంపు, ముస్లిం మైనారిటీలకు రిజర్వేషన్లు, పోడు వ్యవసాయం చేసే వారికి పట్టాల పంపిణీ, సింగరేణి కార్మికులకు ఇచ్చిన హామీలను ఎప్పట్నుంచి అమలు చేస్తారో స్పష్టం ఇవ్వండి' అని గండ్ర కోరారు.

సంగారెడ్డిలో వైద్య కళాశాల ఏర్పాటు చేయండి: జగ్గారెడ్డి

సంగారెడ్డిలో వైద్య కళాశాల ఏర్పాటు చేయాలని సంగారెడ్డి ఎమ్మెల్యే జగ్గారెడ్డి కోరగా సీఎం కేసీఆర్ సానుకూలంగా స్పందించారు.

లోక్‌సభ ఎన్నికల్లోనూ విజయం: ఎంఐఎం

శాసనసభ ఎన్నికల ప్రక్రియ పారదర్శకంగా జరిగిందని ఎంఐఎం శాసన సభ్యుడు అబ్దుల్లా బలాల్ అభిప్రాయపడ్డారు. తెరాసను ఓడించేందుకు అమిత్‌షా, మోదీ, రాహుల్‌గాంధీ, చంద్రబాబు నాయుడు చేసిన ప్రయత్నాలేవీ ఫలించలేదన్నారు. ఏపీ ఎన్నికల్లో తెదేపా ఓడిపోతుందని జోస్యం చెప్పారు. లోక్‌సభ ఎన్నికల్లో తెరాస, ఎంఐఎంలు అన్ని సీట్లు గెలుచుకుంటాయన్నారు.

మాదక ద్రవ్యాల కేసు ఏమైంది: భాజపా

రాష్ట్రంలో సంచలనం సృష్టించిన మాదక ద్రవ్యాల కేసు ఏమైందని భాజపా శాసన సభ్యుడు ఎం.రాజాసింగ్ ప్రశ్నించారు. గవర్నర్ ప్రసంగంపై మాట్లాడకుండా కొందరు సభలో రాజకీయాలు మాట్లాడారని అభ్యంతరం వ్యక్తం చేశారు. కొన్ని పార్టీల నేతలు అధికారంలో ఉన్న వారికి ఊడిగం చేస్తుంటారని ఎద్దేవా చేశారు. రాష్ట్రంలో శాంతిభద్రతల పరిస్థితి బాగానే ఉన్నా. . హైదరాబాద్ నగరంలో బహిరంగ హత్యలు, మాదక ద్రవ్యాల వినియోగం పెరగడం పట్ల ఆందోళన వ్యక్తం చేశారు. దూల్‌పేటలో గుడుంబా కాసే బాధితుల పునరావాసం అంశాన్ని పట్టించుకోవాలని ప్రభుత్వానికి విన్నవించారు.

సీఎల్పీ నేతగా భట్టి.. ఎంఐఎం పక్ష నేతగా అక్బరుద్దీన్

కొత్తగా కొలువుదీరిన తెలంగాణ శాసన సభలో కాంగ్రెస్ పార్టీ శాసన సభాపక్ష నేతగా మల్లు భట్టి విక్రమార్క పేరును సభాపతి అధికారికంగా ప్రకటించారు. సభలో రెండో పెద్ద పార్టీగా ఉన్న కాంగ్రెస్ నుంచి ఆయన పేరును పార్టీ అధ్యక్షుడు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి ప్రతిపాదించారని సభాపతి పేర్కొన్నారు. ఏఐఎం నుంచి అక్బరుద్దీన్ ఓవైసీని ఎంఐఎం శాసన సభాపక్ష నేతగా ప్రకటించారు.

ప్రజా సమస్యలపై చర్చ జరగాలి

- వచ్చే సమావేశాలు ఎక్కువ రోజులు నిర్వహించాలి
- ప్రాజెక్టులపై పెట్టే ప్రతిపైసా పారే నీటిలో కనిపించాలి
- సీఎల్పీ నేత భట్టి విక్రమార్క

ఈనాడు, హైదరాబాద్: తెలంగాణ రాష్ట్ర శాసనసభలో రెండేళ్లుగా ప్రజా సమస్యలపై చర్చ జరగకపోవడం విచారకరమని కాంగ్రెస్ శాసనసభాపక్ష నేత మల్లు భట్టివిక్రమార్క అన్నారు. వచ్చే శాసనసభ సమావేశాలనైనా ఎక్కువ రోజులు జరపాలని అభిప్రాయపడ్డారు. ప్రభుత్వంపై నిర్మాణాత్మకంగా పోరాటం చేస్తామని ప్రకటించారు. ఆదివారం సీఎల్పీ కార్యాలయంలో మీడియాతో ఇష్టాగోష్ఠిగా మాట్లాడారు. సాగునీటి ప్రాజెక్టులపై ప్రభుత్వం వ్యయం చేసే ప్రతి పైసా పారే నీటిలో కనిపించాలని అన్నారు. ఇప్పటి వరకూ ప్రాజెక్టులపై రూ.లక్ష కోట్లు ఖర్చు పెట్టారని, ఒక ఎకరాకైనా కొత్తగా నీళ్లు వచ్చాయా? అని అడిగారు. కేసీఆర్ సాంకేతికంగా ఇంజినీరింగ్ నిపుణుడైతే ఇక ఇంజినీర్లు ఎందుకని ప్రశ్నించారు. ప్రాజెక్టులపై రూ.2.25 లక్షల కోట్ల ఖర్చు ఎక్కడా చూడలేదని భట్టి అన్నారు. ప్రాజెక్టులపై తమ అభ్యంతరాలను ప్రభుత్వం పట్టించుకోకుంటే సాంకేతిక బృందాలతో ప్రాజెక్టుల బాట పడతామన్నారు. ఈసారి శాసనసభ సమావేశాలు సాధారణ సమావేశాలుగా జరిగాయని చెప్పారు. వచ్చే సమావేశాల నుంచి ప్రభుత్వాన్ని సభలో గట్టిగా నిలదీస్తామన్నారు. ప్రభుత్వం చేసే ప్రతి పనికి కాపలాగా ఉండాలని ప్రజలు తమను గెలిపించారని పేర్కొన్నారు. పంచాయతీ ఎన్నికల తర్వాత మరోసారి కాంగ్రెస్ శాసనసభాపక్ష (సీఎల్పీ) సమావేశం నిర్వహిస్తామన్నారు. అప్పుడు సీఎల్పీ కమిటీలపై చర్చిస్తామని తెలిపారు. సభను హుందాగా నడుపుకుందామని చెప్పిన సీఎం ఫిరాయింపులను ప్రోత్సహిస్తారని తాను అనుకోవడంలేదని వ్యాఖ్యానించారు. కాంగ్రెస్ శాసనసభ్యుల్లో ఎవరికి ఏ అంశంపై ఆసక్తి ఉంటే దానిపైనే వారు మాట్లాడుతారన్నారు. పీసీసీ చీఫ్ ఉత్తమ్ కుమార్‌రెడ్డితో తనకు సన్నిహిత సంబంధాలు ఉన్నాయని తెలిపారు. తాను సీఎల్పీ మాజీ నేత కె.జానారెడ్డి ఆశీస్సులను పొందానన్నారు.

అమెరికాలో విద్వేష దాడి

తీవ్రంగా గాయపడిన భారత సంతతి వ్యక్తి

న్యూయార్క్: ఓ సిక్కు వ్యక్తిపై ఓరెగన్‌లో విద్వేష దాడి జరిగింది. ఇక్కడి ఓ స్టోర్‌లో పని చేస్తున్న హర్వీందర్‌సింగ్ డాడ్ అనే భారత సంతతి వ్యక్తిపై ఆండ్రూ రామ్‌సే(24)అనే శ్వేత జాతి యువకుడు దాడికి పాల్పడ్డాడు. హర్వీందర్‌సింగ్ మతం గురించిన అపోహతోనే అతడిపై రామ్‌సే దాడికి పాల్పడేందుకు కారణమై ఉండవచ్చని 'ఫాక్స్ 12 టీవీ న్యూస్' వెల్లడించింది. సిగరెట్ల కోసం వాడే రోలింగ్ పేపర్లు కావాలని రామ్‌సే అడిగాడు. అయితే, అతడు తన గుర్తింపు కార్డును చూపకపోవడంతో హర్వీందర్ ఇవ్వలేకపోయారు. దాంతో, కోపోద్రిక్తుడైన రామ్‌సే ఒక్కసారిగా హర్వీందర్‌పైకి లంఘించాడు. అతడి గడ్డం పట్టుకుని లాగుతూ....ముఖంపై పిడిగుద్దులు కురిపించాడు. తలపాగా లాగేందుకు యత్నించాడు. అతడిపైకి తన బూటు విసిరాడు. అంతటితో ఆగకుండా హర్వీందర్‌ను కిందపడేసి అత్యంత దారుణంగా కొట్టినట్లు సాక్షి ఒకరు తెలిపారు. హర్వీందర్ ముక్కు నుంచి రక్తం కారిందన్నారు. పోలీసులు వచ్చేదాకా తాము రామ్‌సేను పట్టి ఉంచినట్లు అమెరికా నౌకాదళ మాజీ కమాండో జస్టిన్ బ్రెచ్ తెలిపారు.

దేశానికి ఆదర్శంగా రాష్ట్ర శాసనసభ

- వీలైనన్ని ఎక్కువ రోజులు నిర్వహణ
- సభ్యులు హుందాగా ప్రవర్తించాలి
- పార్టీలలో చేరికలపై నిబంధనల మేరకు వ్యవహరిస్తా
- సభాపతి పోచారం శ్రీనివాస్‌రెడ్డి



శాసనసభ కమిటీహాలులో విలేకరులతో మాట్లాడుతున్న సభాపతి పోచారం శ్రీనివాస్‌రెడ్డి. పక్కన శాసనసభ కార్యదర్శి నర్సింహాచార్యులు

ఈనాడు, హైదరాబాద్: తెలంగాణ శాసనసభను దేశానికి ఆదర్శంగా నిలిపేందుకు కృషి చేస్తానని నూతన సభాపతి పోచారం శ్రీనివాస్‌రెడ్డి పేర్కొన్నారు. శాసనసభ సంప్రదాయాలను గౌరవిస్తానని, నియమనిబంధనలకు అనుగుణంగా సభను నిర్వహిస్తానని చెప్పారు. పరస్పర విమర్శలకు పోకుండా ప్రజా సమస్యల పరిష్కారానికి సభ్యులు కృషి చేయాలని సూచించారు. ప్రజల ఆకాంక్షల మేరకు వ్యవహరించాలని, సభ గౌరవాన్ని కాపాడేందుకు అన్ని పక్షాలు సహకరించాలని కోరారు. శాసనసభ సమావేశాలు ముగిసిన తర్వాత ఆయన శాసనసభ కార్యదర్శి నర్సింహాచార్యులతో కలిసి కమిటీ హాలులో విలేకరులతో మాట్లాడారు. "తెలంగాణ రెండో శాసనసభ తొలి సమావేశాలు చక్కగా సాగాయి. సహకరించిన వారందరికీ ధన్యవాదాలు. ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో 119 నియోజకవర్గాల పరిధిలోని ప్రజలు ఎంతో నమ్మకంతో, ఆశతో సభ్యులను ఎన్నుకున్నారు. ప్రజల ఆశయాలకు, అవసరాలకు అనుగుణంగా సభలో చక్కగా వ్యవహరించాల్సిన బాధ్యత సభ్యులపై ఉంటుంది. అందరం సభా మర్యాదలను గౌరవించాలి. సభ పవిత్రతను కాపాడాలి. అడ్డగోలుగా విమర్శలు చేయకూడదు. గత ప్రభుత్వంలో నేను నిర్వహించిన వ్యవసాయ శాఖ దేశానికే ఆదర్శమైంది. రాష్ట్రం అన్ని రంగాల్లో దేశంలో అగ్రస్థానంలో ఉంది. శాసనసభ వ్యవహారాల విషయంలో కూడా ఆదర్శంగా నిలవాలి. నూతన శాసనసభ్యులు చిన్న చిన్న తప్పులు చేస్తే మీడియా వక్రీకరించే ప్రయత్నం చేయవద్దు. గవర్నర్ ప్రసంగం రాష్ట్ర ప్రభుత్వం పనితీరుకు అద్దం పట్టింది. చట్టసభల్లో ప్రతి నిమిషం, ప్రతి మాట విలువైనది. ప్రతి సభ్యునికీ మాట్లాడే అవకాశం కల్పిస్తాం. రాష్ట్ర ప్రయోజనాలు, ప్రగతి కోసం ఎంతగా మాట్లాడితే అంత ఎక్కువ అవకాశం కల్పిస్తాం. సభ్యులు రాజకీయాలకతీతంగా సభలో వ్యవహరిస్తారని ఆశిస్తున్నా. గాడి తప్పితే నిబంధనల ప్రకారం నడుచుకుంటా. పార్టీలలో చేరికలపై నిబంధనల మేరకు వ్యవహరిస్తా. తేడాలు ఉంటే చర్యలు తప్పవు. శాసనసభ పనిదినాల కాలపరిమితిపై నియమం ఏమీలేదు. సభా కార్యకలాపాల సలహా కమిటీ (బీఏసీ) నిర్ణయం మేరకు అవసరమైనన్ని రోజులు నడిపిస్తాం. శాసనసభ వెబ్‌సైట్‌ను త్వరలోనే నవీకరిస్తాం. సమాచారాన్ని అందుబాటులోకి తెస్తాం" అని పోచారం శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు.

శాసనసభ, మండలి సమావేశాలు నిరవధిక వాయిదా

ఈనాడు, హైదరాబాద్: తెలంగాణ శాసనసభ, మండలి సమావేశాలు ఆదివారం నిరవధికంగా వాయిదా పడ్డాయి. గవర్నర్ ప్రసంగంపై ధన్యవాద తీర్మానం ఆమోదం అనంతరం శాసనసభను వాయిదా వేస్తున్నట్లు సభాపతి పోచారం శ్రీనివాస్ రెడ్డి ప్రకటించారు. ఈ నెల 17న ప్రారంభమైన సమావేశాలు నాలుగు రోజులు సాగాయి. మొత్తం 9.28 గంటల పాటు కార్యలాపాలు జరిగాయి. అయిదుగురు సభ్యులు మాట్లాడారు. తొలిరోజు సభ్యుల ప్రమాణస్వీకారం, రెండో రోజు శాసనసభాపతి ఎంపిక, మూడో రోజు ఉభయ సభలను ఉద్దేశించి గవర్నర్ ప్రసంగించారు. ఆదివారం గవర్నర్ ప్రసంగానికి ధన్యవాద తీర్మానంపై చర్చించి ఆమోదం తెలిపారు. శాసనమండలి ఆదివారం 4.54 గంటల పాటు సాగింది. గవర్నర్ ప్రసంగానికి ధన్యవాద తీర్మానంపై 18 మంది ప్రసంగించారు. అనంతరం మండలిని వాయిదా వేస్తున్నట్లు ఛైర్మన్ స్వామిగౌడ్ ప్రకటించారు.

గణతంత్ర వేడుకలకు భద్రత కల్పించండి

చండీగఢ్: భారత గణతంత్ర దినోత్సవం సందర్భంగా అమెరికా, కెనడాల్లోని వివిధ నగరాల్లో జరిగే వేడుకలకు భద్రత కల్పించాలని స్థానిక పోలీసులను భారత రాయబార కార్యాలయాలు కోరాయి. ఖలిస్థాన్ వేర్పాటువాద సంస్థలు ఈ కార్యక్రమాలకు అంతరాయం కలిగించేందుకు ప్రణాళికలు రచించుకున్న నేపథ్యంలో ఈ మేరకు విజ్ఞప్తి చేశాయి.

నామపత్రం వేసినందుకు కులం నుంచి వెలి

పది మందిపై కేసు నమోదు



కుల బహిష్కరణకు గురైన మహేందర్

మంచిర్యాల గ్రామీణం, న్యూస్‌టుడే: కుల పెద్దల మాట వినకుండా, చెప్పిన కట్టుబాట్లను వదిలి వార్డు సభ్యుడిగా నామపత్రం వేశాడనే కారణంగా ఓ వ్యక్తిని కులం నుంచి వెలివేసిన సంఘటన మంచిర్యాల జిల్లా హాజీపూర్ మండలం గుడిపేటలో చోటుచేసుకుంది. బాధితుడు, మంచిర్యాల గ్రామీణ సీఐ కృష్ణకుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. ఈ పంచాయతీలోని ఆరో వార్డును ఎస్సీలకు రిజర్వు చేశారు. ఈ వార్డులో అధికంగా నేతకాని కులస్థులే ఉన్నారు. ఇందులో పోటీ చేసేందుకు మాజీ వార్డు సభ్యుడు ఒకరు నామపత్రం వేశారు. ఆ వ్యక్తిని గెలిపించేందుకు వీలుగా మరెవరూ నామినేషన్ వేయకూడదని కుల పెద్దలు దుర్గం మల్లయ్య, ముడిమడుగుల సత్యనారాయణ, రావుల శేఖర్, గొల్ల రవీందర్, ప్రదీప్, వెంకటేష్, శివ, లింగయ్య, హీమాం, గొల్ల మల్లయ్యలు నిర్ణయించారు. ఈ నిర్ణయాన్ని అంగీకరించని అదే కులానికి చెందిన పాగిడి మహేందర్ నామినేషన్ వేశారు. దీంతో కుల పెద్దలు మహేందర్‌ను పిలిచి పంచాయితీ పెట్టారు. నామినేషన్ వెనక్కి తీసుకోవడానికి ఆయన అంగీకరించలేదు. దీంతో కుల పెద్దలు మహేందర్‌కు రూ.1000 జరిమానా విధించారు. ఆయన కుటుంబసభ్యులతో ఎవరూ సంబంధాలు కలిగి ఉండకూడదని మిగతావారిని హెచ్చరించారు. దీంతో మనస్తాపానికి గురైన మహేందర్ హాజీపూర్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. విషయం తెలుసుకున్న సీఐ కృష్ణకుమార్ బాధితుడిని, కుటుంబ పెద్దలను పిలిచి చర్చించారు. సంఘటనకు కారణమైన పది మందిపై బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి విచారణ చేపట్టారు.

పరిశోధనాత్మక కథనాలకు ఏసీజే పురస్కారాలు

నామినేషన్లకు గడువు ఫిబ్రవరి 25

దిల్లీ: ప్రసార మాధ్యమాల్లో ఉత్తమ పరిశోధనాత్మక కథనాలను ప్రోత్సహించే ఉద్దేశంతో పురస్కారాలను ప్రదానం చేయనున్నట్లు ప్రతిష్ఠాత్మక 'ఏసియన్ కాలేజ్ ఆఫ్ జర్నలిజం' (ఏసీజే) ప్రకటించింది. ఎంపికైన కథనానికి రూ.2 లక్షల నగదు బహుమతితో పాటు పురస్కారాన్ని అందజేస్తామని, ఫిబ్రవరి 25లోగా నామినేషన్లు సమర్పించాలని తెలిపింది. ప్రజా ప్రయోజనాలను దృష్టిలో పెట్టుకుని వెలికితీసిన అక్రమాలు, అధికార దుర్వినియోగం, మానవ హక్కుల ఉల్లంఘన, ఆర్థిక అవకతవకలు, కార్పొరేట్ అవకతవకలు వంటివాటిని పరిశోధనాత్మక కథనాలుగా పరిగణిస్తారు. పరిశోధన తీరు, జనబాహుళ్యంపై అది చూపిన ప్రభావం ఆధారంగా ఎంపికలు జరుగుతాయి. పత్రికలు, డిజిటల్ మాధ్యమాల్లో ఏ భాషలో వచ్చిన కథనాలనైనా ఆంగ్ల అనువాదంతో నామినేషన్లుగా పంపించవచ్చు. గత ఏడాది జనవరి 1 నుంచి డిసెంబరు 31 మధ్య ప్రచురితమైనవాటినే పరిగణనలోకి తీసుకుంటారు.

● 'భగీరథ గంగ'.. దారి తప్పంగ..!



ఇది అతిపెద్ద ఫౌంటైన్ కాదు.. మిషన్ భగీరథ పైప్‌లైన్ లీకేజీతో ఒక్కసారిగా ఆకాశానికి ఎగజిమ్మిన నీరు. నాగర్‌కర్నూల్ జిల్లా తాడూరు మండలం మేడిపూర్ సమీపంలోని నాగర్‌కర్నూల్-కల్వకుర్తి ప్రధాన రహదారి పక్కన ఉన్న మిషన్ భగీరథ ప్రధాన పైప్‌లైన్‌లో రెండు పైపుల మధ్య ఆదివారం మధ్యాహ్నం లీకేజీ ఏర్పడింది. దీంతో నీరు సుమారు 60 అడుగుల ఎత్తుకు చిమ్మింది. రహదారిపై సుమారు 30 నిమిషాలపాటు వాహనాల రాకపోకలు స్తంభించాయి. పోలీసులు, స్థానికులు అక్కడ విద్యుత్ సరఫరా నిలిపివేయించి, సంబంధిత అధికారులకు సమాచారం ఇచ్చారు. దీంతో ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ పరమేశ్ ఎల్లూరు జలాశయం వద్ద మోటార్లను ఆపేయించి, రాకపోకలను పునరుద్ధరించారు. **- న్యూస్‌టుడే, తాడూరు**

పీజీ కోర్సులకు ఉమ్మడి ప్రవేశ పరీక్ష

ఈనాడు, హైదరాబాద్: రాష్ట్రవ్యాప్తంగా వివిధ విశ్వవిద్యాలయాల పరిధిలోని పీజీ కళాశాలల్లో ఎంఏ, ఎంకాం, ఎమ్మెస్సీ కోర్సుల్లో ప్రవేశానికి ఉమ్మడి ప్రవేశ పరీక్ష నిర్వహించనున్నారు. కౌన్సెలింగ్ సైతం ఉమ్మడిగానే నిర్వహిస్తారు. ఉమ్మడి పరీక్ష అంశం గత రెండేళ్లుగా వాయిదా పడుతోంది. ఈసారి తప్పనిసరిగా అమలు చేయాలని రాష్ట్ర ఉన్నత విద్యామండలి పట్టుదలగా ఉంది. ఎంసెట్ తరహాలో ఒకే పరీక్ష.. ఒకే కౌన్సెలింగ్ నిర్వహించాలని ప్రాథమికంగా నిర్ణయం తీసుకున్న విద్యామండలి జేఎన్‌టీయూహెచ్‌కూ దాన్ని వర్తింపజేయనుంది. దీనివల్ల విద్యార్థులకు రెండు ప్రవేశ పరీక్షలు రాసే శ్రమ తప్పుతుందని, దరఖాస్తుల రుసుముల భారం తగ్గుతుందని అధికారులు యోచిస్తున్నారు.

ఫిబ్రవరిలో ఉపకులపతుల సమావేశం

ఉమ్మడి పరీక్ష నిర్వహణకు రాష్ట్ర ఉన్నత విద్యామండలి ఫిబ్రవరి మొదటివారంలో ఉపకులపతుల సమావేశం ఏర్పాటుచేసి, వారి అంగీకారం తీసుకోనుంది. ప్రస్తుతం ఓయూ, కేయూ మాత్రమే ప్రవేశపరీక్షలు జరుపుతున్నాయి. జేఎన్‌టీయూహెచ్ కూడా అయిదారు ఎమ్మెస్సీ కోర్సులకు ప్రత్యేకంగా పరీక్షలు నిర్వహించుకుంటోంది. గతేడాది తెలుగు వర్సిటీ సైతం ఎంఏ జర్నలిజం, భాషా శాస్త్రం, తెలుగు సాహిత్యం కోర్సుల్లో ప్రవేశాలను.. ఓయూ ప్రవేశ పరీక్ష, కౌన్సెలింగ్ ద్వారానే చేపట్టింది. జేఎన్‌టీయూహెచ్‌ను కూడా ఉమ్మడి ప్రవేశ పరీక్ష కిందకు తీసుకురానున్నారు. 'ప్రవేశాలకూ ఉమ్మడి కౌన్సెలింగ్ జరుపుతాం. అందులో జేఎన్‌టీయూహెచ్ కోర్సులనూ చేరుస్తాం. అప్పుడు వర్సిటీకి ప్రతిభావంతులైన విద్యార్థులు వస్తారు' అని ఉన్నత విద్యామండలి ఛైర్మన్ ఆచార్య తుమ్మల పాపిరెడ్డి చెప్పారు.

- ఉమ్మడి ప్రవేశపరీక్ష నిర్వహిస్తే ఆదాయం తగ్గిపోతుందని కేయూ ఆందోళన చెందుతున్నందున దరఖాస్తుల రుసుం రూపేణా వచ్చే నిధులను ప్రవేశాల సంఖ్యను బట్టి పంచుకోవాల్సిందిగా సూచించవచ్చని ఆలోచన.
- వేర్వేరు సిలబస్‌లు ఉన్నందున ఉమ్మడిపరీక్ష రాయడం వీలుకాదని కొందరు విద్యార్థులు అభ్యంతరం వ్యక్తంచేస్తున్నారు. 2016-17 విద్యాసంవత్సరంలో డిగ్రీలో చేరిన వారికి ఛాయిస్ బేస్డ్ క్రెడిట్ సిస్టం (సీబీసీఎస్) అమలవుతోంది. ఆ ప్రకారం పాఠ్య ప్రణాళిక అందరికీ ఒకటే. ఆ విద్యార్థులే పరీక్షలు రాస్తారు కాబట్టి ఆ సమస్య ఉండదని విద్యామండలి స్పష్టం చేయనుంది.
- సబ్జెక్టులు ఎక్కువగా ఉంటే.. ఓయూ, కేయూలు పంచుకొని పరీక్షలను నిర్వహించవచ్చన్నది ఆలోచన.

ప్రస్తుతం నిర్వహిస్తున్న ప్రవేశపరీక్షలు

ఓయూ పీజీసెట్: ఓయూతోపాటు తెలంగాణ, పాలమూరు, మహాత్మాగాంధీ వర్సిటీల పరిధిలోని కళాశాలల్లో ప్రవేశాలకు.

కేయూ పీజీసెట్: కాకతీయ వర్సిటీతోపాటు శాతవాహన విశ్వవిద్యాలయం, అనుబంధ కళాశాలల్లో ప్రవేశానికి.

ఓయూ పరీక్ష ద్వారా భర్తీ చేసే సీట్లు: 19,500 సీట్లుండగా దాదాపు 15 వేల వరకు భర్తీ అవుతున్నాయి.

కేయూ పరీక్ష ద్వారా భర్తీ చేసే సీట్లు: సుమారు 13 వేల సీట్లలో 12 వేల వరకూ భర్తీ అవుతున్నాయి.

బీసీ రిజర్వేషన్ల తగ్గింపు పిటిషన్‌పై నేడు విచారణ

విచారించనున్న సుప్రీం ధర్మాసనం

ఈనాడు, దిల్లీ: పంచాయతీ, స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీల రిజర్వేషన్లు తగ్గిస్తూ తెలంగాణ ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాన్ని సవాల్ చేస్తూ దాఖలైన పిటిషన్‌పై సోమవారం సుప్రీంకోర్టులో విచారణ జరగనుంది. పంచాయతీ, స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీల రిజర్వేషన్లు 34 శాతం నుంచి 24 శాతానికి తగ్గిస్తూ తెలంగాణ ప్రభుత్వం ఆర్డినెన్స్ తీసుకొచ్చిన విషయం విదితమే. దీన్ని సవాల్ చేస్తూ బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు ఆర్.కృష్ణయ్య ఇటీవల సుప్రీంకోర్టును ఆశ్రయించారు. తెలంగాణ ఆర్డినెన్స్‌పై హైకోర్టు ఇచ్చిన మధ్యంతర ఉత్తర్వులు కొట్టివేయాలని, ఆర్డినెన్స్ తీసుకొస్తూ తెలంగాణ గెజిట్‌లో పేర్కొన్న అంశాలపై తదుపరి చర్యలు తీసుకోకుండా స్టే ఇవ్వాలని, 1.1.2019న తెలంగాణ రాష్ట్ర ఎన్నికల సంఘం ఇచ్చిన నోటిఫికేషన్‌పైనా స్టే ఇవ్వాలని పిటిషన్‌లో విజ్ఞప్తి చేశారు. ఈ పిటిషన్‌ను సోమవారం ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ రంజన్‌గొగొయ్ తో కూడిన ధర్మాసనం విచారించనుంది.

ప్రభుత్వాలు బీసీలను మోసగిస్తున్నాయి: జాజుల

బాగ్‌లింగంపల్లి, న్యూస్‌టుడే: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు బీసీ రిజర్వేషన్లను కొల్లగొడుతూ, వారిని మోసగిస్తున్నాయని బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్‌గౌడ్ మండిపడ్డారు. కేంద్ర ప్రభుత్వం అగ్రవర్ణాల పేదలకు పది శాతం రిజర్వేషన్లు కల్పించడం, రాష్ట్ర సర్కార్ బీసీ రిజర్వేషన్లను తగ్గించడమే దానికి నిదర్శనమన్నారు. ఆదివారం హైదరాబాద్‌లో ఆ సంఘం రాష్ట్ర కమిటీ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... బీసీ జనాభా ప్రకారం రిజర్వేషన్లు కల్పించాలనే డిమాండ్‌తో త్వరలో రాష్ట్ర వ్యాప్తంగా బస్సు యాత్ర నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ నెల 22న అన్ని రాష్ట్రాల బీసీ సంఘాల ప్రతినిధులతో కలిసి దిల్లీలో సదస్సు, ఫిబ్రవరి మొదటి వారంలో నగరంలో భారీ బహిరంగ సభ నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు.

అక్రమ కేసులు బనాయించడం అన్యాయం

ఆచార్య జయధీర్ తిరుమల్‌రావు

బాగ్‌లింగంపల్లి, న్యూస్‌టుడే: ప్రజల హక్కుల కోసం పనిచేసే వారిపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అక్రమ కేసులు బనాయించడం అన్యాయమని ఆచార్య జయధీర్ తిరుమల్‌రావు అన్నారు. ఆదివారం హైదరాబాద్‌లోని తెలంగాణ ప్రజాసాంస్కృతిక కేంద్రంలో సాహిత్య సాంస్కృతిక సంఘాల సంయుక్త ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. మేధావులైన ఆనంద్ తేల్‌తుమ్డే, హుమర్ ఖలీల్, అనిర్బన్ భట్టాచార్య, దిల్లీ ప్రొఫెసర్ జీఎన్ సాయిబాబా, విద్యార్థి సంఘం నేత కన్హయ్య కుమార్, సుప్రీంకోర్టు న్యాయవాదులు అరుణ్‌ఫెరిరా, వేర్నాన్ గోంజ్, వరవరరావు తదితరులపై రాజ్యం అక్రమంగా కేసులు నమోదు చేసిందన్నారు. సమావేశంలో ప్రజాగాయని విమలక్క, తెలంగాణ ప్రజా సాంస్కృతిక కేంద్రం డైరెక్టర్ జి.రాములు, రచయితలు భూపతి వెంకటేశ్వర్లు, మోహనకృష్ణ, నస్రిన్‌ఖాన్, గుమ్మడి రాజు నరేష్ పాల్గొన్నారు.

సుస్థిరాభివృద్ధి యువతతో సాధ్యం

- తెలంగాణ జాగృతి అంతర్జాతీయ యువ నాయకత్వ సదస్సు ముగింపు కార్యక్రమంలో నరసింహన్

ఈనాడు డిజిటల్ - హైదరాబాద్

సుస్థిరాభివృద్ధి యువత ద్వారానే సాధ్యమవుతుందని గవర్నర్ ఈఎస్ఎల్ నరసింహన్ అన్నారు. పేదరిక నిర్మూలన, పర్యావరణ పరిరక్షణ కోసం యువత పోరాడాలని సూచించారు. ప్రజల మధ్య అంతరాలు తొలగాలని, అందరికీ సమాన అవకాశాలు అందాలని అప్పుడే సమాజం సరైన మార్గంలో పయనిస్తుందని అన్నారు. ఆదివారం తెలంగాణ జాగృతి ఆధ్వర్యంలో జరిగిన అంతర్జాతీయ యువ నాయకత్వ సమ్మేళనం ముగింపు కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. వసుధైక కుటుంబ భావన భారత మూలాల్లోనే ఉందన్నారు. ప్రతీ నగరం నాది, ప్రజలందరూ నా వాళ్లే అనే ఐక్యతను జాగృతి ఈ కార్యక్రమం ద్వారా సాధించిందన్నారు. జాగృతి అంటే ప్రజల్లో చైతన్యం తీసుకురావడమని, ప్రజల్లో చైతన్యం తీసుకువస్తున్న కవితకు తన అభినందనలన్నారు. మహాత్మాగాంధీని 150 ఏళ్ల తర్వాత కూడా గుర్తుపెట్టుకుంటున్నారంటే ఆయన ఈ దేశానికి, ప్రపంచానికి, సమాజానికి ఎంత సేవ చేశారో తెలుస్తుందని నరసింహన్ అన్నారు. సుస్థిరాభివృద్ధి అంటే దీర్ఘకాలం పాటు స్థిరంగా అభివృద్ధి చెందడమని గాంధీజీ చెప్పారని గుర్తు చేశారు. ప్రస్తుతం స్థిరమైన శాంతి, సామరస్యం, సంతోషం, అంతా ఒక్కటే అనే భావన, పర్యావరణం అవసరమని తెలిపారు. అహింసా ద్వారా ఏదైనా సాధించవచ్చని బాపూజీ నిరూపించారన్నారు. యువత శాంతిని, అహింసను అలవర్చుకోవాలని పిలుపునిచ్చారు. పేదరికం నిర్మూలించడానికి నాణ్యమైన విద్య అవసరమని, మహిళలు, బాలికలకు విద్యనందించడం చాలా ముఖ్యమన్నారు. ఆరోగ్యమే సంపదను సృష్టిస్తుందని, ప్రజల ఆరోగ్యమే దేశానికి సంపదని, ఇందుకోసం పటిష్ఠమైన చర్యలు తీసుకోవాలన్నారు. మానవులంతా ఒక్కటేనని రంగు, ప్రాంతం, భాష, కులం ఆధారంగా మనుషులను విడదీయకూడదని సమాజమంతా కలిసి మెలిసి జీవించాలన్నారు. ప్రజలను విభజిస్తే అది హింసకు దారితీస్తుందన్నారు. చెట్లు, జంతువులు, నీటిని పరిరక్షించడం భారత సంస్కృతిలో భాగమన్నారు. మహిళాసాధికారత అంటే వారికి సరైన వసతులు, భద్రత, రక్షణ కల్పించడం, వారికి నచ్చినట్లు వారిని ఉండనిస్తే చాలన్నారు. యువత పరిధిని దాటి ఆలోచించి సరికొత్త ఆవిష్కరణలు చేయాలని, సాంకేతికతను సమాజం కోసం మాత్రమే వినియోగించాలని అభిప్రాయపడ్డారు. సాంకేతికత మానవ మేధస్సుకు ప్రత్యామ్నాయం కాదని, అలా చేస్తే భవిష్యత్తులో ఇబ్బందులు తప్పవని గవర్నర్ హెచ్చరించారు.



తెలంగాణ జాగృతి యువ నాయకత్వ సదస్సు వేదికపై గవర్నర్ నరసింహన్, ఎంపీ కవిత మాటామంతి

యువత అంటే యువకులే కాదు

ఇలాంటి సదస్సు జరగడం దక్షిణ భారతదేశంలోనే ప్రథమమని, 2030 నాటికి సుస్థిరాభివృద్ధి లక్ష్యాలను సాధిస్తామని తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు, ఎంపీ కవిత తెలిపారు. సుస్థిరాభివృద్ధి సాధన యువత ద్వారా సాధ్యమవుతుందన్నారు. యువత అంటే యువకుల గురించి మాత్రమే మాట్లాడుతున్నారని, మహిళలు కూడా ఇందులో భాగమేనన్నారు. యువతతో గ్లోబల్ నెట్‌వర్క్‌ను ఏర్పాటు చేసి వారంతా అనుసంధానమయ్యేలా చూస్తామన్నారు. సదస్సులో చర్చించిన అంశాలు ఇక్కడితో వదిలేయకుండా యువత కార్యాచరణలోకి తీసుకురావలన్నారు. భూగోళాన్ని ఆరోగ్యంగా ఉంచాలని, అందరం కలిసి పర్యావరణాన్ని సుసంపన్నం చేయాలని వాటర్ మ్యాన్ ఆఫ్ ఇండియా డా.రాజేంద్రసింగ్ పిలుపునిచ్చారు. గ్లోబల్‌వార్మింగ్ వల్ల నేల, నీరు, జీవజాలం నాశనమవుతుందని ఇక్కడికి వచ్చిన యువత తమ దేశాల్లో పర్యావరణాన్ని ప్రేమించడం నేర్చుకోవాలని ఆయన సూచించారు. అనంతరం డా.రాజేంద్రసింగ్‌కు తెలంగాణ జాగృతి జీవితసాఫల్య పురస్కారాన్ని, ఎవరెస్టు పర్వతాన్ని అధిరోహించిన మలావత్ పూర్ణకు, రెజ్లర్ బబితా కుమారి ఫొగాట్‌లకు తెలంగాణ జాగృతి యూత్ అచీవర్స్ అవార్డులను గవర్నర్ నరసింహన్ అందజేశారు.

మహిళలు అన్ని రంగాల్లో దూసుకెళ్లాలి

- వారికి నిర్ణయ స్వేచ్ఛ ఇవ్వాలి

ఈనాడు డిజిటల్, హైదరాబాద్: మహిళలు అన్ని రంగాల్లో దూసుకుపోవాలని, ప్రపంచమంతటా లింగసమానత్వం రావాలని తెలంగాణ జాగృతి అంతర్జాతీయ నాయకత్వ సదస్సుకు హాజరైన వక్తలు ఆకాంక్షించారు. ఆదివారం 'మహిళా నాయకత్వం, సుస్థిరాభివృద్ధి' అనే అంశంపై చర్చ నిర్వహించారు. మహిళలు నిర్ణయాత్మక పాత్ర పోషించాలన్నారు. వారికి అవకాశమిస్తే సామాజిక న్యాయానికి, శాంతి, సామరస్యానికి కొత్త అర్థాన్నిస్తారన్నారు. బాలికలు, మహిళలను స్వేచ్ఛగా నిర్ణయాలు తీసుకునే హక్కును కుటుంబం ఇవ్వాలని వక్తలు కోరారు. సుస్థిరాభివృద్ధికి మహిళా నాయకత్వం అవసరమని, మహిళలు రాజకీయాల్లో ఉంటే పరిస్థితుల్లో మార్పు వస్తుందని అభిప్రాయపడ్డారు. మహిళా సమస్యలను జాతీయ స్థాయిలో చర్చించాలన్నారు. ఈ చర్చలో ఇంగ్లండ్‌కు చెందిన లేబర్‌పార్టీ ఎంపీ సీమా మల్హోత్ర, జాతీయ బాలల హక్కుల కమిషన్ మాజీ ఛైర్మన్ శాంతాసిన్హా, భారత్, శ్రీలంక, మల్దీవులు, భూటాన్ దేశాల డిప్యూటీ ఐరాస మహిళా ప్రతినిధి నిషితా సత్యం, ఓకినావా, అఫ్గానిస్థాన్‌లో వరల్డ్‌ట్రేడ్ సెంటర్స్ వ్యవస్థాపకులు జాన్ డిక్సన్, తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల బ్రిటన్ డిప్యూటీ హై కమిషనర్ అండ్రూ ఫ్లెమింగ్ తదితరులు పాల్గొన్నారు.



సదస్సులో ప్రసంగిస్తున్న బ్రిటన్ డిప్యూటీ హై కమిషనర్ ఆండ్రూ ఫ్లెమింగ్

కేంద్రం తెలంగాణ ప్రజలకే అనుకూలం

తెరాస పార్టీకి కాదు: భాజపా రాష్ట్ర అధ్యక్షుడు లక్ష్మణ్

ఈనాడు డిజిటల్, హైదరాబాద్: కేంద్ర ప్రభుత్వం రాష్ట్రానికి వ్యతిరేకమని శాసనసభలో ముఖ్యమంత్రి కేసీఆర్ చెప్పడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నట్లు భాజపా రాష్ట్ర అధ్యక్షుడు లక్ష్మణ్ తెలిపారు. మోదీ ప్రభుత్వం తెలంగాణ ప్రజలకు అనుకూలమే తప్ప తెరాస పార్టీకి కాదన్నారు. కేంద్రం నిధులు ఇచ్చినా ఖర్చుపెట్టలేని స్థితిలో ఉన్న కేసీఆర్, అనవసర నిందలు మోపడం సరికాదన్నారు. జాతీయ ఆరోగ్య పథకం నిధులు ఖర్చు పెట్టకపోవడం, ఆయుష్మాన్‌భవ పథకాన్ని రాష్ట్రంలో అమలు చేయకపోవడంపై ప్రజలకు సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. ఇప్పటి వరకు రాష్ట్రానికి కేటాయించిన నిధులపై చర్చకు తాను సిద్ధంగా ఉన్నానని సవాల్ విసిరారు. ఇకనైనా నిందలు మానుకొని, కేంద్రం నుంచి రాష్ట్రానికి వచ్చిన నిధులపై శ్వేతపత్రం విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ లక్ష్మణ్ ఆదివారం ఒక ప్రకటన విడుదల చేశారు.

మోదీ ఒక్కరే లీడర్

దేశంలో ప్రధాని నరేంద్ర మోదీ ఒక్కరే లీడర్, మహాకూటమి నేతలంతా డీలర్స్ అని భాజపా జాతీయ అధికార ప్రతినిధి సంబిద్‌పాత్రా పేర్కొన్నారు. నాంపల్లిలోని భాజపా రాష్ట్ర కార్యాలయంలో ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. వచ్చే ఎన్నికల్లో లీడర్, డీలర్స్‌కు మధ్యే పోటీ ఉంటుందన్నారు. ఎంఐఎంకు ఉన్న ఒక్క ఎంపీ ప్రధానిని విమర్శిస్తూ, దేశంలో ప్రజాస్వామ్యం లేదనడం హాస్యాస్పదంగా ఉందన్నారు.

వచ్చే నెల 10న జాతీయ మహిళా సదస్సు

ఫిబ్రవరి 10వ తేదీన హైదరాబాద్‌లో జాతీయ మహిళా సదస్సును నిర్వహించనున్నట్లు భాజపా జాతీయ మహిళా మోర్చా అధ్యక్షురాలు విజయ రహత్‌కర్ ప్రకటించారు. భాజపా రాష్ట్ర కార్యాలయంలో ఆదివారం ఆమె విలేకరులతో మాట్లాడారు. కేంద్ర పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు మహిళా మోర్చా కృషి చేస్తోందని చెప్పారు. ఇందులో భాగంగా అంగన్‌వాడీ కార్యకర్తలు, స్వచ్ఛంద సంస్థల సభ్యులను కలిసేందుకు 'కమల శక్తి" పేరిట త్వరలో కార్యక్రమాన్ని ప్రారంభిస్తామని వెల్లడించారు.

దేశానికే ఆదర్శంగా రైతుబంధు

జనగామ ఎమ్మెల్యే ముత్తిరెడ్డి యాదగిరిరెడ్డి

ఈనాడు డిజిటల్, హైదరాబాద్: తెలంగాణ ప్రభుత్వం అమలు చేస్తోన్న రైతుబంధు పథకం దేశానికే ఆదర్శంగా నిలిచిందని, ఇతర రాష్ట్రాలూ ఈ పథకాన్ని అమలు చేసేందుకు సిద్ధంగా ఉన్నాయని జనగామ ఎమ్మెల్యే ముత్తిరెడ్డి యాదగిరిరెడ్డి అన్నారు. ఆదివారం శాసనసభ మీడియా పాయింట్‌లో ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. ఉమ్మడి రాష్ట్రంలో గత ప్రభుత్వాలు చేయలేని అభివృద్ధి పనులను తెరాస సర్కారు చేసి చూపించినందునే ప్రజలు మరోసారి పట్టం కట్టారని తెలిపారు. గవర్నర్ ప్రసంగం ఆశాజనకంగా ఉందన్నారు.

ఉదయ సముద్రం ప్రాజెక్టును పూర్తి చేయాలి

నకిరేకల్ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య

ఈనాడు డిజిటల్, హైదరాబాద్: తమ నియోజకవర్గంలోని ఉదయ సముద్రం ప్రాజెక్టును తక్షణమే పూర్తిచేయాలని ముఖ్యమంత్రి కేసీఆర్‌కు విన్నవించినట్లు నకిరేకల్ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య తెలిపారు. ఆదివారం శాసనసభ మీడియా పాయింట్‌లో ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. ధర్మారెడ్డి, పిల్లాయిపల్లి కాల్వలకు త్వరగా భూసేకరణ ప్రక్రియ పూర్తిచేయాలని సీఎంను కోరినట్లు చెప్పారు. వచ్చేనెల 12న నార్కట్‌పల్లి మండలం చెరువుగట్టులోని పార్వతీ జడల రామలింగేశ్వర స్వామి బ్రహ్మోత్సవాలకు కేసీఆర్‌ను ఆహ్వానించినట్లు తెలిపారు. కృష్ణా నదిపై సోమశిల సిద్దేశ్వరం వంతెన నిర్మించాలని సీఎంను కోరినట్లు కొల్లాపూర్ ఎమ్మెల్యే హర్షవర్ధన్‌రెడ్డి తెలిపారు. ముఖ్యమంత్రి సానుకూలంగా స్పందించి వంతెన నిర్మాణానికి హామీ ఇచ్చారని వెల్లడించారు.

ఎన్నికల్లో ఓటమికి ఉత్తమ్ కారణం కాదు

సంగారెడ్డి ఎమ్మెల్యే జగ్గారెడ్డి

హైదరాబాద్, న్యూస్‌టుడే: ఎన్నికల్లో పార్టీ ఓటమికి టీపీసీసీ అధ్యక్షుడు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి కారణం కానే కాదని ఎమ్మెల్యే జగ్గారెడ్డి స్పష్టం చేశారు. ఆయన సమర్థమంతంగానే పని చేసినా పరిస్థితులు అనుకూలించలేదని, మరో ఐదేళ్లు ఉత్తమ్‌ను పీసీసీ అధ్యక్షునిగా కొనసాగించినా తప్పేమి లేదన్నారు. సీఎల్పీ కార్యాలయంలో ఆదివారం ఆయన మీడియాతో మాట్లాడారు. భట్టి విక్రమార్కకు సీఎల్పీ నాయకునిగా ఏఐసీసీ అధ్యక్షుడు రాహుల్‌గాంధీ మంచి అవకాశం ఇచ్చారని, కేసీఆర్‌ను సమర్థంగా ఎండగడితే ఆయన విజయవంతం అవుతారని జగ్గారెడ్డి అభిప్రాయపడ్డారు. ఎన్నికలకు ముందు ఉత్తమ్‌ను పొగిడిన సర్వే సత్యనారాయణ.. ఇప్పుడెలా పనికిరారంటారని ప్రశ్నించారు. చంద్రబాబు జాతీయ స్థాయి నాయకుడని, ఏపీకి రెండోసారీ ఆయనే సీఎం అవుతారని జగ్గారెడ్డి జోస్యం చెప్పారు. మెదక్ ఎంపీ సీటు తన భార్యకు ఇవ్వాలని అధిష్ఠానాన్ని కోరుతున్నానని, విజయశాంతి పోటీ చేస్తానంటే తనకు అభ్యంతరం లేదన్నారు.

నైపుణ్యంతోనే ఉపాధికి భరోసా

- ఉద్యోగాలు కల్పించే స్థాయికి యువత ఎదగాలి
- తెలంగాణ జాగృతి యువ నాయకత్వ సదస్సులో వక్తలు

ఈనాడు, హైదరాబాద్: యువత ఎప్పటికప్పుడు నైపుణ్య శిక్షణ పొందాలని, అప్పుడే ఉపాధికి భరోసా లభిస్తోందని వక్తలు పేర్కొన్నారు. మహిళలకు సమానత్వం కోసం రిజర్వేషన్లు కల్పించినప్పటికీ సంప్రదాయ ఆంక్షలు, అడ్డంకులు తొలగించినపుడే అభివృద్ధి సాధ్యమన్నారు. తెలంగాణ జాగృతి యువ నాయకత్వ సదస్సులో 'యువ నాయకత్వం- అంతర్జాతీయ ఆవిష్కరణలు' అంశంపై నిర్వహించిన కార్యక్రమంలో పలువురు వక్తలు మాట్లాడారు. యువత అభివృద్ధిలో లింగవివక్ష లేకుండా అందరినీ ఒకేగొడుగు కిందకు తీసుకువచ్చే విధానాలు అమలు చేయాలని అన్‌జెండర్ సీఈవో పల్లవి పరీక్ అన్నారు. ప్రస్తుతం డిగ్రీలు కేవలం విద్యార్హతగా మారిపోయాయని, యువత విద్యావ్యవస్థలో సంస్కరణలు జరిగే వరకు ఎదురుచూడకుండా నైపుణ్య శిక్షణ పొందాలన్నారు. తద్వారా సొంతగా ఉద్యోగాలు పొందవచ్చన్నారు. యువతకు నూతన సాంకేతిక అంశాలపై నైపుణ్య శిక్షణ అందించి, భారీగా ఉద్యోగావకాశాలు లభించేలా విధానాలు రూపొందించాలని కామన్‌వెల్త్ యూనివర్సిటీస్ దక్షిణాసియా విభాగాధిపతి ఆదిత్య మల్కాని పేర్కొన్నారు. అదే సమయంలో అన్ని రంగాల్లోనూ మహిళలకు ప్రభుత్వాలు సమాన భాగస్వామ్యం, హక్కులు కల్పించాలని కోరారు. యువత ఉద్యోగాలు కల్పించేస్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు. విద్య, నిరుద్యోగానికి మధ్య అంతరాన్ని యువతకు నైపుణ్య శిక్షణ కల్పించడం ద్వారా ప్రభుత్వాలు పరిష్కరించాలని కోస్టారికా ఒమర్ డింగో ఫౌండేషన్ సామాజిక ఆవిష్కరణ అధికారి రోనాల్డ్ సేగురా, గ్లోబల్‌పాలసీ పరిశోధన సమన్వయకర్త విక్టోరియా ఎమ్స్ సూచించారు.

ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబుతో సినీనటుడు అలీ భేటీ

ఈనాడు, అమరావతి: సినీ హాస్యనటుడు అలీ ఆదివారం ఉండవల్లిలోని నివాసంలో ఏపీ సీఎం చంద్రబాబు నాయుడుతో భేటీ అయ్యారు. సుమారు 30 నిమిషాలపాటు సీఎంతో ఆయన చర్చలు జరిపారు. అలీ తెదేపాలో చేరుతారని ప్రచారం జరుగుతోంది. గుంటూరు తూర్పు అసెంబ్లీ నియోజకవర్గం నుంచి తెదేపా తరఫున ఆయన టికెట్టు ఆశిస్తున్నట్లు సమాచారం.

సంప్రదాయ ఆటలను ప్రోత్సహించాలి

- సాంకేతికత వినోదాన్ని మాత్రమే పంచగలదు
- క్రీడా మౌలికాలపై ప్రభుత్వాలు పెట్టుబడులు పెంచాలి
- బాడ్మింటన్ కోచ్ పుల్లెల గోపీచంద్

ఈనాడు, హైదరాబాద్: పిల్లలు ఇంటినుంచి బయటకు వెళ్లి సంప్రదాయ క్రీడలు ఆడుకునే పరిస్థితులు దూరమయ్యాయని బ్యాడ్మింటన్ జాతీయ కోచ్ పుల్లెల గోపీచంద్ ఆందోళన వ్యక్తం చేశారు. క్రీడల్లో పాల్గొనే పిల్లలు, యువత మెదడు చురుగ్గా పనిచేస్తుందని, అలాంటివారే పరీక్షల్లో ఎక్కువ మార్కులు పొందే అవకాశాలున్నట్లు అనేక నివేదికలు వెల్లడిస్తున్నాయన్నారు. ప్రభుత్వాలు క్రీడామౌలిక సదుపాయాలపై పెట్టుబడులు పెట్టకుంటే.. భవిష్యత్తులో వైద్య సేవలకు అధికంగా ఖర్చు చేయాల్సి ఉంటుందని హెచ్చరించారు. ప్రస్తుత పోటీ ప్రపంచంలో సంప్రదాయ క్రీడలను మరిచిపోయామని, వీటిని ప్రోత్సహించాల్సిన అవసరముందన్నారు. సాంకేతిక పరిజ్ఞానం వినోదాన్ని మాత్రమే పంచగలదని, పాఠశాలస్థాయి నుంచే క్రీడల్లో పాల్గొనేలా తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, శిక్షకులు ప్రోత్సహించాలని పిలుపునిచ్చారు. తెలంగాణ జాగృతి అంతర్జాతీయ యువ నాయకత్వ సదస్సులో "యువత అభివృద్ధిలో అవరోధాలు: విజయాలు, కారణాలు" అంశంపై జరిగిన కార్యక్రమంలో మలావత్ పూర్ణ, ఎంపీ కవిత, ప్రముఖ రెజ్లర్ బబితకుమారి ఫొగాట్‌తో కలిసి ఆయన చర్చలో పాల్గొన్నారు. 'యువత క్రీడల్లో పాల్గొనేలా చట్టాలు చేయాలి. రెజ్లింగ్, బాక్సింగ్, ఖోఖో, కబడ్డీ, హాకీ లాంటి చేతులు, కర్రలతో ఆడే సంప్రదాయ ఆటలను, మూలాలను ప్రపంచక్రీడల ఆలోచనలో మరిచిపోయాం. జీవవైవిధ్యం ద్వారా సుస్థిరమైన అభివృద్ధి, సమాజాన్ని పొందవచ్చు. ఇప్పుడు పిల్లలు బయటకు వెళ్లి మైదానాల్లో అందరితో ఆడుకునే పరిస్థితులు లేవు. ఈ తరహా సౌకర్యాలు కల్పించాల్సిన అవసరముంది. నూతన సాంకేతికత అందుబాటులోకి వచ్చాక యువత, పెద్దలకు మరింత సమయం మిగులుతోంది. వీరంతా క్రీడలు, శారీరక ఆరోగ్యానికి ప్రాధాన్యం ఇవ్వాలి. పిల్లల కన్నా పెద్దలు క్రీడల్లో పాల్గొనడం ద్వారా 370 శాతం ఎక్కువగా సంతోషిస్తారు." అని గోపీచంద్ తెలిపారు. భవిష్యత్తులో అన్ని ఖండాల్లోని ఎత్తైన పర్వతాలను అధిరోహిస్తానని మలావత్ పూర్ణ పేర్కొన్నారు. సివిల్ సర్వీసెస్‌లో చేరడమే తన లక్ష్యమని చెప్పారు.



నిజమే.. అబ్బాయిలతో కుస్తీ పోటీల్లో పాల్గొన్నా

అమ్మాయిలకు ఆత్మవిశ్వాసం, తల్లిదండ్రుల అండ ఉంటే ప్రపంచమంతా వ్యతిరేకంగా ఉన్నా అనుకున్నది సాధించగలరు. రెజ్లింగ్‌లో పతకాలు సాధించి, మీ ముందు ఈ పరిస్థితుల్లో ఉన్నామంటే అమ్మానాన్నల ప్రోత్సాహమే కారణం. అమ్మాయిలమైనప్పటికీ రెజ్లర్ కావాలనే ఆలోచనను మాలో నాన్న కలిగించారు. ఆది, సోమవారాలు తేడా లేకుండా శిక్షణతో ఒక్కోసారి ఏడుపు వచ్చేది. ఇంతగా కష్టపడాలా? మేమూ మనుషులమే.. మాకు కొంత విశ్రాంతి కావాలని మా అమ్మను అడిగేవాళ్లం. అప్పుడు అమ్మ చెప్పేది..."రెండేళ్లు కష్టపడు. ఆ తరువాత మీరు లక్ష్యాన్ని చేరుకుని విజయవంతమవుతారు. అప్పుడు శిక్షణ కోసం మిమ్మల్ని బలవంతం చేసే అవకాశం ఉండదు. జీవితాల్లో నిలదొక్కుకుంటారు" అని. అమ్మ చెప్పిన మరో రెండేళ్లు అనే మాటే మమ్మల్ని ఈ స్థాయికి తీసుకువచ్చింది.



సినిమాల్లో చూపించినట్లు నిజ జీవితంలో బాలురతో కుస్తీపోటీల్లో పాల్గొన్నారా? అని ప్రతినిధులు అడగిన ప్రశ్నకు వాస్తవమే అని సమాధానమిచ్చారు. శిక్షణలో అబ్బాయిలతో పోటీపడేవాళ్లమని చెప్పారు.

- బబిత కుమారి ఫొగాట్, ప్రముఖ రెజ్లర్



హైదరాబాద్‌లోని నార్సింగిలో తెలుగు సంగమం సంస్థ ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన సంక్రాంతి సమ్మేళనంలో నటి జమున, మాడుగుల నాగఫణిశర్మను సత్కరిస్తున్న భాజపా జాతీయ ప్రధాన కార్యదర్శి మురళీధర్‌రావు. పక్కన పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు లక్ష్మణ్, బాబూమోహన్, దర్శకులు కోదండరామిరెడ్డి, కె.రాఘవేంద్రరావు, సినీ నటి కవిత, కిషన్‌రెడ్డి

'చిన్నమ్మ'కు శస్త్ర చికిత్స

కోలుకుంటున్న నిర్మలా వసంత్



ఫిలింనగర్, న్యూస్‌టుడే: 'ఆకాశవాణి' పాడి-పంట కార్యక్రమంలో చిన్నమ్మగా శ్రోతలకు చిరపరిచితమైన నిర్మలా వసంత్ (72)కు ఆదివారం హైదరాబాద్ జూబ్లీహిల్స్‌లోని అపోలో ఆసుపత్రిలో వైద్యులు శస్త్ర చికిత్స చేశారు. కొద్ది రోజులుగా అనారోగ్యంతో బాధపడుతున్న ఆమెను శనివారం కుటుంబ సభ్యులు అపోలో ఆసుపత్రిలో చేర్పించారు. కాలికి తీవ్ర ఇన్‌ఫెక్షన్ సోకడంతో ఐసీయూలో ఉంచి శస్త్రచికిత్స చేయాల్సి వచ్చిందని వైద్యులు తెలిపారు. ఆమె ఆరోగ్యం కుదుటపడుతోందని నిర్మలా వసంత్ కుమార్తె డా.సౌందర్య వెల్లడించారు.

ఉగ్రవాదంపై ముమ్మరపోరు

- ప్రపంచ దేశాలకు
వెంకయ్య నాయుడు పిలుపు

గాంధీనగర్: మానవాళి ప్రస్తుతం ఎదుర్కొంటున్న ఉగ్రవాదం, వాతావరణ మార్పులు, అవినీతి అనే మూడు సమస్యలపై అన్ని దేశాలు కలిసికట్టుగా పోరాడాలని ఉపరాష్ట్రపతి వెంకయ్య నాయుడు పిలుపునిచ్చారు. ఇక్కడ జరుగుతున్న ఉజ్వల గుజరాత్ సదస్సులో ఆదివారం ఆయన ప్రసంగిస్తూ ఉగ్రవాద నిర్మూలనకు ఉమ్మడి కృషి అత్యవసరమని చెప్పారు. "ప్రపంచం మొత్తం ప్రశాంతంగా ఉండాలి. అభివృద్ధి జరగాలంటే తొలుత శాంతి నెలకొనాలి. ఉగ్రవాదం మానవత్వానికి వ్యతిరేకం. ఉగ్రవాదానికి మతం లేదు. దీనిని కూకటివేళ్లతో సహా పెకిలించడానికి దేశాలన్నీ కలిసి రావాలి" అని సూచించారు. వాతావరణ మార్పులు కూడా మరో పెద్ద సమస్య అని, దీన్ని కనిష్ఠస్థాయికి తీసుకొని రావాల్సి ఉందని తెలిపారు. ఇందులో భాగంగా భారత్




గాంధీనగర్‌లో 'వైబ్రెంట్ గుజరాత్' సదస్సులో పాల్గొన్న ఉప రాష్ట్రపతి ఎం.వెంకయ్యనాయుడు, గుజరాత్ గవర్నర్ ఓం ప్రకాశ్ కోహ్లి, ముఖ్యమంత్రి విజయ్ రూపాణీ తదితరులు

చొరవతో ఏర్పాటయిన అంతర్జాతీయ సౌరవిద్యుత్తు కూటమి పాత్రను ఆయన ప్రశంసించారు. అవినీతి అన్ని వ్యవస్థలను తినేస్తోందని, దీన్ని అరికట్టడానికి కూడా అన్ని దేశాలు పరస్పరం సహకరించుకోవాలని కోరారు. ఆర్థిక నేరగాళ్లకు చెందిన బ్యాంకు ఖాతాల సమాచారాన్ని ఇచ్చిపుచ్చుకోవాలని సూచించారు. ఈ మూడు పెద్ద సమస్యలను ఎదుర్కోవడంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని కోరారు. గత 15 ఏళ్లలో భారత్ అభివృద్ధి కేవలం పరిశ్రమలకే పరిమితం కాలేదని; వ్యవసాయం, మౌలిక రంగాలు, గ్రామీణ అభివృద్ధి, ఐటీ రంగాల్లోనూ విస్తరించిందని వెంకయ్య నాయుడు తెలిపారు. ఇతర దేశాలతో కేవలం వాణిజ్యం, పెట్టుబడులకే పరిమితం కాకుండా సహకారం, విశ్వాసంతో దీర్ఘకాలిక సంబంధాలను పెంచుకోవాలని భారత్ భావిస్తోందని చెప్పారు. గత కొన్నేళ్లుగా ప్రభుత్వం చేపట్టిన సంస్కరణల కారణంగా పెద్దయెత్తున విదేశీ పెట్టుబడులు వస్తున్నాయని తెలిపారు. స్థిరాస్తి నుంచి ఆరోగ్యం వరకు అన్ని రంగాల్లో విదేశీ పెట్టుబడులు పెట్టడానికి ఇదే మంచి తరుణమని చెప్పారు.

వెలకట్టలేనిది ఐక్యతా విగ్రహం

అంతకుముందు ఉపరాష్ట్రపతి కేవడియాలోని 182 అడుగుల సర్దార్ వల్లభభాయ్ పటేల్ విగ్రహాన్ని సందర్శించారు. ఇది వెలకట్టలేనిదని, అంత పెట్టుబడి పెట్టడానికి అర్హమైనదేనని వ్యాఖ్యానించారు. "ఆధునిక భారత దేశ నిర్మాణంలో సర్దార్ పటేల్ ప్రదర్శించిన ధైర్యం, దూరదృష్టిలకు ఈ ఐక్యతా విగ్రహం చిహ్నంలాంటిది" అని చెప్పారు. చరిత్ర నమోదులో జరిగిన ఒక లోపాన్ని సరిదిద్దినట్టు అయిందని తెలిపారు. ఒక రైతు ఆధునిక భారత రూపకర్తగా నిలిచారని, ఇది అందరికీ గర్వకారణమని ప్రశంసించారు. "నా హృదయం భావోద్వేగం, గర్వంతో నిండిపోయింది. సర్దార్ పటేల్ వారసత్వానికి గుర్తుగా మనకు భారీ విగ్రహం ఉంది" అని వ్యాఖ్యానించారు.

ఉరకలెత్తిన పరుగు



ముంబయిలో ఆదివారం నిర్వహించిన మారథాన్‌లో బాలీవుడ్ తారలు మొదలుకొని క్రీడాకారుల వరకు చిన్నాపెద్దా అందరూ పాలుపంచుకున్నారు. వీరి పరుగుతో బాంద్రా-వర్లీ వంతెన ఇలా కళకళలాడింది.

మరో ప్రతిపాదనతో ట్రంప్

- తిరస్కరించిన డెమొక్రాట్లు

వాషింగ్టన్: అమెరికాలో ప్రభుత్వ షట్‌డౌన్ కారణంగా నెలకొన్న ప్రతిష్టంభనకు తెరదించేందుకు దేశాధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ సరికొత్త ప్రతిపాదనతో ముందుకొచ్చారు. మెక్సికోతో సరిహద్దుల్లో గోడ నిర్మాణం కోసం తాను డిమాండ్ చేస్తున్న నిధులను కేటాయిస్తే, సరైన పత్రాల్లేకుండానే అమెరికాలోకి ప్రవేశించిన డ్రీమర్లు, మరికొంతమంది వలసదారులకు ఉపశమనం కల్పిస్తానని ప్రతిపాదించారు. దేశం నుంచి వెంటనే బయటకు పంపకుండా వారికి తాత్కాలిక రక్షణ కల్పిస్తామని తెలిపారు. ఆయన ప్రతిపాదనను డెమొక్రాట్లు తిరస్కరించారు.

చిన్నతనంలోనే తల్లిదండ్రులతో కలిసి అమెరికాలోకి అక్రమంగా ప్రవేశించినవారిని 'డ్రీమర్లు'గా పిలుస్తారు. సరిహద్దు గోడ నిర్మాణం కోసం తాను డిమాండ్ చేస్తున్న 570 కోట్ల డాలర్లను కాంగ్రెస్ కేటాయిస్తే.. ప్రకృతి విపత్తులు, హింస కారణంగా స్వదేశాలను వీడి అమెరికాలో తాత్కాలిక రక్షణ హోదా(టీపీఎస్) పొందినవారితోపాటు డ్రీమర్లను దేశం నుంచి వెళ్లగొట్టకుండా మూడేళ్లపాటు ఉపశమనం కల్పిస్తానని ట్రంప్ శనివారం ప్రతిపాదించారు. దీనివల్ల ఏడు లక్షలమంది డ్రీమర్లు, మూడు లక్షలమంది టీపీఎస్‌దారులకు లబ్ధి చేకూరుతుందని చెప్పారు. డ్రీమర్లు ఉద్యోగాలు చేసుకునేందుకు అనుమతులు లభిస్తాయని వివరించారు. దేశంలో ప్రస్తుతం నెలకొన్న సంక్షోభాన్ని తొలగించేందుకే ఈ రాజీ ప్రతిపాదనతో తాను ముందుకొచ్చానని, దానికి రిపబ్లికన్లు-డెమొక్రాట్లు సంయుక్తంగా మద్దతు పలకాలని ట్రంప్ పిలుపునిచ్చారు. 'అత్యవసర మానవీయ సహాయం' కింద 80 కోట్ల డాలర్లు, ఓడరేవుల్లో మాదకద్రవ్యాలను గుర్తించే సాంకేతికత కోసం 80.5 కోట్ల డాలర్లు కేటాయించాలని కూడా ఆయన కోరారు. సరిహద్దు భద్రత, పోలీసు వ్యవస్థలను మరింత బలోపేతం చేసుకోవాల్సిన ఆవశ్యకతను నొక్కిచెప్పారు.



శ్వేతసౌధంలో విలేకరులతో మాట్లాడుతున్న అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్

గతంలో తిరస్కరించినవే: డెమొక్రాట్లు

ట్రంప్ ప్రతిపాదనను తాము అంగీకరించే ప్రసక్తే లేదని డెమొక్రాట్లు తేల్చిచెప్పారు. గతంలో తిరస్కరించిన పలు అంశాలను ట్రంప్ మళ్లీ ఈ ప్రతిపాదన రూపంలో ఒక్కచోటికి చేర్చి తమ ముందుకు తీసుకొచ్చారని ప్రతినిధుల సభ స్పీకర్ నాన్సీ పెలోసీ విమర్శించారు. సెనేట్ మైనారిటీ నేత చుక్ షూమర్ కూడా ట్రంప్ ప్రతిపాదనను వ్యతిరేకించారు. అమెరికా ప్రభుత్వ షట్‌డౌన్ ఆదివారంతో 30వ రోజుకు చేరుకుంది.

పాక్‌లో ఎన్‌కౌంటర్ ప్రకంపనలు

- మృతుల్లో ముగ్గురు ఐసిస్ ఉగ్రవాదులు కారు
- విచారణకు ఆదేశించిన ప్రధాని

లాహోర్: పాకిస్థాన్‌లో నలుగురి ప్రాణాలను హరించిన ఎన్‌కౌంటర్ దేశవ్యాప్తంగా ప్రకంపనలు సృష్టించింది. మృతుల్లో ముగ్గురు ఐసిస్ ఉగ్రవాద ముఠా సభ్యులు కారని అధికారులు అంగీకరించారు. ఈ ఎన్‌కౌంటర్‌లో పాల్గొన్న 16 మంది భద్రతా సిబ్బందిని అరెస్టు చేశారు.

లాహోర్‌కు 200 కిలోమీటర్ల దూరంలో సాహివాల్ హైవేపై ఈ ఎన్‌కౌంటర్ జరిగింది. ఇందులో లాహోర్‌కు చెందిన మహ్మద్ ఖలీల్ (42), ఆయన భార్య నబిలా (38), కుమార్తె అరీబా (13), స్నేహితుడు జీషన్ జావెద్ చనిపోయారు. ఖలీల్ కుమారుడికి తూటా గాయాలయ్యాయి. మరో ఇద్దరు కుమార్తెలు క్షేమంగా తప్పించుకున్నారు. వీరంతా జీషన్ కారులో బురేవాలాలో జరిగిన ఒక వివాహానికి వెళ్లి వస్తున్నారు. అయితే జీషన్ ఐసిస్ ముఠా సభ్యుడని ఈ ఎన్‌కౌంటర్‌ను నిర్వహించిన ఉగ్రవాద నిరోధక విభాగం పేర్కొంది. కాల్పుల్లో అతడు హతమయ్యాక ముఠాలోని మిగతా సభ్యులను అజ్ఞాతంలోకి వెళ్లిపోవాల్సిందిగా అఫ్గానిస్థాన్ నుంచి ఫోన్‌కాల్ వచ్చిందని తెలిపింది. ఇద్దరు మహిళలు సహా నలుగురు ఐసిస్ ఉగ్రవాదులు హతమయ్యారని తొలుత పోలీసులు పేర్కొన్నారు. అయితే ఆదివారం తమ ప్రకటనను వెనక్కి తీసుకున్నారు. ఖలీల్ కుటుంబ సభ్యులు అమాయకులని అంగీకరించారు. జీషన్ గురించి వీరికి తెలియదని చెప్పారు. ఉగ్రవాద నెట్‌వర్క్‌కు మందుగుండు సామగ్రిని జీషన్ సరఫరా చేస్తుంటాడని తెలిపారు. శనివారం కూడా ఆయుధాలు, పేలుడు పదార్థాలను సరఫరా చేయడానికి ఖలీల్ కుటుంబాన్ని తన కారులో ఎక్కించుకున్నాడని చెప్పారు. మహిళలు, చిన్నారులు ఉన్న వాహనాన్ని పోలీసులు తనిఖీ చేయరన్న ధీమాతో అలా చేశాడని వివరించారు. అయినా ఆ కారును తాము ఆపడానికి ప్రయత్నించినప్పుడు జీషన్ తొలుత కాల్పులు జరిపాడని పేర్కొన్నారు. తాము జరిపిన ఎదురుకాల్పుల్లో అతడితోపాటు ఖలీల్ కుటుంబంలోని ముగ్గురు చనిపోయారని తెలిపారు. మరోవైపు ఈ ఎన్‌కౌంటర్‌పై ప్రజలు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఖలీల్ కుటుంబ సభ్యులను పట్టుకొని కాల్చేశారని బంధువులు, ప్రత్యక్ష సాక్షులు ఆరోపించారు. ఎన్‌కౌంటర్‌పై ప్రతిపక్షాలు మండిపడ్డాయి. ప్రధాని ఇమ్రాన్ ఖాన్ సంతాపం తెలిపారు. ఈ ఘటనపై దర్యాప్తునకు ఆదేశించారు. నివేదిక వచ్చాక బాధ్యులపై చర్యలు తీసుకుంటామన్నారు.

నేపాల్, భూటాన్‌లకు 'ఆధార్'తో వెళ్లొచ్చు

15 ఏళ్ల వయస్సు లోపు, 65 ఏళ్ల పైబడిన భారతీయులకు వెసులుబాటు

దిల్లీ: ఆధార్ కార్డుకు మరో ప్రయోజనం కల్పిస్తూ కేంద్ర హోంశాఖ ఆదేశాలు జారీ చేసింది. 15 ఏళ్ల వయస్సు లోపు, 65 ఏళ్ల పైబడ్డ భారతీయులు నేపాల్, భూటాన్ దేశాలకు వెళ్లాలనుకుంటే ఇవి గుర్తింపు కార్డుల మాదిరిగా ఉపయోగపడతాయి. మిగిలిన వయసుల వారు వాటిని గుర్తింపు పత్రాలుగా ఉపయోగించడానికి వీల్లేదు. ఈ రెండు పొరుగు దేశాలకు వెళ్లే భారతీయులకు వీసా అవసరం లేదు. పాసుపోర్టు, ఓటరు కార్డు/పాన్‌కార్డులాంటి ఫొటో గుర్తింపు కార్డు ఉంటే సరిపోతుంది. తాజాగా ఈ జాబితాలో ఆధార్ కార్డు చేరింది. 15 ఏళ్ల వయస్సు లోపు, 65 ఏళ్ల పైబడ్డ భారతీయులు ఆధార్‌ను గుర్తింపు పత్రంగా చూపించొచ్చు. భారత పౌరులకు కాఠ్‌మాండూలోని భారత రాయబార కార్యాలయం ఇచ్చే రిజిస్ట్రేషన్ ధ్రువపత్రం ఆధారంగా ఇకపై రెండు దేశాల మధ్య ప్రయాణించడానికి వీల్లేదు. అయితే నేపాల్‌లోని భారతీయులు అత్యవసరంగా భారత్ రావాల్సిన సమయంలో రాయబార కార్యాలయం ఇచ్చే అత్యవసర ధ్రువపత్రం, గుర్తింపు ధ్రువపత్రం ఆధారంగా ఒకవైపు ప్రయాణం చేయవచ్చు. భారత్, నేపాల్ మధ్య ప్రయాణించాలనుకునే రెండు దేశాల్లోని 15-18 ఏళ్లలోపు విద్యార్థులకు ఆయా పాఠశాలల ప్రిన్సిపాళ్లు ఇచ్చే ధ్రువపత్రం సరిపోతుంది. కుటుంబం అంతా కలిసి వెళ్తున్నప్పుడు అందరికీ కాకుండా ఒక్కరికి పాస్‌పోర్టు, ఫొటో గుర్తింపు కార్డు ఉన్నా చాలు.

శబరిమల ఆలయం మూసివేత

శబరిమల/తిరువనంతపురం: తిరువాభరణం, మకరజ్యోతి దర్శనం తదితర కార్యక్రమాల అనంతరం శబరిమలలో 67 రోజుల ప్రత్యేక సీజన్ పరిసమాప్తం కావడంతో ఆదివారం ఉదయం 6 గంటల 15 నిముషాలకు ఆలయ గర్భగుడిని మూసివేశారు. అంతకుముందు సంప్రదాయానుసారం 'భస్మాభిషేకం' నిర్వహించారు. పందలం రాజకుటుంబ వారసులైన పి.రాఘవ వర్మ రాజా దర్శనం చేసుకున్న తర్వాతే ఈ కార్యక్రమాలు జరిగాయి. తిరిగి ఫిబ్రవరి 13వ తేదీన 'కుంభం' పూజల నిమిత్తం ఆలయాన్ని తెరుస్తారు.

త్వరలోనే 'సైజ్ ఇండియా' పథకం!

- మంత్రి స్మృతి ఇరానీ వెల్లడి

గాంధీనగర్: భారతీయ రెడీమేడ్ దుస్తుల పరిశ్రమకు ఇప్పుడిక సొంత ప్రామాణిక కొలతలు రానున్నాయి. అందులో భాగంగానే దేశవ్యాప్తంగా వర్తించేలా 'సైజ్ ఇండియా' పథకం త్వరలోనే అమల్లోకి రాబోతోంది. కేంద్రమంత్రి స్మృతి ఇరానీ ఈ విషయాన్ని ఆదివారం నాడిక్కడ వెల్లడించారు. రెడీమేడ్ దుస్తుల విషయానికి వస్తే అమెరికా, బ్రిటన్ తదితర దేశాలకు వాటికంటూ నిర్దేశిత కొలతలు ప్రత్యేకంగా ఉన్నాయి. ఉదాహరణకు 42, 44, ఎక్స్‌ఎల్ వంటి సైజులనే తీసుకుంటే...వాటికి మనవైన నిర్దేశిత కొలతలంటూ ప్రత్యేకించి లేవు. ఇప్పుడా కొరత తీరనుంది. త్వరలోనే భారతీయ జౌళి, రెడీమేడ్ దుస్తుల పరిశ్రమ కూడా ప్రామాణిక కొలతలను సొంతం చేసుకోనుంది. 'సైజ్ ఇండియా' పథకానికి సంబంధించి అధ్యయనం కూడా చేపట్టనున్నట్లు మంత్రి చెప్పారు.

అది అస్థిర అవినీతి కూటమి

- ప్రతిపక్షాలపై మరోసారి ధ్వజమెత్తిన ప్రధాని

ముంబయి, మార్గోవా: తనకు వ్యతిరేకంగా కూటమి కడుతున్న విపక్షాలపై ప్రధాని నరేంద్ర మోదీ మరోసారి విరుచుకుపడ్డారు. ఆ పార్టీలకు ధన్‌శక్తి (ధనబలం) ఉంటే భాజపాకి జన్‌శక్తి (జన బలం) ఉందని చెప్పారు. మహారాష్ట్రలోని నాలుగు లోక్‌సభ నియోజకవర్గాలతోపాటు దక్షిణ గోవా నియోజకవర్గానికి చెందిన పోలింగ్ బూత్ స్థాయి కార్యకర్తలతో ఆదివారం ఆయన ప్రత్యక్ష ప్రసార సదస్సు విధానంలో మాట్లాడుతూ... కోల్‌కతాలో విపక్షాల నేతలు చేతులు కలపడాన్ని ఎద్దేవా చేశారు. సార్వత్రిక ఎన్నికల్లో విపక్షాలకు ఓటమి తప్పదని, దానికి సాకులు వెతకడంలో భాగంగానే నెపాన్ని ఈవీఎంలపైకి నెట్టివేసే ప్రయత్నం చేస్తున్నారని ఆరోపించారు.



'విపక్షాల మహాకూటమి అంటే పెట్టుబడిదారుల, అవినీతిపరుల, ప్రజా వ్యతిరేకుల కలయిక. కోల్‌కతా సభలో ఒక నేత మాట్లాడుతూ బోఫోర్స్ కుంభకోణం గురించి ప్రస్తావించిన తీరును మీరంతా చూశారు. నిజాన్ని దాచిపెట్టలేమనడానికి అదే నిదర్శనం. విపక్షాలు వేర్వేరు రాజకీయ పార్టీలతో పొత్తు పెట్టుకుంటే మనం మాత్రం 125 కోట్ల మంది భారతీయుల ఆశలు, ఆకాంక్షలు, వారి స్వప్నాలతో పొత్తు కుదుర్చుకున్నాం. కోల్‌కతా సమావేశ వేదికపై ఆశీనులైనవారంతా ఓ పెద్ద నేతకు కుమారుడో, కుమార్తో లేదా రాజకీయాల్లో తన వారసుల్ని పెద్దస్థాయిలో చూడాలని అనుకుంటున్నవారే కావడాన్ని గమనించండి. తమతమ పార్టీల్లో అంతర్గత ప్రజాస్వామ్యాన్ని ఎన్నడూ విశ్వసించనివారే ఇప్పుడు బహిరంగ సభా వేదికపై నుంచి ప్రజాస్వామ్యం గురించి మాట్లాడుతున్నారు. వారికి ఏ వ్యవస్థపైనా విశ్వాసం లేదు. రాజ్యాంగబద్ధ సంస్థల్ని అప్రతిష్ఠపాల్జేయడంలో వారంతా నిమగ్నమై ఉన్నారు' అని మోదీ విమర్శించారు.

పేదలకు కోటాతో విపక్షానికి నిద్ర కరవు

ఆర్థికంగా వెనుకబడిన వారికి జనరల్ కేటగిరిలో 10% రిజర్వేషన్లు కల్పించడానికి వీలుగా తాము తీసుకున్న నిర్ణయంతో విపక్షాలకు నిద్ర కరవయిందని ప్రధాని అన్నారు. విపక్షాలు క్షేత్రస్థాయికి వెళ్లి అబద్ధాలు, వదంతులు వ్యాప్తి చేస్తున్నారంటే తాము చేసిన పని మంచిదేనని అన్నారు. కొత్త కోటా కోసం విద్యాసంస్థల్లో సీట్ల సంఖ్యను 10% మేర పెంచబోతున్నట్లు వెల్లడించారు. ఎస్సీ, ఎస్టీ, ఓబీసీల కోటాల్లో ఎలాంటి మార్పూ ఉండదని స్పష్టంచేశారు. రాజ్యాంగాన్ని క్షుణ్నంగా అధ్యయనం చేశాకే ఈ చరిత్రాత్మక కోటా ప్రకటించామని చెప్పారు.

ఆ ఆర్తనాదాలు ప్రజలవి: రాహుల్



దిల్లీ: భాజపా ప్రభుత్వ నిరంకుశ పాలన నుంచి విముక్తి కల్పించాలంటూ దేశ ప్రజలు ఆర్తనాదాలు చేస్తున్నారని కాంగ్రెస్ అధ్యక్షుడు రాహుల్ గాంధీ అన్నారు. ప్రతిపక్షాల 'ఐక్యతా భారత్' సభ గురించి ప్రధాని నరేంద్ర మోదీ చేసిన విమర్శలను తిప్పికొట్టారు. "పశ్చిమ బెంగాల్‌లో మా పార్టీకి ఒకే ఎమ్మెల్యే ఉన్నారు. అయినా సత్యమార్గంలో నడిచే మేమంటే వారికి భయం. దేశవ్యాప్తంగా పార్టీలన్నింటినీ కూడగట్టి, కాపాడండంటూ పెడబొబ్బలు పెడుతున్నారు" అని మోదీ అన్నారు. దీనిపై రాహుల్ ట్విటర్ ద్వారా స్పందించారు. "కాపాడాలని ఆర్తనాదాలు చేస్తున్నది దేశ ప్రజలు. మోదీ ప్రభుత్వం నుంచి విముక్తి కల్పించాలని కోట్ల మంది నిరుద్యోగులు, రైతులు, దళితులు, మైనార్టీలు, వ్యాపారులు వేడుకుంటున్నారు. మరో వంద రోజుల్లో వారి ఆకాంక్ష నెరవేరుతుంది" అని రాహుల్ ట్వీట్ చేశారు.

కాంగ్రెస్‌కి విశాల హృదయం ఉండాలి: తేజస్వి

దిల్లీ: సార్వత్రిక ఎన్నికల్లో విపక్షాల కూటమికి నేతృత్వం వహించే సత్తా కాంగ్రెస్‌కి ఉందని, అయితే పొత్తుల విషయంలో ఆ పార్టీ విశాల హృదయంతో ఉండాలని రాష్ట్రీయ జనతాదళ్ (ఆర్జేడీ) నేత తేజస్వి యాదవ్ పేర్కొన్నారు. తగినంత సొంత బలం లేని రాష్ట్రాల్లో మాత్రం ప్రాంతీయ పార్టీలకు సముచిత పాత్ర కల్పించడానికి కాంగ్రెస్ ముందుకు రావాలని ఆదివారం ఒక వార్తాసంస్థకు ఇచ్చిన ముఖాముఖిలో ఆయన అభిప్రాయపడ్డారు. దేశవ్యాప్తంగా విస్తరించిన కాంగ్రెస్ పార్టీ ఇతర విపక్షాల కంటే గరిష్ఠ స్థాయిలో సీట్లు సంపాదించగల స్థాయిలో ఉందని చెప్పారు. గెలుపు అవకాశాలే ధ్యేయంగా రాష్ట్రాలవారీగా పొత్తులు నిర్ణయించుకోవాలన్నారు. అఖిలేశ్, మాయావతిలతో భేటీ కావడం కాంగ్రెస్‌పై ఒత్తిడి పెంచే వ్యూహం కాదన్నారు.

అధికారం కోసం గౌరవాన్ని అమ్ముకున్నారు

- మాయావతిపై భాజపా ఎమ్మెల్యే వివాదాస్పద వ్యాఖ్యలు

లఖ్‌నవూ, దిల్లీ: బహుజన్ సమాజ్ పార్టీ(బీఎస్పీ) అధ్యక్షురాలు మాయావతిపై భాజపా మహిళా ఎమ్మెల్యే సాధనా సింగ్ వివాదాస్పద వ్యాఖ్యలు చేశారు. ఉత్తర్‌ప్రదేశ్‌లోని ముఘల్‌సరాయి నియోజకవర్గం శాసనసభ్యురాలిగా ఉన్న సాధనా చందౌలిలో శనివారం నిర్వహించిన సభలో ప్రసంగించారు. "ఉత్తర్ ప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి మాయావతి మహిళ అని గానీ పురుషుడు అని గానీ నేను అనుకోవడం లేదు. ఆమె ట్రాన్స్‌జెండర్ కంటే హీనం. ఆమెకు గౌరవం అంటే అర్థం తెలియదు" అని వ్యాఖ్యానించారు.

తీవ్రంగా స్పందించిన బీఎస్పీ

సాధనా సింగ్ వ్యాఖ్యలపై బీఎస్పీ తీవ్రంగా స్పందించింది. భాజపా మానసిక స్థితికి ఆమె మాటలు అద్దం పడుతున్నాయని పార్టీ ప్రధాన కార్యదర్శి సతీశ్ చంద్ర మిశ్ర అభిప్రాయపడ్డారు. ఎస్పీ, బీఎస్పీ జట్టు కట్టడంతో భాజపా మానసిక సమతుల్యతను కోల్పోయిందని అన్నారు. ఈ వ్యాఖ్యలను జాతీయ మహిళా కమిషన్(ఎన్‌సీడబ్ల్యూ) ఛైర్‌పర్సన్ రేఖా శర్మ కూడా ఖండించారు.

మధ్యధరా సాగరంలో విషాదం!

- 170 మంది శరణార్థుల గల్లంతు

ఐరాస: మధ్యధరా సముద్రంపై మరో విషాదం చోటుచేసుకుంది. అక్కడ రెండు పడవలకు సంబంధించిన శకలాలు కనిపించాయి. వీటిపై పయనమైన దాదాపు 170 మంది శరణార్థులు చనిపోవడం కానీ గల్లంతు కావడం కానీ జరిగి ఉంటుందని ఆందోళన వ్యక్తమవుతోంది. బాధితులను రక్షించేందుకు అన్ని చర్యలూ చేపట్టాలని ఐరాస శరణార్థి సంస్థ (యూఎన్‌హెచ్‌సీఆర్) కోరింది. "మధ్యధరా సముద్రంలో విషాదాలు ఇలా నిరంతరంగా కొనసాగరాదు" అని సంస్థ ఉన్నతాధికారి ఫిలిప్పో గ్రాండి చెప్పారు. గాలింపు చర్యల్లో స్వచ్ఛంద సంస్థలు కూడా పాల్గొనేందుకు అనుమతించాలని సంబంధిత దేశాలను కోరారు. పశ్చిమ మధ్యధరా సాగరంలో ఒక శకలం వెలుగు చూసింది. అందులోని ఒక శరణార్థిని సమీపంలోని మత్స్యకారుల పడవ రక్షించింది. పలు స్వచ్ఛంద సంస్థల అంచనా ప్రకారం ఇందులోని 53 మంది చనిపోయారు. వీరి కోసం మొరాకో, స్పెయిన్ సహాయ నౌకలు గాలింపు చేపడుతున్నాయని, ఇప్పటివరకూ ఎలాంటి ఫలితం లేదని అధికారులు చెబుతున్నారు. సముద్రంలోని మధ్య ప్రాంతంలో మరో నౌక శకలాలు కనిపించినట్లు ఇటలీ నౌకాదళం పేర్కొంది. వాటిపై ఉన్న ముగ్గురు బాధితులను రక్షించినట్లు చెప్పింది. తమతోపాటు లిబియా నుంచి మరో 117 మందితో ఈ పడవలో బయలుదేరినట్లు వారు చెప్పారు. గత ఏడాది మధ్యధరా సముద్రం గుండా ఐరోపా చేరేందుకు ప్రయత్నిస్తూ 2262 మంది శరణార్థులు ప్రాణాలు కోల్పోయారు.

తదుపరి సీబీఐ డైరెక్టర్ ఎవరో?

24న అత్యున్నత స్థాయి సంఘం భేటీ

దిల్లీ: కేంద్ర దర్యాప్తు సంస్థ-సీబీఐ తదుపరి డైరెక్టర్ ఎవరన్నదానిపై ఆసక్తి నెలకొంది. ప్రధాని నరేంద్ర మోదీ అధ్యక్షతనగల అత్యున్నత స్థాయి సంఘం గురువారం సమావేశమవుతున్న నేపథ్యంలో దీనిపై చర్చ జరుగుతోంది. ఈ సమావేశానికి సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ రంజన్ గొగొయిగానీ ఆయన ప్రతినిధిగానీ; లోక్‌సభలో కాంగ్రెస్ పక్ష నేత మల్లికార్జున ఖర్గే హాజరుకానున్నారు.

ఈ పదవికి 1982 నుంచి 1985 వరకుగల బ్యాచ్‌ల ఐపీఎస్ అధికారుల పేర్లను పరిశీలనలోకి తీసుకోవాలని ప్రభుత్వం భావిస్తోంది. ఆ మేరకు పలువురు ఉన్నతాధికార్ల పేర్లపై ఆయా వర్గాల్లో చర్చలు నడుస్తున్నాయి.

★ **పరమీందర్ రాయ్:** 1982 బ్యాచ్ హరియాణా కేడర్ అధికారి. అందరిలో సీనియర్. అయితే సీబీఐలో పనిచేసిన అనుభవం లేదు. ఆయన పదవీ విరమణ గడువు ఈ నెల 31 కావడం గమనార్హం.

★ **రీనా మిత్ర:** 1983 బ్యాచ్ అధికారిణి. కేంద్ర హోం శాఖ ప్రత్యేక కార్యదర్శి (అంతర్గత భద్రత)గా పనిచేస్తున్నారు. సీబీఐలో అయిదేళ్ల పాటు పనిచేసిన అనుభవం ఉంది. ఒకవేళ ఆమెను నియమిస్తే సీబీఐకి తొలి మహిళా డైరెక్టర్ అవుతారు.

★ **జావేద్ అహ్మద్:** 1984 బ్యాచ్ ఉత్తర్‌ప్రదేశ్ కేడర్ అధికారి. ప్రస్తుతం నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ క్రిమినాలజీ, ఫోరెన్సిక్ సైన్సెస్ అధిపతిగా పనిచేస్తున్నారు. సీబీఐలో 13 ఏళ్ల పాటు పనిచేశారు.

★ **ఒ.పి.గల్హోత్రా:** సీబీఐలో 11 ఏళ్ల పాటు పనిచేసిన అనుభవం ఉంది. రాజస్థాన్ డీజీపీగా పనిచేశారు.

★ **హెచ్.సి. అవస్థి:** యూపీ కేడర్ అధికారి. సీబీఐలో ఎనిమిదేళ్లపాటు పనిచేశారు.

★ **యోగేశ్ చందర్ మోదీ:** ప్రస్తుతం జాతీయ దర్యాప్తు సంస్థ (ఎన్ఐఏ) డైరెక్టర్ జనరల్‌గా పనిచేస్తున్నారు. ఈయన పేరు ప్రముఖంగా వినిపిస్తోంది. అస్సాం-మేఘాలయ కేడర్‌కు చెందిన 1984 బ్యాచ్ అధికారి. 2002లో జరిగిన గుజరాత్ అల్లర్లపై విచారణకు సుప్రీంకోర్టు నియమించిన ప్రత్యేక దర్యాప్తు బృందం (సిట్)లో ఉన్నారు. ఆ విభాగంలో 2010 నుంచి 2012 వరకు పనిచేశారు. అల్లర్లలో అప్పటి ముఖ్యమంత్రి నరేంద్ర మోదీ ప్రమేయం లేదని ఈ 'సిట్' పేర్కొంది. అప్పటి గుజరాత్ హోంమంత్రి హరేన్ పాండ్య హత్య కేసుపై దర్యాప్తు జరిపిన సీబీఐ బృందంలోనూ ఉన్నారు.

★ **రాజేశ్ రంజన్:** సీఐఎస్ఎఫ్ డైరెక్టర్ జనరల్‌గా పనిచేస్తున్నారు. 1984 బ్యాచ్ బిహార్ కేడర్ అధికారి. సీబీఐలో అయిదేళ్ల పాటు పనిచేశారు. ఇంటర్‌పోల్‌లో పనిచేసిన అనుభం కూడా ఉంది.

★ **రజనీకాంత్ మిశ్ర:** బీఎస్ఎఫ్ డైరెక్టర్ జనరల్. 1984 ఉత్తర్‌ప్రదేశ్ కేడర్ అధికారి. సీబీఐలో అయిదేళ్లపాటు పనిచేశారు. వచ్చే ఆగస్టులో పదవీ విరమణ చేయనున్నారు.

★ ఎస్.ఎస్.దేశ్వాల్, అరుణ్ మిశ్ర, లోక్‌నాథ్ బెహరా, రిషిరాజ్, అమూల్య పట్నాయక్, జె.కె. శర్మల పేర్లు కూడా పరిశీలనలో ఉన్నాయి.

చెత్తకుప్పలు దాటి.. మేయర్ పీఠంపైకి

రాజేశ్ కాలియా స్వయంకృషితో ఉన్నత స్థానానికి ఎదిగారు



చండీగఢ్: రాజేశ్ కాలియా.. ఒకప్పుడు కుటుంబ పోషణ కోసం వీధుల్లో తిరుగుతూ చెత్త ఏరుకున్నారు. పూట గడవడం కోసం ఆటో రిక్షా నడిపారు. చేతికి దొరికిన పని చేశారు. ఇప్పుడు ఏకంగా చండీగఢ్ నగర మేయర్ పీఠమెక్కారు. నాడు భుజాన సంచి తగిలించుకొని చెత్త ఏరుకున్న ఆయన.. నేడు చండీగఢ్‌ను దేశంలోనే అత్యంత పరిశుభ్ర నగరంగా తీర్చిదిద్దేందుకు కృషిచేయబోతున్నారు. 46 ఏళ్ల కాలియా వాల్మీకి సామాజికవర్గానికి చెందినవారు. స్వస్థలం హరియాణాలోని సోనిపట్ జిల్లా అహులానా గ్రామం. తండ్రి కుందన్ లాల్ స్వీపర్‌గా పనిచేసేవారు. 1977లో వారి కుటుంబం చండీగఢ్‌కు వచ్చి స్థిరపడింది. కుందన్ సంపాదనతో ఇళ్లు గడవడం కష్టంగా ఉండేది. దీంతో ప్రతిరోజు పాఠశాలలో తరగతులు ముగిశాక కాలియా తన ఇద్దరు సోదరులు, నలుగురు సోదరీమణులతో కలిసి వీధుల్లో తిరుగుతూ చెత్త ఏరుకునేవారు. పనిచేస్తూనే 12వ తరగతి వరకు కాలియా చదువుకున్నారు. ఆయన రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్(ఆరెస్సెస్) కార్యకర్త కూడా. పెళ్లయ్యాక కాలియా కొంతకాలం ఆటో నడుపుతూ కుటుంబాన్ని పోషించారు. చెత్త సేకరణ పనిని ఓ ప్రైవేటు సంస్థకు అప్పగిస్తూ చండీగఢ్ మున్సిపల్ కార్పొరేషన్ గత ఏడాది నిర్ణయం తీసుకోగా, ఆ నిర్ణయానికి వ్యతిరేకంగా చెత్త సేకరణ కార్మికులు నిర్వహించిన ఆందోళనకు కాలియా నేతృత్వం వహించారు. తాజాగా నగరంలోని 7వ వార్డు నుంచి భాజపా అభ్యర్థిగా కాలియా విజయం సాధించారు. శనివారం జరిగిన ఎన్నికల్లో మొత్తం 27 ఓట్లకుగాను 16 ఓట్లు దక్కించుకొని ఆయన మేయర్ పీఠమెక్కారు.

జపాన్ కురు వృద్ధుడి కన్నుమూత

ప్రపంచంలోనే ఎక్కువ వయస్సున్న వ్యక్తిగా గిన్నిస్ రికార్డు సొంతం చేసుకున్న జపాన్‌వాసి మెజాజో నొనాకా కన్నుమూశారు. ఉత్తర జపాన్‌లోని హొక్కైడో దీవిలో తన సొంత నివాసంలోనే ఆదివారం తెల్లవారుజామున ఆయన మృతిచెందారు. 113ఏళ్ల మెజాజోది సహజ మరణమేనని కుటుంబ సభ్యులు తెలిపారు. 1905, జులై 25న మెజాజో జన్మించారు. గత ఏడాది 112 ఏళ్ల 259 రోజులు పూర్తి చేసుకొని గిన్నిస్ రికార్డు దక్కించుకున్నారు.








కోడిగుడ్లు 20న ఫారంగేటు అమ్మకం ధరలు (నెక్)	(100కు రూపాయలలో)		
హైదరాబాద్	405	వరంగల్	407
చిల్లరగా (ఒక గుడ్డు)	4.65	విశాఖపట్నం	425
బెంగళూరు	425	చెన్నై	440
21వ తేదీకి...		చిత్తూరు	433
విజయవాడ/గోదావరి	425	నమక్కల్	425

35750-36000 శ్రేణిలో దన్ను



సమీక్ష : అంతర్జాతీయ సంకేతాలు, ఆకర్షణీయ త్రైమాసిక ఫలితాల నేపథ్యంలో గత వారం మార్కెట్లు లాభాల్లో ముగిశాయి. అమెరికా-చైనాల మధ్య వాణిజ్య వివాదం పరిష్కారం దిశగా వెళ్తోందన్న వార్తలతో అంతర్జాతీయ మార్కెట్లు బలపడ్డాయి. అమెరికా కార్పొరేట్ ఫలితాలు, బ్రిటన్ ప్రధాని థెరెసా మే అవిశ్వాస తీర్మానంలో గట్టెక్కడం సెంటిమెంట్‌ను మెరుగుపరిచాయి. దేశీయంగా పారిశ్రామికోత్పత్తి మందగించినప్పటికీ.. రిటైల్, టోకు ద్రవ్యోల్బణం పలు నెలల కనిష్ఠానికి చేరడంతో ఉపశమనం లభించింది. రిజర్వు బ్యాంక్ వచ్చే పరపతి సమీక్షలో రేట్ల కోతకు పరిస్థితులు అనుకూలిస్తున్నాయన్న అంచనాలు జోరందుకున్నాయి. అయితే జీఎస్‌టీ వసూళ్లు తగ్గడం, పెట్టుబడుల ఉపసంహరణ ఆశించిన స్థాయిలో లేకపోవడం వంటి కారణాలతో ప్రభుత్వం ద్రవ్యలోటు లక్ష్యాన్ని చేరలేదనే అంచనాల వల్ల మదుపర్లు అప్రమత్తతతో వ్యవహరించారు. ఇన్ఫోసిస్, టీసీఎస్, రిలయన్స్ ఇండస్ట్రీస్, ఇండస్‌ఇండ్ బ్యాంక్, హెచ్‌యూఎల్ వంటి పెద్ద కంపెనీల ఫలితాలు మదుపర్లను మెప్పించాయి. డాలర్‌తో పోలిస్తే రూపాయి బలహీనపడగా, ముడిచమురు ధరల పెరుగుదల కొనసాగింది. మొత్తం మీద ఈ పరిణామాలతో గత వారం సెన్సెక్స్ 1 శాతం పెరిగి 36,387 పాయింట్ల వద్ద ముగిసింది. నిఫ్టీ 1 శాతం లాభంతో 10,907 పాయింట్ల దగ్గర స్థిరపడింది. విదేశీ సంస్థాగత మదుపర్లు (ఎఫ్ఐఐలు) నికరంగా రూ.54 కోట్ల షేర్లను కొనుగోలు చేయగా, డీఐఐలు, ఫండ్ల కొనుగోళ్లు రూ.521 కోట్లుగా నమోదయ్యాయి.

లాభపడ్డ, నష్టపోయిన షేర్ల నిష్పత్తి 2:3గా నమోదు కావడం.. చిన్న, మధ్య తరహా షేర్లలో అప్రమత్తత, బలహీనతలను సూచిస్తోంది.

ఈవారంపై అంచనా } కీలకమైన 36,300 పాయింట్ల వద్ద మద్దతు లభించడంతో గత వారం సూచీల లాభాలు కొనసాగాయి. 35,750- 36,000 పాయింట్ల శ్రేణి దన్నుగా నిలిస్తే.. స్వల్పకాలంలో లాభాలు కొనసాగే అవకాశం ఉంది. 36,750- 37,150 పాయింట్ల శ్రేణిలో మార్కెట్లకు గట్టి నిరోధం ఎదురుకావొచ్చు.

ప్రభావిత అంశాలు } అంతర్జాతీయ సంకేతాలు, కంపెనీల త్రైమాసిక ఫలితాలు ఈ వారం మార్కెట్లకు దిశానిర్దేశం చేయనున్నాయి. దేశీయంగా చూస్తే.. సమీపకాలంలో మార్కెట్లకు కంపెనీల ఫలితాలు కీలకం కానున్నాయి. చమురు ఉత్పత్తి దేశాల భారీ ఉత్పత్తి కోతలు, అమెరికా- చైనాల మధ్య వాణిజ్య ఒప్పందం కుదరొచ్చన్న అంచనాలతో అంతర్జాతీయ ముడిచమురు ధరలు దాదాపు 3.7 శాతం పెరిగాయి. ముడిచమురు ధరలు మరింత పెరిగితే దేశీయ సెంటిమెంట్ దెబ్బతినే అవకాశం ఉంది. లాభాలకు సైతం అడ్డుకట్ట పడొచ్చు. వచ్చే మధ్యంతర బడ్జెట్‌లో వ్యవసాయ రంగానికి ప్రత్యేక తాయిలాలు ఉండొచ్చన్న వార్తలపై మార్కెట్లు దృష్టి పెట్టొచ్చు. ద్రవ్యలోటుపై వీటి ప్రభావాన్ని మదింపు చేసుకోవచ్చు. అంతర్జాతీయంగా చూస్తే.. అమెరికా- చైనా వాణిజ్య చర్చల పురోగతిపై మార్కెట్లు కన్నేయొచ్చు. స్వల్పకాలంలో చర్చల నిర్ణయాలు అంతర్జాతీయ మార్కెట్ల సెంటిమెంట్‌ను ప్రభావితం చేయనున్నాయి. బ్రెగ్జిట్‌పై అనిశ్చితి నేపథ్యంలో బ్రిటన్‌లో రాజకీయ పరిణామాలు కీలకం కానున్నాయి. చైనా నుంచి వెలువడే వార్తలు, గణాంకాలు ప్రభావం చూపనున్నాయి.

తక్షణ మద్దతు స్థాయిలు: 35,950, 35,753, 35,382;
తక్షణ నిరోధ స్థాయిలు: 36,554, 36,750, 37,128

మార్కెట్లకు 35,750- 36,000 శ్రేణిలో మద్దతు లభించొచ్చు. ఈ శ్రేణిలో ఉన్నంతకాలం మార్కెట్లు సానుకూలతలు కొనసాగించొచ్చు.

– సతీశ్ కంతేటి, జెన్ మనీ

అంతటా సానుకూలతలే

● కలిసొస్తున్న కంపెనీల ఫలితాలు ● అమెరికా-చైనా వాణిజ్య యుద్ధం తగ్గుముఖం ● 11,000 పాయింట్లకు నిఫ్టీ! ● బ్యాంకు, లోహ షేర్ల రాణింపు ● ఔషధ రంగానికి ప్రతికూలతలు ● విశ్లేషకుల అంచనాలు

స్టాక్ మార్కెట్ ఈ వారం

ఈ వారం నిఫ్టీ తన కీలక నిరోధ స్థాయి అయిన 11,000 పాయింట్లను పరీక్షించవచ్చని విశ్లేషకులు అంచనా వేస్తున్నారు. అంతర్జాతీయ మార్కెట్లు రాణిస్తుండడం ఒక కారణమైతే.. దేశీయంగా వినియోగదారు కంపెనీలు, ప్రైవేటు రంగ బ్యాంకుల ఆర్థిక ఫలితాలు బాగుండే సూచనలుండటం మరో కారణం. చైనా వస్తువులపై దిగుమతి సుంకాలను తగ్గించే అంశాన్ని అమెరికా వాణిజ్య అధికారులు పరిశీలిస్తున్నట్లు వచ్చిన వార్తలు సానుకూలతలు తెచ్చిపెట్టొచ్చు. నిఫ్టీకి తొలుత 10,800 వద్ద ఆ తర్వాత 10,500 వద్ద మద్దతు లభించవచ్చని సాంకేతిక నిపుణులు భావిస్తున్నారు.

- హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్, కోటక్ మహీంద్రా బ్యాంక్ వంటి ప్రైవేటు రంగ బ్యాంకుల మద్దతు వల్ల **బ్యాంకు** షేర్లు సానుకూలంగా రాణించవచ్చు. కోటక్ మహీంద్రా బ్యాంక్ ఫలితాలు నేడు వెలువడనున్నాయి. ఈ బ్యాంక్ నికర లాభం 24% వృద్ధితో రూ.1310 కోట్లకు చేరొచ్చన్న అంచనాలున్నాయి. హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ ఫలితాలు అంచనాలను చేరడం కలిసొచ్చే అంశం. యూనియన్ బ్యాంక్, విజయా బ్యాంక్, యెస్ బ్యాంక్ ఫలితాలపై కూడా మదుపర్లు ఓ కన్నేయవచ్చు.
- **ఎఫ్ఎమ్‌సీజీ** విభాగంలో ఇప్పటికే వెలువడిన హెచ్‌యూఎల్ ఫలితాలు మదుపర్లను నిరుత్సాహ పరిచాయి. బుధవారం వెలువడబోయే ఐటీసీ గణాంకాల నుంచి ఈ రంగ షేర్లు సంకేతాలను అందిపుచ్చుకోవచ్చు.
- **ఔషధ** కంపెనీలు బలహీనతలను కొనసాగించొచ్చు. సన్ ఫార్మాలో కార్పొరేట్ పాలనా సమస్యలు ఇందుకు నేపథ్యం. కీలక సూచీలు లాభాలు పొందుతాయన్న అంచనాల మధ్య ఈ రంగ షేర్లలో నష్టాలు తగ్గే అవకాశం ఉంది.
- **లోహ, గనుల** తవ్వక కంపెనీలు రాణించే అవకాశం ఉంది. అమెరికా, చైనాల మధ్య వాణిజ్య యుద్ధం తగ్గుముఖం పడుతుందన్న అంచనాలు ఇందుకు నేపథ్యం. సోమవారం ఫలితాలను ప్రకటించనున్న హిందుస్థాన్ జింక్‌పై మదుపర్లు దృష్టి సారించే అవకాశం ఉంది.
- **సిమెంటు** కంపెనీల షేర్లు మిశ్రమ ధోరణిలో కనిపించొచ్చు. అక్టోబరు-డిసెంబరులో దేశంలోని కొన్ని ప్రాంతాల్లో సిమెంటు ధరలు పెరిగిన విషయం విదితమే. గురువారం వెలువడే అల్ట్రాటెక్ సిమెంట్ ఫలితాల వరకు మదుపర్లు వేచిచూసే అవకాశం ఉంది.
- ఎటువంటి ప్రధాన వార్తలూ లేనందున **యంత్ర పరికరాల** షేర్లు చాలా తక్కువ శ్రేణిలో కదలాడొచ్చు. శుక్రవారం ఫలితాలను ప్రకటించనున్న ఎల్ అండ్ టీ కీలకం కానుంది.
- ప్రభుత్వ రంగ **చమురు** కంపెనీలు ఈ వారం స్థిరీకరణకు గురికావొచ్చు. ఓఎన్‌జీసీ వంటి అప్‌స్ట్రీమ్ కంపెనీలు సానుకూల ధోరణిని, బీపీసీఎల్, హెచ్‌పీసీఎల్ వంటి డౌన్‌స్ట్రీమ్ కంపెనీలు ప్రతికూల ధోరణిని కనబరచవచ్చు.
- **రిలయన్స్ జియో** బలమైన ఫలితాలు, ఆ కంపెనీ మరింత మంది వినియోగదార్లను జతచేసుకునే దిశగా ఆలోచించేలా చేయవచ్చు. ఇది భారతీ ఎయిర్‌టెల్, వొడాఫోన్ ఐడియా షేర్లపై ఒత్తిడి తీసుకురావొచ్చు. జనవరి 31న వెలువడే భారతీ ఎయిర్‌టెల్ ఫలితాల కోసం ఈ రంగం ఎదురు చూడొచ్చు.
- **వాహన** రంగంలో ఈ వారం ఎంపిక చేసిన స్క్రిప్‌లలో కదలికలను గమనించవచ్చు. ఫలితాలు ప్రకటించనున్న మారుతీ సుజుకీ(శుక్ర), టీవీఎస్ మోటార్(మంగళ) కంపెనీల ఫలితాలపై దృష్టి ఉంటుంది..
- ఈ వారం **ఐటీ** షేర్లు స్తబ్ధుగా ఉండొచ్చు. విప్రో తన మార్చి త్రైమాసికానికి విక్రయ అంచనాలను తక్కువగా ప్రకటించిన నేపథ్యంలో ఆ కంపెనీ షేర్లు నష్టాల పాలు కావొచ్చు.

చమురు	ప్రస్తుత ధర	నిరోధం	మద్దతు
బీపీసీఎల్	354.20	360.80	348.00
హెచ్‌పీసీఎల్	239.50	248.10	233.90
ఐఓసీఎల్	137.85	139.50	136.40
ఓఎన్‌జీసీ	146.75	149.10	143.90
ఆయిల్ ఇండియా	172.40	174.20	171.10
టెలికాం	**ప్రస్తుత ధర**	**నిరోధం**	**మద్దతు**
భారతీ ఎయిర్‌టెల్	311.15	344.10	287.80
ఆర్‌కామ్	13.35	13.80	13.10
ఆర్ఐఎల్	1184.35	1224.50	1115.20
వొడాఫోన్ ఐడియా	35.20	38.20	32.90
యంత్రపరికరాలు	**ప్రస్తుత ధర**	**నిరోధం**	**మద్దతు**
భెల్	70.95	72.10	69.20
ఎల్ అండ్ టీ	1,317.90	1,366.60	1,288.60
థెర్మాక్స్	1,080.50	1,137.30	1,033.80
సీమెన్స్	1,054.75	1,075.50	1,039.60
వాహన	**ప్రస్తుత ధర**	**నిరోధం**	**మద్దతు**
అశోక్ లేలాండ్	92.30	94.20	91.10
హీరో మోటోకార్ప్	2898.75	2964.20	2830.30
ఎం అండ్ ఎం	734.95	743.50	723.70
మారుతీ సుజుకీ	7357.95	7413.90	7290.00
టాటా మోటార్స్	183.30	187.80	179.10
టీవీఎస్ మోటార్	535.65	557.20	521.20

బ్యాంకింగ్	ప్రస్తుత ధర	నిరోధం	మద్దతు
కెనరా బ్యాంక్	272.60	280.00	268.10
హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్	2130.25	2152.40	2103.50
ఐసీఐసీఐ బ్యాంక్	372.00	379.00	366.90
ఇండస్‌ఇండ్ బ్యాంక్	1516.90	1540.20	1501.40
ఎస్‌బీఐ	294.95	302.00	290.80
ఎఫ్ఎమ్‌సీజీ	**ప్రస్తుత ధర**	**నిరోధం**	**మద్దతు**
బ్రిటానియా ఇండస్ట్రీస్	3,171.35	3,257.40	3,091.20
డాబర్ ఇండియా	424.10	431.70	414.80
హెచ్‌యూఎల్	1,744.10	1,788.30	1,705.20
ఐటీసీ	291.45	296.90	288.00
ఔషధ	**ప్రస్తుత ధర**	**నిరోధం**	**మద్దతు**
అరబిందో ఫార్మా	770.05	789.40	753.40
క్యాడిలా హెల్త్‌కేర్	347.05	359.60	336.80
సిప్లా	509.40	515.60	504.20
డాక్టర్ రెడ్డీస్	2596.80	2641.70	2572.00
లుపిన్	862.30	876.00	845.00
సన్‌ఫార్మా	390.75	448.90	341.10
లోహ	**ప్రస్తుత ధర**	**నిరోధం**	**మద్దతు**
హిండాల్కో ఇండస్ట్రీస్	208.80	211.50	204.60
జిందాల్ స్టీల్	145.65	148.80	143.00
జేఎస్‌డబ్ల్యూ స్టీల్	285.60	295.50	278.30
ఎన్ఎమ్‌డీసీ	90.70	92.70	89.60
టాటా స్టీల్	470.65	481.80	462.40
సిమెంట్	**ప్రస్తుత ధర**	**నిరోధం**	**మద్దతు**
ఏసీసీ	1439.75	1480.60	1414.60
అంబుజా సిమెంట్స్	212.65	217.40	209.80
ఇండియా సిమెంట్స్	85.00	87.50	83.60
శ్రీ సిమెంట్	15590.25	16185.40	15177.40
అల్ట్రాటెక్ సిమెంట్	3819.95	3904.30	3729.50
ఐటీ	**ప్రస్తుత ధర**	**నిరోధం**	**మద్దతు**
హెచ్‌సీఎల్ టెక్నాలజీస్	966.30	982.90	938.10
ఇన్ఫోసిస్	730.95	741.10	721.30
టీసీఎస్	1900.65	1921.80	1865.40
టెక్ మహీంద్రా	709.15	720.40	696.70

ఈ ఏడాదే బ్రిటన్‌ను అధిగమిస్తాం

అతిపెద్ద ఆర్థిక వ్యవస్థల్లో 5వ స్థానానికి భారత్: పీడబ్ల్యూసీ

దిల్లీ: అతిపెద్ద ఆర్థిక వ్యవస్థల జాబితాలో బ్రిటన్‌ను ఈ ఏడాది భారత్ అధిగమించే అవకాశముందని అంతర్జాతీయ కన్సల్టెన్సీ సంస్థ పీడబ్ల్యూసీ తాజా నివేదికలో పేర్కొంది. 2017లో ప్రపంచ బ్యాంకు విడుదల చేసిన అంతర్జాతీయ ర్యాంకింగుల్లో ఫ్రాన్స్‌ను అధిగమించి భారత్ ఆరో స్థానానికి ఎగబాకింది. పీడబ్ల్యూసీ అంతర్జాతీయ ఆర్థిక నివేదిక ప్రకారం, ఈ ఏడాది బ్రిటన్ వాస్తవ జీడీపీ 1.6 శాతం, ఫ్రాన్స్ వాస్తవ జీడీపీ 1.7 శాతం మేర వృద్ధి చెందుతాయని అంచనా వేస్తోంది. ఇదే సమయంలో 2019-20లో భారత్ వృద్ధి 7.6 శాతం నమోదయ్యే అవకాశం ఉందని పేర్కొంది. అందువల్ల భారత్, ఫ్రాన్స్‌లు అతి పెద్ద ఆర్థిక వ్యవస్థల 2019 జాబితాలో యునైటెడ్ కింగ్‌డమ్ (బ్రిటన్)ను అధిగమించే వీలు కలుగుతోంది. దీంతో భారత్ 5వ స్థానం, ఫ్రాన్స్ 6వ స్థానంలో నిలిచే అవకాశం ఉండటంతో బ్రిటన్ 7వ స్థానానికి దిగజారే పరిస్థితి కనిపిస్తోందని అభిప్రాయపడింది.

స్పెక్ట్రమ్ చెల్లింపునకు రెండేళ్ల గడువివ్వండి

● వొడాఫోన్ ఐడియా వినతి

దిల్లీ: అధిక రుణభారంతో సతమతమవుతున్నందున, స్పెక్ట్రమ్ వార్షిక చెల్లింపులపై రెండేళ్ల మారటోరియం విధించాలని వొడాఫోన్ ఐడియా ప్రభుత్వానికి విజ్ఞప్తి చేసింది. 'వార్షిక చెల్లింపు కింద రూ.10,000 కోట్లు జమ చేయాల్సి ఉంది. ఈ నేపథ్యంలోనే టెలికాం విభాగానికి వొడాఫోన్ ఇండియా నుంచి రెండేళ్ల మారటోరియం విజ్ఞాపన వచ్చింది. దీనిని పరిశీలించి, నిర్ణయం తీసుకునేందుకు వేర్వేరు మంత్రిత్వ శాఖలు, విభాగాలు క్షుణ్నంగా అధ్యయనం చేయాల్సి ఉంటుంది' అని ప్రభుత్వ సీనియర్ అధికారి ఒకరు వెల్లడించారు. ఇరు సంస్థలు విలీనం కాకముందు 2010, 2012, 2014, 2015, 2016 సంవత్సరాలలో జరిగిన వేలంలో రూ.79,343 కోట్ల విలువైన స్పెక్ట్రమ్‌ను వొడాఫోన్, రూ.63,597 కోట్ల స్పెక్ట్రమ్‌ను ఐడియా కొనుగోలు చేశాయి.

కియా మోటార్స్ ప్రయోగాత్మక ఉత్పత్తి ఈనెలలోనే

దిల్లీ: ఆంధ్రప్రదేశ్‌లోని అనంతపురం జిల్లాలో నెలకొల్పిన ప్లాంటులో, స్పోర్ట్స్ వినియోగ వాహనం (ఎస్‌యూవీ) ఎస్‌పీ కాన్సెప్ట్ వాహన ప్రయోగాత్మక ఉత్పత్తి ఈ నెలలోనే చేపట్టేందుకు దక్షిణ కొరియా సంస్థ కియా మోటార్స్ అనుబంధ కియా మోటార్స్ ఇండియా సన్నాహాలు చేస్తోంది. ప్రపంచవ్యాప్తంగా సంస్థకు ఇది 15వ ప్లాంటు అవుతుంది. ఈ ప్లాంటు నుంచి ఈ ఏడాది మధ్యలో నూతన వాహనాన్ని విపణిలోకి విడుదల చేయాలన్నది సంస్థ ప్రణాళిక. ఇక్కడి ప్లాంటులో ఏడాదికి 3 లక్షల వాహనాలు తయారు చేయనున్నారు. ఇందుకోసం దేశవ్యాప్తంగా విక్రయశాలలు, పంపిణీ వ్యవస్థలను కూడా సంస్థ సమకూర్చుకోనుంది. 'ఈ ప్లాంటులో తొలి మోడల్‌గా ఎస్2ఐ కార్ల ప్రయోగాత్మక ఉత్పత్తిని ఈ నెలాఖరుకు ప్రారంభిస్తామ'ని కియా మోటార్స్ ఇండియా మార్కెటింగ్ అధిపతి మనోహర్ భట్ తెలిపారు. దేశీయ పరిస్థితుల్లో ఈ వాహనం పనితీరు ఎలా ఉందో ప్రస్తుతం పరీక్షిస్తున్నట్లు వివరించారు. రూ.7,000 కోట్ల పెట్టుబడితో నిర్మిస్తున్న ఆంధ్రప్రదేశ్ ప్లాంటు నుంచి 6 నెలలకో కొత్త మోడల్ విడుదల చేయాలన్నది తమ ప్రణాళికగా వెల్లడించారు. 4 ప్రాంతీయ కార్యాలయాలు నెలకొల్పుతామని, మహా నగరాలతో పాటు 2-3 అంచెల నగరాలలోనూ ప్రత్యేక విక్రయశాలలు ప్రారంభించడం ద్వారా దేశంలోనే అతిపెద్ద నెట్‌వర్క్‌గా అవతరిస్తామని పేర్కొన్నారు. అంతర్జాతీయంగా సంస్థ ప్రచారకర్తగా టెన్నిస్ క్రీడాకారుడు రఫెల్ నాదల్ ఉండగా, దేశీయంగా ఎవరినైనా నియమించాలా అనేది పరిశీలిస్తున్నట్లు వివరించారు.



కేజీ-డీ6 నుంచి నికో బయటకు!

చెల్లింపుల్లో విఫలమైనందునే

దిల్లీ: రిలయన్స్ ఇండస్ట్రీస్, బీపీ, నికో రిసోర్సెస్ సంస్థలు సంయుక్తంగా కేజీ-డీ6 గ్యాస్ బ్లాక్‌ను నిర్వహిస్తున్నాయి. దీని అభివృద్ధి కోసం తన వాటా మొత్తాన్ని చెల్లించడంలో నికో రిసోర్సెస్ విఫలమైనందున, ఈ ప్రాజెక్టు నుంచి బయటకు వెళ్లమంటూ మిగతా రెండు సంస్థలు కోరాయి. సంయుక్త భాగస్వామ్య ఒప్పందంలో (జేఓఏ) భాగంగా నికోకు నోటీసు కూడా పంపాయి. గత ఏడాది డిసెంబరు 17న నోటీసు అందుకున్నట్లు నికో సంస్థ ధ్రువీకరించింది. అయితే బయటకు వెళ్లేందుకు ఇష్టం లేక, దీనికి సమాధానంగా మధ్యవర్తిత్వపు నోటీసును (ఆర్బిట్రేషన్ నోటీస్) జారీ చేసింది. వాస్తవానికి నికో సంస్థ తన రుణదాతలకు చెల్లింపులు చేయడంలో విఫలమైంది. ఈ తరుణంలో తన వాటా 10 శాతం కింద కేజీ-డీ6 బ్లాక్‌లోని ఆర్-క్లస్టర్, శాటిలైట్ క్లస్టర్, ఎంజే డెవలప్‌మెంట్ ప్రాజెక్టులకు సంబంధించి చెల్లించాల్సిన 5-6 బిలియన్ డాలర్లు (సుమారు రూ.35,000-42,000 కోట్లు) చెల్లించలేకపోయింది. గతంలోనూ నగదు సంక్షోభం కారణంతో ఎన్ఈసీ-25 బ్లాక్ నుంచి నికో బయటకొచ్చింది.

అమెరికా విపణి నుంచి లుపిన్, సన్‌ఫార్మా, గ్లెన్‌మార్క్ ఔషధాలు వెనక్కి

దిల్లీ: వివిధ కారణాలతో అమెరికా విపణి నుంచి పలు ఔషధాలను భారత ఔషధ సంస్థలు లుపిన్, సన్‌ఫార్మా, గ్లెన్‌మార్క్ ఫార్మాలు వెనక్కి (రీకాల్) పిలిపిస్తున్నాయి. అమెరికా ఆహార, ఔషధ నియంత్రణ సంస్థ (యూఎస్ఎఫ్‌డీఏ) తాజా ఎన్‌ఫోర్స్‌మెంట్ నివేదిక ప్రకారం.. లుపిన్ 55,000 వయల్స్, 1,60,241 బాక్సుల యాంటీ బ్యాక్టీరియల్ ఔషధం సెఫ్ట్రియాక్సిన్‌ను స్వచ్ఛందంగా వెనక్కి పిలిపిస్తోంది. ఈ ఔషధాల్లో రబ్బరు అవశేషాలు గుర్తించామని యూఎస్ఎఫ్‌డీఏ తెలిపింది. ఈ స్వచ్ఛంద రీకాల్‌ను క్లాస్-1గా గుర్తించామని వెల్లడించింది. బ్యాక్టీరియా ఇన్ఫెక్షన్ల నివారణలో వినియోగించే 2,87,784 బాటిళ్ల సెఫ్‌డినిర్ ఔషధాన్ని సైతం వెనక్కి పిలిపిస్తున్నట్లు లుపిన్ ప్రకటించింది. దీన్ని యూఎస్ఎఫ్‌డీఏ క్లాస్-2 రీకాల్‌గా వర్గీకరించింది. ఇదే సమయంలో సాధారణ అనస్థీషియాగా వినియోగించే 13,918 కార్టన్లు, 1,39,180 వయల్ల వెకూరోనియం బ్రోమైడ్‌ను సన్‌ఫార్మా స్వచ్ఛందంగా వెనక్కి పిలిపించనుంది. మరోవైపు గ్లెన్‌మార్క్ సైతం 96,240 అప్లికేటర్ల ఎస్ట్రాడియల్ వెజైనల్ ఇన్‌సర్ట్స్ ఔషధాలను తిరిగి పిలిపిస్తోంది.

జీఎస్‌టీ రిటర్న్‌లు 6 నెలలు దాఖలు చేయకపోతే ఇ-వే బిల్లుల నిలిపివేత

దిల్లీ: వరుసగా ఆరు నెలల పాటు వస్తు సేవల పన్ను (జీఎస్‌టీ) రిటర్నులు దాఖలు చేయని వారికి, సరకు రవాణా సమయంలో జారీ చేసే ఇ-వే బిల్లులు నిలిపి వేయాలని అధికారులు భావిస్తున్నారు. 6 నెలల పాటు జీఎస్‌టీ రిటర్నులు దాఖలు చేయని వారిని గుర్తించే ఐటీ వ్యవస్థను వస్తు సేవల పన్ను నెట్‌వర్క్ అభివృద్ధి చేస్తోందని, దీని సాయంతో ఇటువంటి వారికి ఇ-వే బిల్లులు జారీ చేయడం నిలిపివేస్తామని ఒక అధికారి వెల్లడించారు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం ఏప్రిల్-డిసెంబరులో రూ.15,278.18 కోట్ల విలువైన 3,626 జీఎస్‌టీ ఎగవేతలు, నిబంధనల ఉల్లంఘన కేసులను గుర్తించామని కేంద్ర పన్ను అధికారులు తెలిపారు. పన్ను వసూళ్లు పెంచడానికి ఎగవేతల నియంత్రణే పరిష్కారమని జీఎస్‌టీ అధికారులు చెబుతున్నారు. ప్రతినెలా రూ.లక్ష కోట్లపైగా జీఎస్‌టీ వసూలు చేయాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకోగా.. ఇప్పటివరకు నెలవారీ జీఎస్‌టీ వసూళ్ల సగటు రూ.96,800 కోట్లు మాత్రమే.

నేటి బోర్డు సమావేశాలు

కోటక్ మహీంద్రా బ్యాంక్, హెచ్‌డీఎఫ్‌సీ ఏఎంసీ, హిందుస్థాన్ జింక్, హడ్కో, యూనియన్ బ్యాంక్, జీహెచ్‌సీఎల్, జస్ట్ డయల్, ఎల్‌అండ్‌టీ ఫైనాన్షియల్ హోల్డింగ్స్

పసిడికి రూ.32,450 వద్ద నిరోధం

కమొడిటీస్ ఈ వారం

● బంగారం, వెండి



పసిడి ఫిబ్రవరి కాంట్రాక్టు గత సోమవారం రూ.31,989 వద్ద సానుకూలంగా ఆరంభమైంది. ఆ తర్వాత కీలక స్థాయైన రూ.32,298ని అధిగమించి రూ.32,390 వద్ద వారం గరిష్ఠాన్ని చేరింది. 2016 జులై తర్వాత పసిడి కాంట్రాక్టుకు ఇదే గరిష్ఠ స్థాయి. అయితే లాభాల స్వీకరణ రూపంలో ఆ తర్వాత కాంట్రాక్టుకు కొంత అమ్మకాల ఒత్తిడి ఎదురైంది. అయినప్పటికీ చివరకు 0.33% లాభంతో రూ.32,096 వద్ద ముగిసింది. ఈవారం పసిడి కాంట్రాక్టుకు రూ.32,450 వద్ద నిరోధం ఎదురుకావచ్చు. ఈ స్థాయిని అధిగమించకుంటే స్వల్పకాలంలో కొంత అమ్మకాల ఒత్తిడి ఎదురయ్యేందుకు అవకాశం ఉంటుంది. అమెరికా, చైనాల మధ్య వాణిజ్య యుద్ధ ఉద్రిక్తతలు తగ్గుముఖం పట్టొచ్చన్న అంచనాలు, పసిడి కాంట్రాక్టుపై ప్రతికూల ప్రభావం చూపించొచ్చు. అమెరికా ప్రభుత్వ పాక్షిక మూసివేత పరిణామాలపైనా ట్రేడర్లు దృష్టి సారించే అవకాశం ఉంది. ఈవారంలో అమెరికా వెల్లడించే కీలక ఆర్థిక గణాంకాలు కూడా కాంట్రాక్టుకు దిశానిర్దేశం చేస్తాయి. వెండి మార్చి కాంట్రాక్టు కిందటి వారం రూ.39,305 వద్ద ప్రారంభమైంది. రూ.39,770 వద్ద వారం గరిష్ఠాన్ని చేరాక.. కాంట్రాక్టు దిద్దుబాటుకు లోనయ్యింది. ఆఖరుకు 0.32% నష్టంతో రూ.39,181 వద్ద స్థిరపడింది. సాంకేతికంగా కాంట్రాక్టుకు ప్రతికూల ధోరణి కనిపిస్తోంది. అందువల్ల ఈవారం రూ.38,896 కంటే కిందకు రాకుంటే లాంగ్ పొజిషన్లు కొనసాగించొచ్చు. అయితే రూ.39,548- 39,984 మధ్య లాభాలు స్వీకరించడం మంచిది. షార్ట్ సెల్ పొజిషన్లు తీసుకోదలిస్తే రూ.39,684 వరకు వేచి ఉండటం మేలు.

● ప్రాథమిక లోహాలు



రాగి ఫిబ్రవరి కాంట్రాక్టు ఈవారం సానుకూలంగానే కనిపిస్తోంది. అందువల్ల రూ.435 వరకు లాంగ్ పొజిషన్లను అట్టే పెట్టుకోవచ్చు. అయితే స్టాప్‌లాస్‌ను రూ.422.60 దిగువకు మార్చుకోవాలి. సీసం జనవరి కాంట్రాక్టుకు ఈవారం కొంత అమ్మకాల ఒత్తిడి ఎదురయ్యే అవకాశం ఉంది. ఈ విషయాన్ని దృష్టిలో ఉంచుకొని రూ.137 దిగువకు వస్తే ప్రస్తుత లాంగ్ పొజిషన్లు వదిలించుకోవాలి. రూ.139 స్థాయికి ఎగువన మాత్రమే కాంట్రాక్టు సానుకూలంగా చలించేందుకు అవకాశం ఉంటుంది. ఈవారం జింక్ జనవరి కాంట్రాక్టు కొనుగోళ్లకు మొగ్గు చూపొచ్చు. లాంగ్ పొజిషన్లు ఉంటే రూ.177.55 వద్ద స్టాప్ లాస్ పెట్టుకుని వాటిని కొనసాగించొచ్చు. అయితే రూ.189.55 స్థాయికి చేరాక లాభాలు స్వీకరించడం మంచి వ్యూహం అవుతుంది. అల్యూమినియం జనవరి కాంట్రాక్టుకు ఈవారం కొనుగోళ్ల మద్దతు లభించొచ్చు. గత 11 వారాలుగా కాంట్రాక్టు ప్రతికూలంగా చలిస్తుండటమే ఇందుకు కారణం. రూ.128.75 వద్ద స్టాప్‌లాస్ పెట్టుకుని రూ.130.25 కంటే పైన కొనుగోళ్లకు మొగ్గు చూపొచ్చు. నికెల్ జనవరి కాంట్రాక్టు సాంకేతికంగా సానుకూలంగానే కనిపిస్తోంది. రూ.819 వద్ద స్టాప్‌లాస్ పెట్టుకుని లాంగ్ పొజిషన్లు తీసుకోవడం మంచిదే.

● ఇంధన రంగం

ముడి చమురు కాంట్రాక్టు తిరిగి సానుకూల బాట పట్టినట్లు కనిపిస్తోంది. అందువల్ల కొనుగోళ్లకు మొగ్గు చూపొచ్చు. ప్రస్తుత లాంగ్ పొజిషన్లు కూడా కొనసాగించొచ్చు. సహజ వాయువు జనవరి కాంట్రాక్టుకు ఈవారం కూడా వాతావరణ అంచనాలు దిశానిర్దేశం చేస్తాయి. సాంకేతికంగా ఇప్పటికే ఓవర్ సోల్డ్ పరిధిలో ఉన్నందున.. ధర తగ్గినప్పుడల్లా కొనుగోలు చేసే వ్యూహంతో ముందుకెళ్లొచ్చు. ముడి పామోలిన్ నూనె (సీపీఓ) జనవరి కాంట్రాక్టు ఈవారం కూడా సానుకూలంగానే చలించొచ్చు. అందువల్ల ఉన్న లాంగ్ పొజిషన్లు కొన్నింటిలో లాభాలు స్వీకరించి.. మిగిలిన వాటిని స్టాప్‌లాస్‌తో అట్టే పెట్టుకోవడం మంచి వ్యూహం అవుతుంది. ఎందుకుంటే సమీపకాల నిరోధానికి ఇది చేరువగా ఉండటమే ఇందుకు కారణం.



– ఆర్ఎల్‌పీ కమొడిటీ అండ్ డెరివేటివ్స్

గతవారం పొజిషన్లు ఇలా

కమొడిటీ	ప్రారంభం (రూ.లలో)	ముగింపు (రూ.లలో)	వృద్ధి/(క్షీణత) (శాతంలో)
రాగి (ఫిబ్రవరి)	414	428.95	3.61
సీసం (జనవరి)	140.05	141.70	1.18
జింక్ (జనవరి)	175.30	185.15	5.62
అల్యూమినియం (జనవరి)	128.90	133.10	3.26
నికెల్ (జనవరి)	802.60	837.70	4.37
ముడి చమురు (ఫిబ్రవరి)	3,646	3,855	5.73
సహజ వాయువు (జనవరి)	218.60	238.20	8.97
సీపీఓ (జనవరి)	546.50	551.50	0.91

ఛాంపియన్

కివీస్ చేరిన భారత్



ఆక్లాండ్: న్యూజిలాండ్‌తో సిరీస్‌లో తలపడేందుకు భారత క్రికెట్ జట్టు ఆక్లాండ్‌లో అడుగుపెట్టింది. జనవరి 23న ప్రారంభమయ్యే ఈ సిరీస్‌లో టీమ్‌ఇండియా ఐదు వన్డేలు, మూడు టీ20 మ్యాచ్‌లు ఆడనుంది. ఆక్లాండ్ విమానాశ్రయం నుంచి భారత ఆటగాళ్లు బయటకు వస్తున్న వీడియోను బీసీసీఐ ట్విటర్‌లో ఉంచింది. కేదార్ జాదవ్, దినేశ్ కార్తీక్‌లు అభిమానులకు ఆటోగ్రాఫ్‌లు ఇవ్వడం.. కెప్టెన్ విరాట్ కోహ్లి, భార్య అనుష్క‌శర్మతో కలిసి రావడం లాంటి దృశ్యాలు ఈ వీడియోలో కనిపించాయి. బుధవారం నేపియర్‌లో జరిగే తొలి వన్డే కోసం భారత జట్టు సోమవారం బయల్దేరి వెళ్లనుంది. రెండు, మూడు వన్డేలు తౌరంగలో (26, 28న), నాలుగో వన్డే హామిల్టన్ (31న), ఐదో వన్డే వెల్లింగ్టన్‌లో (ఫిబ్రవరి 3న) జరుగుతాయి. తొలి టీ20 వెల్లింగ్టన్‌లో (ఫిబ్రవరి 6న), రెండో టీ20 ఆక్లాండ్‌లో (8న), మూడో టీ20 హామిల్టన్ (10న)లో జరుగుతాయి.

వన్డే బ్రాడ్‌మన్.. కోహ్లి




దిల్లీ: వన్డే క్రికెట్లో ఇప్పటికీ ధోనినే ప్రపంచంలో అత్యుత్తమ ఫినిషర్ అని ఆస్ట్రేలియా మాజీ కెప్టెన్ ఇయాన్ ఛాపెల్ అన్నాడు. "విజయంతో ముగింపునివ్వడంలో ధోనికి ఎవరూ సాటి రారు. తీవ్ర ఒత్తిడి.. ఉత్కంఠభరిత సందర్భాల్లోనూ అతడి మెదడు చురుగ్గా పనిచేస్తుంది. ఒకప్పుడు మైకెల్ బెవాన్ బౌండరీలతో మ్యాచ్‌లు గెలిచిపించేవాడు. ఇప్పుడు ధోని సిక్సర్లతో ఆ పని చేస్తున్నాడు. 37 ఏళ్ల వయసులోనూ ధోని వికెట్ల మధ్య అత్యంత వేగంగా పరుగెత్తుతున్నాడు. సాంకేతికంగా బెవాన్ కంటే ధోనినే ఉత్తమం. వన్డే క్రికెట్లో ధోనినే అత్యుత్తమ ఫినిషర్. ఇక వన్డేల్లో అత్యుత్తమ బ్యాట్స్‌మన్ విరాట్ కోహ్లినే. ఈ విషయంలో వివ్ రిచర్డ్స్, సచిన్ తెందుల్కర్, డివిలియర్స్‌లను కోహ్లి దాటేశాడు. 'వన్డే బ్యాట్స్‌మెన్‌లో సర్ డొనాల్డ్ బ్రాడ్‌మన్'గా కోహ్లి రిటైరవడం ఖాయం" కోహ్లి వన్డే క్రికెట్లో అత్యంత గొప్ప బ్యాట్స్‌మన్ అని ఆస్ట్రేలియా మాజీ సారథి మైకెల్ క్లార్క్ అభిప్రాయపడ్డాడు. "నా దృష్టిలో వన్డే క్రికెట్లోనే కోహ్లి అత్యంత గొప్ప బ్యాట్స్‌మన్. ఈ విషయంలో నాకెలాంటి అనుమానాల్లేవు. టీమ్‌ఇండియా తరపున అతడు సాధించిన ఘనతలు అద్భుతం. కోహ్లిలో దూకుడు ఎక్కువే.. ఐతే దేశానికి విజయాలు అందించాలన్న అతడి తపనను గౌరవించాలి. వన్డే క్రికెట్లో కోహ్లినే అందరి కంటే గొప్ప" అని క్లార్క్ తెలిపాడు.

క్రికెట్టే జీవితం కాదు



దిల్లీ: ఛేదనలో రారాజు.. పరుగుల యంత్రం.. రికార్డుల మొనగాడు.. ఈ పదాలు చదవగానే ఎవరి పేరైనా మనసులో స్ఫురిస్తుంది అంటే అది విరాట్ కోహ్లిదే. ఆటగాడిగా, కెప్టెన్‌గా జట్టును ఉన్నత స్థానంలో నిలిపి, సరికొత్త రికార్డులు సృష్టిస్తూ దూసుకెళ్తోన్న ఈ టీమ్‌ఇండియా సారథికి జీవితంలో క్రికెట్ కంటే ముఖ్యమైంది మరొకటి ఉందంటా! అది తన కుటుంబం అని చెబుతున్నాడు కోహ్లి. జీవితంలో క్రికెట్ కేవలం ఓ భాగం మాత్రమే అని, కుటుంబానికే మొదటి ప్రాధాన్యత ఇస్తానని కోహ్లి అంటున్నాడు. "ఎనిమిదేళ్ల తర్వాత ఏం చేస్తారు అని నన్ను అడిగితే? కుటుంబానికి ప్రాధాన్యతనిస్తానని చెప్తా. నేను, నా భార్య అనుష్క, మా కుటుంబం అంతే. క్రికెట్ ఎలాగో నా జీవితంలో భాగం. కానీ కుటుంబానికి మొదటి ప్రాధాన్యత ఇవ్వాలనుకుంటా. ఎందుకంటే జీవితంలో కుటుంబానికి మించి ఏముంది? క్రికెట్ జీవితం కంటే ఎక్కువ కాదు. కొంతమంది ఆ విషయాన్ని వదిలేసి తీవ్రంగా ఆలోచిస్తుంటారు. అది సరికాదు. జీవితంలో ఏం జరిగినా.. జరగాల్సి ఉన్నా కూడా తిరిగి నువ్వు ఇంటికి రావాల్సిందే. కాబట్టి నా ప్రాధాన్యత ఎప్పుడూ కుటుంబానికే. క్రికెట్‌కు నా జీవితంలో ప్రత్యేక స్థానం ఉంది కానీ అదే జీవితం కాదు. ఎనిమిదేళ్ల తర్వాత నేను పూర్తిగా కుటుంబంపైనే దృష్టి సారిస్తా" అని కోహ్లి పేర్కొన్నాడు. ఆస్ట్రేలియాతో రెండో వన్డేలో శతకం సాధించిన కోహ్లి.. అత్యధిక అంతర్జాతీయ శతకాల్లో శ్రీలంక దిగ్గజం కుమార సంగక్కరను దాటి మూడో స్థానంలో నిలిచాడు. కోహ్లి కంటే ముందు పాంటింగ్, సచిన్ మాత్రమే ఉన్నారు. ప్రస్తుతం కోహ్లి ఖాతాలో 64 అంతర్జాతీయ శతకాలున్నాయి.

ఫెదరర్‌కు షాక్




- ఆస్ట్రేలియన్ ఓపెన్ నుంచి ఔట్
- సిట్సిపాస్ పెను సంచలనం
- నిష్క్రమించిన కెర్బర్

ఆస్ట్రేలియన్ ఓపెన్‌లో పెను సంచలనం. ఫేవరెట్ రోజర్ ఫెదరర్ ఔట్. హోరాహోరీ పోరులో ఫెదరర్‌కు షాకిస్తూ గ్రీస్ కుర్రాడు సిట్సిపాస్ కెరీర్‌లో తొలిసారి గ్రాండ్‌స్లామ్ క్వార్టర్‌ఫైనల్‌కు దూసుకెళ్లాడు. తుది ఎనిమిదిలో అడుగుపెట్టిన నాదల్.. మరో యువ సంచలనం టియోఫోతో పోరుకు సిద్ధమయ్యాడు. మహిళల సింగిల్స్‌లో రెండో సీడ్ కెర్బర్ కథ ముగిసింది. షరపోవా కూడా ఇంటిముఖం పట్టింది.

మెల్‌బోర్న్

ఆస్ట్రేలియన్ ఓపెన్‌లో హ్యాట్రిక్‌తో కొత్త ఏడాదిని ఘనంగా ఆరంభించాలనుకున్న ఫెదరర్ ఆశ నెరవేరలేదు. నాలుగో రౌండ్లోనే అతడి పోరాటం ముగిసింది. పురుషుల టెన్నిస్‌లోకి కొత్త నీరు రాకను సూచిస్తూ గ్రీస్ యువ సంచలనం స్టెఫానోస్ సిట్సిపాస్ మెల్‌బోర్న్ పార్క్‌లో ప్రకంపనలు సృష్టించాడు. నాలుగు సెట్లపాటు రసవత్తరంగా సాగిన పోరులో 20 ఏళ్ల సిట్సిపాస్ 6-7 (11-13), 7-6 (7-3), 7-5, 7-6 (7-5)తో తనకన్నా 17 ఏళ్ల పెద్దవాడైన డిఫెండింగ్ ఛాంపియన్ ఫెదరర్ (స్విట్జర్లాండ్)ను ఓడించాడు. ఓ గ్రాండ్‌స్లామ్ టోర్నీ క్వార్టర్‌ఫైనల్ చేరిన తొలి గ్రీకు ఆటగాడిగా అతడు రికార్డు సృష్టించాడు. "ఈ అనుభూతిని చెప్పడానికి నా వద్ద మాటలు లేవు. ఈ భూమి మీద ఇప్పుడు అందరి కన్నా సంతోషంగా ఉన్నది నేనే. ఫెదరర్ టెన్నిస్ దిగ్గజం. అతడంటే నాకెంతో గౌరవం. ఆరేళ్ల వయసు నుంచి ఫెదరర్ ఆట చూస్తున్నా. ఇక్కడ అతడితో తలపడడంతోనే నా కల నెరవేరింది." అని విజయం అనంతరం సిట్సిపాస్ వ్యాఖ్యానించాడు. నిజానికి ఈ మ్యాచ్‌లో పైచేయి సాధించడానికి ఫెదరర్‌కు చాలా అవకాశాలే వచ్చాయి. కానీ చేజార్చుకున్నాడు. 12 బ్రేక్ పాయింట్ అవకాశాలు రాగా అన్నింటినీ వృథా చేశాడు. అద్భుతంగా ఫోర్‌హ్యాండ్ షాట్లు ఆడే ఫెదరర్.. ఈ మ్యాచ్‌లో మాత్రం లయ తప్పాడు. కీలక సమయాల్లో పేలవ ఫోర్‌హ్యాండ్ షాట్లు ఆడాడు. అతడి 55 అనవసర తప్పిదాల్లో 33 ఫోర్‌హ్యాండ్‌తో చేసినవే కావడం గమనార్హం. ఫెదరర్ రెండో సెట్లో నాలుగు సెట్ పాయింట్లను ఉపయోగించుకోలేకపోవడం మ్యాచ్‌కే మలుపు. ఆ సెట్‌ను చేజిక్కించుకున్న తర్వాత సిట్సిపాస్ మరింత ఉత్సాహంతో ఆడాడు. మ్యాచ్‌లో అతడు 20 ఏస్‌లు కొట్టగా.. ఫెదరర్ 12 ఏస్‌లు సంధించాడు. 14వ సీడ్ సిట్సిపాస్ సెమీఫైనల్లో స్థానం కోసం 22వ సీడ్ రాబర్టో బటిస్టా అగట్ (స్పెయిన్)ను ఢీకొంటాడు. అగట్ 6-7 (6-8), 6-3, 6-2, 4-6, 6-4తో ఆరో సీడ్ సిలిచ్ (క్రొయేషియా)ను మట్టికరిపించాడు. మరోవైపు రెండో సీడ్ రఫెల్ నాదల్ (స్పెయిన్) మాత్రం సాఫీగా క్వార్టర్స్ చేరుకున్నాడు. నాలుగో రౌండ్లో అతడు 6-0, 6-1, 7-6 (7-4)తో బెర్డిచ్ (చెక్)ను మట్టికరిపించాడు. తొలి రెండు సెట్లలో తిరుగులేని ఆధిపత్యాన్ని ప్రదర్శించిన నాదల్‌కు.. మూడో సెట్లో గట్టి పోటీ ఎదురైంది. నాదల్ క్వార్టర్‌ఫైనల్లో అమెరికా సంచలన ఆటగాడు ఫ్రాన్సిస్ టియోఫోతో తలపడతాడు. హోరాహోరీగా జరిగిన ప్రీక్వార్టర్స్‌లో 20 ఏళ్ల టియోఫో 7-5, 7-6 (8-6), 6-7 (1-7), 7-5తో గ్రిగోర్ దిమిత్రోవ్ (బల్గేరియా)పై విజయం సాధించాడు. టియోఫో నుంచి నాదల్‌కు గట్టి పోటీ తప్పదని భావిస్తున్నారు. వీళ్లు ఇంతకుముందెప్పుడూ తలపడలేదు.

గ్రీకు వీరుడు



1 గ్రీస్ నుంచి ఓ గ్రాండ్‌స్లామ్ టోర్నీలో క్వార్టర్‌ఫైనల్ చేరిన తొలి ఆటగాడు స్టెఫానోస్ సిట్సిపాస్

ఈనాడు క్రీడావిభాగం

సిట్సిపాస్.. రోజర్ ఫెదరర్‌ను ఓడించి ఆస్ట్రేలియన్ ఓపెన్లో పెను సంచలనమే సృష్టించాడీ 20 ఏళ్ల గ్రీస్ కుర్రాడు. 2016 నుంచి ఏటీపీ టూర్‌లో ఉన్నా గత రెండేళ్ల నుంచి తన ఉనికిని చాటుకుంటూ వస్తున్నాడు సిట్సిపాస్. అతని తండ్రిది గ్రీసు.. తల్లిది రష్యా. ఇద్దరూ టెన్నిస్ క్రీడాకారులు కావడం సిట్సిపాస్‌కు కలిసొచ్చింది. ముఖ్యంగా అతని తల్లి జూనియర్ ర్యాంకింగ్స్‌లో ప్రపంచ నంబర్ వన్ కూడా అయింది. సిట్సిపాస్ ఇద్దరు సోదరులు, సోదరి కూడా టెన్నిస్ క్రీడాకారులే. ఆరేళ్ల వయసులో తానూ రాకెట్ పట్టిన సిట్సిపాస్.. వేగంగా ఎదిగాడు. 2016లో ఐరోపా జూనియర్ ఛాంపియన్‌షిప్ గెలిచి సత్తా చాటిన ఈ కుర్రాడు..అదే ఏడాది కెన్నిత్ రైస్మాతో కలిసి వింబుల్డన్ జూనియర్ డబుల్స్ టైటిల్ గెలుచుకున్నాడు. జూనియర్ వింబుల్డన్ గ్రాండ్‌స్లామ్ టైటిల్ గెలిచిన తొలి గ్రీకు ఆటగాడిగా సిట్సిపాస్ ఘనత సాధించాడు. అదే ఊపులో సీనియర్ సర్క్యూట్‌లోకి వచ్చిన సిట్సిపాస్ గతేడాది నొవాక్ జకోవిచ్, కెవిన్ అండర్సన్, డొమినిక్ థీమ్, అలెగ్జాండర్ జ్వెరెవ్ లాంటి టాప్ ఆటగాళ్లను ఓడించి ప్రకంపనలు రేపాడు. ఒక్క 2018లోనే అతను ఆరుగురు టాప్-10 ఆటగాళ్లను ఓడించాడంటేనే సిట్సిపాస్ జోరు అర్థం చేసుకోవచ్చు. ఆ ఏడాది వింబుల్డన్‌లో నాలుగో రౌండ్ చేరాడు కూడా. అదే ఏడాది నెక్ట్స్ జనరేషన్ ఏటీపీ టైటిల్‌ను కూడా అతను ఖాతాలో వేసుకున్నాడు. 2018లో 15వ ర్యాంకు సాధించిన సిట్సిపాస్.. టాప్-20 ర్యాంకులో నిలిచిన పిన్న వయస్కుడిగా ఘనత సాధించాడు. దూకుడుగా ఆడడం.. మెరుపు సర్వీసులు.. కోర్టులో ప్రశాంతంగా ఉండడం సిట్సిపాస్ లక్షణాలు. అందుకే మహేశ్‌భూపతి లాంటి ఆటగాళ్లు సిట్సిపాస్‌ను భవిష్యత్ నంబర్‌వన్‌గా కీర్తిస్తున్నారు. "టెన్నిస్‌లో అత్యుత్తమ ఆటగాడికి ఉండాల్సిన లక్షణాలన్నీ ఈ కుర్రాడికి ఉన్నాయి. శారీరకంగా, మానసికంగా బలంగా ఉండటమే కాదు.. మంచి నైపుణ్యం కూడా సిట్సిపాస్ సొంతం" అని భూపతి చెప్పాడు. కెరీర్‌లో తొలిసారి రోజర్ ఫెదరర్‌ను ఓడించిన సిట్సిపాస్.. సెమీస్‌లో నాదల్‌ను ఎదుర్కొనే అవకాశముంది. మరి ఈ గ్రీకు వీరుడు ఎలాంటి సంచలనాలు సృష్టిస్తాడో..!

కోలిన్స్ సంచలనం



కోలిన్స్

మహిళల సింగిల్స్‌లో చెక్ అమ్మాయి క్విటోవా క్వార్టర్‌ఫైనల్లో ప్రవేశించింది. నాలుగో రౌండ్లో ఆమె 6-2, 6-1తో అనిసిమోవా (అమెరికా)ను చిత్తుగా ఓడించింది. రెండో సీడ్ కెర్బర్ (జర్మనీ) మాత్రం అనూహ్య ఓటమితో టోర్నీ నుంచి నిష్క్రమించింది. తొలిసారి ఆస్ట్రేలియన్ ఓపెన్‌లో ఆడుతున్న డానియెల్ కోలిన్స్ (అమెరికా) ఆమెకు షాకిచ్చింది. ఏకపక్షంగా సాగిన పోరులో కోలిన్స్ 6-0, 6-2తో మాజీ ఛాంపియన్ కెర్బర్‌ను చిత్తుగా ఓడించింది. ఐదో సీడ్ స్టీఫెన్స్ (అమెరికా) కథ కూడా ముగిసింది. నాలుగో రౌండ్లో ఆమె 7-6 (7-3), 3-6, 3-6తో పవ్లిచెంకోవా (రష్యా) చేతిలో ఓడిపోయింది. మాజీ ఛాంపియన్ మరియా షరపోవా (రష్యా) 6-4, 1-6, 4-6తో ఆస్ట్రేలియాకు చెందిన ఆష్లే బార్టీ చేతిలో కంగుతింది.

అప్పుడు విండీస్.. ఇప్పుడు టీమ్ ఇండియా

డీన్ జోన్స్

ఆస్ట్రేలియాలో టీమ్‌ఇండియాకు అత్యంత గొప్ప పర్యటన ఇదే. పెర్త్ టెస్టులో పేలవమైన ఆటతీరు తప్పితే మొత్తంగా టీమ్‌ఇండియా అదరగొట్టింది. విదేశీ గడ్డపై యువ ఆటగాళ్లు సత్తాచాటారు. తొలి అవకాశంలోనే చాహల్ అద్భుతంగా రాణించాడు. కుల్‌దీప్‌యాదవ్ ఆకట్టుకున్నాడు. టెస్టుల్లో మెరిసిన షమి.. వన్డే సిరీస్‌నూ గొప్పగా ముగించాడు. రోహిత్‌శర్మ వన్డేల్లోనూ సత్తాచాటాడు. పర్యటన ఆసాంతం విరాట్ కోహ్లి అద్భుతంగా సారథ్యం వహించాడు. ఇప్పుడు ధోనినే ప్రధాన 'సమస్య'. జట్టులో ధోని మళ్లీ యథాస్థానానికి చేరుకున్నాడు. ఈనేపథ్యంలో రిషబ్ పంత్‌ను కేవలం

బ్యాట్స్‌మన్‌గానే జట్టులోకి ఎంపిక చేస్తారా? అన్నది ప్రశ్న. ప్రపంచ కప్‌కు ఇదే అత్యుత్తమ జట్టు. 80ల్లో, 90ల ఆరంభంలో వెస్టిండీస్‌కు ఇప్పటి టీమ్ ఇండియా ఏమాత్రం తీసిపోదు. ఎవరి గడ్డ మీదనైనా గెలువగలరన్న పేరును టీమ్‌ఇండియా నిలబెట్టుకోవాలి. అస్సలు కాడి వదలొద్దు. అప్పట్లో విండీస్ అనగానే ప్రత్యర్థుల గుండెల్లో దడ పుట్టేది. ఇప్పుడు టీమ్‌ఇండియాకు అలాంటి పేరే వచ్చింది. ప్రపంచ కప్‌లో టీమ్‌ఇండియాకు గొప్ప నైతిక స్థైర్యమిది. తుదిజట్టులో ఎవరు కావాలంటే వారిని ఎంపిక చేసుకునే వెసులుబాటు టీమ్‌ఇండియాకు ఉంది. ఒక్కో స్థానానికి 15 మంది పోటీపడుతున్నారు! ఎన్నో ప్రత్యమ్నాయాలు! కోహ్లి పూర్తి చేయకపోతే రోహిత్. అతడు చేయలేకపోతే ధోని ముగిస్తాడు. ఈ పర్యటనలో గతం కంటే ఎక్కువ మంది ఆసీస్ అభిమానుల్ని కోహ్లి సంపాదించుకున్నాడు.

ఆస్ట్రేలియన్ ఓపెన్‌లో లవ్వాట

మోన్‌ఫిల్స్, స్వితొలినా



సంచలనాలతో సాగుతున్న ఆస్ట్రేలియన్ ఓపెన్‌లో లవ్వాటలు వేడెక్కిస్తున్నాయి. ఉక్రెయిన్ భామ ఎలినా స్వితొలినా, ఫ్రాన్స్ స్టార్ మోన్‌ఫిల్స్ ఇటీవలే ఉమ్మడిగా ఇన్‌స్టాగ్రామ్ ఖాతా తెరిచి తమ మధ్య ప్రేమ బంధాన్ని ప్రపంచానికి చాటారు. తన మ్యాచ్‌లకు మోన్‌ఫిల్స్ వస్తుండటంపై ప్రశ్నలు ఎదురవుతుండటంతో.. అతడితో ప్రేమలో ఉన్నట్లు గత వారమే స్వితొలినా వెల్లడించింది. "నాకు మద్దతు ఇవ్వడానికే మోన్‌ఫిల్స్ నా మ్యాచ్‌లకు వస్తున్నాడు. నేను అతని మ్యాచ్‌లకు వెళుతున్నా" అని ఆమె చెప్పింది. స్వితొలినా-మోన్‌ఫిల్స్ మాత్రమే కాదు వావ్రింకా-డొనా వికిచ్, డొనిమిక్ థీమ్-మ్లదెనోవిచ్ కూడా ఉమ్మడి ఖాతాలు తెరిస్తే చూడాలని ఉంది అని ఆస్ట్రేలియా యువ క్రీడాకారిణి డారియా గవ్‌రిలొవా అంది. మరోవైపు తన ప్రేయసి గురించి మాట్లాడేందుకు ఇష్టపడని రఫెల్ నాదల్ కూడా తన మనసు విప్పాడు. నాదల్ ప్రిక్వార్టర్స్ మ్యాచ్ చూసేందుకు అతడి ప్రేయసి జిస్కా పెరెల్లో స్టేడియానికి వచ్చింది. దీనిపై మాజీ ఆటగాడు జిమ్ కొరియర్ చాలా కాలం తర్వాత పెరెల్లో వచ్చినట్టుంది అని అడగ్గా.. "2005లో వైల్డ్‌కార్డు రూపంలో నా హృదయంలో ప్రవేశించింది. పద్నాలుగేళ్లు నాతో కలిసి ఉన్న తర్వాత తను తిరిగి ఇక్కడికి రావడానికి వైల్డ్‌కార్డు అవసరం లేదు. ఆమె ఎప్పుడు రావాలనుకుంటే అప్పుడు రావొచ్చు" అని బదులిచ్చాడు నాదల్. తన వల్ల రఫెల్ దృష్టి ఆట మీద నుంచి మరలకూడదనే జిస్కా అతనాడే టోర్నీలకు దూరంగా ఉంటుంది. అయితే ప్రస్తుత ఆస్ట్రేలియన్ ఓపెన్‌లో నాదల్ ఆడే ప్రతి మ్యాచ్‌కు హాజరై అతణ్ని ప్రోత్సహిస్తోంది.



ప్రాణాపాయ స్థితిలో జాకబ్ మార్టిన్



వదోదర: భారత మాజీ క్రికెటర్, బరోడాను రంజీ విజేతగా నిలబెట్టిన మాజీ కెప్టెన్ జాకబ్ మార్టిన్ ప్రాణాపాయ స్థితిలో ఉన్నాడు. నిరుడు డిసెంబర్ 28న రోడ్డు ప్రమాదానికి గురై తీవ్ర గాయాలతో ఆసుపత్రి పాలైన మార్టిన్ పరిస్థితి విషమంగా ఉంది. మార్టిన్‌కు కృత్రిమ శ్వాస అందిస్తున్నారు. అతని ఆసుపత్రి ఖర్చుల కోసం బీసీసీఐ రూ.5 లక్షలు, బరోడా క్రికెట్ సంఘం రూ.3 లక్షలు సాయం చేశాయి. అయితే మార్టిన్ వైద్యానికి ఇప్పటికే రూ.11 లక్షలు ఖర్చు అయినట్లు.. మరిన్ని నిధుల కోసం దాతలను అర్థిస్తున్నట్లు బరోడా క్రికెట్ సంఘం కార్యదర్శి సంజయ్ పటేల్ చెప్పాడు. 1999-2001 మధ్య కాలంలో భారత్ తరపున 10 వన్డేలు ఆడిన జాకబ్.. దేశవాళీ పోటీల్లో బరోడా, రైల్వేస్‌కు ప్రాతినిధ్యం వహించాడు. 2000-01 సీజన్లో బరోడా తొలిసారి రంజీ టైటిల్ గెలవడంలో జాకబ్‌ది కీలకపాత్ర.

ధీరజ్‌కు రజతం

పుణె: ఖేలో ఇండియా యూత్ క్రీడల్లో ఆంధ్రప్రదేశ్ ఆర్చరీ క్రీడాకారుడు ధీరజ్ మెరిశాడు. అండర్-21 పురుషుల వ్యక్తిగత రికర్వ్ విభాగంలో రజతం సాధించాడు. ఆదివారం ఫైనల్లో ధీరజ్ 2-6 తేడాతో సచిన్ (హరియాణా) చేతిలో పరాజయం చెందాడు. విజయవాడలోని చెరుకూరి వోల్గా ఆర్చరీ అకాడమీలో ధీరజ్ శిక్షణ పొందుతున్నాడు. ఖేలో ఇండియా యూత్ క్రీడలు ఆదివారం ముగిశాయి. 85 స్వర్ణాలతో మహారాష్ట్ర ఓవరాల్ ఛాంపియన్‌గా నిలిచింది.

పంజాబ్‌ను గెలిపించిన బజ్‌రంగ్

లూధియానా: ప్రో రెజ్లింగ్ లీగ్-4లో డిఫెండింగ్ ఛాంపియన్ పంజాబ్ రాయల్స్ తొలి విజయం సాధించింది. బజ్‌రంగ్ పునియా సత్తా చాటడంతో ఆదివారం జరిగిన పోరులో 4-3తో దిల్లీ సుల్తాన్స్‌ను ఓడించింది. ఆరు బౌట్లు ముగిసే సరికి రెండు జట్లు 3-3తో సమంగా నిలిచాయి. నిర్ణయాత్మక ఏడో బౌట్లో బజ్‌రంగ్ (65 కేజీ) 9-0తో ఆండ్రీ క్వ్యయకోవ్‌స్కీని ఓడించి పంజాబ్‌కు విజయాన్నందించాడు.

ఆర్పీఎఫ్ పరీక్ష నిర్వహణలో గందరగోళం

- దుండిగల్‌లోని ఐఏఆర్ఈలో నిర్వహించాల్సిన పరీక్ష వాయిదా
- నెట్‌వర్క్ సమస్యలతో కోదాడలోని ఓ కేంద్రంలో నిలిపివేత



దుండిగల్‌లోని ఐఏఆర్ఈ కళాశాల ఎదుట ఆందోళన చేస్తున్న అభ్యర్థులు

దుండిగల్, కోదాడ,న్యూస్‌టుడే: రాష్ట్రంలో ఆదివారం నిర్వహించిన రైల్వే ప్రొటెక్షన్ ఫోర్స్(ఆర్పీఎఫ్) ఆన్‌లైన్ పరీక్ష సందర్భంగా పలు చోట్ల గందరగోళ పరిస్థితులు ఏర్పడ్డాయి. దీంతో హైదరాబాద్ దుండిగల్‌లోని ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఏరోనాటికల్ ఇంజినీరింగ్(ఐఏఆర్ఈ) కళాశాలలో జరగాల్సిన ఆర్పీఎఫ్ కానిస్టేబుల్ ఆన్‌లైన్ పరీక్ష వాయిదా పడింది. ఇక్కడ రాయాల్సి ఉన్న 2,400 మంది అభ్యర్థులకు త్వరలో పరీక్ష నిర్వహిస్తామని ఆర్పీఎఫ్ ప్రకటించింది. ఈ కేంద్రంలో మొత్తం మూడు స్లాట్లలో 2400 మంది అభ్యర్థులకు పరీక్ష నిర్వహించే బాధ్యతను ఎస్ఎస్ఈ సంస్థకు ఆర్పీఎఫ్ అప్పగించింది. అయితే నిర్వహణ లోపాల వల్ల పరీక్ష జరగలేదు. అభ్యర్థులకు ముందుగా పరీక్ష రాసే గదులు, కంప్యూటర్లను కేటాయించలేదు. చివరి నిమిషంలో హడావుడిగా కేటాయించినా సాంకేతిక సమస్యలు తలెత్తాయి. వేలిముద్రల యంత్రాలు, కొన్ని కంప్యూటర్లు మొరాయించడంతో నిర్వాహకులు చేతులెత్తేశారు. దీంతో అభ్యర్థులు కళాశాల ఎదుట ఆందోళనకు దిగారు. మధ్యాహ్నం 2.30 గంటల ప్రాంతంలో పరీక్షను వాయిదా వేస్తున్నట్లు అధికారులు ప్రకటించడంతో శాంతించారు. త్వరలో పరీక్ష నిర్వహిస్తామంటూ అభ్యర్థుల సెల్‌ఫోన్లకు ఆర్పీఎఫ్ సంక్షిప్త సందేశాలను పంపింది. అలాగే సూర్యాపేట జిల్లా కోదాడలోని కిట్స్ మహిళా ఇంజినీరింగ్ కళాశాలలో నిర్వహించిన ఈ పరీక్షకు నెట్‌వర్క్ లోపాలు తలెత్తడంతో కంప్యూటర్లలో ప్రశ్నపత్రం కనిపించలేదు. రెండు గంటలకు పైగా వేచి చూసిన అభ్యర్థులు సహనం కోల్పోయి ఆందోళనకు దిగారు. కళాశాలలో ఫర్నిచర్‌ను ధ్వంసం చేశారు. పోలీసులు అభ్యర్థులతో మాట్లాడి శాంతింపజేశారు. ఉన్నతాధికారులకు విషయం తెలియజేసి తిరిగి పరీక్ష నిర్వహించేందుకు చర్యలు తీసుకుంటామని పోలీసులు, నిర్వాహకులు తెలపడంతో వివాదం సద్దుమణిగింది. ఈ కేంద్రంలో మూడు దఫాలుగా నిర్వహించాల్సి ఉండగా ఉదయం పరీక్ష సజావుగానే పూర్తయింది. మధ్యాహ్నం జరగాల్సిన పరీక్ష సమయంలో ఈ పరిస్థితి ఏర్పడింది. దీంతో చివరి రెండు పరీక్షలు జరగలేదు.

ఏపీ ఉద్యోగి ఒక్కరొచ్చినా ఉద్యమమే

విద్యుత్తు ఇంజినీర్స్ అసోసియేషన్

ఖైరతాబాద్, న్యూస్‌టుడే: తెలంగాణను వీడకుండా ఉన్న 1157 మంది ఏపీ విద్యుత్తు ఉద్యోగుల కోసం కమిషన్ వేస్తే, దానిని అడ్డం పెట్టుకుని ఆంధ్రప్రదేశ్‌లోని ఇతర ఉద్యోగులంతా రాష్ట్రంలోకి చొరబడేందుకు యత్నిస్తున్నారని తెలంగాణ విద్యుత్తు ఇంజినీర్ల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు శివాజీ ఆరోపించారు. ఏపీ నుంచి ఒక్క ఉద్యోగి వచ్చినా మరో ఉద్యమం చేపడుతామన్నారు. ఆదివారం మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. 1157 మంది ఉద్యోగుల విభజన, ముల్కీ నిబంధనల అమలుకు సుప్రీం కోర్టు మాజీ న్యాయమూర్తి జస్టిస్ ధర్మాధికారి నేతృత్వంలోని కమిటీ నగరానికి రాగా తెలంగాణ ఆప్షన్‌గా లేఖలు ఇచ్చేందుకు ఆంధ్రా ఉద్యోగులు వేలాదిగా వచ్చారన్నారు. తెలంగాణ ఆప్షన్ పెట్టుకోవాలని ఏకంగా ఏపీ విద్యుత్తు సంస్థల అధికారులు సర్క్యులర్ విడుదల చేశారని ఆరోపించారు.

విదేశాలకు సాయంలో భారతీయుల ముందంజ

- సర్వేలో వెల్లడి

దావోస్: విదేశాలకు సాయం చేయడంలో భారతీయులు ముందుంటున్నారు. తమ దేశం ఇతర దేశాలకు సాయం చేయడాన్ని స్వాగతిస్తున్నారు. ఈ విషయంలో ప్రపంచంలోనే అగ్రస్థానంలో ఉన్నారు. దావోస్‌లో 'ప్రపంచ ఆర్థిక వేదిక' (డబ్ల్యూఈఎఫ్) సదస్సు ప్రారంభంకానున్న సందర్భంగా ఆదివారం విడుదల చేసిన సర్వేలో ఈ విషయం వెల్లడయింది. అంతర్జాతీయంగా సాయం అందించడానికి 95 శాతం భారతీయులు సమ్మతిస్తున్నారు. 94 శాతంతో తరువాత స్థానాల్లో ఇండోనేసియా, పాకిస్థాన్‌లు ఉన్నాయి. అగ్రరాజ్యాలైన ఫ్రాన్స్, బ్రిటన్, జర్మనీ, అమెరికాల్లో ఈ సమ్మతి 60 కన్నా తక్కువ శాతం ఉంది.

★ వలసలపై ఉత్తర అమెరికా వాసులు సానుకూలత వ్యక్తం చేయగా, ఐరోపా వాసులు వ్యతిరేకించారు. తమ దేశానికి కొత్తగా వలస వచ్చే వారి వల్ల మేలు కలుగుతుందని 63 శాతం మంది అమెరికావాసులు అభిప్రాయపడుతున్నారు.

ప్రజాకర్షణ కన్నా పారదర్శకతే మేలు

ప్రజాకర్షక విధానాల కన్నా, పారదర్శకతతో అమలు చేసే విధానాలే మంచివని ప్రపంచంలోని అత్యధికులు అభిప్రాయపడుతున్నారు. కొన్ని దేశాలు రక్షణాత్మక విధానాలను అనుసరిస్తుండడం, వాణిజ్య వివాదాలు పెరుగుతున్న నేపథ్యంలో ఈ అభిప్రాయనికి ప్రాధాన్యం ఏర్పడింది. దేశాలు పరస్పరం సహకరించుకోవాలని, వలసలపై స్వేచ్ఛాయత విధానాలు అనుసరించాలని కోరుతున్నారు. ఇతరుల ప్రయోజనాలను పణంగా పెట్టి దేశాన్ని అభివృద్ధి చేసుకోవాలన్న విధానం మంచిది కాదని చెబుతున్నారు. జీవితంలో ఉన్నతస్థానాలకు వెళ్లడానికి తగిన అవకాశాలు లేవని, ఇందుకు ప్రభుత్వాలు తగిన చర్యలు తీసుకోవడం లేదని ఎక్కువ మంది భావిస్తున్నారు.

పాదరక్షల్లో రెండు కిలోల పసిడి

- శంషాబాద్ విమానాశ్రయంలో పట్టివేత



స్వాధీనం చేసుకున్న బంగారం బిస్కెట్లు

శంషాబాద్ గ్రామీణ, న్యూస్‌టుడే: పాదరక్షల అడుగుభాగంలో బంగారం బిస్కెట్లను తరలిస్తున్న వ్యక్తి అరెస్టయ్యాడు దీని విలువ సుమారు రూ.66.2 లక్షలు ఉంటుందని డీఆర్ఐ అధికారులు తెలిపారు. షార్జా నుంచి ఓ ప్రయాణికుడు సుమారు 2 కిలోల బంగారాన్ని లగేజీలో పెట్టుకొని ఆదివారం ఉదయం మధ్యప్రదేశ్‌లోని ఇండోర్ విమానాశ్రయంలో దిగాడు. ఇండోర్ నుంచి శంషాబాద్ వెళ్తున్న మరో వ్యక్తికి ఆ బంగారాన్ని అందజేశాడు. సదరు వ్యక్తి ఆ బంగారు బిస్కెట్లను తన పాదరక్షల అడుగుభాగంలో పెట్టుకుని శంషాబాద్ విమానాశ్రయంలో దిగాడు. ఎయిర్‌పోర్టు నుంచి బయటకు వస్తున్న ఆ ప్రయాణికుడిని డీఆర్ఐ అధికారులు అదుపులోకి తీసుకున్నారు. తనిఖీల్లో బంగారం గుట్టురట్టయ్యింది.

చిచ్చు రేపిన కులాంతర వివాహం

- ప్రేమ వివాహం చేసుకున్న కుమార్తె
- మూడేళ్ల తర్వాత పుట్టింటికి
- మనస్తాపంతో తండ్రి ఆత్మహత్య

వెల్దండ, న్యూస్‌టుడే: కుమార్తె కులాంతర వివాహం చేసుకోవడంతో తండ్రి ఆగ్రహించాడు. ఇంటికి రావద్దంటూ ఆంక్షలు విధించాడు. వాటిని తోసిరాజని పుట్టింటికి వచ్చిన బిడ్డను ఆహ్వానించలేక చివరికి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. నాగర్‌కర్నూల్ జిల్లా వెల్దండ మండలంలో ఆదివారం జరిగిన ఘటన కుటుంబంలో విషాదానికి కారణమైంది. వెల్దండ మండలం కొట్రా గ్రామానికి చెందిన చిట్టి లక్ష్మమ్మ, శ్రీశైలం(45) దంపతుల పెద్ద కుమార్తె మూడేళ్ల క్రితం అదే గ్రామానికి చెందిన యువకుడిని కులాంతర వివాహం చేసుకొంది. ఈ పరిణామంతో ఆగ్రహం చెందిన తండ్రి ఇకపై ఇంటికి రావద్దంటూ కుమార్తెపై ఆంక్షలు విధించాడు. వస్తే ఆత్మహత్య చేసుకుంటానని హెచ్చరించాడు. ఈ పరిణామాల నేపథ్యంలో యువతి మూడేళ్లుగా పుట్టింటి గడప తొక్కలేదు. మూడేళ్ల తర్వాత తొలిసారి శనివారం సాయంత్రం అమ్మగారింటికి వచ్చిన ఆమెపై తండ్రి శ్రీశైలం ఆగ్రహం వ్యక్తం చేశాడు. కుటుంబ సభ్యులతో గొడవపడ్డాడు. అదే రోజు రాత్రి ఇంటి ఎదుటే ఉన్న చెట్టుకు ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఆదివారం వేకువజామున కుటుంబ సభ్యులు గమనించి పోలీసులకు సమాచారం అందించారు. లక్ష్మమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్టు ఎస్సై వీరబాబు తెలిపారు.

ఏపీ ఉద్యోగ, ఉపాధ్యాయ ఐకాస ఛైర్మన్‌గా చంద్రశేఖర్‌రెడ్డి

ఈనాడు డిజిటల్– అమరావతి: ఆంధ్రప్రదేశ్ ఉద్యోగ, ఉపాధ్యాయ, కార్మిక, పింఛనుదారుల ఐకాస ఛైర్మన్‌గా ఎన్.చంద్రశేఖర్‌రెడ్డి ఎన్నికయ్యారు. ప్రస్తుతం ఈయన ఏపీ ఎన్జీవో సంఘం అధ్యక్షుడిగా వ్యవహరిస్తున్నారు. ఆదివారం విజయవాడలోని ఏపీఎన్జీవో భవన్‌లో జరిగిన ఐకాస కార్యవర్గ సమావేశంలో ఆయనను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి ఐకాస ఆధ్వర్యంలో ఈ నెల 23న విస్తృత స్థాయి సమావేశం నిర్వహించనున్నట్లు తెలిపారు. ప్రధానంగా ఉద్యోగులకు 35 శాతం మధ్యంతర భృతి ప్రకటించాలన్న డిమాండ్‌తో దీన్ని నిర్వహించనున్నట్లు వివరించారు.

Editor: Ramoji Rao, Printed and Published by him on behalf of Ushodaya Publications, a division of Ushodaya Enterprises Private Limited, and printed at Eenadu Press, Alugunoor, Karimnagar - 505 527, Telangana. Cell: 99590 21802, 99590 21803 RNI No. 52793/92, Regd. No. G/RN/KAR/48/2018-20 Eenadu, Karimnagar. Air surcharge extra. Mumbai, Kolkata, Goa. Re.1-00, Portblair Rs.10.00

"వినూత్నమైన ఆలోచన నుంచి విభిన్నమైన ఆవిష్కరణ సాధ్యమవుతుంది"

– ఏపీజే అబ్దుల్ కలాం, భారత మాజీ రాష్ట్రపతి

సాధారణంగా బొకేలు దేంతో తయారు చేస్తారు..? పూలతో...
కానీ ఇక్కడ కూరగాయలు, ఆకుకూరలతో తయారు చేస్తారు...
ఆశ్చర్యపోకండి... ఇంకా ఉంది...
మనం బొకేలు ఎవరికైనా ఇస్తే వాళ్లేం చేస్తారు... కొద్దిసేపు తమతో ఉంచుకుని తర్వాత వాటిని ఎక్కడైనా పడేస్తారు...
కానీ ఈ బొకేలోని కూరగాయలతో చక్కగా వండుకోవచ్చు. విందు చేసుకోవచ్చు...
ఎందుకంటే ఇవన్నీ సేంద్రియ విధానంలో పండించిన కూరగాయలు కాబట్టి...

ఈ బొకేలను భోంచేయొచ్చు



తిరుపతి పద్మావతిపురానికి చెందిన సాయికుమార్ నగరంలో పూలబొకేల దుకాణం నిర్వహించుకునేవారు... చిన్నగా మొదలైన వ్యాపారాన్ని తన పరిచయాలతో పెంచుకున్నారు... ఇంతలోనే తిరుపతిలో ప్లాస్టిక్ నిషేధం అమల్లోకి తెచ్చారు. దీంతో వ్యాపారం నిర్వహించుకునేందుకు సాయికుమార్‌కు అడ్డంకులు ఎదురయ్యాయి. అనుకోకుండా వచ్చిన కష్టానికి పరిష్కారం ఆలోచిస్తూ... ఇంటికి వెళుతుండగా దారిలో పూలన్నీ కుప్పలు తెప్పలుగా రోడ్డుపై పడిపోయి ఉండటం గమనించాడు. ఎంతో అపురూపంగా... శ్రమతో తయారు చేస్తున్న పూలబొకేలు ఇదే రీతిలో పడేస్తున్నారా..? వాటిని దాచుకుంటున్నారా...? దాచుకుంటే ఆ వాడిన పూలను ఎన్నిరోజులు ఇంట్లో ఉంచుకుంటారు..? అన్న ఆలోచనలు అతని కొత్త ఆవిష్కరణకు కారణమయ్యాయి.



■ సాయికుమార్ కుటుంబసభ్యులు మార్కెట్లో కాయగూరలు కొనరు. తమ పెరట్లో సేంద్రియ పద్ధతిలో పెంచుకునే కూరగాయలతోనే వారి ఆహారం తయారవుతుంది. సాయికుమార్‌కు కూడా సేంద్రియ వ్యవసాయం అంటే విపరీతమైన అభిమానం. సేంద్రియ పద్ధతిలో పెంచిన తాజా కూరగాయాలనే బొకేలుగా మార్చితే... వాటినే బహుమతిగా ఇస్తే... అందుకునేవారు వాటిని తాజాగా కూర చేసుకొని తింటే... ఆరోగ్యానికి ఆరోగ్యం... బహుమతికి అర్థం ఉంటుందని భావించాడు. మొదట ఒక బొకేను తయారు చేసి దుకాణంలో ఉంచారు. రెడ్ క్యాప్సికం, గ్రీన్ క్యాప్సికం, దోసకాయ, ఆనపకాయ, వంకాయ, బెండకాయ, క్యాబేజీ, క్యారెట్ ఇలా కూరగాయలను చూడచక్కగా వరుసలో పేర్చి... కాగితంతో తయారు చేసిన అందమైన బుట్టలో ఉంచిన ఈ బొకేను చూసిన చాలామంది నుంచి వారెవ్వా అన్నారు. మొదటి రోజు 2 బొకేలు అమ్ముడుపోయాయి. బహుమతిగా కూరగాయాల బొకే ఇచ్చిన వారు... వాటిని స్వీకరించిన వారు మురిసిపోయారు. అతి తక్కువ సమయంలోనే తిరుపతిలో చాలామంది ఈ కొత్తరకం కూరగాయల బహుమతికి ఫిదా అయ్యారు. జనవరి 1న సాయికుమార్ సుమారుగా 50 వరకు బొకేలు అమ్మారు.



■ గతంలో బొకెల కోసం పూలను ప్రత్యేకంగా బెంగళూరు నుంచి తెప్పించేవారు. దీంతోపాటు పలమనేరు, కుప్పం, బి.కొత్తకోటతోపాటు.. విదేశాల నుంచి పుష్పాలు వచ్చేవి. వీటి ఖరీదు ఎక్కువగా ఉండేది. అయితే సాయికుమార్ విన్నూతమైన ఆలోచనతో ప్రస్తుతం అతడి విరుల ఖర్చు తగ్గింది. అయితే తాజా కూరగాయలు మాత్రం తన ఇంటి పెరట్లోవే వాడుతున్నాడు. అయితే రాన్రాను వస్తున్న ఆర్డర్లతో ప్రస్తుతం తాను పండించే కూరగాయాలు సరిపోని పరిస్థితి వచ్చింది. దీంతో సేంద్రీయ సాగుతో కూరగాయాల పంటలు పండించే వారి ద్వారా కూరగాయలు కొనుగోలు చేయాలని చూస్తున్నాడు... తన విభిన్నమైన ఆలోచనకు ప్రజల నుంచి వస్తున్న మద్దతు... స్పందన ఆశ్చర్యానికి గురిచేస్తోందని సాయికుమార్ చెబుతున్నాడు.

- చిత్ర కథనం: **సింహాచలం,** తిరుపతి



భళా... పుస్తకాలయ్యా!

నెత్తిన బస్తాతో చకచకా నడుచుకుంటూ వెళ్తున్న ఈ వ్యక్తి
ఏ ఎరువుల బస్తానో మోసుకెళుతున్న సన్నకారు రైతూ కాదు...
వీధుల్లో తిరిగి సరకులను అమ్ముకునే చిరు వ్యాపారీ కాదు...
ఈయనో నిరుపేద...
కానీ ఆయన లక్ష్యం అచంచలమైంది...
ఆయన ప్రయత్నం ఆదర్శప్రాయమైంది.
తనకు వచ్చేది అతి కొద్ది ఆదాయమైనా
అందులోంచే పేద పిల్లలకు పుస్తకాలిస్తారు.
తన ఒంట్లో శక్తి సన్నగిల్లుతున్నా, చేతిలో రూపాయి కాసు లేకున్నా వాటిని ఇలా మోసుకుంటూ పాఠశాల వరకు తీసుకెళ్లి పిల్లలకు అందజేస్తారు.
మన చేతిలో ఉన్న చిన్న వస్తువును కూడా ఎవరికైనా ఇవ్వాలంటే ఆలోచిస్తాం. కానీ తన కష్టార్జితంలో అత్యధిక భాగాన్ని పదిమంది పిల్లల చదువు కోసం వినియోగిస్తున్న ఆయన సేవను ఏమనాలి? ఏ విలువ కట్టాలి?
ఇదే కదా నిజమైన చదువులమ్మ పూజ....

కుటుంబ పరిస్థితుల కారణంగా చదువుకోలేకపోయాను. ఆ బాధ నాకు మొదటి నుంచీ ఉంది. చదువుకునే పేద పిల్లలకు ఏదైనా సాయం చేయాలనిపించింది. పని చేయగలిగే శక్తి ఉన్నంత కాలం నా కష్టార్జితం రాత పుస్తకాలు ఇవ్వాలనుకున్నాను. చదువుకుంటే జీవితంలో బాగా స్థిరపడవచ్చు. సమాజానికి ఏదైనా మంచి చేయొచ్చు. పిల్లలకు పుస్తకాలు ఇస్తున్న సమయంలో ఎంత సంతోషపడతానో చెప్పలేను. ఆ పిల్లల కోసం ఎంత బరువైనా మోయాలనిపిస్తుంది. - వెంకటేశ్వర్లు

ఆయన పేరు చిమటా వెంకటేశ్వర్లు. ఊరు ప్రకాశం జిల్లా పర్చూరు మండలం నూతలపాడు. ఆయన వయసు కూడా ఇప్పుడు ఏడు పదులు దాటుతోంది. ఒకే కుమారుడు చిన్ననాడే చనిపోయాడు. భార్య దూరంగా ఉంటోంది. శతాధిక వృద్ధురాలైన తల్లి వెంకటసుబ్బమ్మను చూసుకోవాల్సిన బాధ్యతా అతనిపై ఉంది. ఉన్న ఎకరం, కౌలుకు తీసుకున్న మరో ఎకరం పొలం పండితేనే కుటుంబ పోషణ సాధ్యమవుతుంది. ఇంతటి క్లిష్టపరిస్థితుల్లో కూడా తన ఆశయాన్ని కొనసాగిస్తున్నారు. కుటుంబ భారాన్ని మోస్తూనే చదువుకు చేయూతనిస్తున్నారాయన. తాను చదువుకోలేక పోయానన్న బాధను అధిగమించేందుకు తన వంతు సాయంగా పుస్తకాలు అందజేస్తూ వస్తున్నారు. ఇలా ఒకటి రెండు కాదు తొమ్మిదేళ్లుగా వేలాది మంది విద్యార్థులకు ఆయన ఇలా సాయం చేశారు. విద్యాసంవత్సరం మొదలయిందంటే వెంకటేశ్వర్లులో ఆతృత మొదలవుతుంది. పంట అమ్మి దాచిన డబ్బుతో రాత పుస్తకాలు కొని ఇంట్లో పెట్టుకుంటారు. తాను వెళ్లదలచుకున్న పాఠశాలలో విద్యార్థులు ఎంత మంది ఉన్నారో తెలుసుకుంటారు. పుస్తకాలను బస్తాలో పెట్టుకొని బయలుదేరతాడు. పర్చూరు నియోజకవర్గంలోని ఆరు మండలాల్లో ఉన్న దాదాపు ప్రతి ప్రభుత్వ పాఠశాలలో ఆయన రాత పుస్తకాలు పంపిణీ చేశారంటే తాను చేస్తున్న పనిపై తనకు ఎంత చిత్తశుద్ధి ఉందో అర్థం చేసుకోవచ్చు. మొదట్లో పెన్సిళ్లు కూడా ఇచ్చేవారు. పెన్సిళ్ల వాడకం తగ్గిపోవడంతో రాత పుస్తకాలను మాత్రమే పంపిణీ చేస్తున్నారు. తొమ్మిదేళ్లుగా వెంకటేశ్వర్లుది ఇదే విధి. ఎప్పుడైనా వ్యవసాయంలో ఒడిదుడుకులు ఎదురయినా లక్ష్యం మాత్రం సడలన్విలేదు. అప్పు చేసి, మరోచోట కూలి పనికి వెళ్లి మరీ పుస్తకాలిస్తున్నారాయన. మొదట్లో సైకిల్‌పై పుస్తకాల బస్తా పెట్టుకొని పాఠశాలలకు వెళ్లేవాడు. వయసు పైబడడంతో శరీరంలో శక్తి తగ్గుతుండడంతో బస్‌లో వెళ్లి, పుస్తకాల బస్తా నెత్తిన పెట్టుకొని పాఠశాలలకు వెళ్లి ఇచ్చొస్తున్నారు. దగ్గరి ఊర్లయితే కాలి నడకన వెళ్లి ఇచ్చొస్తారు. విద్యార్థులందరికీ పుస్తకాలు అందజేసిన తర్వాత ఆ వివరాలను తనవద్ద ఉన్న పుస్తకంలో రాయించుకుంటారాయన. గత తొమ్మిదేళ్లలో ఇప్పటి వరకు ఏపాఠశాలలో ఏ విద్యార్థికి ఎన్ని పుస్తకాలిచ్చిందీ ప్రతి వివరం వెంకటేశ్వర్లువద్ద భద్రంగా ఉన్నాయి.



గత 9 ఏళ్లలో 200కు పైగా ప్రభుత్వ పాఠశాలల్లో రాత పుస్తకాలు వెంకటేశ్వర్లు పంపిణీ చేశాడు. దాదాపు 10 వేలకు పైగా పుస్తకాలు ఇచ్చారాయన.

- **శింగవరపు ఉదయశంకర్,** పర్చూరు

కన్నీళ్లను గెలిచినోళ్లకు జలపాతాలో లెక్కా?

వాటర్ రాపెల్లింగ్...

నిటారుగా వందల అడుగుల ఎత్తు నుంచి జలపాతం హోరున జారుతుంటే.. ఆ నీటితో పోటీపడి అంతెత్తు నుంచి కిందికి దిగే క్రీడ. ఈ ఆట గురించి వింటూనే నరాల్లో భయం పుట్టిందా? నీటిలో పట్టుతప్పితే.. కొండరాళ్లు జారితే.. మనగతేంటి? నిజమే చాలా కష్టమైన క్రీడే. ప్రాణాలకు తెగించి ఆడాల్సిన ఆటే. మరి ఇలాంటి ప్రమాదకర క్రీడలో పతకాలు సాధిస్తున్నది ఇద్దరు అమ్మాయిలంటే...? ఎవరు వారు? ఎక్కడుంటారు? ఈ క్రీడనే ఎందుకు ఎంచుకున్నారు? అనేక ప్రశ్నలు మెదడును తొలుస్తున్నాయా? చదివేయండి మరి...!



వీరి పట్టుదల చూసి పర్వతాలే తలవంచుతున్నాయి. జలపాతాలే జేజేలు పలుకుతున్నాయి. జీవితంలో కష్టాలను అధిరోహించి, కన్నీళ్లను దాటేసిన ఈ స్నేహితులిద్దరిదీ తెలంగాణ రాష్ట్రంలోని కొమరం భీం జిల్లా. ఆదివాసీ తెగల్లోనే బాగా వెనుకబడిన కొలాం అనే గిరిజన తెగకు చెందిన ఈ ఇద్దరమ్మాయిల పేర్లు... మడావి కన్నీబాయి, మడావి కల్పన. కెరమెరి మండలం భీమన్‌గొంది గ్రామం. కన్నీబాయికి చిన్నప్పుడే తండ్రి చనిపోయాడు. పేదరికమే బాధ పడేంత పేదరికంలో కుటుంబం చిక్కుకుపోయింది. బంధువులు కన్నీబాయిని ఆసిఫాబాద్ ఐటీడీఏ పాఠశాలలో చేర్పించారు. పదో తరగతి వరకు చదువుకుంది. ఆ తరువాత కెరమెరి ప్రభుత్వ కళాశాలలో ఇంటర్ పూర్తి చేసింది. ప్రస్తుతం దూర విద్యలో డిగ్రీ చదువుతూ... సమగ్ర అభివృద్ధి పథకం(సీసీడీపీ)లో సూపర్‌వైజర్‌గా దినసరి ఉద్యోగం చేస్తుంది. కల్పనదీ నిరుపేద కుటుంబం. చిన్నవయస్సులోనే తల్లిదండ్రులు ఇద్దరూ ప్రాణాలు విడిచారు. కన్నీళ్లకే కన్నీళ్లొచ్చే దుఃఖం. బంధువులు రెసిడెన్షియల్ పాఠశాలలో చేర్పించారు. అక్కడ పదోతరగతి, ప్రభుత్వ కళాశాలలో ఇంటర్ పూర్తిచేసింది. ఎత్తైన కొండలు, చుట్టూ పచ్చని అడవులు... మధ్యలో గూడేలు. తమ గూడేల అందం చూడాలని ఇద్దరికీ ఎంతో ఆశ. సెలవుల్లో ఊరికి వచ్చినప్పుడు సమీపంలోని కొండలు ఎక్కేవారు. కోనలు దాటేవారు. ఈ ఆసక్తే కన్నీబాయి, కల్పనలను సాహస క్రీడల వైపు మళ్లించింది.

ప్రతిభకు నైపుణ్యం తోడై.. సాహస క్రీడల శిక్షకుడు సంతోష్ ఆధ్వర్యంలో పర్వతారోపణపై జిల్లాలో ఇస్తున్న శిక్షణ గురించి తెలుసుకున్నారు. అక్కడ ప్రవేశం పొందారు. ప్రత్యేక శిక్షణను తీసుకున్నారు. ఆయన నేర్పించిన మెలకువలను ఆవాహన చేసుకున్నారు. పాకుతూ కొండలు ఎక్కడం(జూమరింగ్), ఉవ్వెత్తున కిందకి దూకుతున్న జలధారాల్లో తాడు సాయంతో పై నుంచి కిందకు దిగడం(వాటర్ రాపెల్లింగ్), బెలూన్‌తో కింద నుంచి ఎత్తుకు ఎగరడం(ప్యారాసెల్), కళ్లకు గంతలు కట్టుకొని కొండలు ఎక్కడం వంటి సాహస క్రీడల్లో నైపుణ్యం సాధించారు.


ప్రపంచస్థాయిలో జయకేతనం విశాఖపట్నం జిల్లా 'కటిక' జలపాతంవద్ద జరిగిన ప్రపంచ రాపెల్లింగ్ పోటీల్లో ప్రథమ, తృతీయ స్థానాల్లో నిలిచారు. ఈ పోటీలకు పలుదేశాల నుంచి 180 మంది క్రీడాకారులు హాజరయ్యారు. అందులో మహిళా విభాగంలో 12 రకాల పోటీల్లో కన్నీబాయి దీటైన ప్రతిభను కనబర్చింది. 2.47 నిమిషాల్లో 400 అడుగులపై నుంచి నిటారుగా జాలువారె నీటి దాటుకుంటూ లక్ష్యాన్ని చేరింది. మొదటిస్థానాన్ని కైవసం చేసుకొంది. ఇదే జలపాతాన్ని కల్పన 3 నిమిషాల్లో దిగి మూడో స్థానంలో నిలిచింది. జీవితంలో ఎన్నో క్లిష్ట పరిస్థితులను గట్టెక్కిన వారికి పర్వతాలు ఓ లెక్క. కన్నీటి సంద్రాలే ఈదిన వారికి జలపాతాలు ఏ పాటి అని చాటిచెప్పారు ఈ అడవితల్లి ముద్దుబిడ్డలు. కొలాం తెగ సిగలో మెరిసిన నెలవంకలు.

- **మహ్మద్ రహీమొద్దీన్,** ఉట్నూరు

- 2015లో ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలో జరిగిన ప్యారాసెల్ పోటీల్లో ప్రతిభ చాటి అప్పటి కలెక్టర్ జగన్మోహన్ నుంచి ప్రత్యేక బహుమతి అందుకున్నారు.
- 2016లో నిజామాబాద్ జిల్లాలో నిర్వహించిన రాపెల్లింగ్ రాష్ట్రస్థాయి పోటీల్లో కన్నీబాయి మొదటి, కల్పన రెండవ స్థానాల్లో నిలిచారు.
- 2018లో ఆదిలాబాద్ జిల్లాలోని ఇచ్చోడ గాయత్రి జలపాతం వద్ద నున్న 220 మీటర్ల ఎత్తుగల కొండలు ఎక్కిదిగే పోటీల్లో మొదటి, రెండో బహుమతులను సాధించారు.



పడవ పథం... ప్రకృతి హితం



ఎక్కడ నెగ్గాలో కాదు... ఎక్కడ తగ్గాలో తెలియాలి....
ప్లాస్టిక్ విషయంలోనూ అంతే... దాన్ని ఎంత వరకు వినియోగించాలో తెలిసుండాలి..
లేదంటే ఆ సన్నటి పొరే పెనుముప్పు అవుతుంది. విలయానికి కారణమవుతుంది.

మరి ప్లాస్టిక్ మనకు హానికరం కాకుండా ఉండాలంటే దాన్ని కొత్తగా ఉత్పత్తి చేయకుండా ఉండాలి. దీనికి రీసైక్లింగ్ ఒక్కటే మార్గం. ప్లాస్టిక్‌ను పునర్వినియోగించడం ఎలాగో తెలుసుకోవడం ప్రతి మనిషీ బాధ్యత...

ఇదే విషయాన్ని చెబుతుందా పడవ...



మీరు విన్నది నిజమే... పడవే...

వివిధ దేశాల్లో ఉత్పత్తయిన ప్లాస్టిక్ వ్యర్థాలను సముద్ర జలాల్లోకి డంప్ చేస్తుండడం ఆఫ్రికా దేశాల పాలిట పెనుముప్పులా మారుతోంది. ఏటా ప్రపంచంలోని సముద్ర జలాల్లోకి 12 మిలియన్ టన్నుల ప్లాస్టిక్ వ్యర్థాలు వచ్చి చేరుతుంటే ఆఫ్రికా తీరంలోకి చేరుతున్న మొత్తం చాలా ఎక్కువే. దాని పునర్వినియోగంతో పరిస్థితులను కొంచెమైనా అదుపులోకి తీసుకురావచ్చు... సరిగ్గా ఇదే సందేశంతో ఆఫ్రికా జలాల్లోకి అడుగు పెట్టబోతోంది ఆ భారీ పడవ. మొత్తం ప్లాస్టిక్ వ్యర్థాలతో తయారవడం దీని ప్రత్యేకత. కెన్యాతీరంలోకి కొట్టుకొచ్చిన సీసాలు, మూతలు, చివరకు వాహనాల్లోని ప్లాస్టిక్ వ్యర్థాలను ఉపయోగించి దీన్ని రూపొందించారు. ఆ ఖండంలో ఉన్న తీరంలోని దేశాలన్నిటినీ చుట్టివస్తుందిది. దీన్ని సృష్టించిన ఫ్లిప్‌ఫ్లాపీ స్వచ్ఛంద సంస్థతో పాటు ఐరాస బృందం కూడా ఇందులో ఉండి ప్లాస్టిక్ గురించి ప్రజలకు అవగాహన కలిగిస్తారు. ప్లాస్టిక్ వ్యర్థాలతో రూపొందించిన ఈ నావ ప్రపంచంలోనే ఈతరహాలో తయారైన మొట్టమొదటిది.

ఈనాడు సినిమా

మహా నాయకుడి రథయాత్ర


బాలకృష్ణ

ఎన్టీఆర్ బయోపిక్‌లోని తొలి భాగం 'ఎన్టీఆర్ కథానాయకుడు' ఈ సంక్రాంతికి విడుదలైంది. రెండో భాగం 'మహా నాయకుడు' వచ్చే నెల ప్రథమార్ధంలో వస్తోంది. చిత్రీకరణ తుది దశకు చేరుకుంది. ప్రస్తుతం నందమూరి బాలకృష్ణ, కల్యాణ్ రామ్, వేలాది మంది జూనియర్ ఆర్టిస్టుల మధ్య రథయాత్రకు సంబంధించిన సన్నివేశాల్ని తెరకెక్కిస్తున్నారు. క్రిష్ తెరకెక్కిస్తున్న ఈ చిత్రంలో విద్యాబాలన్, రానా, సుమంత్ అక్కినేని కీలక పాత్రలు పోషిస్తున్నారు. ఈనెల 22తో చిత్రీకరణ పూర్తవుతుంది. ప్రస్తుతం నిర్మాణానంతర కార్యక్రమాలు సమాంతరంగా జరుగుతున్నాయి. సంగీతం: కీరవాణి

పరుగులు పెట్టిస్తున్న ప్రభాస్


ప్రభాస్

ప్రభాస్ నుంచి 2018లో ఒక్క సినిమా రాలేదు. అలాగని ప్రభాస్ ఖాళీగా లేడు. వరుసగా రెండు సినిమాలు ఒప్పుకున్నాడు. అందులో ఒకటి 'సాహో'. దీనికి సుజీత్ దర్శకత్వం వహిస్తున్నారు. రాధాకృష్ణ దర్శకుడిగా మరో చిత్రం సెట్స్‌పై ఉంది. ఒకేసారి సమాంతరంగా రెండు సినిమా షూటింగుల్లో పాల్గొనడం ప్రభాస్ కెరీర్‌లో ఇదే తొలిసారి. నెలలో 'సాహో'కి కొన్ని రోజులు కేటాయిస్తే, రాధాకృష్ణ సినిమాకి మరికొన్ని రోజులు ఇస్తున్నాడు. ప్రస్తుతం రాధాకృష్ణ దర్శకత్వంలో రూపొందుతున్న చిత్రానికి సంబంధించిన షూటింగ్‌లో పాల్గొంటున్నాడు ప్రభాస్. ఇదో ప్రేమకథ. పూజా హెగ్డే కథానాయికగా నటిస్తోంది. త్వరలోనే యూరప్‌లో కీలక ఘట్టాలు తెరకెక్కిస్తారు. 'సాహో' ఆగస్టు 15న విడుదలవుతుంది. రెండో చిత్రాన్నీ ఈ ఏడాదే విడుదల చేయాలన్నది ప్రభాస్ ఆలోచన. లేదంటే 2020 సంక్రాంతికి రావొచ్చు.

స్టార్లు అంతరించిపోరు


అజయ్ దేవగణ్

బాలీవుడ్‌లో ప్రస్తుతం ఉన్న సీనియర్ కథానాయకుల్లో అజయ్ దేవగణ్ ఒకరు. ఆయన పరిశ్రమకొచ్చి 28 ఏళ్లవుతోంది. ఆయన సమకాలీకులైన చాలా మంది హీరోలు ఎప్పుడో తెరమరుగయ్యారు. కానీ అజయ్ మాత్రం ఇప్పటికీ వరుస చిత్రాలతో ప్రేక్షకులను అలరిస్తూ అగ్ర కథానాయకుడిగా కొనసాగుతున్నారు. అయితే ఇటీవలి కాలంలో స్టార్ కథానాయకుల చిత్రాలు తీవ్రంగా నిరాశ పరుస్తున్నాయి. మరో వైపు కథా బలమున్న చిన్న చిత్రాలు సత్తా చాటుతున్నాయి. దీంతో బాలీవుడ్‌లో స్టార్ల పని అయిపోయిందని, ఇక స్టార్‌డమ్ అనే మాట వినిపించదన్న వ్యాఖ్యలు వెలువడుతున్నాయి. అయితే అజయ్ వాటికి భిన్నంగా స్పందించారు. "స్టార్ సిస్టమ్ అనేది అంతరించిపోతుందని నేను అనుకోవడం లేదు. అయితే ఇప్పటి ప్రేక్షకులు సినిమాలను ఎంచుకోవడంలో చాలా నిక్కచ్చిగా ఉన్నారు. సినిమా బాగుందంటేనే వెళ్తున్నారు. దీని వల్ల మేం సినిమాల పట్ల జాగ్రత్త వహించాల్సి వస్తోంది. గతంలో మాకు నచ్చిన ప్రతి సినిమా చేసేవాళ్లం. అదృష్టవశాత్తు అవి ప్రేక్షకులకూ నచ్చాయి. కానీ ఈరోజుల్లో అలా జరగడం లేదు. మా తర్వాతి తరం నటులు సినిమా ఎంపికలో జాగ్రత్తగా ఉండి తీరాలి" అన్నారు అజయ్. 90వ దశకానికి చెందిన కాజోల్, టబు లాంటి నటీమణులు ఇప్పటి తరాన్నీ ఆకట్టుకుంటున్నారనీ, వారి ప్రతిభే అందుకు కారణమన్నారాయన. ప్రతిభావంతులైన నటులు ఎప్పటికీ కనుమరుగు కారని, కాలాను గుణంగా ఎదుగుతారని ధీమా వ్యక్తం చేశారు. తన సుదీర్ఘ నట ప్రస్థానం గురించి చెబుతూ "పరిశ్రమలో నేను ఎక్కువ ఇబ్బందులు ఎదుర్కోలేదు. అయితే పని విషయంలో బాగా కష్టపడ్డా"న్నారు.

పాలకొల్లులో దాసరి విగ్రహం



ప్రముఖ దర్శకుడు దాసరి నారాయణరావు స్వస్థలం పశ్చిమ గోదావరి జిల్లాలోని పాలకొల్లు. అక్కడ దాసరి విగ్రహం ఒకటి రూపుదిద్దుకుంటోంది. ఈనెల 26న దాసరి విగ్రహ కమిటీ ఆధ్వర్యంలో దాన్ని ఆవిష్కరిస్తారు. ప్రముఖ నటుడు మంచు మోహన్‌బాబుతో పాటు సినీ, రాజకీయ ప్రముఖులు, దాసరి కుటుంబ సభ్యులు ఈ కార్యక్రమంలో పాల్గొంటారు. సంగీత దర్శకుడు కోటి ఆధ్వర్యంలో సంగీత విభావరి ఏర్పాటు చేశామని నిర్వాహకులు తెలిపారు.

ఆ విమర్శకురాలు చెప్పిందే వింటా!


కీర్తి సురేష్

చిత్రసీమలో పొగడ్తలు, విమర్శలు మామూలే. ఒకరు పొగిడారని మనవాళ్లు అనుకోకూడదు, తిట్టారని వాళ్లను పక్కన పెట్టకూడదు అంటోంది కీర్తి సురేష్. 'మహానటి'తో కీర్తి ప్రతిష్ఠ పెరిగింది. తెలుగులో అగ్ర కథానాయికల జాబితాలో చోటు దక్కించుకుంది. ప్రస్తుతం తన కెరీర్‌ని పరుగులు పెట్టిస్తోంది. మీ సినీ జీవితంలో అందుకున్న ఉత్తమ ప్రశంస, విమర్శ ఏది? అని అడిగితే... "చాలా ఉన్నాయి. అయితే వీటిని నేనెప్పుడూ సీరియస్‌గా పట్టించుకోను. ఎక్కడివి అక్కడే వదిలేయాలి. నాలోనూ ఓ విమర్శకురాలు ఉంటుంది కదా? తనేం చెబితే అది వింటా. ఓ నటిగా నేనేం చేయాలో నాకు తెలుసు. నటిగా నా నుంచి ఏం రాబట్టుకోవాలో దర్శకుడికి తెలుసు. మా ఇద్దరి మధ్య సమన్వయం ఉంటే పాత్ర పండుతుంది. 'మహానటి'తో నాకు మంచి పేరొచ్చింది. నా జీవితంలో గుర్తుండిపోయే సినిమా అది. అయితే ఆ ఒక్క పాత్రే కొలమానం కాకూడదు. అలాంటి కథలు మరిన్ని చేయాలని ఉంద"ని చెప్పింది కీర్తి.

ప్రకృతి ప్రేమ

అనురాగ్ కొణిదెన కథానాయకుడిగా నటిస్తున్న చిత్రం 'మళ్లీ మళ్లీ చూశా'. శ్వేత అవస్థి, కైరవి తక్కర్ కథా నాయికలు. సాయిదేవ రామన్ దర్శకుడు. కొణిదెన కోటేశ్వరరావు నిర్మాత. చిత్రీకరణ పూర్తయింది. ప్రస్తుతం నిర్మాణానంతర కార్యక్రమాలు


శ్వేత అవస్థి, అనురాగ్ కొణిదెన

జరుగుతున్నాయి. దర్శకుడు మాట్లాడుతూ "ఓ అందమైన కలని కథగా మార్చుకుని ప్రకృతి సృష్టించిన ఓ ప్రేమ కావ్యమిది. ప్రేమకు ప్రకృతి తోడైతే ఎలా ఉంటుందో తెరపై చూపిస్తున్నాం. మంగళవారం ప్రముఖ నిర్మాత డి.సురేష్ బాబు చేతుల మీదుగా ప్రచార చిత్రాన్ని ఆవిష్కరిస్తామ"న్నారు.

చిత్రమైన వినోదం


సిద్ధి ఇద్నాని, సుమంత్ అశ్విన్

సుమంత్ అశ్విన్, సిద్ధి ఇద్నాని జంటగా నటిస్తున్న చిత్రం 'ప్రేమ కథా చిత్రమ్ 2'. మాళవిక నాయర్ కీలక పాత్రధారి. హరికిషన్ దర్శకుడిగా పరిచయమవుతున్నారు. ఆర్.సుదర్శన్‌రెడ్డి నిర్మాత. వచ్చే నెల 22న విడుదల చేస్తారు. నిర్మాత మాట్లాడుతూ "వినోదం, భయం, ప్రేమ మేళవించిన విచిత్రమైన కథ ఇది. విద్యుల్లేఖ, ప్రభాస్ శీను మధ్య వచ్చే సన్నివేశాలు వినోదం పంచుతాయి. నిర్మాణానంతర కార్యక్రమాలు జరుగుతున్నాయి. హారర్ కామెడీలో కొత్త ట్రెండ్ సృష్టించే చిత్రమవుతుంద"న్నారు. సంగీతం: జెబి

మణికర్ణిక మెరుపులు



బాలీవుడ్ భామ కంగనా రనౌత్ ముంబయిలో జరిగిన ఓ ఫ్యాషన్ షోలో ర్యాంప్‌పై నడిచి సందడి చేసింది. కంగన నటించిన 'మణికర్ణిక' చిత్రం ఈ నెల 25న ప్రేక్షకుల ముందుకు రానుంది. అందులో ఝాన్సీ రాణి లక్ష్మీబాయి పాత్రలో వీరత్వాన్ని ప్రదర్శించనుంది.

దోషం ఎవరికి?


సన

కిషోర్, సన జంటగా నటించిన చిత్రం 'దోషం'. నాకా.. దేవుడికా? అనేది ఉపశీర్షిక. రఘు గోపసాని స్వీయ నిర్మాణంలో తెరకెక్కిస్తున్నారు. నిర్మాణానంతర కార్యక్రమాలు పూర్తయ్యాయి. దర్శక నిర్మాత మాట్లాడుతూ "దోషాలు... వాటి పేరుతో మనుషుల్లో కనిపించే నమ్మకాల నేపథ్యంలో సాగే చిత్రమిది. నెల్లూరులోని రామాపురంకి చెందిన వ్యక్తులు ఇందులో నటించారు. సమాజంలో చైతన్యం తీసుకొచ్చే చిత్రమవుతుంది. ప్రతినాయకుడిగా ప్రవీణ్ పున్నూరు చాలా బాగా నటించాడు. ఫిబ్రవరి నెలాఖరున చిత్రాన్ని ప్రేక్షకుల ముందుకు తీసుకొస్తాం" అన్నారు. రాజేష్, వసీమ్, అనిల్, వెన్నెల తదితరులు నటించిన ఈ చిత్రానికి సంగీతం: గౌతమ్ రవిరామ్.

కోల్‌కతా చిత్రోత్సవాల్లో 'అప్పు'

మాస్టర్ సాయి శ్రీవంత్ ప్రధాన పాత్ర పోషించిన బాలల చిత్రం 'అప్పు'. ఈ చిత్రాన్ని కోల్‌కతాలో జరుగుతున్న అంతర్జాతీయ బాలల చిత్రోత్సవాల్లో ప్రదర్శించబోతున్నారు. "35 దేశాల నుంచి వచ్చిన 200 చిత్రాలు ఈ చిత్రోత్సవాల్లో ప్రదర్శనకు నోచుకున్నాయి. వాటిలో 'అప్పు'కీ స్థానం దక్కినందుకు సంతోషంగా ఉంద"న్నారు చిత్ర దర్శకుడు కె.మోహన్.

బాక్సింగ్ తుఫాన్


ఫరాన్ అక్తర్

'భాగ్ మిల్కా భాగ్'... స్పోర్ట్స్ బయోపిక్‌ల్లో ఓ కొత్త ఒరవడికి శ్రీకారం చుట్టిన సినిమా. చిన్న సినిమాగా వచ్చి మంచి విజయాన్ని అందుకొంది. మిల్కాసింగ్ జీవితం ఆధారంగా తెరకెక్కిన ఈ చిత్రంలో ఫరాన్ అక్తర్.. మిల్కాగా నటించాడు. రాకేష్ ఓం ప్రకాష్ మెహ్రా దర్శకత్వం వహించారు. ఇప్పుడు ఈ ఇద్దరి కలయికలో క్రీడా నేపథ్యంలో సాగే మరో చిత్రం తెరకెక్కబోతుంది. బాక్సింగ్ కథాంశంతో సాగే ఈ చిత్రానికి తుఫాన్ అనే పేరుని ఖరారు చేశారు. "ఇది క్రీడా చిత్రం. బయోపిక్ కానీ, నిజ జీవిత కథ కానీ కాదు. ఓ కల్పిత కథ" అని చెప్పారు ఫరాన్. ఆయన ప్రస్తుతం 'ది స్కై ఈజ్ పింక్'లో ప్రియాంక చోప్రాకు భర్తగా నటిస్తున్నారు.

చరిత్ర ప్రేమికుణ్ని


ఆమీర్ ఖాన్

బాలీవుడ్‌లో అగ్రకథానాయకుల్లో ఆమీర్ ఖాన్ పంథానే వేరు. కథల ఎంపికలో ఆయన అభిరుచి ప్రత్యేకం. ప్రయోగాత్మక చిత్రాలను ఎంచుకొని అద్భుత విజయాలు సాధించిన ఘనత ఆయనది. కథలను ఎంచుకోవడంలో ఆయనకు అంత గురి ఎలా సాధ్యమైందని చాలా మంది ఆశ్చర్యపోతుంటారు. దానికి ఆమీర్ స్పందిస్తూ "సృజనాత్మక రంగంలో ఉన్న వ్యక్తిగా నేను నా మనసుకు నచ్చిన కథలనే ఎంచుకున్నాను. కొన్ని చిత్రాలు మార్కెట్ పరంగా రిస్క్ అన్నారు. అయితే వాటిని ప్రేక్షకులు ఆదరించారు. అది నాకు ఎంతో శక్తిని, నమ్మకాన్ని ఇచ్చింద"న్నారు ఆమీర్. సినిమాపై ఎంతో మక్కువ ఉన్న ఆమీర్ ఇటీవల ప్రారంభమైన 'నేషనల్ మ్యూజియం ఆఫ్ ఇండియన్ సినిమా'పై సంతోషం వ్యక్తం చేశారు. "నేను సినిమా విద్యార్థిని. చరిత్ర ప్రేమికుణ్ని. ఈ మ్యూజియం ప్రారంభం కావడం ఆనందంగా ఉంది. దాన్ని సందర్శించడానికి ఆసక్తిగా ఎదురుచూస్తున్నాను. 'చిత్ర పరిశ్రమను ఎవరు ప్రారంభించారు, మూకీ, టాకీ సినిమాలు ఎవరెవరు తీశారు' ఇలాంటి విషయాలను తెలుసుకోవాలనుకుంటున్నాను. సినిమా వ్యక్తుల మీద ఎలాంటి పుస్తకం కనపడినా కొనేస్తాను. అది చదవడం బాగా ఇష్టమ"న్నారు ఆమీర్.

వసుంధర

ఈ టీలతో ఒత్తిడి దూరం!

టీ తాగకపోతే ఏ పనీ చేయలేరు కొందరు. అలాగని మితిమీరి తాగడం మంచిది కాదు. అలా సాధారణ టీలకు తాగే బదులు హెర్బల్ టీలను ఎంచుకుంటే ఆరోగ్యానికి మేలంటున్నారు నిపుణులు.



తులసి, నిమ్మగడ్డి, పుదీనా... ఇలా చెప్పాలంటే బోలెడన్ని ఆకులు... చామంతి, బంతి, మల్లె, మందార, గులాబీ వంటి పూలు.. మనకి విరివిగా అందుబాటులో ఉంటాయి. వీటిని ఆహారంలో వాడటంతో పాటు అందాన్ని మెరుగుపరుచుకోవడానికి వినియోగిస్తాం. అయితే వీటితో టీలను కూడా తయారు చేసుకోవచ్చు. విదేశాల్లో ఇప్పటికే ఇవి ప్రాచుర్యంలో ఉన్నాయి. మన దగ్గరా ఇప్పుడిప్పుడే ఆదరణ పొందుతున్నాయి. ఈ టీల తయారీ కోసం నాణ్యమైన పూలను, ఆకులను మొదటి దశలోనే సేకరిస్తారు. వాటిని ప్రత్యేక పద్ధతుల్లో ఎండబెడతారు. ఇలా సిద్ధం చేసిన పూలు/ఆకులను వేణ్నీళ్లలో వేసి కాస్త తేనె, యాలకులపొడి లేదా అల్లం కలిపి తాగితే చాలు. వీటిలో లభించే యాంటీఆక్సిడెంట్లు ఒత్తిడిని దూరం చేస్తాయి. శరీరంలోని ఫ్రీరాడికల్స్‌తో పోరాడతాయి. ట్రైగ్లిజరాయిడ్ల సంఖ్యను తగ్గిస్తాయి. చక్కటి నిద్రకు సాయపడతాయి. నెలసరి నొప్పులకు ఉపశమనం కలిగిస్తాయి. పరగడుపున వేడివేడిగా ఈ హెర్బల్ టీలను తాగితే వీటిల్లో ఉండే విటమిన్ సి జీర్ణప్రక్రియని మెరుగుపరుస్తుంది. పని ఎక్కువగా ఉన్నప్పుడు తాగితే ఒత్తిడి అదుపులోకి వస్తుంది.

పెన్సిళ్లు, పెన్నులు తెచ్చేస్తాడు!

? మా బాబు వయసు ఎనిమిదేళ్లు. ఈ మధ్య స్కూలు నుంచి తోటిపిల్లల పెన్సిళ్లు, పెన్నులు తెచ్చేస్తున్నాడు. అలాగే తన వస్తువులు కూడా పోగొట్టుకుంటున్నాడు. తీసుకు వచ్చిన వాటిని తిరిగి ఇచ్చేయమంటే ఇవ్వడు. తన వస్తువులు ఎవరు తీసుకున్నారో కూడా చెప్పడు. ఇదేమైనా మానసిక సమస్యా... దీన్ని ఎలా మాన్పించాలి?

– ఓ సోదరి



✔ భయం, మానసిక పరిణతి సరిగా లేకపోవడం వల్ల ఇలా చేస్తుండొచ్చు. ఎనిమిదేళ్ల పిల్లాడు తన వస్తువులు పోగొట్టుకుంటున్నాడు, మిగతా పిల్లల వస్తువులు తెస్తున్నాడంటే... అతడి తెలివితేటలు ఎలా ఉన్నాయో పరిశీలించాలి. బిలో యావరేజ్ ఇంటెలిజెన్స్ ఉన్న పిల్లలకు తాము ఎవరి దగ్గర ఏం తీసుకుంటున్నామో, ఇతరులకు ఏం ఇచ్చామో గుర్తుండదు. వీరిలో తొందరపాటు కూడా ఎక్కువే. తమకు నచ్చిన వస్తువును వెంటనే తీసేసుకుంటారు. ఇతరుల వస్తువులు తీసుకుంటే ఏమవుతుందో/వారు ఏమనుకుంటారో అని కూడా ఆలోచించరు. అసలు ఎవరి వస్తువు ఏదో కూడా వీళ్లకి తెలియదు. కారణం మానసిక పరిణతి సరిగ్గా లేకపోవడమే. మీ అబ్బాయిలో ఇదే సమస్య ఉంటే గనుక మీరెన్నిసార్లు చెప్పినా తాను తెచ్చిన వస్తువుని తిరిగి ఇవ్వడు. ఎందుకంటే ఎవరి దగ్గర నుంచి తాను తెచ్చాడో గుర్తుండదు. ఇక, మానసిక పరిపక్వత తక్కువగా ఉండే పిల్లల వస్తువులను తోటి చిన్నారులు తీసుకుంటారు. వారివి మీ వాడికి ఇస్తుంటారు. అక్కడ తిరిగి తీసుకోవడానికి, ఇవ్వడానికి మీ అబ్బాయి మొహమాటపడుతూ ఉండొచ్చు. దీన్ని అటెన్షన్ డెఫిసిట్ హైపర్ యాక్టివిటీ డిజార్డర్ (ఏడీహెచ్‌డీ) అంటారు. ఈ సమస్యతో బాధపడే చిన్నారులు ఏ పనీ ఆలోచించి చేయరు. తమ వస్తువులను కూడా జాగ్రత్త చేసుకోలేరు. మరో రకం పిల్లలు వాళ్ల దగ్గర లేని, ఇతరుల దగ్గర ఆకర్షణీయంగా కనిపించేవాటిని తెచ్చేసుకుంటారు.

డియర్ వసుంధర



డా. మండాది గౌరీదేవి
పిల్లల మానసిక నిపుణురాలు

» ఈ లక్షణాన్ని తగ్గించాలంటే...

పైవాటిలో మీ అబ్బాయిలో ఏ లక్షణం కనిపించినా వెంటనే తగ్గించే ప్రయత్నం చేయండి. నీ వస్తువులు తీసుకెళ్తే నువ్వేలా బాధపడతావో, వాళ్లూ అంతే అనే విషయం అర్థమయ్యేలా చెప్పండి. అలా చేస్తే నీతో ఎవరూ స్నేహం చేయరు. కాబట్టి నువ్విలాంటి పనులు చేయకూడదు' అంటూ వివరించాలి. తను ఏ వస్తువులను ఇష్టపడి తీసుకువస్తున్నాడో అలాంటివాటినే అతడి ప్రవర్తన బాగుంటే... మీరే కొనిపెడతామని చెప్పండి. అలాగే మీ బాబుతో 'నీ వస్తువులను పోగొట్టుకోకుండా తిరిగి తీసుకు రావడమూ ముఖ్యమే అని చెప్పండి. అలా చేస్తే వారాంతంలో స్టార్‌లు ఇవ్వాలి. ఎన్ని స్టార్లు వస్తే తన ప్రవర్తన అంత బాగా ఉన్నట్లు. అప్పుడు చిన్న చిన్న కానుకలివ్వండి. ప్రశంసలూ అందించండి. ఇలా వారం, ఆపై నెలకు మార్చాలి. తనకు నచ్చిన ప్రదేశాలకు తీసుకువెళ్లడం, నచ్చిన వ్యక్తులతో మాట్లాడించడం లాంటివి చేయడం వల్ల అతడి ప్రవర్తనలో మార్పు వస్తుంది. 'దీన్నే బిహేవియర్ మాడిఫికేషన్ అంటాం.

- మీ సందేహాలను vasukid@eenadu.net కు పంపించగలరు.

వలలున్నాయి.. అతివల్లారా..

● గీతికకి పెళ్లయ్యింది. ఇద్దరు పిల్లలు. హాయిగా గడిచిపోతోంది ఆమె జీవితం. అకస్మాత్తుగా ఓ రోజు ఆమె నగ్న చిత్రాలు పోర్న్ సైట్‌లో కనిపించాయన్న విషయం తెలిసి షాక్‌కి గురైంది. కుంగిపోయి ఆత్మహత్యాయత్నం చేసింది. అదృష్టవశాత్తు కుటుంబ సభ్యుల అప్రమత్తతో బయటపడింది. కానీ ఆమెకెవరూ శత్రువులు లేరు. మరి ఈ పని ఎవరు చేసుంటారు?

- ఏం జరిగింది: గీతిక చాలా కాలం తరువాత తన చిన్ననాటి స్నేహితుల్ని సోషల్ మీడియాలో కలుసుకుంది. అంతా కలిసి ఓ బృందంగా ఏర్పడ్డారు. ఒకరినొకరు మళ్లీ కొత్తగా పరిచయం చేసుకున్నారు. ఈ క్రమంలో ఆమె తన జీవితంలోని మధుర క్షణాల తాలూకు ఫొటోలు, వీడియోలను వారికి షేర్ చేసింది. అంతే..! వాటిల్లోని ఆమె ఫొటోను మార్ఫింగ్ చేసి పోర్న్ సైట్లలో అప్‌చేశాడో దుండగుడు.

● నిత్య పేరు, ఫొటోతో ఉన్న ఫేస్‌బుక్ ఖాతా నుంచి ఆమె స్నేహితులందరికీ ఫ్రెండ్ రిక్వెస్టులు అందాయి. ఆమే కదా అని యాక్సెప్ట్ చేశారు వారంతా. అది మొదలు ఆ ఖాతా నుంచి వారందరికీ మార్ఫింగ్ చేసిన నిత్య ఫొటోలు వస్తున్నాయి. అసభ్యకరమైన చేస్తున్నారెవరో. కానీ అది నిత్య కాదు. మరెవరు ఆమె పరువు తీయాలనుకున్నారు?

- ఏం జరిగింది: ఎదురింట్లో ఉండే వంశీ నిత్యను ఇష్టపడ్డాడు. అతని ప్రేమను ఆమె తిరస్కరించింది. దాంతో అతడు నిత్యపై కక్ష కట్టాడు. ఆమె ఫొటోలను సేకరించి మార్ఫింగ్ చేసి ఓ కల్పిత ఐడీ సృష్టించాడు. దాని ద్వారా అమెను అల్లరిపాలు చేయాలనుకున్నాడు.

● ఓ రోజు శ్వేత ఫోన్‌కి కొన్ని ఫొటోలు వచ్చాయి. అవి ఆమె తన ఇంట్లో దుస్తులు మార్చుకుంటున్నప్పుడు తీసినవి. కోరినంత డబ్బు ఇవ్వకపోతే వాటిని సోషల్‌మీడియాలో పోస్ట్ చేస్తానంటూ ఓ ఆంగతకుడి నుంచి బెదిరింపులు. ఇంతకీ ఆ ఫొటోలు ఎవరు తీశారు? ఎందుకు బెదిరిస్తున్నారు?

- ఏం జరిగింది: ఆ ఆంగతకుడిది మధ్యప్రదేశ్. నచ్చిన పాటలు ఫ్రీగా డౌన్‌లోడ్ చేసుకోవచ్చంటూ ఆమె ఫోన్‌కి ఓ సందేశం పంపాడు. పాటల్ని విందామని శ్వేత యథాలాపంగా ఆ ఆప్షన్‌లను నొక్కుతూ వెళ్లింది. అంతే హ్యాకర్ ఆమె ప్రతి కదలికనూ ఆమె ఫోన్‌లోని మైక్రో కెమెరాతో వీడియో రికార్డ్ చేశాడు. వాటిని చూపించి ఆమెను బెదిరించడం మొదలుపెట్టాడు.

స్నేహితుడని నమ్మింది ఒకరు.... అతడి ప్రేమని తిరస్కరించింది మరొకరు.... నా ఫోను, ల్యాప్‌టాప్‌లే కదా! భద్రం అనుకుంది మరొకరు... కారణాలేవైనా.... జాగ్రత్త, అప్రమత్తత లేకపోవడం వల్ల చాలామంది జీవితాల్లో చిచ్చు పెడుతోంది సాంకేతికత. స్మార్ట్ ఫోన్ సౌకర్యమే.. అంతర్జాలం కూడా అవసరమే.. కానీ, దాన్ని సరిగా ఉపయోగించకపోతే మాత్రం అనర్థాలే. అదెలా అంటే...



సామాజిక మాధ్యమాల ద్వారా సైబర్ బుల్లీయింగ్, స్టాకింగ్, హ్యాకింగ్... వంటివి రోజు రోజుకీ హెచ్చుమీరుతున్నాయి. పేర్లేవైనా అన్నీ సైబర్ నేరాల కిందకే వస్తాయి. వీటి బారిన పడిన ఎంతో మంది పరువుపోతుందనే భయంతో మౌనంగా ఉండిపోతున్నారు. అయితే వీరిలో యువత సంఖ్యే ఎక్కువ. అలాగే ఒంటరిగా ఉండే మహిళలు, కుటుంబ తగాదాలతో సతమతమవుతున్న వారు కూడా వీటి బారిన సులువుగా పడుతున్నారని సైబర్ క్రైమ్ రికార్డులు చెబుతున్నాయి.

ఎందుకిలా...

సాంకేతికతను దుర్వినియోగం చేయడం, మితిమీరి వినియోగించడం వంటివన్నీ దీనికి కారణాలే. అరచేతిలో ప్రపంచాన్ని చూడగలిగే సౌకర్యం, ఏ పనిచేసినా...సులువుగా సలహాలు ఇచ్చే యాప్‌లు, విచ్చలవిడిగా వచ్చే ఆకర్షణీయమైన ప్రకటనలు, ఫేక్ వార్తలు వంటివన్నీ మనల్ని తప్పుదోవ పట్టిస్తున్నాయి. దీనికి తోడు ప్రేమ వైఫల్యంతో వచ్చే అసూయ, కోపం, అమ్మాయిలు, ఉచితంగా వచ్చే డబ్బుపై మోజు ఈ కొత్త మోసాలకు ప్రధాన కారణం. సామాజిక చొరవ తగ్గి, వర్చువల్ కమ్యూనికేషన్ పెరగడం మరో కారణం.

మరేం చేయాలి?

ఇంటర్నెట్: ఇప్పుడు కాసేపు అంతర్జాలం లేకపోతే ఏదో వెలితిగా అనిపిస్తోంది. అంతలా దీనికి అలవాటైపోయాం. కానీ దాన్ని వాడటంలో కనీస జాగ్రత్తలు తీసుకోకపోతే ఇబ్బందులు తప్పకపోవచ్చు. పైరేటెడ్ వెబ్‌సైట్స్, టోరెంట్స్ వంటి వాటి నుంచి ఏదైనా డౌన్‌లోడ్ చేయడం మొదలుపెడితే వాటిల్లో ఉండే మైక్రో కెమెరా దానంతట అదే ఆన్ కావొచ్చు. చాలామంది అమ్మాయిలు దాన్ని గమనించుకోరు. దాంతో ఆ కెమెరా ఆ పరిసర ప్రాంతాలను చిత్రీకరిస్తుంది. ఆ ఫొటోలను చూపించే హ్యాకర్లు అమాయక అమ్మాయిల్ని బెదిరిస్తున్నారు. ఈ పరిస్థితి నివారించాలంటే కొమాడో వంటి యాంటీమాల్‌వేర్,

సైబర్ నేరాల బారి నుంచి తప్పించుకోవాలంటే...

ఇప్పుడంతా ఫొటో తీసుకోవాలంటే బ్యూటీయాప్, వంట చేయడానికి, దుస్తులు కొనుక్కోవడానికి, వినోదానికి, విజ్ఞానానికి ఇలా ప్రతి పనికీ ఓ యాప్‌ని వాడేస్తున్నారు. వాటిని ఇన్‌స్టాల్ చేసేందుకు ఎడాపెడా అనుమతులు ఇచ్చేస్తున్నారు. నిజానికి ఇవన్నీ మీ పనుల్ని సులభతరం చేయొచ్చు. సౌకర్యాన్ని అందించొచ్చు. కానీ వాటివల్ల వ్యక్తిగత గోపత్య ఏ మేరకు భద్రంగా ఉంటుందో మాత్రం ఆలోచించడం లేదు. ఇలా మనం చేసే చిన్న పొరపాట్ల వల్లే సైబర్‌నేరాల బారిన పడుతున్నాం.



అనుమతులివ్వొద్దు: వ్యక్తిగతంగా ప్రతి ఒక్కరూ అంతర్జాలాన్ని, సోషల్ మీడియాను ఉపయోగించుకోవడానికి కొన్ని పరిధులు పెట్టుకోవాలి. ఫోన్‌కి సురక్షితమైన పాస్‌వర్డ్ పెట్టుకున్నా... యాప్‌లకు అనుమతులు ఇవ్వడం వల్ల దొంగ చేతికి తాళాలు ఇచ్చినట్లు అవుతుంది. ప్లే స్టోర్‌లో కనిపించిన ప్రతి యాప్‌నీ డౌన్‌లోడ్ చేసుకోకూడదు. వాటి నియమ నిబంధనలు చదవాలి. ఎక్కువ అనుమతులు అడుగుతుంటే ఆలోచించాల్సిందే. ముందుగా మెకాఫీ, కాస్పెర్‌స్కై, ఎవాస్ట్ వంటి యాంటీవైరస్ సాఫ్ట్‌వేర్‌లను డౌన్‌లోడ్ చేసుకోవాలి. ఫోనులో సెట్టింగ్-సెక్యూరిటీలో-పర్మిషన్స్ మేనేజర్ అని ఉంటుంది. ఒకవేళ అది లేకపోతే ప్లేస్టోర్ నుంచి డౌన్‌లోడ్ చేసుకోవాలి. అప్పుడే మన ఫోనులోని కెమెరా, మైక్రోఫోను, లొకేషన్‌ని ఏ యాప్‌లు వాడగలుగుతున్నాయో తెలుసుకోగలుగుతాం.. యాప్ లాకర్‌ని వాడినా మంచిదే. ఫొటోలను భద్రపరుచుకోవడానికి థర్డ్‌పార్టీ యాప్‌లను వాడొద్దు. గూగుల్ ఫైల్స్‌గో సురక్షితం. వాటిని ఎన్‌క్రిప్ట్ చేసుకోగలిగితే హ్యాక్ కాకుండా ఉంటాయి. అన్‌నోన్ సోర్సెస్ నుంచి ఏదీ డౌన్‌లోడ్ చేయకూడదు.

ఫిర్యాదు చేస్తే తొలగిస్తారు

ఆడపిల్లల ఫొటోలు, వీడియోలు వారికి తెలియకుండానే తీసి పోర్న్ సైట్‌లలో పెడుతున్నారు దుండగులు. అలాంటివి చూసినప్పుడు, తెలిసినప్పుడు కుంగిపోయి ఆత్మహత్యాప్రయత్నాలు చేస్తున్నారు కొందరు. కానీ తొందరపడొద్దు. ఆ వీడియో కిందే రిపోర్ట్ బటన్ ఉంటుంది. దాన్ని క్లిక్ చేసి ఫిర్యాదు చేస్తే తొంభైశాతం సైట్‌లు వాటిని తొలగిస్తాయి. ఒకవేళ అప్పటికీ డిలీట్ కాకపోతే 'డిజిటల్ మిలీనియం కాపీరైట్ యాక్ట్''కి ఫిర్యాదు చేస్తే ఆ లింక్‌లను, వీడియోలను తొలగిస్తాయి.

స్క్రీన్ షాట్‌లు తీసుకోండి

ఆన్‌లైన్‌లో వేధింపులు ఎదుర్కొంటుంటే వాటిని స్క్రీన్‌షాట్‌లు తీసుకోండి. యూఆర్ఎల్ కాపీ చేసుకోండి. అవతలి వ్యక్తులు వాటిని డీయాక్టివేట్ చేసినా పోలీసులు వారిని సులువుగా గుర్తించేందుకు సాయపడతాయి.

ఫైర్‌వాల్స్‌ని ఇన్‌స్టాల్ చేసుకోవడం వల్ల మీ ఫోన్, ల్యాప్‌టాప్‌ల నుంచి మీ సమాచారం తస్కరించే అవకాశం ఉండదు.

సోషల్ మీడియా: ప్రతి ఒక్కరు సామాజిక మాధ్యమాల్లో ఖాతాలు ఉండటాన్ని హోదాకు చిహ్నంగా భావిస్తున్న రోజులివి. అమ్మాయిలైనా, అబ్బాయిలైనా సోషల్ వెబ్‌సైట్స్‌ని సరైన దిశలో వాడకపోతే కుంగుబాటుకి గురయ్యే ప్రమాదం ఉంది. వ్యక్తిగత ఫొటోలు తరచూ పోస్ట్‌చేయడం, చెక్‌ఇన్‌లు చేయడం, ట్యాగ్‌లు చేయడం వంటివన్నీ మీ వ్యక్తిగత భద్రతను ప్రశ్నార్థకం చేస్తాయి. వీటిని పోస్ట్ చేసేముందే ఒకటికి రెండు సార్లు పరిశీలించుకోవడం మంచిది. అలానే తప్పనిసరిగా పెట్టాల్సి వచ్చినా సెట్టింగ్ సెక్యూరిటీలో ఫొటోలకు ప్రైవేట్ ఆప్షన్ పెట్టుకోవడం వల్ల కొంతవరకూ సురక్షితం. అపరిచితులతో స్నేహం, ఫొటో షేరింగ్ అసలే వద్దు. ఇక ఇంటర్నెట్, గూగుల్, ఫేస్‌బుక్...ఇలా దేన్ని ఉపయోగిస్తున్నా ఇంటర్నెట్ సేఫ్టీకోసం ఫోన్ నంబర్‌తో లింక్ చేసే టూ స్టెప్స్ వెరిఫికేషన్‌ని ఎనేబుల్‌లో ఉంచుకోవాలి. లాగిన్ నోటిఫికేషన్‌లు ఎనేబుల్ చేసుకోవడం వల్ల ఇతరులు ఎక్కడ మీ లాగిన్‌లు ఉపయోగించినా తెలిసిపోతుంది. మీ వాట్సాప్ ప్రొఫైల్ పిక్చర్ మార్చినప్పుడు ఫొటో సీన్ బై కాంటాక్ట్స్ ఆప్షన్‌నే ఎంచుకోవాలి. ఫోన్‌లో యాప్‌లాక్ ఎనేబుల్ చేసుకోవాలి. అన్‌నోన్‌సోర్స్‌లను డిజేబుల్ చేయాలి.



సాయి సతీష్
ఇండియన్ సర్వర్స్ సీఈవో

సమాజానికి కొంత తిరిగిద్దామని!

హైదరాబాద్‌కి చెందిన అల్కా అగర్వాల్ ఇద్దరు పిల్లల తల్లి. ఉన్నత విద్యావంతురాలు. భర్తతో కలిసి ఓ పరిశ్రమను నిర్వహిస్తోంది. సమాజం కోసం ఏదైనా చేయాలనుకుంది. ఆమె ఆలోచనకు మరో ముగ్గురు మహిళలు తోడయ్యారు. వారంతా కలిసి కిందటేడాది 'సిద్ధమ్' పేరుతో ఓ స్వచ్ఛంద సంస్థను ప్రారంభించారు.

సమాజానికి నా వంతుగా ఏదైనా సేవ చేయాలనే ఆలోచనతోనే ఈ స్వచ్ఛంద సంస్థ ఏర్పాటు చేశా. మా వారికో పరిశ్రమ ఉంది. వారితో పాటు నేనూ కలిసి పనిచేసేదాన్ని. అయినా సంతృప్తి ఉండేది కాదు. ఆ ఆలోచనల్లో ఉన్నప్పుడు మా బంధువు ఒకామె క్యాన్సర్ బారిన పడి కోలుకున్నారు. దాంతో ఆమె నలుగురికీ ఉపయోగపడేలా ఏమైనా సేవాకార్యక్రమాలు చేయాలనుకున్నారు. నాదీ అదే ఆలోచన కావడంతో మేమిద్దరం కలిశాం. మాకు మరో ఇద్దరు తోడయ్యారు. అంతా కలిసి 2018లో సిద్ధమ్ పేరుతో ఓ ఎన్జీవోను ప్రారంభించాం.

పదకొండు కార్యక్రమాలు...

ఈ సంస్థ ద్వారా ఆరోగ్య శిబిరాలు, క్యాన్సర్‌పై అవగాహనా సదస్సులు, ఎగ్జిబిషన్‌ల నిర్వహణ లాంటి దాదాపు పదకొండు సామాజిక సేవా కార్యక్రమాలెన్నో మేం ఇప్పటివరకూ చేశాం. గ్రామీణ కళాకారులు, చేనేత కార్మికులకు మా స్టాళ్ల ద్వారా ఎగ్జిబిషన్లలో ఒక వేదిక కల్పిస్తాం. ఇందుకు రుసుముగా అతి తక్కువ నగదుని తీసుకుంటాం. వీటి ద్వారా వారి ఉత్పత్తులకు మార్కెటింగ్ సదుపాయాన్ని కల్పిస్తున్నాం. ఇక,



గృహిణులకు పోషకాహారంపై అవగాహన కల్పించడానికి వంటల పోటీలను నిర్వహిస్తున్నాం.

విద్యార్థుల కోసం

ఇక విద్యార్థినులకు కెరీర్ కౌన్సెలింగ్, వ్యక్తిత్వ వికాస తరగతులు నిర్వహిస్తున్నాం. ఆరోగ్య, రక్తదాన శిబిరాలను ఏర్పాటు చేస్తున్నాం. నెలసరి సమయంలో తీసుకోవాల్సిన పరిశుభ్రతపై అవగాహన, స్కిల్ డెవలప్‌మెంట్ ప్రోగ్రామ్స్ వంటివీ నేర్పించాం. వీటితోపాటు కరాటే, జూడో వంటి ఆత్మరక్షణ విద్యలనూ నేర్పిస్తున్నాం. ఇవి మాత్రమే కాదు... ఆసక్తి ఉన్న వారికి నగల తయారీ, టైలరింగ్ వంటి స్వయం ఉపాధి శిక్షణా తరగతులు పదిరోజుల పాటు నిర్వహిస్తున్నాం. వీటికి నామమాత్రపు రుసుము వసూలు చేస్తున్నాం. ఈ రుసుముని కూడా వివిధ సేవా కార్యక్రమాలకే ఉపయోగిస్తాం. ఇలా ఇప్పటికే సెయింట్ ఫ్రాన్సిస్, బద్రుకా కళాశాలలో మా వంతు కార్యక్రమాలు కొనసాగుతున్నాయి. ఇప్పుడు మా సంస్థలో యాభైమందికి పైసభ్యులు ఉన్నారు.

దక్షిణధ్రువాన్ని చేరుకున్న తొలి మహిళ

రక్తం గడ్డకట్టే మంచులో, వీపుపై 35 కేజీల బరువుతో, 111 కిలో మీటర్ల ప్రయాణం.... మాటలేం కాదు. ఆ ఘనత సాధించి దక్షిణ ధ్రువాన్ని చేరుకున్న మొదటి మహిళా ఐపీఎస్ ఆఫీసర్ అపర్ణా కుమార్.



2॥ పర్వతాలెక్కి

అది మాత్రమే కాదు...ఇప్పటివరకు ప్రపంచవ్యాప్తంగా 211 పర్వతారోహణలు చేయడమే కాకుండా ఆ పర్వతశ్రేణులను కొలిచి రికార్డు సృష్టించారు. ప్రస్తుతం ఆమె డీఐజీగా, ఇండో-టిబెటన్ బోర్డర్ పోలీసు ఆఫీసర్ (ఐటీబీపీ)గా విధులు నిర్వర్తిస్తున్నారు. ఇప్పటివరకూ ఆమె సాధించిన విజయాల్లో... 2015లో యూరప్‌లో 18,510 అడుగుల ఎత్తైన పర్వతశ్రేణి ఎల్‌బ్రస్‌ను కొలిచింది అత్యంత క్లిష్టమైన సాహసం. అదే ఏడాది దక్షిణ అమెరికాలో అతి ఎత్తైన అకోన్‌కాగ్వా, ఇండోనేషియాలో కార్‌స్టెన్జ్ పిరమిడ్, అలాగే టాంజానియాలోని కిలిమాంజారో వంటి పర్వతాలెన్నో ఎక్కి కొలిచిన సాహసాలు ఈమె ఖాతాలో చేరాయి. అలాగే 2016లో మౌంట్ ఎవరెస్టు పర్వతాన్ని కొలిచిన తొలి మహిళా ఐపీఎస్ ఆఫీసర్‌గా కూడా పురస్కారం అందుకున్నారు. 2017లో అంటార్కిటికాలోని 17వేల అడుగుల ఎత్తున్న విన్‌సన్ మాసిఫ్ పర్వత శిఖరాన్ని చేరుకుని అక్కడ మన జాతీయ జెండా, ఉత్తరప్రదేశ్ పోలీసు జెండాను ఎగరవేశారామె. తాజాగా గత డిసెంబరు 30న దిల్లీ నుంచి అపర్ణ బయలుదేరి దుబాయ్ మీదుగా చిలీలోని పుంటాస్ అరెనస్ నుంచి శాంటియాగో వెళ్లి, అక్కడి నుంచి దక్షిణ ధ్రువానికి చేరుకోవడానికి యాత్రను ప్రారంభించారు. 111 మైళ్ల దూరం, మైనస్ 40 డిగ్రీల సెల్సియస్ ఉష్ణోగ్రతలో ప్రయాణించి ఈ నెల 13న దక్షిణధృవాన్ని చేరుకున్నారు.



అపర్ణ బెంగళూరు, నేషనల్ లా కాలేజీలో డిగ్రీ చదివారు. సివిల్స్‌కు హాజరై, 2002 బ్యాచ్ ఉత్తరప్రదేశ్ క్యాడర్, ఐపీఎస్ ఆఫీసర్‌గా విధుల్లో చేరారు. భర్త సంజయ్ కుమార్ ప్రభుత్వాధికారి కాగా, వీరికి ఇద్దరు పిల్లలు. చిన్నవయసు నుంచి పర్వతారోహణపై ఉన్న ఆసక్తితో, ఇందులో శిక్షణ తీసుకుని పలు సాహసాలకు ఈమె శ్రీకారం చుట్టారు.

చదువు

ఎన్ని చాలు? ఏవి మేలు?



ఇంజినీరింగ్ విద్యను చదవాలనుకునేవారికి ప్రవేశ మార్గాలు ఎన్నో! జాతీయ, రాష్ట్ర స్థాయుల్లో పాతిక వరకూ ఇంజినీరింగ్ ప్రవేశపరీక్షలున్నాయి. దాదాపు ఇవన్నీ ఆన్‌లైన్ పరీక్షలే. సిలబస్ దాదాపు ఒకటే. మరి వీలైనన్ని ఎక్కువ పరీక్షలకు దరఖాస్తు చేసి, రాయటం మంచిదేనా? ఏమాత్రం కాదు! ఇలా చేయటం విద్యార్థులకూ, వారి తల్లిదండ్రులకూ ఆర్థికంగా, మానసికంగా ఎంతో భారం! వ్యూహాత్మకంగా కూడా ఇది సరి కాదు! మరి ఏ విద్యార్థులు ఎన్ని ఎంట్రన్సులను, ఎలా ఎంచుకోవాలి? నిపుణులు సూచిస్తున్నదేమిటి?

25 ఇంజినీరింగ్ ఎంట్రన్సులు... సరైనవాటి ఎంపిక కీలకం!

ఎన్‌టీఏ (నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ) ఏర్పడిన తర్వాత ఇంజినీరింగ్ ప్రవేశ పరీక్షలన్నీ ఒకే పరీక్షగా ఏర్పడతాయనుకున్నారు. కానీ ఇది తొలి సంవత్సరం కాబట్టి ఆ ప్రక్రియ పూర్తి కాలేదు. ఆ నేపథ్యంలో ఇప్పుడు ఇంజినీరింగ్ ఆశావహుల ముందు 25 వరకు వివిధ రకాల ప్రవేశ పరీక్షలున్నాయి. వీటిలో ఏ పరీక్షలు రాయాలో ముందే నిర్ణయించుకుంటే వాటిపై నిర్దిష్టంగా శ్రద్ధ పెట్టి, మెరుగైన ర్యాంకు కోసం పూర్తిస్థాయిలో కృషి చేయవచ్చు. ఇదే ఆచరణీయం.

ఎంపీసీ విద్యార్థులు ఇంజినీరింగ్‌లో చేరాలని ప్రారంభించినా ఇంటర్మీడియట్ పూర్తి చేసుకునేటప్పటికీ కొంతమంది ఇతర రంగాలవైపు మొగ్గు చూపుతున్నారు. అంటే లా, సీఏ, బిజినెస్ మేనేజ్‌మెంట్, డిజైన్, ప్యూర్ సైన్సెస్‌లో గ్రాడ్యుయేషన్, పోస్ట్ గ్రాడ్యుయేషన్ చేయడానికి ఇష్టపడుతున్నారు. ఇలాంటివారు తమ అభీష్టానికి తగ్గట్లుగా లా అయితే క్లాట్, సీఏ అయితే సీఏ ఫౌండేషన్, బిజినెస్ మేనేజ్‌మెంట్ అయితే ఐఐఎం, సింబయోసిస్; డిజైన్ కోర్సులు అయితే నిఫ్ట్; ప్యూర్ సైన్సెస్ అయితే నెస్ట్‌లో లేదా సెంట్రల్ యూనివర్సిటీల ప్రవేశ పరీక్షలకు మాత్రమే దరఖాస్తు చేసుకోవటం ఉత్తమం. ఆ విధానంలో తయారయినప్పుడే అనుకున్న ఫలితాలను పొందగలుగుతారు.

అధిక శాతం విద్యార్థులు తమకు ఇష్టం లేకపోయినప్పటికీ సహాధ్యాయులు చేస్తున్నారనో, అధ్యాపకులు చెప్పారనో కనిపించిన ప్రతి పరీక్షకూ దరఖాస్తు చేస్తున్నారు. దీనివల్ల తల్లిదండ్రులకు 25 వేల నుంచి 30 వేల రూపాయిల వరకు అదనపు ఆర్థిక భారం! విద్యార్థులు కూడా ఏ పరీక్షపైనా తగిన స్పష్టత, పట్టు లేక దేంట్లోనూ రాణించలేకపోతున్నారు. అందుకని తమ సామర్థ్యాన్ని అంచనా వేసుకుని అందుకు తగ్గట్లుగా కొన్ని ఎంట్రన్సులను మాత్రమే ఎంపిక చేసుకోవడం మేలని నిపుణులు చెపుతున్నారు.

ప్రతిష్ఠాత్మక సంస్థల్లో చేరాలనుకున్నవారు

ఐఐటీ, ఐఎస్ఐ, ఐఐఎస్ఈఆర్, ఐఐఎస్‌టీ లాంటి సంస్థల్లో ప్రవేశం కోరే విద్యార్థులు జేఈఈ - అడ్వాన్స్‌డ్ లేదా సంబంధిత సంస్థ నిర్వహించే పోటీ పరీక్షలకు తయారవ్వాలి. అత్యంత ప్రతిభావంతులైన విద్యార్థులు పై సంస్థలను దృష్టిలో ఉంచుకొని ఆ పోటీ పరీక్షలకు తోడుగా జేఈఈ - మెయిన్స్‌కి కూడా దరఖాస్తు చేసుకొని వాటికి సన్నద్ధమవటం మేలు. ఇంకా అదనంగా కావాలంటే రాష్ట్రస్థాయి ఎంసెట్‌కి కూడా దరఖాస్తు చేస్తే సరిపోతుంది. అంటే ఈ విద్యార్థులు గరిష్ఠంగా 4 పరీక్షలకు దరఖాస్తు చేసుకుంటే చాలు. **ఉదా:** జేఈఈ మెయిన్స్, జేఈఈ అడ్వాన్స్‌డ్, ఐఎస్ఐ ఎంట్రన్స్, ఎంసెట్.

మెయిన్స్‌లో వంద వరకే వస్తుంటే

జేఈఈ మెయిన్స్‌లో 360 మార్కులకు 100 మార్కుల వరకే వచ్చే విద్యార్థులు ఎంసెట్‌కు అత్యంత ప్రాధాన్యం ఇవ్వాలి. ఎందుకంటే రెండు తెలుగు రాష్ట్రాల్లో కలిపి 1,70,000 వరకు సీట్లు ఉన్నాయి. అయితే వాటిలో యూనివర్సిటీ కళాశాలల్లో సీట్లు సాధించే దిశలో వారు సన్నద్ధమవ్వాలి. అంటే 160 మార్కులకు జరిగే ఈ పరీక్షలో 120 మార్కుల వరకు సాధించే దిశలో ప్రణాళిక ఏర్పరచుకోవాలి. ఈ పరీక్షనే ముఖ్యంగా ఎంచుకునే విద్యార్థి రెండు రాష్ట్రాల్లోని ఎంసెట్ పరీక్షలతోపాటు గీతం, విట్, ఎస్ఆర్ఎం లాంటి రెండు డీమ్డ్ యూనివర్సిటీ పరీక్షలను ఎంపిక చేసుకోవడం మేలు.

అయితే అధిక ఫీజులు భారంగా భావించేవారు ఎంసెట్ పరీక్షలకు మాత్రమే పరిమితం కావొచ్చు. అధికంగా దరఖాస్తు రుసుములు చెల్లించి పరీక్షలు రాసి, తర్వాత ఆర్థిక ఇబ్బందులకు లోనయ్యేకంటే ఎంసెట్ రెండు రాష్ట్రాల పరీక్షలను మాత్రమే రాసుకుంటే సులభంగా సీటు సాధించే అవకాశం ఉంటుంది.

ఐఐటీ సీటు రాదనుకున్నవారు

'ప్రతిభావంతులమే కానీ ఐఐటీల్లో ప్రవేశం కష్టం' అని భావిస్తే జేఈఈ-మెయిన్స్‌తో పాటు, బిట్‌శాట్, ఎంసెట్, మణిపాల్ లాంటి ఏదో ఒక డీమ్డ్ యూనివర్సిటీకి దరఖాస్తు చేస్తే సరిపోతుంది. గతంలో బిట్స్ పిలాని, మణిపాల్ లాంటి సంస్థల్లో ఫీజు అధికంగా ఉండేది. ఇప్పుడు వాటి ఫీజు ఐఐటీలతో దాదాపు సమానంగా సంవత్సరానికి 2.5 లక్షల రూపాయిల వరకు ఉంటున్నాయి.



బీఆర్క్ లక్ష్యంగా ఉన్నవారు

ఆర్కిటెక్చర్ (బి.ఆర్క్) చేయాలనుకునే విద్యార్థులకు ఇప్పుడు సీట్ల సంఖ్య బాగా పెరిగింది. ప్రస్తుతం ఐఐటీ, ఎన్ఐటీల్లో సీట్లు ఉన్నాయి. అవికాకుండా ఎన్ఏటీఏ (నేషనల్ ఆప్టిట్యూడ్ టెస్ట్ ఇన్ ఆర్కిటెక్చర్- నాటా) ద్వారా కూడా చేరవచ్చు. ఈ సంవత్సరం నుంచి ఎన్ఏటీఏ పరీక్షను కూడా ఎన్‌టీఏకు ఇస్తున్నారు. ఈ పోటీ పరీక్షలు కూడా సంవత్సరానికి రెండు సార్లు జరిపి వాటిలో ఉత్తమ మార్కు ఆధారంగా ర్యాంకు కేటాయిస్తారు.

తెలుగు రాష్ట్రాల్లో బి.ఆర్క్ సీట్లు 1500 వరకు ఉన్నాయి. బి.ఆర్క్, బి. ప్లానింగ్ రెండింటికీ ఈ పరీక్షే ప్రాతిపదిక కాబట్టి విద్యార్థులు బాగా ప్రిపేరయితే సీటు సాధించవచ్చు. ఈ పోటీ పరీక్షలో ఫిజిక్స్, కెమిస్ట్రీలు లేవు. కేవలం మ్యాథమేటిక్స్, లాజికల్ రీజనింగ్ మాత్రమే ఉన్నాయి. తెలుగు విద్యార్థులు మిగిలిన ఏ రాష్ట్ర విద్యార్థులతో పోల్చుకున్నా మ్యాథమేటిక్స్ పరంగా చాలా బాగా చేస్తారు కాబట్టి ఈ పరీక్ష ద్వారా ఎక్కువమంది తెలుగు విద్యార్థులు సీట్లు సాధించే అవకాశం ఉంటుంది. బి.ఆర్క్ లేదా బి.ప్లానింగ్ మాత్రమే చేయాలనుకునే విద్యార్థులు జేఈఈ మెయిన్స్ రెండో పేపర్, నాటాలకు మాత్రమే దరఖాస్తు చేసుకొని డ్రాయింగ్‌లో కొద్దిగా తర్ఫీదు కాగలిగితే అత్యుత్తమ మార్కులు సాధించుకొని జేఎన్‌టీయూ లాంటి ప్రభుత్వ విద్యాసంస్థల్లో చేరే అవకాశం ఏర్పడుతుంది.

ఎంసెట్‌లో 80 లోపు వస్తుంటే

ఎంసెట్‌లో 80 మార్కులలోపే వస్తున్న విద్యార్థులు, ఆర్థికంగా సంవత్సరానికి 2.5 లక్షల రూపాయిల వరకు కట్టగల స్తోమత ఉన్నవారు ఏవైనా 3 డీమ్డ్ యూనివర్సిటీలకు దరఖాస్తు చేసుకోవడం మేలు. వీటిలో కొంతవరకు ఫీజు తక్కువగా ఉన్నది ఒరిస్సా రాష్ట్రంలోని కళింగ మాత్రమే.

ఎంసెట్‌లో 60 లోపు వస్తుంటే

ఎంసెట్‌లో 60 మార్కులలోపే వస్తున్నవారూ, ఆర్థికంగా సంవత్సరానికి ఏమంత ఖర్చు చేయలేనివారుంటారు. ఇలాంటివారు బేసిక్ సైన్స్‌లో ఎంఎస్సీ చేయడానికి సెంట్రల్ యూనివర్సిటీలు లేదా నెస్ట్ పరీక్షలకు మాత్రమే నియంత్రించుకొని వాటికి తయారవడమే మేలు. ఒక సాధారణ కళాశాలలో ఇంజినీరింగ్ చేసే విద్యార్థి కంటే సెంట్రల్ యూనివర్సిటీలో బేసిక్ సైన్సెస్ చేసే విద్యార్థికి అద్భుతమైన భవిష్యత్తు ఉంటుంది.

ఏ విధమైన ప్రణాళిక లేకుండా కన్పించిన ప్రతి పోటీ పరీక్షకూ విద్యార్థులు దరఖాస్తు చేస్తూ వెళ్తే తల్లిదండ్రులకు ఆర్థిక భారమే తప్పించి అనుకూల ఫలితం ఏమీ ఉండదు. ఈ పరీక్షలన్నీ 45 రోజుల కాలవ్యవధిలో జరుగుతాయి. అన్నింటికీ లేదా 10, 15 పరీక్షలకు దరఖాస్తు చేసిన విద్యార్థులు ప్రతి రెండు మూడు రోజులకో పరీక్ష రాయాల్సి ఉంటుది. పరీక్షా విధివిధానాల్లో కూడా స్వల్ప తేడాల వల్ల పరీక్షపై అవగాహన, పట్టు లేక ఏ పరీక్షలో కూడా అనుకున్నవిధంగా రాణించలేక తుది గమ్యాన్ని చేరుకోలేక పోతున్నారు. కాబట్టి విద్యార్థి మొదట తన అభిలాష ఏమిటో, దాన్ని చేరుకోగలనో లేదో అనే విషయంపై స్పష్టమైన అవగాహన ఏర్పరచుకోవాలి. గరిష్ఠంగా 4 లేదా 5 పరీక్షలకు మాత్రమే పరిమితమై వాటికి నిర్దిష్ట ప్రణాళికతో తయారుకాగలిగితే లక్ష్యాన్ని సులభంగా చేరుకోవచ్చు.

- పి. అభిలేఖ్, డైరెక్టర్, మెలూహ

ఏ ప్రవేశపరీక్ష దరఖాస్తు ఎప్పుడు?

ముఖ్యమైన 21 ప్రవేశపరీక్షల వివరాల పట్టిక www.eenadupratibha.net లో చూడండి.

నోటీస్ బోర్డు

అప్రెంటిస్‌షిప్

ఇంటిగ్రల్ కోచ్ ఫ్యాక్టరీ

చెన్నైలోని ఇంటిగ్రల్ కోచ్ ఫ్యాక్టరీ కింది అప్రెంటిస్ ఖాళీల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

ఖాళీలు: గ్రాడ్యుయేట్ అప్రెంటిస్-100, టెక్నీషియన్ (డిప్లొమా) అప్రెంటిస్-120. **శిక్షణ కాలం:** ఏడాది. **అర్హత:** సంబంధిత బ్రాంచుల్లో ఇంజినీరింగ్ డిప్లొమా, బీఈ/ బీటెక్ ఉత్తీర్ణత.

ఎంపిక: విద్యార్హతలో ప్రతిభ ఆధారంగా.

దరఖాస్తు: ఆన్‌లైన్. **చివరితేది:** ఫిబ్రవరి 6

వెబ్‌సైట్: http://www.icf.indianrailways.gov.in/

ప్రభుత్వ ఉద్యోగాలు

నేషనల్ సీడ్స్ కార్పొరేషన్

న్యూదిల్లీలోని నేషనల్ సీడ్స్ కార్పొరేషన్ లిమిటెడ్ కింది పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

పోస్టులు: మేనేజ్‌మెంట్ ట్రైనీ, సీనియర్ ట్రైనీ, డిప్లొమా ట్రైనీ తదితరాలు. **ఖాళీలు:** 260 **అర్హత:** ఐటీఐ, ఇంటర్, ఇంజినీరింగ్ డిగ్రీ, బీఎస్సీ, పీజీ, ప్రొఫెషనల్ డిగ్రీ (లా), ఎంబీఏ, కంప్యూటర్ పరిజ్ఞానం, అనుభవం. **దరఖాస్తు:** ఆన్‌లైన్.

చివరితేది: ఫిబ్రవరి 9 https://www.indiaseeds.com/

యూనివర్సిటీ ఆఫ్ దిల్లీ

యూనివర్సిటీ ఆఫ్ దిల్లీ... స్కూల్ ఆఫ్ ఓపెన్ లెర్నింగ్ ఒప్పంద ప్రాతిపదికన కింది పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది. **పోస్టులు:** డేటా అనలిస్ట్, జూనియర్ కన్సల్టెంట్ తదితరాలు. **ఖాళీలు:** 09 **ఒప్పంద కాల వ్యవధి:** 6 నెలలు.

అర్హత: ఎంబీఏ, బీటెక్/ బీఈ, ఎంసీఏ/ ఎంఎస్సీ, గ్రాడ్యుయేషన్, డిప్లొమా, అనుభవం. **దరఖాస్తు:** ఆన్‌లైన్/ ఆఫ్‌లైన్. **చివరితేది:** ఫిబ్రవరి 8 https://sol.du.ac.in/

ప్రవేశాలు

ఇండియన్ స్టాటిస్టికల్ ఇన్‌స్టిట్యూట్

కోల్‌కతాలోని ఇండియన్ స్టాటిస్టికల్ ఇన్‌స్టిట్యూట్ (ఐఎస్ఐ) 2019-20 సంవత్సరానికిగానూ కింది ప్రోగ్రాముల్లో ప్రవేశాలకు దరఖాస్తులు కోరుతోంది. **కోర్సులు:** బ్యాచిలర్ డిగ్రీ, మాస్టర్స్ డిగ్రీ, ఎంఎస్, ఎంటెక్, పీజీ డిప్లొమా, జేఆర్ఎఫ్. **విభాగాలు:** స్టాటిస్టిక్స్, మ్యాథమేటిక్స్, క్వాంటిటేటివ్ ఎకనామిక్స్, క్వాలిటీ మేనేజ్‌మెంట్ సైన్స్, కంప్యూటర్ సైన్స్ తదితరాలు. **ఆన్‌లైన్ దరఖాస్తు:** ఫిబ్రవరి 5 నుంచి మార్చి 12 వరకు. **ఐఎస్ఐ ప్రవేశ పరీక్ష తేది:** మే 12 https://www.isical.ac.in/

నాటా-2019

దేశవ్యాప్తంగా ఉన్న వివిధ విద్యాసంస్థల్లో అయిదేళ్ల బీఆర్క్ డిగ్రీ మొదటి ఏడాది ప్రవేశాలకు నిర్వహించే నాటా ప్రకటన విడుదలైంది. ఈ ఏడాది నుంచి నాటాను కౌన్సిల్ ఆఫ్ ఆర్కిటెక్చర్ ఏటా రెండుసార్లు నిర్వహించనుంది.

› నేషనల్ ఆప్టిట్యూడ్ టెస్ట్ ఇన్ ఆర్కిటెక్చర్ (నాటా)-2019

అర్హత: ఫిజిక్స్, కెమిస్ట్రీ, మ్యాథమేటిక్స్ సబ్జెక్టులతో 10+2 ఉత్తీర్ణత. **మొదటి పరీక్ష తేది:** ఏప్రిల్ 14 **రెండో పరీక్ష తేది:** జులై 7 **ఆన్‌లైన్ దరఖాస్తు ప్రారంభం:** జనవరి 24

చివరితేది: మొదటి పరీక్షకు మార్చి 11, రెండో పరీక్షకు జూన్ 12 **వెబ్‌సైట్:** http://www.nata.in/

ప్రతిభ — ఏపీపీఎస్‌సీ గ్రూప్స్ పరీక్షల స్టడీ మెటీరియల్ ప్రతిభలో నేటినుంచి..!

సుస్థిరంగా మార్కుల వృద్ధి



కలవరపడకుండా కొత్త అంశంపై పట్టు

ఏపీపీఎస్‌సీ గ్రూప్స్ పరీక్షల్లో కొత్తగా చేర్చిన అంశం- 'సుస్థిరాభివృద్ధి- పర్యావరణ పరిరక్షణ'. దాదాపు 8 నుంచి 10 ప్రశ్నలు దీనిలో వస్తాయి. 'నూతనాంశం కదా, ఎలా చదవాలో!' అని ఆందోళన చెందనవసరం లేదు. ప్రశ్నలు కూడా మరీ కఠిన స్థాయిలో అడిగే అవకాశం లేదు. పబ్లిక్ సర్వీస్ కమిషన్ నిర్వహించే పోటీ పరీక్షల్లో ఎక్కువగా డిగ్రీ స్థాయి పుస్తకాల నుంచీ, అదే స్థాయికి చెందిన వర్తమాన సమాచారం నుంచీ ఎక్కువగా ప్రశ్నలు అడుగుతున్నారు. థియరీ కంటే ఆచరణాత్మక పద్ధతిలో ఇవి ఉంటున్నాయి.

జనరల్ స్టడీస్‌లో ప్రధానంగా 2016 నుంచి సుస్థిరాభివృద్ధినీ, 2018 నోటిఫికేషన్ల నుంచి 'సుస్థిరాభివృద్ధి-పర్యావరణ పరిరక్షణ'నీ సిలబస్‌లో ప్రవేశపెట్టారు. 2014 ఆంధ్రప్రదేశ్ విభజన తర్వాత గ్రూప్స్, ఇతర ఉద్యోగ నియామక పరీక్షల్లో 'ఆంధ్రప్రదేశ్ విభజన-సమస్యలు' అనే అంశాన్ని చేర్చారు. ఈ విధంగా నూతనంగా చేర్చిన అంశాల పాఠ్యాంశ పరిధి తక్కువగా ఉన్నప్పటికీ ఎక్కువ ప్రశ్నలు వచ్చే అవకాశం ఉంది. ఈ రకమైన తక్కువ పరిధి అంశాలను విశ్లేషణాత్మక అవగాహన ద్వారా చదువుకోగల్గితే ఎక్కువ మార్కులు పొందవచ్చు.

సుస్థిరాభివృద్ధి - పర్యావరణ పరిరక్షణలో సులభంగా మార్కులు పొందడానికి దీని మూలం, చరిత్రలపై స్థూల అవగాహన అవసరం. అందుకే దీని విశేషాలను పరిశీలిద్దాం.

మూలం ఎక్కడ?

18, 19వ శతాబ్దాల్లో ఐరోపాలోని అటవీ అధికారులు మొదట సుస్థిరత్వం అనే భావనను ప్రవేశపెట్టారు. ఆనాడు అడవుల్లో చెట్లు తరిగిపోయినా, కొట్టివేసినా తిరిగి ఆ ప్రాంతాల్లో నాటి చెట్ల సంఖ్యను భర్తీ చేసేవారు. ఇలా భావితరాలవారికి కూడా అడవులు తరిగిపోకుండా ఉండాలనే సంకల్పంతో ఉద్భవించిన పదమే సుస్థిరత్వం.

1972 జూన్ 5న స్వీడన్ స్టాక్ హోం పర్యావరణ సదస్సులో ఐక్యరాజ్యసమితి 'సుస్థిరాభివృద్ధి' అనే పదాన్ని ఉపయోగించింది. తర్వాత 1980లో ఐరోపాకు చెందిన 'ప్రకృతి, సహజ వనరుల అంతర్జాతీయ యూనియన్' సంస్థ వారు ఈ భావనను వెలుగులోకి తెచ్చారు. 1987లో ఐక్యరాజ్యసమితి ఏర్పాటు చేసిన 'బ్రంట్ లాండ్ కమీషన్'లో 'అవర్ కామన్ ఫ్యూచర్' అనే నివేదిక సుస్థిరాభివృద్ధి భావనను విస్తృతం చేసింది. ఈ నివేదికలో 'ప్రస్తుత తరాలవారి అవసరాలు, ఆకాంక్షలను నెరవేరుస్తూ భవిష్యత్తు తరాల ప్రజల అవసరాలను తీర్చడంలో రాజీలేని మార్గం ద్వారా అభివృద్ధి సాధించడమే, కొనసాగించడమే సుస్థిరాభివృద్ధి' అని నిర్వచించారు.

ఈ నిర్వచనంలో సుస్థిరాభివృద్ధి మూడు ముఖ్యాంశాల ద్వారా కొనసాగుతుంది. 1. అవసరాలు 2. అభివృద్ధి 3. భవిష్యత్తు తరాలు. 1990లో డాలీ అనే శాస్త్రజ్ఞుడు సుస్థిరాభివృద్ధి కొనసాగింపునకు మూడు నియమాలను సూచించాడు.

ప్రాధాన్యం పెరిగింది

1992 రియో-డి-జెనిరో సదస్సు ద్వారా ఎజెండా-21 అంశాన్ని ప్రవేశపెట్టడంతో సుస్థిరాభివృద్ధి ప్రాధాన్యం పెరిగింది. తర్వాత 2000 సెప్టెంబరులో ఐక్యరాజ్యసమితి సుస్థిరాభివృద్ధిని అంతర్జాతీయంగా విస్తరింపజేయడానికి సహస్రాబ్ది అభివృద్ధి లక్ష్యాల తీర్మానం చేసి అమలుపరిచింది. ఈ మిలీనియం డెవలప్‌మెంట్ గోల్స్‌లో మొత్తం 8 లక్ష్యాలున్నాయి.

2002లో దక్షిణాఫ్రికా జోహెన్స్‌బర్గ్‌లో మొదటిసారి సుస్థిరాభివృద్ధి సదస్సును నిర్వహించారు. ఆర్థిక కార్యకలాపాలు, ప(ర్యావరణ విషయాలను దృష్టిలో ఉంచుకొని పర్యావరణ విద్యకు ఎక్కువ ప్రాధాన్యం ఇవ్వాలని ఈ సదస్సు పిలుపునిచ్చింది. అందుకోసం ఐక్యరాజ్యసమితి 2005-2015 కాలాన్ని 'సుస్థిరాభివృద్ధి కోసం విద్యా దశాబ్దం'గా ప్రకటించింది.

2015 సెప్టెంబరు 25-27 తేదీల మధ్య ఐక్యరాజ్యసమితి సర్వప్రతినిధుల సభలో ఆకలి, దారిద్ర్యాలను నిర్మూలించటానికి ప్రపంచదేశాలన్నింటినీ ఏకంచేసి సుస్థిరాభివృద్ధి లక్ష్యాలను ప్రకటించింది. ఇందులో 17 లక్ష్యాలు, 169 ఉపలక్ష్యాలున్నాయి.

భిన్న కోణాల్లో..

ఈమధ్య ఏపీపీఎస్‌సీ పోటీపరీక్షల్లో యూపీఎస్‌సీ తరహాలో నూతన దృక్పథంతో విశ్లేషణాత్మకంగా ప్రశ్నలను అడుగుతున్నారు. ప్రతి అంశాన్నీ అభ్యర్థి విభిన్న కోణాల్లో ఆలోచించి జవాబు గుర్తించాల్సివుంటుంది.

ఎ) మొదటి దృక్పథంలో సబ్జెక్టును ప్రశ్నగా ఇస్తారు. ❑ ప్రస్తుతం దేశంలో మొత్తం జాతీయ పార్కులు ఎన్ని? (104).

బి) రెండో దృక్పథంలో సబ్జెక్టుకు చెందిన తాజా అంశాలు అడుగుతున్నారు. ❑ ఇటీవల మొత్తం ఎన్ని జాతీయ పార్కులు యునెస్కో గుర్తింపు పొందాయి? (8 పార్కులు).

సి) మూడో దృక్పథంలో సబ్జెక్టుకు చెందిన వర్తమాన అంశాలను అడుగుతున్నారు. ❑ దేశంలో ఏ జాతీయ పార్కు మస్కట్‌ను ఏర్పాటు చేసుకున్నది? (మధ్యప్రదేశ్‌లోని కన్హా నేషనల్ పార్కు).

సిలబస్‌లోని ప్రతి సబ్జెక్టునూ ఇలా చదవగలిగితే విజయం వైపు ప్రయాణించవచ్చు.

- కె. గోవర్ధన్ రెడ్డి

ఉపయోగపడే పుస్తకాలు

'సుస్థిరాభివృద్ధి-పర్యావరణ పరిరక్షణ'పై సంపూర్ణ సమాచారం కోసం మార్కెట్లో ఉన్న పుస్తకాలన్నీ చదవాల్సిన అవసరం లేదు. ప్రామాణిక పుస్తకాలను సంప్రదిస్తే సరైన అవగాహన పెరిగి, గరిష్ఠంగా మార్కులు సాధించగలుగుతారు.

1. **తెలుగు అకాడమీ:** ★ ఇంటర్మీడియట్ రెండో సంవత్సరపు అర్థశాస్త్రం ★ పోటీ పరీక్షల కోసం ప్రత్యేకంగా రాసిన 'పర్యావరణం- ఆర్థికాభివృద్ధి' ★ డిగ్రీ రెండో సంవత్సరం వారికి నిర్దేశించిన 'ఎన్విరాన్‌మెంటల్ స్టడీస్'
2. **సీబీఎస్ఈ:** 8వ తరగతి నుంచి 12 తరగతుల సోషల్ స్టడీస్
3. **ద హిందూ:** 'సర్వే ఆఫ్ ఎన్విరాన్‌మెంట్ అండ్ సస్టైయినబుల్ డెవలప్‌మెంట్'
4. **ఇండియా ఎన్విరాన్‌మెంటల్ సొసైటీ, న్యూదిల్లీ:** 'బయో డైవర్సిటీ ఫర్ సస్టైయినబుల్ డెవలప్‌మెంట్'